సాహిత్య

# ప్రస్థానం

డిసెంబర్ 2006

వెల:రు.10




సాహితీ ప్రవంతి

# షహీద్ సద్దాం

ఉరికొయ్యన దేహం వూగుతున్నా
ఉక్కు శిరసు ధిక్కరిస్తూనే వుంది
వీరుడా సాహసానికి చావుండదు
సాహసీ నిన్ను మానవాళి మరవదు

నియంతవో నీతిమంతుడివో
ఉన్మాదివో ఉద్రేకివో
నడిపించిన నాయకుడివి
పోరాడిన యోధుడివి

మంటల మధ్యనా
మడమ తిప్పని ధైర్యం
బోనులోనూ
తడబడని స్థయిర్యం
నీలోనే చూసింది కాలం
నీవే ప్రతిఘటనకు అలవాలం

ఘనీభవించిన కక్ష
రాక్షసశక్తుల శిక్ష
ముసుగు తొడుకోక్కుండా నీవు
ముష్కరుల ముసుగు తీసేశావ్

కాలసంధ్యలో నీ బలిదానం
బుష్షాసురులకు రణనాదం

షహీద్ సద్దాం
నీకిక మరణానంతర జీవితం
అమర్ రహే అంటుంది
ఖండఖండాంతర ప్రపంచం

\- తెర



# నెత్తుటి రుణము

కనుచూపు మేరా నెత్తురు
ఎండమావులూ ఒయాసిస్సులూ
రక్తపు వర్ణపు ఇసుక లోయలు
ఖర్జూర చెట్లకు కాసిన మాంసపు గుత్తులు

రక్తంతో తడిసిన ఇనుప డేగ రెక్కలు
యంత్ర భూతాలు,రక్తం తోడే రిగ్గులు!

పది లక్షల ఖండిత శిరస్సులు
కోటి కోట్ల ప్రశ్నల రక్త చారికలు
రాలిపడ్డ కుత్తుకలలో
నూనెకూ నెత్తుటికీ మధ్య రగుల్కొన్న రసాయనచర్యలు

ఎన్నిగ్యాలన్ల నెత్తురు పోస్తే మీ కార్లు పరుగెడతాయి?
ఎన్నెన్ని మాంస ఖండాలను పిండితే
మీ ఆయిల్ దాహం తీరుతుంది?

సద్దాము అహ్మదీ ఛావెజ్
మండుతున్న జాతుల ఎగురుతున్న జెండాలు
చెల్లా చెదురైన ఛిద్ర దేహాలన్నీ పోగు చేసుకుంటారు
భుజం మార్చుకుంటారు రుణం తీర్చుకుంటారు

విచారణ లేకుండా ఉరి తీస్తారు
పెట్రోలు పోసి తగలబెడతారు
ఒరేయ్!
నెత్తురు పోసిన హోమగుండం ఎన్నటికీ చల్లారదు!

\- అరుణ్ సాగర్

సాహిత్య
ప్రస్థానం
అక్టోబర్-డిసెంబర్ 2006
సంపుటి : 4 సంచిక : 17

# మరో అడుగు

**ఈ** సంచికతో ప్రస్థానం మూడేళ్లు పూర్తి చేసుకుంటున్నది. మార్చి నుంచి మాస పత్రికగా వెలువరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పత్రికను మరింత సమగ్రంగానూ, చక్కగానూ తీసుకురావడానికి ఒక సలహామండలి కూడా ఏర్పడుతున్నది. ఇంత కాలమూ ఈ పత్రికను ఆదరించిన సాహితీ మిత్రులే ఇకపైన కూడా మాస పత్రికను ముందుకు నడిపిస్తారని మా పరిపూర్ణ విశ్వాసం. ఈ సందర్భంగా మాస పత్రిక ఎలా వుండాలని కోరుకుంటున్నారో, ఇప్పటి వరకూ వున్న వాటిలో నచ్చినివి, నచ్చనివి ఏమిటో లేఖల ద్వారానూ, ఇతరత్రానూ తెలియజేస్తే చాలా ఉపయోగం.

సాహిత్య రంగంలో నూతనోత్సాహం పెరగడానికి, కొత్తగొంతులు వినిపించడానికి, అన్నిటికన్నా మించి సామ్రాజ్యవాద ప్రపంచీకరణకూ, మతోన్మాదానికి వ్యతిరేకంగా విశాల వేదిక నిర్మించడానికి ప్రస్థానం సాహితీ స్రవంతి ఈ కాలంలో శాయశక్తులా కృషి చేశాయి. ఇకముందూ చేస్తాయి. ఇప్పుడు సాహిత్య కార్యక్రమాలు గతం కన్నా విస్తృతంగానూ, ఆసక్తికరంగానూ జరుగుతున్నందుకు ఎంతగానో సంతోషిస్తున్నాయి కూడా. మాసపత్రిక కావడం దానికి మరింత దోహదపడుతుంది.

.......

ఈసారి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు చేయితిరిగిన కథా రచయిత, సాహితీ లోకంలోసహృదయశీలి మునిపల్లె రాజు గారికి లభించింది. ప్రస్థానం ఆయనను మనసారా అభినందిస్తోంది.

.......

ఈ సంచిక పూర్తవుతున్న దశలో సద్దాం హుస్సేన్‌ను అమెరికా సామ్రాజ్యవాదం ఉరితీసింది. ప్రజాస్వామిక ప్రగతిశీల శక్తులు ఎలుగెత్తి ఖండించవలసిన ఈ ఘాతుకం దృష్ట్యా పత్రికను కాస్త ఆలస్యం చేసి కొన్ని అంశాలు జత చేశాము.

ఈ లోగా ప్రసిద్ధ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య కన్నుమూశారు. ఆయనకు నివాళిగా రాచపాళెం వ్యాసం పునర్ముద్రించాం. తెలుగు సాహిత్య ప్రపంచంపై తనదైన విలక్షణ ప్రభావం ప్రసరించిన ఆ విమర్శక మేధావికి ప్రస్థానం నివాళులర్పిస్తోంది.

.......

**పాఠకులకు 2007 నూతన సంవత్సర శుభాకాంక్షలు**

**ముఖచిత్రం : అక్బర్**
**లోపలి చిత్రం : మోహన్**

## ఈ సంచికలో...

**షహీద్ సద్దామూ, సామ్రాజ్యవాదమూ............... 2**
**కవితలు.............................................. 5**
**చూ-డో-కు (కథ) ................................. 6**
**శిల్ప రహస్యాలు తెలిసిన**
**వల్లంపాటి వెంకట సుబ్బయ్య................. 9**
**స్పెసిమన్ (కథ) .................................. 11**
**సమీక్షా పర్వం .................................... 14**
**ఉత్సాహం నింపిన ఉత్తరాంధ్ర సాహిత్యశాల ...... 22**
**అరసం - విరసం**
**మధ్య కాలంలో సంచలనాలు ............... 25**
**స్త్రీల రచనలలో**
**మానవ హక్కులు, నైతిక విలువలు................. 30**
**ప్రజా జీవనాన్ని కాంక్షించిన నవల**
**'మలుపు తిరిగిన రథ చక్రాలు'.............. 34**
**కదన శంఖం - కథన శిల్పం**
**మగ్జీం గోర్కి నూరేళ్ల 'అమ్మ' ............... 38**
**కష్టజీవుల కథల గురించి... ..................... 43**
**ఆరు పదుల ఆత్మీయ కథకుడు**
**మునిపల్లెరాజుకు సముచిత గౌరవం........ 45**
**ప్రపంచ మహాకవి శ్రీశ్రీ ........................... 47**
**ఇమేజిస్టు కవి నారాయణబాబు .................... 49**
**సాహితీ సంరంభంగా అద్దేపల్లి సప్తతి ............. 53**
**డైరీ .............................................. 54**
**కవితలు.............................................. 61**
**ప్రకటనలు .......................................... 64**

సంపాదకుడు
**తెలకపల్లిరవి**
ముద్రాపకులు, ప్రచురణకర్త
**వి. కృష్ణయ్య**
మేనేజర్
**కె. లక్ష్మయ్య**

ఎడిటోరియల్ బోర్డ్ అడ్రస్ :
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

## దృక్పథం

# షహీద్ సద్దామూ, సామ్రాజ్యవాదమూ



తెలకపల్లి రవి

ఉరి తియ్యబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం ఇప్పుడు రణన్నినాదం. ఘనీభవించిన కక్షతో రాక్షస శక్తులు శిక్ష విధిస్తే తను ముసుగు వేసుకోనంటూ సద్దాం హుస్సేన్ ఆ ముష్కరత్వాన్ని బట్టబయలు చేశాడు. ఉరితాడుకు దేహం వేళ్లాడుతున్నా పిక్కటిల్లిన ధిక్కార స్వరం అది. సామ్రాజ్యవాదపు అమానుష చరిత్రకు తాజా సాక్ష్యమది. ఈ ధరాతలంపై తన ఆధిపత్యం యధేచ్ఛగా కొనసాగాలంటే సద్దాం హుస్సేన్ అనే మానవుడిని లేకుండా చేయడం దాని దృష్టిలో తప్పనిసరి. ఎదురు దెబ్బలు తింటున్నప్పుడే మేకపోతు గాంభీర్యం మరింత అవసర మవుతుంది. ఏక ధృవ ప్రపంచమంటూ ఏకపక్ష పోకడలు ఎంతో కాలం సాగించలేనని తేటతెల్లమై పోతున్న కొద్ది మరింత బింకం చూపుతున్నది. వెనిజులాలో మరోసారి చావేజ్ ఘన విజయం, నికరాగ్వాలో ఒర్టేగా పునరాగమనం వంటి పరిణామాల తర్వాత సద్దాం హుస్సేన్‌ను అడ్డు తొలగించకపోతే తమ ఆధిపత్యం అన్న మాటకు అర్థమే వుండదనీ దాని భయం.

అమెరికా ఆధిపత్య వ్యూహాలలో దురాక్రమణలూ, నరమేధాలూ,ఆర్థిక పీడనతో పాటు కీలకమైన నాయకుల నిర్మూలన కూడా ముఖ్య భాగం. ఆ విధంగానే గతయాభై అరవై ఏళ్లలో అమెరికా నేతలు ఎందరెందరో వర్ధమాన దేశాల నాయకులను పొట్టన బెట్టుకున్నారు. ఒక్కొక్క చోట ఒక్కొక్క సాకు, ఒక్కో పాచిక. బయిట దేశాలలోనే కాదు– స్వదేశంలోనూ సోవియట్ అణు కార్యక్రమానికి సహకరించారని తప్పుడు కేసు మోపి పందొమ్మిది వందల యాభైలలో రోజన్‌బర్గు దంపతులపై మరణశిక్ష విధించింది. ఆ టక్కరి పురాణాలు ప్రపంచ మంతటికీ తెలిసినవే.

వజ్రాలకూ, బంగారానికి నిలయం ఆఫ్రికా ఖండం. అందుకే దానిపై సామ్రాజ్యవాదానికి ఎప్పుడూ కన్ను. దాన్ని ఆక్రమించడమే కాక అక్కడనుంచి నల్లవారిని బానిసలుగా మార్చుకుని వస్తువుల్లా వ్యాపారం చేసిన చరిత్ర అమెరికాది. నిజానికి దాని ఆధునికత వెనక వున్నదంతా ఇండియన్లబడే మూలవాసుల, ఆఫ్రికా నుంచి తీసుకువచ్చిన నల్లజాతి బానిసల రక్త మాంసాలే. ఇది చాలక ఆ దేశాలను ప్రత్యక్షంగా వలస పాలన సాగించింది సామ్రాజ్య వాదం. వజ్రాలకు ఆలవాలమైన ఒకప్పటి కాంగో ఇప్పటి జైరే నల్లజాతి నాయకుడు పాట్రిస్ లుముంబాను సిఐఎ పథకం ప్రకారం హత్య చేయించింది.

సామ్రాజ్య వాదానికి సింహస్వప్నమైన విప్లవ యోధుడు చేగువేరాను 1967లో బొలీవియాలో దారుణంగా హత్య చేయించింది. చిలీ ఎన్నికల్లో గెలుపొంది జన రంజకమైన చర్యలను, సంక్షేమ పథకాలనూ అమలు చేస్తున్న సోషలిస్టు అధ్యక్షుడు సాల్వడార్ అలెండీని 1973లో సైనికి కుట్రతో హతమార్చింది.

మళ్లీ 1989లో రుమేనియా సోషలిస్టు నేత నికొలాయ్ సెషెస్క్యూ నాటి ప్రతికూల పరిస్థితుల్లోనూ గట్టిగా నిలబడ్డంతో బూటకపు విచారణ తతంగం జరిపించి అక్కడికక్కడే కాల్చి చంపించింది. ఆయన మృతదేహాన్ని పదే పదే టీవీలలో చూపుతూ సోషలిస్టు శక్తుల మనో స్థయిర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించింది.

తర్వాతి కాలంలో ఆఫ్ఘనిస్థాన్‌లో లౌకిక ప్రగతిశీల ప్రభుత్వాన్ని కూలదోయడానికి అనేకానేక దుష్టశక్తులకు వత్తాసునిచ్చింది. దాన్ని అల్లకల్లోలం చేసింది. ఆ క్రమంలోనే బిన్‌లాడెన్‌నూ,తాలిబాన్లనూ ప్రోత్సహించింది. తాలిబాన్లు ఆఫ్ఘనిస్తాన్‌ను వశపర్చుకున్నాక అప్పటి అధ్యక్షుడు నజీబుల్లాను నడిబజారులో ఉరితీయించింది.

ఈ విధంగా ప్రపంచంలో అమెరికా సైన్యం దురాక్రమణలకూ, నరమేధాలకూ సిఐఎ సాగించిన కుట్రలకూ, హత్యలకూ, అంతేలేదు. కొన్ని చోట్ల కోర్టులను, మరికొన్నిచోట్ల సైన్యాన్ని, మరికొన్ని చోట్ల కిరాయి హంతక ముఠాలనూ



ఉపయోగించు కుంటుంది. క్యూబా అధినేత కాస్ట్రోపై హత్యాయత్నాల పరంపర సాగించింది. యాసిర్ అరాఫత్, కల్నల్ గడాఫీ, తదితరులందరూ హత్యా ప్రయత్నాలనుంచి బయిటపడిన వారే.

అదంతా గతంలోని వ్యవహారం.అప్పుడు అంతర్జాతీయ రంగ స్థలంపై దీటైన ప్రత్యర్థిగా సోవియట్ యూనియన్ వుంది. 1991లో తొలి గల్ఫ్‌యుద్ధం నాటికే అది గణనీయంగా బలహీనపడినా ఉనికిలో వుంది. అప్పుడు ఇరాక్‌లో ఎలాటి వ్యూహం అనుసరించాలనే దానిపై అమెరికా పాలకవర్గాలలోనే తీవ్ర విభేదాలుండేవి. ఏదిఏమైనా అత్యంత చమురు సంపన్నమైన ఆ దేశాన్ని అదుపులోకి తెచ్చుకోవాలనే విషయంలో భిన్నాభిప్రాయాల లేవు. పైగా అరబ్ ప్రపంచమంతటినీ హడలగొట్టేందుకు, ఇప్పటికే తొత్తులుగా వున్నవాటిని మరింతగా లోబర్చుకునేందుకూ కువైట్‌పై ఇరాక్ ఆక్రమణ పెద్ద సాధనంగా దొరికింది. నూతన ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి ఇది నాంది అని అప్పట్లో పెద్ద బుష్ ప్రకటించాడు. ఇరాక్‌పై మహాదుర్మార్గమైన ఆంక్షలు విధించి వేధించారు. కసిగందులతో సహా లక్షలాది మంది విషాద మరణాలకు కారకులైనారు. అయినా సద్దాం హుస్సేన్ ఆధిపత్యంలో కొనసాగడం తమ వ్యూహానికి పెద్ద ఆటంకమని అమెరికా భావించింది. అప్పట్లో రక్షణ మంత్రిగా వున్న డోనాల్డ్ రమ్స్ఫెల్డ్ తదితరులు 1998లో బిల్ క్లింటన్‌కు లేఖరాస్తూ ఇరాక్‌నుఅలాగే వదిలేస్తే మొత్తం మధ్య ప్రాచ్యంలోనే పట్టు తగ్గిపోవచ్చని హెచ్చరించారు. (వాస్తవానికి అరబ్ నాయకులెవరో ఒకరిని ఎప్పుడూ సామ్రాజ్యవాదం తన దాడికి లక్ష్యంగా పెట్టుకుంటూనే వచ్చింది. మొదట్లో నాజర్, గడాఫీ, అరాఫత్, సద్దాం హుస్సేన్, బిన్‌లాడెన్ ఇలా ఒక్కొక్క దశలో ఒకరిపై కేంద్రీకరణ, దాడి జరుగుతూ వచ్చాయి. అరబ్ దేశాలపై ఇంత నిఘా వేయడానికి కారణం అక్కడి చమురు సంపదే గాని మత పరమైంది కాదు). ఇలాటి స్థితిలో 9/11 దాడులు మరో గొప్ప అవకాశంగా దొరికాయి. అల్ ఖైదాకు ఇరాక్ సహకారం వుందని నిరూపించే గట్టి ఆధారాలేమీ దొరకలేదు. అయినా సంబంధం వుండే వుంటుందని కాలమిస్టులు రాతలు గుప్పించారు. ఈ లోగా అక్కడ సామూహిక విధ్వంసక ఆయుధా లున్నాయంటూ నిరాధార నివేదికలు పుట్టించారు. ఈ విషయంలో సహకరిస్తే ఇరాక్‌పై ఆంక్షలు ఎత్తివేయ వచ్చునని ఐరాస అధికారులు సూచించారు గాని సద్దాం హుస్సేన్ పదవీ చ్యుతుడైతే తప్ప ఆంక్షల ఎత్తివేత సాధ్యం కాదని అమెరికా భీష్మించింది. తర్వాత ఇరాక్ ఎంతగా దిగివచ్చినా దురుద్దేశపూరితమైన అమెరికా దాన్ని దిగ్బంధించడానికే నిర్ణయించుకుంది. నాటోలో కూడా విభేదాలు వచ్చినా ఖాతరు చేయలేదు.

2003 ఫిబ్రవరిలో సద్దాం,ఆయన కుమారులు దేశం వదలివెళ్లాలని బుష్ అల్టిమేటం జారీ చేశారు.సహజంగానే దాన్ని సద్దాం తిరస్కరించడంతో సైనిక దాడి ప్రారంభమైంది. తర్వాతి కథ తెలిసిందే.

దేశాన్ని ఆక్రమించిన తర్వాత సద్దాంను వేటాడి కనీస నిబంధనలు కూడా పాటించకుండా కలుగులో ఎలుకలా పట్టుకున్నామన్నారు. 2005 అక్టోబరు 19న విచారణ తంతు మొద లెట్టారు. నెలరోజుల్లో ముగించి ఉరి తీసేద్దా మనుకున్నారు. ఈ తతంగంతో ప్రజానీకం పూర్తిగా భయభ్రాంతు లవుతారనీ భావించారు. 1982లో తనను పదవి నుంచి తప్పించేందుకు జరిగిన కుట్ర విఫలమైన తర్వాత సద్దాం దుజైల్‌లో 148 మందిని హత మార్చాడన్నది మొదటి ఆరోపణ. ఇంకా చాలా ఆరోపణలున్నా వాటిలో అమెరికా కూడ ముద్దాయిగా నిలవాల్సి వస్తుంది గనక దీన్ని ఎంచుకున్నారు. ఈ విచారణ ఇరాక్‌కే గాక మొత్తం పశ్చిమాసియా అంతటా సరికొత్త న్యాయప్రమాణాలు నెలకొల్పుతుందని వూదరగొట్టారు. అయితే కథ అడ్డం తిరిగింది. చాలా మంది రాజకీయ నేతల్లానే సద్దాం ఆ న్యాయస్థానాన్ని తన సమరాంగణంగా మలుచుకున్నాడు.

కోర్టులో హాజరు పరిచిన రోజునే సద్దాంను ఫలానా అని ప్రమాణం చేయమంటే తిరస్కరించాడు. నేను ఈ దేశానికి అధ్యక్షుణ్ని, ఈ కోర్టును గుర్తించడం లేదు, మీరు దురాక్రమణ దారులు అని గర్జించాడు. నీవూ ఇరాకీవే నేనెవరో నీకు తెలుసు,నేను నేరం చేయలేదు అని ప్రకటించాడు. ఆయన తరపున వాదించే ముగ్గురు న్యాయవాదులు మెజారిటీ షియా వర్గపు హంతకదళాల చేతుల్లో హత్యకు గురయ్యారు. 30 మందిని సాక్షులుగా ప్రవేశపెట్టగా వారేమీ చెప్పేందుకు సిద్ధపడలేదు. కొంతమంది తెర వెనక నుంచే సాక్ష్యమిచ్చారు. జరిగిన మేరకు విచారణ న్యాయ సంప్రదాయాలకు విరుద్ధంగా అడ్డగోలుగా సాగింది. అమెరికాపై నిరసనలూ, కోర్టు బహిష్కరణలూ, సమ్మెలూ, వాకౌట్లతో కోర్టు ప్రతిధ్వనించింది. న్యాయమూర్తి వారి పట్ల మె తగ్గా వ్యవహరిస్తు న్నాడని కీలుబొమ్మ ప్రధాని నూరి కమల్ అల్ మాలిక్ చిందులు తొక్కాడు. చివరకు ప్రధాన న్యాయమూర్తి రిజార్ మహ్మద్ అమీన్ పదవికి రాజినామా చేసి తప్పుకోవలసి వచ్చింది. తాను విపరీతమైన మానసిక ఒత్తిడికి గురయ్యానని ఆయన తర్వాత గార్డియన్ పత్రికకు చెప్పాడు.

తర్వాత వచ్చిన న్యాయమూర్తి కుర్దు జాతీయుడైన రవూఫ్ అ బ్బుల్ రహ్మాన్ సద్దాంను రాజకీయ ప్రత్యర్థిలా చూశాడు. పరిగణించి అడుగడుగునా సద్దాం హుస్సేన్ కూడా ఆయనను ఖాతరు చేయకుండా ‘ నీ చావు నీవు చావు’(గోటు హెల్) అని ధిక్కారం ప్రకటించాడు.ఈ విచారణ ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందని చెప్పినప్పటికీ సద్దాం ప్రతిఘటనను సెన్సార్ చేసేందుకోసం ఆలస్యంగానే ప్రసారం చేసేవారు. అలా తూతూ మంత్రంగా జరిపించేద్దామనుకున్న విచారణ చాలా కాలం పట్టింది. ఇదంతా న్యాయప్రమాణాలకు నిలవదని ఐరాస మానవహక్కుల సం ఘమే విమర్శించింది.ి. చివరకు అందరూ అనుకున్నట్టు మరణశిక్ష ప్రకటించారు.

ఇరాక్ జనాభాలో మూడు శాతం వరకూ హతమై పోయిందని, 2003 దురాక్రమణ తర్వాత పదిలక్షల మంది జాడతెలియకుండా పోయారనీ బ్రిటిష్ వైద్య పత్రిక లాన్సెట్ అక్టోబర్‌లో రాసింది. ప్రస్తుత ఇరాక్ ఆరోగ్యమంత్రి అలేషా మరీ మాట్లాడుతూ లక్షన్నర మంది ఇరాకీలు చంపివేయబడ్డారనీ, అమెరికా సైన్యాలే ఇందుకు కారణమని విమర్శించాడు. సాధ్యమైనంత త్వరగా దేశాన్ని నిర్వహించే బాధ్యతను తమకు అప్పగించాలని కీలుబొమ్మ ప్రదాని నౌరి అలూ మాలిక్ కోరుతున్నాడు. సద్ధాంను ఉరితీస్తే తప్ప దేశంపై తనకు పట్టు రాదని ఆయన భయం. అందుకే కొత్త సంవత్సరం వచ్చేలోగానే ఉరితీసేయాలని ముందే చెప్పాడు. అది జరగకపోవడం పట్ల చాలా అసంతృప్తిచెందాడు కూడా. అయితే ఆయన ఆందోళన చెందనవసరం లేకుండా నవంబరు26న సద్ధాంకు విధించిన ఉరిశిక్షను అప్పిలేట్ ట్రిబ్యూనల్ ఖాయం చేసింది. అంతేగాక అప్పుడు ఉపప్రధాని రందాన్‌కు యావజ్జీవ శిక్ష మాత్రమే విధిస్తేదాన్ని కూడా మరణశిక్షగా మార్చింది. ఇదంతా చట్ట బద్ధంగా సముచితమైన రీతిలో జరిగిందని అమెరికా హర్షం వెలిబుచ్చినా బ్రిటన్‌తో సహా చాలా దేశాలు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశాయి.

ఇప్పటివరకూ ఇరాక్‌లో 3000 మంది అమెరికన్లు హతమవగా 20 వేలమంది గాయపడ్డారు. నెలకు వందమంది వరకూ దాడుల్లో మరణిస్తున్నారు. వీరు గాక 6000 మంది ఇరాకీ పోలీసులు కూడా దాడుల్లో హతులయ్యారు. పోలీసులలో నలభై శాతం మంది మానేశారు. ఏటా ఇరవై శాతం మంది విధులు మానేస్తున్నారు. ఇరాక్‌లో షియా, సున్నీ అనుయాయుల తగాదాలతో అంతర్యుద్ధం ప్రజ్వరిల్లు తుందనే భయం కూడా పెరుగుతున్నది. దేశంలో షియా జనాభా బాగా ఎక్కువకాగా సద్దాం సున్నీ. అయినా సద్దాం పాలనపై ఎన్ని విమర్శలున్నా ఆయన హయాంలో ఇలాటి పరిస్థితిలేదు. మధ్య ప్రాచ్యంలోని అనేక దేశాలలో సున్నీలు ఎక్కువగా వున్నారు. ఈజిప్టు అధ్యక్షుడు ముబారక్ మరణ శిక్షను బహిరంగంగానే వ్యతిరేకిస్తూ దీనివల్ల అనూహ్యస్థాయిలో కల్లోలం చెలరేగుతుందని హెచ్చరించాడు. ఇంకా సౌదీ అరేబియా, జోర్డాన్, లెబనాన్‌లలో సున్నీలు ఎక్కువకాగా మరో ప్రధాన ఇస్లామిక్ రాజ్యమైన ఇరాన్‌లో షియాలదే ఆధిక్యత. అలాగే తీవ్రవాద సంస్థ హిజ్బుల్లా కూడా షియా వర్గానికి చెందిందే. సద్దాం పతనం తర్వాత ఇరాక్‌లో షియా మత శక్తులు విజృంభణ మొదట్లో తొత్తు ప్రభుత్వానికి తోడ్పడినా తర్వాత అది ప్రధానికి ఆందోళనగా మారింది. ఇప్పుడుసద్దాంను ఉరితీయించడంద్వారా తాను షియాల మద్దతు పొందగలనని ఆయన వ్యూహం. అయితే వాస్తవంలో సద్దాం మరణశిక్ష తర్వాత ఇరాక్ షియా సున్నీ ఘర్షణలకు కేంద్రబిందువుగా మారుతుందని దానివల్ల మొత్తం56 దేశాల్లోనూ కల్లోలం తలెత్తడమే కాక అమెరికా పట్ల వ్యతిరేకత కూడా తీవ్రమవుతుందని అధికారిక నివేదికలే హెచ్చరిస్తున్నాయి. ఇరాక్‌లో రకరకాల మతపరమైన సాయుధ దళాల ఉనికి వారికి ప్రాణసంకటమవుతున్నది. అక్కడ జరిగే పేలుళ్లలోమరణించేవారిలో63 శాతంమంది అమెరికన్‌సైనికులేవున్నారు. శవాల గుట్టలతో ఆస్పత్రులలో శవాగారాలు కిటకిటలాడి స్థలం లేకుండా పోయింది. నవంబరు రెండవ వారంలోనే 60 శవాలు వచ్చిపడ్డాయి. ఇలాటి స్థితిలో తిరుగుబాటు దాడులను అరికట్టి పరిస్థితిని అదుపులోకి రాకపోగా అకారణంగా బలైపోతున్నామనే భయాందోళన అమెరికన్ల లోనే ప్రబలింది. వందమంది సైనికులు సంతకాలు చేసిన పత్రంలో ఇరాక్‌నుంచి ఉపసంహరించు కోవాలంటూ అధ్యక్షున్ని కోరారు. బ్రిటన్‌ప్రధాని టోనీ బ్లెయిర్ బలవంతాన ఇంటికి పంపే సన్నాహాలకూ ఇదే కారణం. ఆఖరుకు పదవీ విరమణ చేస్తూ ఐరాస ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ కూడా అమెరికా వైఖరిపై విమర్శలతో వీడ్కోలు పలికాడు.

దీనంతటి నుంచీ కనీస పాఠాలు నేర్చుకుంటే సద్దాంను మరణశిక్షను రద్దుచేసి వుండాలి. కాని అది అమెరికా నైజానికే విరుద్ధం. మౌలికంగా ప్రపంచాధిపత్యంపై ఆధారపడిన సామ్రాజ్యవాదం ఎప్పుడూ దురాక్రమణలూ, దోపిళ్లూ నరమేధాలూ సాగిస్తూనే వుంటుంది. అందులో వ్యూహాత్మకంగా ఎక్కువ ప్రమాదకరమైన దేశాలనూ, రాజకీక శక్తులనూ వ్యక్తులపై మరింతగా కేంద్రీకరిస్తుంది. ఈ వారమే మరణించిన గెరాల్డ్ ఫోర్డ్ 1975లో రెండు చెంపలూ వాయించుకుని మరీ వియత్నాం నుంచి వైదొలగడంచరిత్రలో మరువరాని ఘట్టం. చారిత్రిక రాజకీయ పరిస్థితులలో చాలా మార్పులున్నా సద్దాం విషయంలో జరుగుతున్నదదే.

సద్దాంను ఉరితీస్తే తప్ప దేశంపై తనకు పట్టు రాదని ఆయన భయాందోళనలతో వణికిపోయాడు. అందుకే కొత్త సంవత్సరం వచ్చేలోగానే ఉరితీసేయాలని ముందే చెప్పాడు. ఆయన ఆందోళన చెందనవసరం లేకుండా నవంబరు 26న సద్దాంకు విధించిన ఉరిశిక్షను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఖాయం చేసింది. ఆ లాంఛనం పూర్తయ్యాక జనవరి 26 వరకూ ఆగుతారని ఎవరూ అనుకోనేలేదు గాని అంత హఠాత్తుగా డిసెంబరు 30నే చంపేస్తారనీ అనుకోలేదు. ఆఖరి ఘట్టాన్ని గురించి అధికారికంగా విడుదలైన వివరాలు, ఆ తర్వాత వచ్చిన అసలు కథల మధ్య తేడా చూస్తే సద్దాం పట్ల ఎంత అమానుషంగా వ్యవహరించారో కళ్లకు కడుతుంది. ఇంత జరిగిన తర్వాత ఆయనను స్వగ్రామంలో సమాధి చేస్తే సందర్శకుల తాకిడి తారెత్తిస్తున్నది. అయితే అసలు కథ ముందే వుంటుంది. ఉరి తియ్యబడ్డ ఆ శిరస్సు చెప్పిన రహస్యం ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తుంది.



## కవితలు



### నూతన సంవత్సరమా! స్వాగతం

మల్లెమొగ్గల గోపాలరావు

పలుకుదాం నూతన సంవత్సరానికి స్వాగతం
వరిస్తూ విజయాలను ముందుకు దూసుకుపోదాం మనం
ఈర్ష్య, ద్వేషం ఉన్న వ్యక్తి బ్రతుకు బడబానలం
ప్రేమతో నిండిన ప్రతి హృదయం పూవుల వనం!

నిష్కల్మషమైన హృదయాలకు చేద్దాం వందనం
ఉంటుంది ప్రతి వ్యక్తి జీవితానికో ప్రయోజనం
పుట్టినందుకు సార్థకం అవ్వాలి మన జన్మం
గుబాళించును జగమంతా శాంతికై చేస్తే శ్రమదానం!

వ్యక్తి ఆలోచన కావాలి నిత్య నూతనం
ప్రయోజనాత్మక మార్పులకు పొందాలి స్పందనం
ఏదైనా సాధించాలనే తపన కావాలి తమ విధానం
పట్టుదల, కృషి వున్నవాని బ్రతుకు కాదా బృందావనం!

సదా కోరుకుంటే సజ్జన సన్నిదానం
ప్రేమ, కరుణలతో మనసు అవుతుంది సంధానం
ప్రజలందరు ఆలపిస్తే సమైక్యతాగానం
ప్రతి దుష్ట శక్తి ఓడి మంచికి చేస్తుంది వందనం!



### చీకటి వెలుగులు



రేగుల పాటి కిషన్‌రావు

ఎడారిలో చినుకులాగ మనసు మురియుచుండగా
వర్ష రుతువు వరదలాగ వేదన వస్తున్నది

కొందరిలో అక్షరాలు ఎండిన మడుగులు కాగా
కొందరిలో పాండిత్యం పొంగిపొర్లుతున్నది

సౌజన్యం తేనెలాగ బొట్టు బొట్టు పడుతుండగ
దౌర్జన్యం తుఫానులా అదరగొట్టుచున్నది

పాలనలో నీతి నాతి వివస్త్రలాగ పడి ఉన్నది
అధికారము అందలమ్ము ఎక్కి తిరుగుతున్నది

న్యాయం చల్లారుచున్న నిప్పు చందమవుతుండగ
అన్యాయం మండుచున్న అడవి చందమగుచున్నది

ధర్మం కాళ్ళు విరిగి నడవలేక నడచుచుండ
అధర్మమ్ము నక్కలాగ పెద్ద పరుగు తీస్తున్నది

శాంతి సుమము పరిమళాలు పంచి విందు చేయుచుండ
హింస కంపలాగ వచ్చి ఒళ్లు చీరి వేస్తున్నది

ఐక్యత సాధించు కొరకు చేయి చేయి కలుపుచుండ
విభేదాల విషసర్పం కాటువేయ చూస్తున్నది

సమత కూత గొంతులోనే అణచివేయబడుచుండగ
అంతరమ్ము అగ్ని చిమ్ము పర్వతమే యగుచున్నది


### ఆకురాలు కాలం!



భీంపల్లి శ్రీకాంత్

ఆకురాలు కాలం
ఎన్ని బతుకులను రాల్చిందో
పగబట్టిన కరవు కాలం
ఎన్ని జీవితాలను చిదిమేసిందో
ఇక్కడ వసంతం విరబూయదు
పసిడి పరిమళాలను వెదజల్లనీయదు
పాలమూరు...
ఇపుడు రెక్కలు తెగిన పక్షి
కుంటుతూ... కుంటుతూ...
దూరాల తీరాలను దాటుతోంది
గాలి దాహాన్ని తీర్చుకుంటూ...
అది - ఎక్కడికెళ్ళినా...
దానికి ఆకలి దాహం తీరదు
ఇపుడు దేశమంతా కరవు
వలస పక్షికి కూడా
దానికి,
పబ్బాలు ఉండవు
పండుగలు ఉండవు
పని దొరకడమే
దానికి పండుగ
చేయి ఆడితేనే
దాని కడుపు నిండుగ
దూర తీరాలు దాటిన వలస పక్షికి...
కుహుకుహురాగాల
స్వరాలు వినబడవు
ఆకలి గీతం తప్ప
షడ్రచుల పచ్చడి
తాగాలనే ధ్యాసే ఉండదు
కష్ట, నష్టాల శ్రమదాహం తప్ప
దశాబ్దాల నా పాలమూరును
కరవు కాటేసింది
అది చూడలేని ప్రభుత
నాలుగు చేతులు ఎత్తేసింది

# చూ–డో–కు



**వెంకట్రావు ఈ మధ్య ఆఫీసులో అదోరకంగా వుంటున్నాడు. తన సీట్లో కూర్చుని ఎపుడూ పెన్నును ఊపుతూ అపుడపుడు ఒక్కసారిగా ఏదో అంకె వేసి మళ్ళీ ఆలోచిస్తుంటాడు. ఎవరైనా దగ్గరకు వస్తే ఆ కాగితాన్ని మూసేసి వచ్చిన వారితో త్వరగా మాట్లాడి పంపి, తిరిగి ఆ పనిలో పడిపోతాడు.**

## తుమ్మా భాస్కర్

**ఆ**ఫీసరు పిలిచినా ఏదో పరధ్యాసలో వెళ్ళి వచ్చి మళ్ళీ ఆ పనిలోనే ఉండిపోతాడు. ఆఫీసు పనులను త్వరగా పూర్తి చేయడం లేదని ఆఫీసరు ఎన్నోసార్లు చివాట్లు పెట్టినా అతనికి చీమ కుట్టినంతైనా లేదు.

ఆఫీసు టైము ముగియగానే స్కూటరుపై సరాసరి పబ్లిక్ గార్డెన్‌కు వెళ్ళి గడ్డిపై కూర్చుని సీరియస్‌గా పనిలో పడిపోయాడు.

"ఇక్కడున్నావా నాయనా! నిన్ను వెతకలేక చచ్చాను. ఈ రోజు మన టైపిస్టు పెళ్ళి ఉన్న సంగతి కూడా మర్చిపోయావా?" అంటూ కొలీగ్ బ్రహ్మానందం వచ్చాడు.

బ్రహ్మానందం వచ్చి అంతరాయం కలిగించినందుకు వెంకట్రావుకు చిరాకు కలిగింది గాని తను చేసే పనిని గమనిస్తే ఎక్కడ అసహ్యించుకుంటాడోనని మౌనంగా అతని వెంట పెళ్ళికి వెళ్ళాడు.

పెళ్ళి మంటపంపై బ్రాహ్మణుడు పెళ్ళి మంత్రాలు చదువుతున్నాడు. వచ్చిన వారంతా ఎదురుగా కుర్చీలలో కూర్చుని పెళ్ళి తంతును వీక్షిస్తున్నారు. వెంకట్రావు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా పేపరులో కళ్ళు పెట్టి పెన్నుతో కుస్తీపడుతున్నాడు. అక్షింతలను పంచి పెట్టే వ్యక్తి దగ్గరకొచ్చింది కూడా గమనించలేదు.

"సార్! మీ పజిల్ తరువాత చూసుకోండి. ముందు ఈ అక్షింతలు తీసుకోండి" అన్న పిలుపుకు వెంకట్రావు తల ఎత్తకుండానే అక్షింతలను తీసుకున్నాడు.

వచ్చిన వారంతా అక్షింతలు వేసి భోజనానికి కదిలారు. వెంకట్రావుకు ఇవేమీ పట్టలేదు. అలాగే కూర్చుని పజిల్‌లో లీనమయ్యాడు.

"నీ పిచ్చి నీకే గాని, ఎదురుగా ఏమి జరుగుతుందో కూడా చూసే పరిస్థితిలో లేవు. అందరు భోజనానికి కదిలారు" అంటూ బ్రహ్మానందం భుజం తట్టడంతో వెంకట్రావు లేచి అక్షింతలను వధూవరులపైకి విసిరి, భోజనానికి కదిలాడు.

వారి భోజనం అయింది.

"వెంకట్రావు! నన్ను మా ఇంటి దగ్గర డ్రాప్ చేసి వెళ్ళు" అంటూ బ్రహ్మానందం కోరాడు.

వెంకట్రావుకు ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"అలా కాదు. నిన్ను మీ ఇంటి దగ్గర దింపి వెళ్ళాలంటే నాకు చుట్టూ అవుతుంది. నీవు నా స్కూటరు తీసుకెళ్ళు. నేను బస్సులో వెళతాను. ఇక నుంచి నేను రోజూ ఆఫీసుకు బస్సులోనే వచ్చి బస్సులోనే ఇంటికి వెళతాను" అని అన్నాడు వెంకట్రావు.

"స్కూటరుండగా అలా ఎందుకు వెళ్ళాలి?"

"అది అంతేలే." అంటూ వెంకట్రావు స్కూటరు తాళపు చేతులు బ్రహ్మానందం చేతిలో పెట్టి తుర్రున బస్ ఎక్కాడు.

వెంకట్రావు బస్సులో కూడా పజిల్ చేయడంలోనే నిమగ్నమయ్యాడు. తనకు ప్రయాణంలో కూడా సమయం వృథా కానందుకు ఎంతో సంబరపడ్డాడు.

– – –



వెంకట్రావు పనిపై బ్రహ్మానందం ఇంటికి వెళ్ళాడు.

బ్రహ్మానందం భార్యను వెంకట్రావుకు కాఫీ ఇవ్వమన్నాడు.

''పని మనిషి ఇస్తుందిలెండి'' అంటూ బ్రహ్మానందం భార్య వెంకట్రావు వద్దకు వచ్చి ''అన్నయ్యగారు! మీరు ఈ పజిల్స్‌ను బాగా చేస్తారట. ఇది నాకు చాలా హార్డ్‌గా వుంది. మీరు చేయండి" అంటూ ఆమె తన చేతిలోని పేపరును చూపిస్తూ దాన్ని అతనికి ఇచ్చింది.

వెంకట్రావు ఆశ్చర్యపోయాడు. ఎన్నడు కూడా బ్రహ్మానందం భార్య తనతో ఇలా చనువుగా మాట్లాడలేదు. ఇది నిజమో కాదోనని అతను తన తలను ఒక్కసారి విదిలించాడు.

''నీ జబ్బు మా ఆవిడకు కూడా అంటుకుంది. పనిమనిషి మీద పనంతా పడేయడమే కాదు, నా సంగతి, పిల్లల సంగతి కూడా చూసుకోవడం మానేసింది. ఇక మీ పజిల్ కానీయండి" అంటూ గొణిగాడు బ్రహ్మానందం.

బ్రహ్మానందం మాటలకు వెంకట్రావు నొచ్చుకున్నాడు.

"ఆయన మాటలేమీ పట్టించుకోకు అన్నయ్యగారు" అన్న ఆమె మాటలు వెంకట్రావును ఓదార్చాయి.

అతనిలో పజిల్‌ను సాధించి చూపించాలనే తపన.

''ఇదేముందమ్మా! తేలికదైతే అర్ధగంట, కష్టతరమైందయితే ఎక్కువలో ఎక్కువ రెండు గంటలు" అంటూ జేబులోంచి పెన్ను తీసి పజిల్‌లోని గళ్ళు నింపడానికి పూనుకున్నాడు.

అతను ఎలా గళ్ళు నింపగలుగుతున్నాడో ఆమె చూడసాగింది.

భార్య చూస్తున్న తీరుకు బ్రహ్మానందానికి ఒళ్ళు మండుతుంది గాని ఓర్చుకోసాగాడు.

కొద్దిసేపటికి "ఇది చాలా కష్టంగా ఉందే" అని మెల్లగా అన్నాడు వెంకట్రావు.

''నేను పొద్దుటినుంచి ఈ పజిల్‌ను నింపలేక చచ్చాననుకోండి. గుడికి వెళ్ళాల్సి ఉండి కూడా దీన్ని పూర్తి చేయందే వెళ్ళగూడదనుకున్నాను. సమయానికి మీరు వచ్చారు" అంటూ ఆమె తన పట్టుదలను ఎరుకపరిచింది.

''అది ఏమైనా కొంపలు ముంచేదా అంత కంగారుపడుతున్నావు" అని బ్రహ్మానందం భార్యను వెటకారంగా అన్నాడు.

ఆమె మూతి ముడిచింది.

ఇంతలో ఫోన్ రావడంతో "కాస్త ఫోన్ ఎత్తండి" అంటూ ఆమెను భర్తను కోరింది.

''అతి ముఖ్యమైన పనిమీద ఉన్నట్లుగా ఆదేశాలూను'' అంటూ బ్రహ్మానందం లేచి వెళ్ళి ఫోను మాట్లాడి వచ్చాడు.

"వెంకట్రావ్! నీకేనయ్యా ఫోన్. మీ రెండవ అమ్మాయికి జ్వరం వచ్చిందట. మీ ఆవిడ నిన్ను వెంటనే రమ్మంది" అని చెప్పాడు బ్రహ్మానందం.

''హాస్పిటల్‌కు తీసుకువెళ్ళ మనకపోయావా?" అని సలహా ఇచ్చాడు వెంకట్రావు.

బ్రహ్మానందానికి కోపం వచ్చింది.

"నీకేమైనా బుర్ర ఉందా? అమ్మాయికి జ్వరం వస్తే నీవు వెళ్ళి హాస్పిటల్‌కు తీసుకెళ్ళాల్సిందిపోయి ఆడమనిషిని తీసుకెళ్ళమంటావా? అసలు ఈ పజిల్‌లో ఏముందయ్యా? ఎవరికి ఎవరం కాకుండా, మాట్లాడుకోకుండా పోతున్నాము" అంటూ బ్రహ్మానందం కోప్పడ్డాడు.

"ఈ రోజు దీని అంతు తేల్చందే నిద్రపోను" అంటూ వెంకట్రావు ఆ కాగితాల్ని జేబులో పెట్టుకొని ముందుకు కదిలాడు.

"సరే! అసలు నీవు ఎందుకు వచ్చినట్లు?" అడిగాడు బ్రహ్మానందం.

వెళ్ళబోయిన వెంకట్రావు ఆగి, "ఆ మరిచిపోయాను. రేపు అమ్మాయి పరీక్ష ఫీజుకు లాస్ట్‌డేట్. ఒక వేయి రూపాయలు బదులు అడుగుదామని వచ్చాను" అని అన్నాడు.

"ఇంకో రెన్నాళ్ళయితే నిన్ను నీవే మరిచిపోతావు" అంటూ బ్రహ్మానందం వేయి రూపాయలు వెంకట్రావుకు ఇచ్చాడు.

"అన్నయ్యగారు! ఆ పజిల్ నింపడం మరిచిపోకండి. నేను ఫోన్ చేస్తాను" అంది బ్రహ్మానందం భార్య.

వెంకట్రావు అలాగేనంటూ వెళ్ళిపోయాడు.

– – –

వెంకట్రావు రెండవ కూతురుకి విపరీతమైన జ్వరం. హాస్పిటల్‌లో డాక్టరు ఆ అమ్మాయికి గ్లూకోజు బాటిల్ ఎక్కించి వెళ్ళిపోయాడు. వెంకట్రావు బెడ్ పక్కనే కుర్చీలో కూర్చుని పజిల్‌లో లీనమయ్యాడు.

అమ్మాయి 'డాడీ' అని మూలుగుతుంది. ఆయనకు ఆ మూలుగు వినపడటం లేదు. పజిల్‌లో ఆందోళనపడుతూ ఒక చేతి వేళ్ళతో జుట్టును దువ్వుకోసాగాడు.

ఆ అమ్మాయి మూలుగు విన్న నర్సు పరుగున వచ్చి చూసింది. గ్లూకోజు బాటిల్ ఎపుడో అయిపోవడంతో రివర్స్‌లో రక్తం రాసాగింది. అమ్మాయి వణుకుతుంది.

నర్సు అమ్మాయి చేతికున్న సిరంజి, బాటిల్‌ను తీసివేసింది. డాక్టరు వచ్చి పరీక్ష చేస్తున్నాడు. ఇంతలో వెంకట్రావు భార్య, పెద్దమ్మాయి వచ్చారు.



వారందరి రాకతో వెంకట్రావు ఇహలోకంలోకి వచ్చాడు.

నర్సు జరిగింది చెప్పింది.

డాక్టరుకు కోపమొచ్చింది.

''ఏమయ్యా! బిడ్డకు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నావా? అసలు నీవు తండ్రివేనా?" కోపంగా అన్నాడు డాక్టరు.

వెంకట్రావు భార్య అక్కడ పక్కన ఉన్న పేపరును తీసి "చూడండి డాక్టరుగారు! ఈయనకు ఇదొక రోగం తయారైంది. దీన్ని నింపుకుంటు ఎదురుగా ఎవరున్నారు, ఏమి జరుగుతుందో కూడా చూసుకోడు. సరిగ్గా అన్నం తినడు. పిల్లల బాగోగులు కూడా చూసేది లేదు. ఎపుడూ దీని ధ్యాసే. ఇదేదో మనకు ఉపయోగపడుతున్నట్లుగా దీని వెంట పడుతున్నాడు" అంటూ కసురుకుంది.

"ఓహో! సు-డో-కునా. దీని రుచి మరిగిన మనిషి మటాషేనమ్మా. దీనికి అలవాటు పడిన వాడిలో ఛాలెంజిలాంటి మనస్తత్వం ఏర్పడి ఎపుడూ ఒక పజిల్‌ను నింపిన తరువాత మరొకటి నింపాలనే తీవ్రత ఏర్పడుతుంది. దీనివలన మనసు భారమవుతుంది. ఒక్కొక్కసారి తలలోని నరాలన్నీ లాగేస్తాయి. ఏదో కోల్పోయిన వాళ్ళమవుతాము. వేరే ఆలోచనలు సరిగా రావు. వేరే వాళ్ళతో మాట్లాడుతున్నా, వేరే పనులు చేస్తున్నా ఇది మనల్ని పట్టి పీడిస్తూనే ఉంటుంది. బిడ్డకు ప్రమాదమున్న పరిస్థితిలో కూడా ఈయనగారు పజిల్‌లో లీనమయ్యే స్థితికి చేరాడంటే వ్యసనం ముదిరిందన్నమాట" అని డాక్టరు చెప్పాడు.

''ఈ పజిల్ జోలికి వెళ్ళొద్దని నేను ఇంట్లో మొత్తుకుంటూనే ఉన్నాను. ఒకసారి పొయ్యిపైన టీ గిన్నెను చూడమనిఅలా బయటకు వెళ్ళి వచ్చేసరికి అది మాడి పొగలొచ్చేంత వరకు కూడా చూసుకోలేదు. మరొకసారి బస్సులో తను దిగాల్సిన స్టేజిలో దిగకుండా లాస్ట్ స్టేజిలో దిగడంతో ఆఫీసుకు ఆలస్యం కావడం, ఆ పూట సెలవు! పజిల్ పిచ్చిలో పడటమే. ఏదో ఒలింపిక్ గేమ్స్ పోటీలకు వెళుతున్నట్లుగా రాత్రివేళ పక్కలో కూడా ఇదే పని... ఇంతకూ దీని గురించి మీకు ఇంతగా ఎలా తెలుసు డాక్టరుగారు?" అని అడిగింది వెంకట్రావు భార్య.

"నేనూ దాని బాధితుడనేనమ్మా. దాని ఉచ్చులో పడి నా ప్రాక్టీసును పోగొట్టుకున్నాను. నా సమయాన్ని ఎంతగానో వృధా చేశాను. అపుడు అర్ధమయింది నేను కోల్పోతున్నదేమిటో. దీన్ని ఎలాగైనా వదిలించుకోవాలని ఆలోచించి చివరకు సు-డో-కు పజిల్ లేని పత్రికను మాత్రమే తెప్పించుకోవడం జరిగింది. దానితో నేను తిరిగి మనిషిగా మారాను. నా ప్రాక్టీసు యధావిధిగా పెరిగింది. ఇక దీని ఛాయలకు కూడా వెళ్ళదలచుకోలేదు. దీని వ్యసనాన్ని కంపల్సివ్ సుడోకు సిండ్రోమ్' అంటారు అంటూ డాక్టర్ చెప్పాడు.

వెంకట్రావు అవమానంగా తలదించుకున్నాడు.

"సారీ! డాక్టరుగారి లాగే మనం కూడా సు-డో-కు లేని పత్రికను తెప్పించుకుందాం. దాన్ని చూసే సమయాన్ని, మిగతా అవసర పనులకు వాడతాను" అంటూ వెంకట్రావు భార్యతో అన్నాడు.

వెంకట్రావుకు సెల్‌ఫోన్ వచ్చింది.

"ఎవరు?" అని అడిగాడు.

''నేను బ్రహ్మానందం భార్యను. నాకు ఎంత ప్రయత్నించినా ఆ సు-డో-కు రాక నిద్రపట్టడం లేదు. మీకైనా వచ్చిందా అని అడుగుతున్నాను" అటునుంచి గొంతు.

"సారీ చెల్లెమ్మా! ఇంకెపుడు పజిల్స్ జోలికి వెళ్ళను. నీవు కూడా పొరపాటుగానైనా చూడొకు. దాన్ని మరిచిపో" అంటు వెంకట్రావు సెల్ పెట్టేశాడు.

అక్కడి వారందరిలో సంతోష ఛాయలు విరబూశాయి.

లేట్

# శిల్ప రహస్యాలు తెలిసిన సాహిత్య విమర్శకుడు వల్లంపాటి వెంకట సుబ్బయ్య




**మార్క్సిస్టు సాహిత్య విమర్శకునికి ఉండవలసిన భౌతికవాద ప్రాపంచిక దృక్పథం, చారిత్రక దృష్టి, సామాజిక అవగాహన, వస్తుతత్వం, విస్తృత అధ్యయనశీలం, ఆలోచనాపరమైన స్పష్టత, అభివృద్ధిపరమైన సరళత, వినయ ప్రతిపాదనలో ఉండవలసిన క్రమత వల్లంపాటి సాహిత్య విమర్శలో పుష్కలం.**

**డా॥ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి**

గత నూరేళ్ళ తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య వస్తువును గురించి జరిగినంత చర్చ, వస్తువును అభివ్యక్తం చేసే శిల్పాన్ని గురించి జరగలేదు. మార్క్సిస్టు దృక్పథంతో శిల్పాన్ని గురించి అధ్యయనం చేసిన వారిలో అరుదైన వ్యక్తి వల్లంపాటి వెంకట సుబ్బయ్య. మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకులలో సిద్ధాంతాలను అన్వయించి చూపేవారు తక్కువ. ఆ కొద్దిమందిలో 'వల్లంపాటి' ఒకరు. సాహిత్య విమర్శలోని వస్తు శిల్పాలను, సిద్ధాంత అన్వయాలను సమన్వయం చేసి అనేక విమర్శ గ్రంథాలు రాసిన వల్లంపాటి కన్నుమూశారు. ఆయన మరణం (2007 జనవరి 2) ప్రజా సాహిత్యానికి, సాహిత్య విమర్శకు పూడ్చలేని వెలితి. వల్లంపాటి రచయిత, విమర్శకుడు, అనువాదకుడు.

ఆయన 1937 మార్చి 15న చిత్తూరుజిల్లా రొంపిచెర్లలో జన్మించారు. ఎం.ఎ. ఆంగ్లం, బిఎడ్, ఆంగ్ల భాషాబోధనలో పిజి డిప్లొమా చేసి 'ఆంగ్ల సాహిత్య బోధనలో భారతీయతత్వం' అనే అంశంపై ఎంలిట్ చేశారు. పుట్టపర్తి నారాయణాచార్యులు శిష్యుడైన వల్లంపాటి మదనపల్లిలో బిసెంట్ థియోసాఫికల్ కళాశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ కళాశాల ప్రాంగణంలోని క్వార్టర్స్‌లో ఉండేవారు. అది విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నివసించిన ఇల్లు. వల్లంపాటికి డెబ్బై ఏళ్ళ జీవితంలో దాదాపు నలభయ్యేళ్ళ సాహిత్య జీవితం ఉంది. 1985 నాటికే ఆయన 70 కథలు, 4 నవలలు, 30 సాహిత్య వ్యాసాలు రాశారు. చరిత్ర అంటే ఏమిటి? చరిత్రలో ఏం జరిగింది? అనే గ్రంథాలను, కొన్ని కన్నడ రచనలను అనువదించారు. ఇంద్రధనుస్సు, దూరతీరాలు, మమతలు – మంచుతెరలు, జానకి పెళ్ళి నవలలు కాగా, గాయపడిన దేవత, బండి కదిలింది కథలు. 1985కు ముందు వల్లంపాటి రాసిన సాహిత్య విమర్శ వ్యాసాలలో కొన్ని ఏరి 'అనుశీలన' పేరుతో ప్రచురించారు. వాటితో మరికొన్ని కలిసి 1977లో వల్లంపాటి సాహిత్య వ్యాసాలుగా వచ్చాయి. 'నవలా శిల్పం', 'కథా శిల్పం', 'విమర్శా శిల్పం' (2002), 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక సాంస్కృతిక విశ్లేషణ' ఆయన రాసిన విమర్శ గ్రంథాలు. 'భారతదేశ చరిత్ర – ప్రగతి – సంప్రదాయవాదాలు', 'నవల – ప్రజలు' వంటివి ఆయన ఇతర అనువాదాలు. కథా శిల్పానికి 1997లో తెలుగు విశ్వవిద్యాలయం, 1999లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు వచ్చాయి.




వల్లంపాటి గొప్ప స్నేహశీలి. మానవీయ విలువల్ని ఒంటబట్టించుకున్నారు. మంచి క్రీడాకారుడు. నిరాడంబరంగా ఉంటూ ఏ వయసు వారితోనైనా హాయిగా మాట్లాడే సహృదయులు. ప్రజా సాహిత్య ప్రచారంలో రాష్ట్రమంతటా పర్యటించారు. మంచి వక్త. తన అభిప్రాయాలను ఎవరైనా అనాగరికంగా ఖండిస్తే మౌనం వహిస్తారు. పేచీకోరు మనస్తత్వం కాదు. వల్లంపాటి ప్రధానంగా కల్పనా (నవల, కథానిక) సాహిత్య విమర్శకులు. నవలా శిల్పం, కథా శిల్పం నవలా, కథా రచయితలకు, ఇటు కృలనా సాహిత్య విమర్శకులకు కరదీపికలు. కథలెలా రాస్తారు? కథా కథనం, కథా – కమామీషు వంటి గ్రంథాలు రాశారు. రచయితలకున్నట్లే సాహిత్య విమర్శకులకు కూడా నిబద్ధత ఉండాలన్నారు వల్లంపాటి. సమాజంలోంచి సాహిత్యం పుట్టినట్టు, సాహిత్యంలోంచి సాహిత్య విమర్శ పుడుతుందన్నారు. ఎప్పటి సాహిత్యాన్నైనా విమర్శించడానికి వర్తమాన సాహిత్యాలోచనలనే ఆధారంగా పెట్టుకోవాలన్నారు. సాహిత్య విమర్శకుడు

గొప్ప పాఠకుడు, ఉత్తమ విద్వాంసుడు కావాలని, సాహిత్య విమర్శకుడు రచనకూ పాఠకుడికీ, పాఠకుడికీ రచయితకూ మధ్య అనుసంధాన కర్త అనీ, సాహిత్య విమర్శ రచనను విశ్లేషించడమే గాక, దానిని సరిదిద్దాలని అభిప్రాయపడ్డారు. భారతీయ అలంకార శాస్త్రాలను పూర్తిగా నెత్తినెత్తుకోకుండా, పూర్తిగా నేలకేసి కొట్టకుండా, రస, ధ్వని సిద్ధాంతాలను ఆధునిక సాహిత్యానికి ఉపయోగించుకునే ప్రయత్నం చేయాలని 'విమర్శాశిల్పం'లో ప్రతిపాదించారు గాని, సమన్వయం చేయలేదు.

ప్రాంతీయ అస్తిత్వ వేదన ఒక ప్రముఖాంశంగా సాహిత్యంలో కొనసాగుతున్న నేపథ్యంలో వల్లంపాటి 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం' అనే గ్రంథం ఇటీవల రాశారు. చరిత్ర, ప్రాచీన సాహిత్యంలో కనిపించే రాయలసీమ స్థానిక జీవిత రేఖలు, రాయలసీమలోని ఆధునిక సాహిత్యం ఆలస్యంగా ప్రవేశించడానికి గల కారణాలు, ఆధునిక రాయలసీమ సాహిత్యంలో విభిన్న ప్రక్రియలలో జరిగిన కృషి మొదలైన అంశాలను ఈ గ్రంథంలో విశ్లేషించారు. అనారోగ్యం తొందరచేయడం వల్లనేమో సాహిత్య విమర్శ అధ్యాయం క్లుప్తంగా ముగించారు.

## ఆరుదైన విమర్శకుడు వల్లంపాటి

ప్రసిద్ధ విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య మృతికి సాహితీ స్రవంతి ప్రగాఢ సంతాపం ప్రకటిస్తోంది. లోతైన అధ్యయనం, నిశిత పరిశీలనా దృష్టి, సైద్ధాంతిక అన్వయం మేళవించిన అరుదైన విమర్శకుడాయన.విలువలు, ప్రమాణాల విషయంలో రాజీకి నిరాకరిస్తూనే అకారణ కాఠిన్యం లేకుండా సుబోధకశైలిని పాటించిన సంయమనశీలి. రచనలను పరిచయాలు, విమర్శలు విశ్లేషణలకే పరిమితం కాకుండా ఆధునిక మార్క్సిస్టు కోణంలో వస్తువు, శిల్పం వంటివాటిని సమగ్రంగా తెలియజేసిన మన కాలపు గొప్ప విమర్శకులలో ఆయనొకరు. కథ, నవలలకు సంబంధించి వల్లంపాటి రచనలు అత్యంత ప్రామాణికమైనవిగా నిల్చిపోయాయి. ఇటీవల ఆస్వస్థత పాలయ్యేవరకూ కూడా అన్ని చోట్లా సాహిత్య గోష్టులలో పాల్గొంటూ యువతరం రచయితలకు మార్గదర్శనం చేసేవారు. మంచి అనువాదకులుగా కూడా అనేక ఉత్తమ గ్రంథాలను తెలుగులో అనువదించారు. సామ్యవాద మేధావి వల్లంపాటికి సాహితీ స్రవంతి జోహారులర్పిస్తున్నది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నది.

**జనవరి 2, 2007**

నిబద్ధుడైన సాహిత్య విమర్శకుడుగా వల్లంపాటి నిలకడగానే వ్యవహరించారు. నిబద్ధత జీవలక్షణమైన నిర్మొహమాటమి ఆయన విమర్శలో అడుగడుగునా కనిపిస్తుంది. తానెంతో అభిమానించే రావిశాస్త్రి, మధురాంతకం రాజారాం కథల్లో తన ప్రమాణాలకు ఒదగని అంశాలను ఎత్తి చూపడానికి వెనుకాడలేదు. నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, 'కాడి', జొన్నవిత్తుల రామచంద్రమూర్తి 'వలస దేవరస్వామి', మీ రాజ్యం మీరేలండి, శాంతినారాయణ 'పెన్నేటి మలుపులు' వంటి నవలల్లోని వెలితిని ఎత్తి చూపడం కూడా ఇందులో భాగమే.

తొలి తెలుగు కథ వివాదంలో వల్లంపాటి చివరి దాకా దిద్దుబాటుకే కట్టుబడి ఉన్నారు. తెలుగు కథా చరిత్రను రాస్తూ ఈ వివాదాల మీద తన అభిప్రాయాన్ని ఆయన ప్రకటించి ఉంటే బాగుండేది. రాయలసీమ జీవితాన్ని గురించి తొలి కథ రాసిన వారు సీమేతర రచయిత చింతా దీక్షితులు (సుగాలీ కుటుంబము 1921) అని వల్లంపాటి కొత్త విషయాన్ని బయటపెట్టారు. కథా శిల్పంలో, రాయలసీమ జీవితం మీద కథ రాసిన రాయలసీమ కథకులతో కాలక్రమం దృష్ట్యా జి. రామకృష్ణ (చిరంజీవి విజయవాణి 1941) మొదటివాడని, ప్రభావం దృష్ట్యా కె. సభా (పాతాళగంగ) అని నిర్ణయించారు. తెలుగులో మొదటి నవల ఏది అన్న ప్రశ్నకు సమాధానంగా వల్లంపాటి శ్రీ రంగరాజ చరిత్రను తిరస్కరించి, రాజశేఖర చరిత్రనే తొలి నవలగా గుర్తించారు. రాయలసీమలో ఆధునిక చైతన్యం ఆలస్యం కావడానికి సీమలోని వాతావరణమే కారణం తప్ప, రచయితలు కాదని అభిప్రాయపడ్డారు. ఆధునిక సృజనాత్మక సాహిత్య ప్రక్రియలు రాయలసీమలో ఆలస్యమైనా, ఆధునిక సాహిత్య విమర్శ ముందంజలో ఉండటం మీద వల్లంపాటి కొంత చర్చ చేశారు గాని అది సమగ్రం కాదు. వల్లంపాటి 'కథను చదవడం ఎలా?' అనే చిన్న వ్యాసం రాశారు. 'కథలు రాయడం ఎలా?' అని అనేకులు రాశారు గాని, 'కథను ఎలా చదవాలి?' అని రాయడం అరుదే. ఆ పని వల్లంపాటి చేశారు.

మార్క్సిస్టు సాహిత్య విమర్శకునికి ఉండవలసిన భౌతికవాద ప్రాపంచిక దృక్పథం, చారిత్రక దృష్టి, సామాజిక అవగాహన, వస్తుతత్వం, విస్తృత అధ్యయనశీలం, ఆలోచనాపరమైన స్పష్టత, అభివృద్ధిపరమైన సరళత, వినయ ప్రతిపాదనలో ఉండవలసిన క్రమత వల్లంపాటి సాహిత్య విమర్శలో పుష్కలం. అంతా పడమటి వాసనని కొందరు ఈసడించుకున్నా, కొన్ని సమయాలలో పరిపక్వతను గురించి మాట్లాడినప్పుడు ఏవేవో అంటగట్టినా చలించకుండా నిలబడిన విమర్శ కథకుడు వల్లంపాటి. ప్రగతిశీల సాహిత్య దృష్టిలో, సాహిత్య విమర్శలో ఆయన కృషి గణనీయం. ఇప్పుడు ఆయన లేరు. ఆయన సాహిత్య విమర్శ ఉంది.

**('వార్త' సౌజన్యంతో)**

# స్పెసిమన్



మీనాక్షి శ్రీనివాస్

**ప్రభాత సమయం ప్రశాంతంగా హాయిగా ఉంది. ప్రాణం పూలతేరులా తేలిపోతుంది. పల్లె సీమల పరిమళాలు, పంట పొలాల పైరుగాలులు... ఆహా... ఆస్వాదిస్తే అంతా అందమే... ఆనందమే... అపురూపమే... అద్భుతమే.**

**అ**సలు యిదంతా ఎందుకు అంటారా?... ఈ నా ఆనందానికి, ఈ అస్వాదనకూ కారణం నా జీవితాశయం నెరవేరబోతుంది. కాకపోతే ఒకలా అనుకుంటే ఇంకొక విధంగా, ఇంకో మార్గంలో మార్గం ఏదయితేనేం... గమ్యం ఒకటే అయినప్పుడు. అందుకే ప్రాణం పూలతేరులా... మనసు తెలిమంచులా... అబ్బబ్బ... చచ్చినా చావని పులుపు... అదే అనర్గళంగా... ఇదిగో మళ్ళీ... అంతొద్దులే కానీ ఆపేసెయ్ నీ ఊకదంపుడు... సుదీర్ఘ సుత్తి, అంతరాత్మ హెచ్చరించింది. "సరేలే... యింక నోర్మూయ్" కసిరి పారేసింది.

మనసు ఉరకలేసుకుంటూ కాకినాడ సమీపానికి చేరింది. అవును యిదేమిటీ మెడికల్ కాలేజ్ బస్‌లో వెళ్ళాల్సిన దాన్ని యిలా అంబులెన్స్‌లో...ఛ... ఎందులో వెడితేనేం నా చిరకాలపు వాంఛ... మనోనిశ్చయం ఈడేరుతోందిగా.

"రంగరాయ మెడికల్ కాలేజ్" ఎంత ఠీవిగా, హుందాగా ఉందా బోర్డు. ఎన్ని సంవత్సరాల నుంచి, ఎన్ని లక్షల మందిని శరీరశాస్త్రంలో నిష్ణాతులను తయారు చేసి పంపించిందో కదా. చిన్నప్పుడంతా ఎప్పుడూ అనుకొనే దాన్నిగా తెల్లటి కోటు, చేతిమీద స్టెత్ వేసుకుని చక్కగా స్నేహితులతో కబుర్లు చెబుతూ వెడుతుంటే, నలుగురి చూపు గొప్పగా మీదపడుతుంటే ఆ గౌరవం... ప్చ్... పోనీలే ఆ గౌరవం, ఆనందం అప్పుడు దక్కకపోయినా ఈ రకంగా అయినా నలుగురికి ఉపయోగపడే వైద్యవృత్తికి సహాయపడగలగడం... అదృష్టమే మరి ఆలోచిస్తే... ఆలోచనలతో ఉండగానే రంగరాయ మెడికల్ కాలేజ్ చేరింది అంబులెన్స్. గబగబా స్ట్రెచర్ తీసుకుని పరుగెత్తుకొచ్చారు నలుగురు మనుషులు. ఎనాటమీ లాబ్ చీఫ్ అనుకుంటా వాళ్ళని 'జాగ్రత్త... జాగ్రత్త' అంటూ హెచ్చరిస్తున్నాడు ఠీవిగా కోటు జేబులో చేతులుంచుకుని.

"జాగ్రత్త! జాగ్రత్త ఎందుకూ నేనేమైనా గాజుబొమ్మనా లేక పూలకుండీనా... ఆఫ్టరాల్ శవాన్ని, ప్రాణంలేని కట్టెని..." పక్కున నవ్వొచ్చింది. గట్టిగా నవ్వుతూనే ఉన్నా.

"జాగ్రత్త... బాడీ యింకా డీకంపోజిషన్ స్టార్ట్ అవలేదు కదా. ఆ హాస్పిటల్ వాళ్ళు ఆ యింజక్షన్స్ అన్నీ సరిగా ఇచ్చారో లేదో ఎందుకైనా మంచిది ఆ జాగ్రత్తలు అన్ని వెంటనే తీసుకోండి" నా కూడా ఉన్న కేర్‌టేకర్‌కు చెబుతున్నాడాయన.

"ఓ...ఆ "జాగ్రత్త" గురించా ఆయన మాట్లాడేది.

అయితే ఓ.కె. నవ్వాపేసి సైలెంటయిపోయా.

"అబ్బా... యింత బరువుగుందేంటి గురూ. నాజూగ్గా బొమ్మలా ఉందిగాని సూడ్డానికి" కొత్తగా చేరిన కుర్రాడు కాబోలు ఆ నలుగురిని అడుగుతున్నాడు. పేకింగ్ అప్పుడు పక్కనే ఉన్నాడు కదా.

''అదంతేలేరా... పీనుగ బరువెక్కిపోతది... బిగుసుకుపోతది కదా" సందేహం తీర్చాడు సీనియర్.



అమ్మయ్య మొత్తానికి మెడికల్ కాలేజ్‌లో చేరిపోయా విజయవంతంగా. దీనికెంత కష్టమయిందనీ... అమ్మో ఇంతకంటే ఎంసెట్‌లో రాంక్ తెచ్చుకుని సీట్ సంపాదించుకోవడమే సులువేమో... ఇలా రావడం కంటే, మరే ఈ నిర్ణయం తీసుకోవడానికి ఎంత గుండెధైర్యం కావాలి, యింట్లో అంతా అపోజ్ చేసేవాళ్ళే... ఛ...ఛ... మన యింటా వంటా లేవు యిలాటి పన్లు అని.

పదిమంది ముందు స్పెసిమన్‌లా.. ఒంటి మీద నూలుపోగు లేకుండా... మనసుని తొలిచేస్తున్న ఈ ఆలోచనని అవతలికి తరిమెయ్యడానికి నేనే ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. ఎన్నో ఏళ్ళ అంతర్మథనం నుంచి వచ్చిన నిర్ణయం కనుకే ఎవరేమన్నా నా నిర్ణయం సడలిపోలేదు.

వలువలూ, విలువలూ సభ్యసమాజంలో నవనాగరికత పేరున వదిలేస్తే సిగ్గుపడాలి కానీ యిలా శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి ఎంతోమంది భావి భారత వైద్యులికి పనికి వచ్చే స్పెసిమన్‌లా మారడానికెందుకుండాలి. అదీగాక ప్రాణం ఉన్నంత వరకేగా ఈ "నేను". అది కాస్తా గుటుక్కుమంటే మిగిలేదే ఈ దేహం. దానికి లింగ వివక్ష... మానాభిమానాలు ఉంటాయా, పిచ్చి కానీ... అది అన్నింటికీ అతీతం.

"అంతగా కావాలనుకుంటే నేత్రదానం చెయ్యి" గొప్పగా సలహా ఇచ్చారు కొంతమంది.

నిజమే అలా చెయ్యొచ్చు. ఒక్క నేత్రాలేమిటి కావాలనుకుంటే మన శరీరంలో అన్ని భాగాలూ డొనేట్ చెయ్యొచ్చు. అవి మనం చనిపోయాక అవసరమైన వారికి అమర్చే విధంగా పత్రాలు, గట్రా రాయచ్చు.

మన దేశంలో – ఊహు అసలు మనుష జాతిలోనే స్వార్థం పెరిగిపోయాక ఉన్నవాడు, లేనివాడి దగ్గరో, అవయవాల అవసరం ఉన్నవాడు వాటిని అమ్ముకునే అవసరం ఉన్నవాడి దగ్గరో డబ్బుతోనో, దౌర్జన్యంతోనో... యిలాంటి అవసరాలు బాగానే మేనేజ్ చేసుకుంటున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ రోగుల నుంచి వాళ్ళ అనుమతి లేకుండా, వారికి తెలియకుండా కిడ్నీలను యిడ్లీల్లా అమ్మేసుకుంటున్న బడాచోర్... కార్యక్రమాల మాటేమిటి?

"వైద్యో నారాయణో హరిః" అనే మాట అటుంటి నేడు వైద్యో నారాయణా... హరీ... అనిపించేటట్లు చేస్తున్న ఈ వైద్య వ్యవస్థ... దానికలాంటి అవస్థ కల్పించిన ఘరానా వైద్యులనేం చెయ్యాలి?

"అబ్బబ్బ... నీకక్కరలేని విషయాలు లేవు కదా... బతికున్నప్పుడే యిలాంటి వాటినేం చేయలేకపోయావు... చచ్చి... నీకెందుకింకా అంత ఆక్రోశం... ఆవేదన... నోర్మూసుకుని నీ పని చూసుకో..." తిట్టిపోసింది అంతరాత్మ.

"నువ్వొకదానివి మధ్యలో, బతికుండగా ఎటూ నోరెత్తనిచ్చేదానివి కాదు కదా కనీసం చచ్చాక అన్నా నాకు స్వాతంత్రం లేదా... నా ఫీలింగ్స్‌ని బయటపెట్టుకోకూడదా... ఎదురు దాడికి దిగింది ఆత్మ.

''అది నా ఉద్దేశం కాదురా... కానీ ప్రయోజనం లేని కంఠశోష కదా అని" నసిగింది అంతరాత్మ.

''ప్రయోజనం ఉన్నా లేకపోయినా బతికున్ననాళ్ళూ అణచుకున్న నా ఆవేదన బహిర్గతం చేయకపోతే... నా ఆత్మకు శాంతి ఉండదు. నన్ను చెప్పనియ్" బొటబొటా కన్నీరు రాల్చింది.

"సరే... సరే... నీ యిష్టం... మరీ ఎమోషనల్ అవకు" నిట్టూర్చింది అంతరాత్మ.

"పోనీలే ఎవరేం అమ్ముకుంటే నాకెందుకు కానీ నేనెందుకు స్పెసిమన్‌లా మారేనో అయినా చెబుతా.

"విద్య వ్యాపారమైపోయిన ఈ రోజుల్లో కార్పొరేట్ విద్యా విధానంలో, ముఖ్యంగా సైన్స్ అనేది కేవలం థియరీ – అది కూడా అర్థం చేసుకుని విషయం తెలుసుకుని చదివే చదువు కాకుండా పోయింది. సైన్స్ విద్యార్థికి ప్రాక్టికల్స్ ఎంత ముఖ్యం అనేది మరచిపోయి కేవలం కాలేజ్‌లు పరస్పర అవగాహనతో ప్రాక్టికల్స్ ఓ ఫార్సు చేసి మార్కులు వేసేసి అయిందనిపిస్తున్నారే... అదెంత బాధాకరం..."

'ఏ సైన్స్ విద్యార్థికి ప్రాక్టికల్స్ ఉంటున్నాయి, తెలుస్తున్నాయి. భౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం సరే ప్రాణికోటికి ఆధారమైన వైద్యశాస్త్రం కూడా ప్రాక్టికల్స్ లేకుండా చదివేస్తే... దేహంలో జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ... యిలా అన్నిటి తీరుతెన్నులు, నిర్వహణ విధులు... బాధ్యతలూ అన్నీ థియరీ మాత్రమే తెలిస్తే... ఎందరిని చంపితే వైద్యులవుతారో ఆ దేముడికే తెలియాలి. అందుకే

అలాంటి అవస్థ ఈ వ్యవస్థకు రాకుండా... చంద్రుడికో నూలుపోగులా... నేను ఈ శరీర శాస్త్రానికో స్పెసిమన్‌లా మారాలనుకుంటున్నా....

"అబ్బా... యిక్కడంతా ఏదో వెగటు కలిగించే వాసన... చాలా ఘాటుగా... ఆ... యిదే కదూ ఫార్మాలిన్ ద్రవం. ఇదేమిటి నా పాకింగ్ అంతా పీకేసి మొత్తం పులుముతున్నారు. అయ్యయ్యో... నన్నిలా ద్రావకంలో పడేశారు.

'ఓ... ఈ శిథిలాలయం... యింకా శిథిలం కాకుండా కదూ, కానీ... ఒప్పుకున్నాక తప్పుతుందా... అయినా అప్పుడే ఏమయింది రేపు కాలేజీ పిల్లలకు నన్ను నిలువునా చీరి నాలోని వ్యవస్థలన్నిటినీ అవగాహన కలిగేలా చేస్తారుగా అప్పుడుంటుంది.'



"అయ్యయ్యో... వీడెవడో నన్ను ముట్టుకుంటున్నాడే...." "ఛ...ఛ...ఏమిటా గోల నువ్విప్పుడేం అందాల భామవీ కాదు, బంగారు బొమ్మవీ కాదు. ఎనాటమీ స్పెసిమన్‌వి. ఆ విషయం మర్చిపోకు" గుర్తు చేసింది అంతరాత్మ.

అవును కదూ... ఆ కాస్త ప్రాణం పోతే యింక ఈ దేహానికి విలువే లేదు కదా. అందుకే కదా మన పెద్దవాళ్ళు అనే వాళ్ళు 'చచ్చేకా మన వెంట వచ్చేవి మనం చేసిన మంచి, చెడ్డ... పాపం, పుణ్యం... మాత్రమే అని మరి ఎందుకు ఈ లోకంలో యిన్ని అరాచకాలు, అక్రమాలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. ఎంతటి వాళ్ళకయినా చచ్చాక కావలసింది ఆరడుగుల నేలేగా, అసలు కాల్చేస్తే అయ్యేది పిడికెడు బూడిద. అంతమాత్రానికే యింత దిగజారిపోయి యిన్ని నేరాలు, ఘోరాలు చెయ్యాలా? ఎక్కడ చూసినా అకృత్యాలు, అఘాయిత్యాలు, తనలాంటి సాటి ప్రాణి మీద దౌర్జన్యం – ఏమిటా రాక్షసత్వం. అందులో పొందే ఆనందం – అంత బాగుంటుందా? ఆ ఆనందం – అంత అవసరమా?

సభ్య సమాజం – నవ నాగరికత యివన్నీ పేర్లకే పరిమితమా? కాసుల కోసమో, తాత్కాలిక సుఖ సంతోషాల కోసమో బలైపోతున్న మానవీయతకు మరి మనుగడే లేదా?

"ఆక్రోశంగా... ఆవేశంగా, ఆవేదనగా అరవాలనకుంటున్న నా గొంతు పైకి లేవదేం? ఏదీ నా సుస్వరం? ఓ... యిప్పుడు నాకవేవీ ఉండవు కదా... మరి నేను స్పెసిమన్ కదూ.

చెట్లు చేమలు... అనంత జీవకోటి ప్రాణం ఉన్నప్పుడూ, అది పోయిన తరువాత కూడా పదిమందికి ఉపయోగపడతాయి కదా. కేవలం ఒక్క మనిషి మాత్రం తన స్వార్థం చూసుకుంటాడు బతికున్నన్నాళ్ళూ... కనీసం చనిపోయాక అయినా దేనికీ పనికిరాని ఈ దేహాన్ని సాటి మనుషుల కోసం అవయవ దానమే... కాకుంటే వైద్య విజ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఎనాటమీ స్పెసిమన్‌లానో మారగలిగితే... ఎంత ఉపయోగం.. "ఏనుగు చచ్చినా బతికినా వెయ్యే అన్నట్లుగా, ప్రభుత్వ కళాశాలల్లో అయితే సరే అనాథ శవాలో – అభాగ్య శవాలో అయినా దొరుకుతాయి. మరి మిగతా వాటిలో?

'అందుకే వైద్య వృత్తిని ఎంచుకుని, మెడిసిన్ చదివే వారందరికీ నాదో విజ్ఞప్తి... గొప్ప కోసమో... డబ్బు కోసమో మాత్రమే కాకుండా చిత్తశుద్ధితో శరీర విజ్ఞానాన్ని తరచి... తరచి చూసి నేర్చుకుని వైద్యులు కండి. అప్పుడే రోగమొకటి యిచ్చే ట్రీట్‌మెంట్ ఒకటి కాకుండా ఉంటుంది.'

'ఇదిగో... నీతో అదే మరి చిక్కు... అవన్నీ వాళ్ళ కాలేజ్ వాళ్ళు... ఉపాధ్యాయులు, అధ్యాపకులు చూసుకుంటారు కానీ నువ్విక..." ఉరిమింది అంతరాత్మ.

"ఓకే... ఓకే... బాబా అలాగే... మళ్ళీ రేపటి అనాటమీ క్లాస్ వరకూ నేను నిశ్శబ్దంగా విశ్రాంతి తీసుకుంటా."

---

## నీటి నానీలు

**ఎం. ధనుంజయ్ నాయక్**

ఇవాళ ఉన్నవి
పెట్రోలు బంకులే
వచ్చేస్తున్నాయ్
నీటి బంకులు

జలం పైకొస్తేనే
తల్లి నేల
పచ్చ చీర కట్టుకొని
తల్లీ బైలెల్లినాదే.

గంగా యమునలను
భక్తితో స్మరిస్తావు
మరి నీటినెందుకు
హరిస్తావు?

వజ్రాలూ వైఢూర్యాలూ
అమూల్యమా?
వాటిని మించినవి
నీటి బిందువులే!

ఆశయాలు కాదు
రక్షించుకోవాల్సింది
అడుగడుగునా
జలాశయాలు

# సమీక్షా పర్వం


H నేల రాలుతున్న నెలవంకల కోసం చేయిచాచిన కవిత్వం - గేరా
H రంగుల ఇంద్రధనుస్సు కవితా వార్షిక -2005 - మందరపు హైమావతి
H జీవనోత్సవం - డా॥ మంతెన సూర్యనారాయణరాజు
H మాట్లాడటమే కాదు హృదయం రాయనూ గలదు - వి. ప్రతిమ
H కళింగాంధ్ర మాండలికం-1 - జి. గీత
H ఆంతరంగికాన్ని ఆవిష్కరించిన "వస్తువు అభివ్యక్తి" - వేము
H రాచపాళెం చర్చ - తెలకపల్లి రవి


గేరా



## నేల రాలుతున్న నెలవంకల కోసం చేయిచాచిన కవిత్వం

ప్రతి మనిషి జీవితంలోనూ బాల్యం – అత్యంత మధురమైన మరపురాని దశ" – బాల్యం గురించి ఏ వ్యక్తి నడిగినా, సరిగ్గా ఇలాగే కాకపోయినా, ఇంచుమించుగా ఇదే అర్థం వచ్చేలా వ్యాఖ్యానిస్తాడు. ఇక కవుల విషయానికి వస్తే, కీట్సు మొదలుకొని, ఇప్పుడిప్పుడే కవితా వనంలోకి అడుగులేస్తున్న యువ కవులు సైతం బాల్యాన్ని ఉన్నతీకరిస్తూ అల్లుకుపోతారు.

కన్నవాళ్ళూ, నా అన్న వాళ్ళూ కలిగి, ఏ కొరతా లేని కుటుంబాల్లో పుట్టే కొంతమంది విషయంలో ఇది అక్షరసత్యమే కావచ్చుగానీ, ఇది అర్ధ సత్యమే. నాణేనికి మరోవైపున చూస్తే, ఎందరో అభాగ్యుల జీవితాల్లో బాల్యం – కత్తుల వంతెనపై దాటి వచ్చిన ఓ విషాద జీవిత శకలం. గుర్తుకొచ్చినప్పుడల్లా గుండెల్లో పొడిచే గునపం. పసితనంపై వ్యవస్థ చేసిన పైశాచిక సంతకం. ఈ రెండు వాస్తవాలనూ అందంగానూ, అర్థంగానూ అభివర్ణిస్తూ వెదజల్లిన కవితా కౌముదే వై. శ్రీరాములు దీర్ఘ కవిత "చేయిచాచిన వెన్నెల".

ఈ కవితకు ముందు నగ్నముని సుదీర్ఘమైన ముందు మాట, దానికి ముందు ఈ కవిత రాయడానికి కవికి ప్రేరణ కలిగించిన ఆరు దృశ్యాలు, వాటికి ముందు ప్రమాదవశాత్తు మరణించిన కవి ఇద్దరు కూతుళ్ళ ఫొటోలు, ఇవన్నీ కలిసి చిన్నారులపై రాసిన ఓ దీర్ఘ కవితను అనుభూతించడానికి అనువుగా పాఠకుల హృదయాలను సంసిద్ధం చేస్తాయి.

ఈ మొత్తం కవితను కవి రెండు భాగాలుగా విభజించాడు. మొదటి భాగమంతా బాల్యాన్ని ఉన్నతీకరిస్తూ, భావాత్మకంగా వర్ణిస్తూ, బాల్యానికిచ్చిన అనేక వైవిధ్యమైన నిర్వచనాలతో సాగిపోతుంది. అందులో మచ్చుకు కొన్ని...

"ఆరు బయట పడుకొని
ఆకాశంలోకి చూస్తూ
చుక్కల వాయిద్యాన్ని
చూపులతో మీటే సంగీతం బాల్యం" (పే. 42)
"కాగితపు పడవల్లో ప్రేమను మోస్తూ
ఆవలి గట్టుకు చేర్చిన వసంతం – బాల్యం" (పే. 46)
"తీపి తీపి కలల పలకలపై
బతుకుని బలపాలతో రాసుకొన్న సంకలనం
– బాల్యం" (పే. 47)
"అందిన అందాల్ని
కళ్ళలోకి అనువదించుకోవడమే బాల్యం
ఆనందాన్ని అందరితో పంచుకోవడమే బాల్యం"
"నదిలో కొట్టుకుపోతున్న
చందమామే బాల్యం (పే. 41)

ఇలా మొదటి భాగం నిండా, కవి ఎన్నో రకాలుగా బాల్యాన్ని నిర్వచిస్తూ, పరవశిస్తూ, తాను స్వయంగా బాల్యంలోకి నడిచి వెళ్ళడమే కాకుండా, తన వెంట మనల్ని తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తాడు. అందుకు కవి వాడిన పద చిత్రాలు, తీసుకొన్న ప్రతీకలు, గుప్పించిన భావుకత మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి, ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తాయి.

"వానలో తడిసి
ఎండలో విరిసిన రంగుల ఇంద్రధనుసే బాల్యం
జుట్టులోంచి వాన
బొట్టుబొట్టుగా రాలుతున్నట్టు
నడుస్తుంది బాల్యం"

ఇలాంటి భావుకతకు లొంగకుండా ఎలా ఉండగలం చెప్పండి?

"చిలుకలు వాలిన చెట్టయిన
గిలకలు కట్టిన ఊయలను
నే నిదురించడానికి ఊపేది
జోలపాటతో నట్టింట నానమ్మ
నా కోసమే కూసేటి బోసినో కోయిలమ్మ"

పాఠకుల్ని పసిపాపల్ని చేసేసే ఇలాంటి పాదాలు మనకు మొదటి భాగం నిండా కనిపిస్తాయి.

వీటిని దాటి, రెండో భాగంలోకి ప్రవేశిస్తే

"తరతరాల భావి జీవితానికి
కాళ్ళు కోసం
గోళ్ళు పీకి, గొంతు కోసి
తల క్రిందులుగా వ్రేలాడదీసిన తలలేని పావురం
బాల్యం
తెల్లని వెన్నెలంటి కుందేటిని చీల్చిన
నెత్తుటి చర్మం బాల్యం" వంటి వ్యదార్థ జీవిత యధార్థ దృశ్యాలు మనల్ని కమ్ముకొని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. పసితనంపై వ్యవస్థ చేస్తున్న గాయాల్ని మన కళ్ళ ముందుంచి కన్నీళ్ళు తెప్పిస్తాయి.

పేదరికం వల్ల తమ బాల్యాన్ని కటిక చాకిరి కింద నలగ్గొట్టుకుంటున్న చిన్నారి చేతులు, ఉన్మాదం ఉగ్రవాదమై ఉరమగా పెన్నులూ, పెన్సిళ్ళూ పట్టుకోవాల్సింది పోయి, ట్రిగ్గర్‌పై బిగుసుకుంటున్న పసివేళ్ళు, ఆకలి రాకాసిలా తరుముతుంటే కామాంధుల దాహానికి బలైపోతున్న లేత శరీరాలు... ఇలా పసితనంలోనే భరించలేనన్ని బాధల్ని అనుభవిస్తూ అర్ధాంతరంగా రాలిపోతున్న మొగ్గల్ని గురించి రాస్తూ...

"ఉదయించే దిశలోనే అస్తమిస్తున్న సూర్యుడు
చందమామ కాలేకపోతున్న నెలవంక వాడు"
అంటూ ఆర్ద్రంగా రాస్తాడు కవి.

ఎంతో సున్నితమైన భావాలను సరళమైన పదాలతో స్పృశిస్తూ పోవడంలో కవి చక్కటి శిల్పచాతుర్యం ప్రదర్శించాడు. ఎక్కడా శ్రుతిమించకుండా, భాషకు, భావనకు సమతుల్యత పాటించడం కనిపిస్తుంది.

అయితే, లోపం ఏమిటంటే, గంభీరంగా సాగిపోవాల్సిన భావజాలానికి అంత్యప్రాసలతో కూడిన వాక్య నిర్మాణాలు అతకవనిపిస్తుంది. ఆర్ద్రత, సంవేదన కలిగించాల్సిన చోట, ఈ అంత్యప్రాసలు పంటి కింద రాళ్ళలా, కంటిలోని నలుసుల్లా ఆటంకం కలిగిస్తాయి.

"బాలా!
హింసించినా హసించే బేలా!
నువ్వే నువ్వే నా ఆశల అందాల నేల"

"బాలా!
చీకటిని చీల్చే జ్వాలా!
నువ్వే నువ్వే నా ఏకైక ఎర్రని కల"

వంటి వాక్య ప్రయోగాలు ఈ సందర్భంలో పనికి రావనిపిస్తాయి. అవి ఏ ప్రేమ కవితలకో, ఆసు కవితలకో, మినీ కవితలకో అమరినంత అందంగా, ఆర్ద్రత, సానుభూతి, ఆవేదన కలిగించే ఓ దీర్ఘ కవితలో అతకవనిపిస్తుంది.

"ఏనాటికైనా కాంతి కిరణాలతో
నీ వెన్నెముకను తయారు చేయడమే
నా సంకల్పం
ఏనాటికైనా ఈ లోకం ముంగిలిలో
సూర్యునిలా నిన్ను నిలపడమే
నా ఆశయం" అంటూ బాల్యాన్ని ఉన్నతీకరిస్తున్న వై. శ్రీరాములు "చేయిచాచిన వెన్నెల" దీర్ఘ కవిత, ప్రతి కవితా ప్రియుడూ చేతిలోకి తీసుకోవాల్సిన చందమామే!

**(చేయిచాచిన వెన్నెల (దీర్ఘ కవిత), కవి : వై. శ్రీరాములు, పేజీలు : 78, వెల : రూ. 50/- ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు, ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, తెలుగు బుక్‌హౌస్, దిశ, నవయుగ - హైదరాబాద్)**

---

**మందరపు హైమావతి**




## రంగుల ఇంద్రధనుస్సు
## కవితా వార్షిక -2005

సాహిత్య ప్రక్రియలన్నిటిలో ప్రత్యేకమైనది కవిత్వ ప్రక్రియ. ఏది కవిత్వం అన్నదానికి ఎన్నో నిర్వచనాలున్నా మనసుపై ప్రగాఢ ప్రభావాన్ని కలిగించేదే ఉత్తమ కవిత్వమని చెప్పవచ్చు. అలాంటి ఉత్తమ కవితల సమాహారమే కవితా వార్షిక 2005.

కవిత్వం మీద ప్రేమతో ప్రతి ఏడాది పత్రికలలో వచ్చిన కవితలలో కొన్నిటిని ఏర్చి కూర్చి కవితా వార్షికగా తీసుకువస్తున్నారు వరంగల్ సృజనలోకం వారు.

ఈనాటి సంక్లిష్ట సంక్షుభిత సమాజంలో సామాన్యుని బ్రతుకు దుర్భరమైపోయింది. ఒకప్పటి గ్రామీణ భారతం నేడు అప్పుల భారతంగా మారిపోయింది. అందరికీ అన్నం పెట్టే అన్నదాతే కరువు రక్కసికి చిక్కి తినడానికి తిండి లేక, తాగడానికి నీళ్ళు దొరకని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు.

ఒకప్పటి భాగ్యసీమలు, పల్లె సీమలు నేడు కరువు సీమలుగా మారిపోయాయి. పైరగాలి వీచే పచ్చని చేలు, ఎగిరే పిట్టలు, రచ్చబండలపై కూర్చుని కబుర్లు చెప్పే గ్రామీణ ప్రజలు, ఉదయ సాయంకాల వేళల్లో గ్రామ వీధుల్లో పశువుల కాపర్లు తోలుకు వెళ్ళే పశువుల మందలు ఇలాటి దృశ్యాలెక్కడివి. ఇప్పుడు ఎండి బీటలు వారిన పొలాలు, తాళం పెట్టిన ఇళ్ళు, వలసపోయిన ఊళ్ళు, ఇదీ నేటి గ్రామీణ భారత ముఖచిత్రం.

ఇక నగరాల్లో నానాటికీ పెరుగుతున్న ధన దాహం, పతనమవుతున్న నైతిక విలువలు, అంతులేని వస్తు వ్యామోహం,

వేయి ఛానళ్ళతో విస్తరిల్లుతున్న టి.వి. విష సంస్కృతి, ఆర్థిక సంబంధాలే తప్ప, మానవ సంబంధాలు మంట కలిసిపోవడం వీటన్నిటిని కవులు సమర్థవంతంగా తమ కవితల్లో చిత్రీకరించారు.

ప్రపంచీకరణ ప్రభావం వలన మన సంస్కృతికి దూరమై పరభాషా సంస్కృతులకు బానిసలు కావడం, ఆధునిక సాంకేతిక జ్ఞానం వలన ప్రపంచం చిన్న కుగ్రామమైనా మనసుకు మనసుకు మధ్య ఒక మౌన హిమాలయం. నిస్తేజమైన యాంత్రిక జీవితం ఊబిలో కూరుకుపోతున్నాడు మానవుడు. ఒక దుఃఖపు కమురు వాసన జీవితాన్ని అలుముకుంటున్న ఒక విషాద స్థితిని "మనసు బిలియర్డ్ బంతై జారిపోతుంది. మక్మల్ గుడ్డపై / ఫెడేల్ ఫెడేల్మని చెంపలపై చరుపులు చరుపులు / అరుపులు అరుపులు / కకావికలైన రైల్వే ప్లాట్‌ఫారంపై పొగల్లో, తెగిన చెప్పుల్లో రక్తపు మరకల్లో దుఃఖవాసన" అని జీవితాన్ని వ్యాఖ్యానిస్తారు రామచంద్రమౌళి.

21వ శతాబ్దం వచ్చినా, మానవుడు గ్రహాంతర యానం చేస్తున్నా మహిళ మాత్రం ఇప్పటికీ రెండవ తరగతి పౌరురాలే. ఇంకా ఆడపిల్ల జననం నిషేధమే. ఆమె బ్రతుకే సందేహమైన చోట "రక్తం, ఉమ్మనీరూ తడిసి ముద్దయిన నా చేతుల్లో / ముద్దులొలికే నువ్వొక ప్రశ్నార్థకమైన భవిష్యత్తయినపుడు / ఈ నిశ్శబ్ద నిశీధిలో దారేదో / ఈ పెంజీకటి కవ్వల / ఏదీ?... నీ చిరునవ్వుల వెన్నెల? అని లంకా శివరామప్రసాద్ ప్రశ్నించినపుడు ఒక దుర్భరమైన విషాదం గుండెను పిండి వేస్తుంది.

అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణాల వలన, రోడ్లు వెడల్పు చేయడం వలన, ప్రాజెక్టులు కట్టడం వలన ఉన్న ఇంటిని, ఊరిని కోల్పోయిన అభాగ్యుల దయనీయ స్థితిని, బైపాస్ రోడ్డు వలన చిన్న చిన్న పనివారు ఉపాధిని కోల్పోయిన విధానాన్ని జింబో, ఎన్. గోపి బొమ్మ కట్టేలా చక్కగా చిత్రీకరించారు. "అనగనగా/ ఓ వూరుండేది / ఎవరి కండ్లు పడ్డాయో / ఏమో / ఊరు మాయమై పోయింది అనీ, అరుగు మీద దర్జీ / రోడ్డు పక్కన చెప్పులు కుట్టేవాడూ / గోడ నీడన / అద్దం బిళ్ళ ఆకాశం లోకి చూపిస్తూ / క్షౌరం చేసేవాడూ – గుడిసె హోటళ్ళూ" మాయమైన తీరును అద్భుతంగా ఆవిష్కరించారు తమ కవితల్లో.

కులవృత్తులు నాశనమై, వృత్తి పనివారు ఆత్మహత్యలు చేసుకొంటున్న వైనాన్ని కవులు మరిచిపోలేదు. సిరిసిల్లలో గుడిగంటకు ఉరేసుకుని మరణించిన చేనేత కార్మికుణ్ణి గురించి "కండెలాంటివాడు ఉత్త బెరడైపోయె గదరా! విధి శాపమై / పేదవాడి ప్రేవులు కోస్తూనే ఉంది / ఎంత చేసిన" ఆకలి బంగాళాఖాతం... బెత్తెడు ఖాళీ అస్తమానూ"... అని ఈగ హనుమాన్ వ్యాఖ్యానిస్తారు.

ప్రపంచమంతా ప్లాస్టిక్‌మయమైనపుడు కుండలకీ, చేటలకీ స్థానమే లేదు. ఆదిలాబాద్ రంజన్లు కవితలో "కుమ్మరింట కుండే లేనట్టు! వడ్రంగింట తెడ్డే లేనట్టు! ఎర్రెర్రని మంటల్లో! ఒళ్ళంతా కాల్చుకున్న / మానవీయత నిండిన / మమతలు కుండలు / ఎక్కడని ముని మడుగుల రాజారావుగారు ప్రశ్నిస్తున్నారు.

ఈనాడు అక్షరాలు నేర్చిన ప్రతి ఒక్కరికి అమెరికా వెళ్ళడమే ఆదర్శం. డాలర్ల సంపాదనే జీవన ధ్యేయం. చదువుకొని ఉద్యోగం చేస్తూ పచ్చ కార్డును సొంతం చేసుకొని చాలా మంది అమెరికాలోనే స్థిరనివాస మేర్పరచుకొంటున్నారు. తల్లిదండ్రుల్ని అక్కడికే వచ్చేయమంటున్నారు. కానీ తండ్రులు మాత్రం ఈ భూమినీ, ఈ గాలినీ వదలలేక రానంటున్న విధానాన్ని "ఇక్కడే వుంటా! కొడుకా! తెంచుకోలేకుండాను రా! ఈ మట్టితో నా బంధం ! తెగడం లేదురా అని వాళ్ళ అభిప్రాయాన్ని నిష్కర్షగా చెప్పడాన్ని మునిమడుగుల రాజారావు వర్ణించారు.

ఈనాటి గ్లోబల్ ప్రపంచంలో స్త్రీ ఒక వస్తువు. ఒక మార్కెట్ సరుకు. ప్రకటనలకీ ఆమె శరీరమే, ప్రచారానికీ ఆమె శరీరమే. టెన్నిస్ క్రీడాకారులకు ప్రత్యేకంగా 'బ్రా'లని తయారుచేసిన కంపెనీ వాటి ప్రచారానికి మోడలింగ్ చేసిన కోర్నికోవా గుండెల మీద అడ్డంగా రాసిన "బాల్స్ వోన్లీ షుడ్ బౌన్స్' అనే కాప్షన్‌కి నిరసనగా "అవున్నిజమే...! బంతులు మాత్రమే ఎగరాలి! ఆ రెండు మాంసం ముద్దలు మాత్రమే ఎగరాలి!" అంటూ పదునైన తన భావాన్ని వ్యక్తీకరించారు వంశీకృష్ణ.

ఇక ఈ సంపుటంలో స్త్రీవాదం, దళితవాదం, ముస్లిం మైనారిటీవాదం, తెలంగాణా అస్తిత్వ వాదాన్ని ప్రతిబింబించే కవితలు, జీవితంలోని అన్ని సందర్భాలకు స్పందించిన కవితలు ఎన్నో వున్నాయి. విప్లవ రచయితల అరెస్టుకు నిరసనగా తమ గళాలు విప్పారు. స్థానిక సమస్యలకు, దేశ, విదేశ ప్రపంచ పరిణామాలకు తెలుగు కవి వెంటనే స్పందిస్తున్నాడు. ఏ అన్యభాషల వారికీ తీసిపోని విధంగా ప్రతిభావంతంగా కవిత్వమై జీవిస్తూనే ఉన్నాడు.


ఇంకా తమదైన, ప్రత్యేకమైన శైలిలో డాక్టర్ సి.నా.రె, శివారెడ్డి, దర్భాశయనం శ్రీనివాసాచార్య, డాక్టర్ ఎస్వీ, పొట్లపల్లి శ్రీనివాసరావు, జూలూరు గౌరీశంకర్, శిఖామణి, జూకంటి జగన్నాథం, దేవీప్రియ, అద్దేపల్లి రామమోహనరావు, జుగాష్ విలి, విమల, హిమజ, మందరపు హైమావతి, దోర్నాదుల సుబ్బమ్మ, శిలాలోలిత మొదలగు వారు రాసిన కవితలతో పలు రంగుల ఇంద్రధనుస్సు ఈ వార్షిక.

ఈ పుస్తకంలో కవుల కవితలతో పాటు రామాచంద్రమౌళి, పొట్లపల్లి, డా॥ లంకా శివరామప్రసాద్ సమీక్షలతో పాటు ప్రఖ్యాత చిత్రకారులైన శీలా వీర్రాజు, డా॥ జయదేవ్, ఏలె లక్ష్మణ్, రమణజీవి, అక్బర్‌లతో నిర్వహించిన కవితా గోష్ఠిని పొందుపరచి కవిత్వ ప్రియులకు విందు చేశారు.

కవుల చిరునామాలతో, చక్కని ప్రింటింగ్‌తో, ముఖ్యంగా అచ్చు తప్పుల్లేని ఈ పుస్తకం సాహిత్యాభిమానులందరూ చదవదగినది. గ్రంథాలయాలలో ఉంచుకోదగినది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఈ వార్షికలను ప్రచురిస్తున్న సృజన లోకం వరంగల్ వారికి అభినందనలు

**(రంగుల ఇంద్రధనుస్సు కవితా వార్షిక-2005 సమీక్ష, వెల 100/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, బ్యాంక్ వీధి, హైదరాబాద్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్ ప్రజాశక్తి బుక్‌హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్ దిశా పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్)**

డా॥ మంతెన సూర్యనారాయణరాజు




# జీవనోత్సవం

ఎక్స్‌రే పబ్లిషర్స్ వారు ప్రచురించిన అవార్డు కవితల సంకలనం "జీవనోత్సవం" తలా తోక లేని పీఠికల బాధ లేకుండా హాయిగా చదివించగలిగేదిగా వుంది. సాహిత్యంలో అవార్డు వచ్చిన కవితంటే దానికో ప్రత్యేకత ఎలాగా ఉండకపోదు. సుమారు డెబ్భయ్యేడు మంది కవులు రాసిన భిన్న కోణాల్ని స్పృశించిన కవితలు ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి. ఒక్కో రచయిత రెండు, మూడు పర్యాయాలు అవార్డులు పొందడం వల్ల కవితలు ఎనభైకి పైబడి ఉన్నాయి. ఎక్స్‌రే పత్రిక నడిపే కొల్లూరిని ఈ ప్రయత్నం చేసి కవుల్ని ప్రోత్సహిస్తున్నందుకు అభినందించాల్సిందే. ఇది ఎక్స్‌రే వారి రజతోత్సవ ప్రచురణగా వెలువడటం హర్షదాయకం.

ఆధునిక కవులు నేడు భావ వ్యక్తీకరణకి, వస్తు వైవిధ్యానికి, వ్యంగ్యస్ఫోరకమైన చురకలకి ప్రాముఖ్యతనివ్వడం ఒక శుభసూచకమేనని చెప్పొచ్చు. ఈనాడు ఇటువంటి సంకలనాలు ఇటు కవిత్వంలో అటు కథల్లో పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. రీడబులిటీ అనేది మీడియా ప్రభావంతో కొంతవరకు తగ్గిపోయింది. అవార్డుల సంగతికొస్తే ఇచ్చానమ్మా వాయనం! పుచ్చుకున్నానమ్మ వాయనం!! అన్నట్లుగా తయారయిందీ మధ్య. నిజం చెప్పొద్దు వీటిలో వుండే ఎన్నో ప్రలోభాలకు, ఆకర్షణలకూ, పైరవీలకు తావు ఏర్పడిన దాఖలాలు గోచరిస్తున్నై. అలాగని ఈ సంకలన కర్తను నేను కించపరచదల్చుకోలేదు. విషయం చెప్పాలి కాబట్టి పత్రికాముఖంగా చెప్పక తప్పడం లేదు.

అద్దంకి శ్రీనివాస్ 'కొలిమి కుర్రాడు' కవితలో బాల కార్మిక వ్యవస్థను చక్కగా విశ్లేషించారు. కవిత ప్రారంభంలోనే వాడి గురించి 'నిప్పు బుట్టను నెత్తి కెత్తుకున్న సూరీడు వాడు' అని కితాబివ్వడం మెచ్చదగిన మహావాక్యం. మరో మంచి కవితలో వేముగంటి మురళీకృష్ణ తన కవితలో రైతు గురించి, వ్యవసాయం గురించి చెబ్తూ 'నేలింకా నాగల్నే ప్రేమిస్తుంది' అని వున్న యధార్థాన్ని చాటే ప్రయత్నం చేస్తారు. జి. విజయలక్ష్మి తమ కవిత ద్వారా మగాళ్ళను నిలదీసే ప్రయత్నం చేశారు. స్త్రీకి లింగ సంబంధమైన వివక్షతకు సంబంధించిన అంశాల్ని వారు ప్రశ్నిస్తారు. ఈ సంకలనంలో 'లకుమ' కవితలు రెండు, మూడు ఉన్నాయి. అన్నీ రసగుళికలే. ఒకదానిలో అంటారు. 'అమెరికా త్రిశంకు స్వర్గానికి చేతులు చాస్తున్నారని' జనాన్ని వాళ్ళంతా నా దేశంలో ఉట్టికెక్కలేని వాళ్ళే వారంతా అని వ్యంగ్యంగా చురకలేస్తారు. ఇంకో కవిత లకుమదే. 'ఒక ఇన్‌కమింగ్! ఒక అవుట్ గోయింగ్!' చక్కని సెటైర్‌ని ప్రదర్శించేదిగా సాగుతుంది. ఇదేవిధంగా కవయిత్రుల్లో సుజనారామం 'బ్రతుకు రాట్నం' కవిత కూడా ఎన్నదగిన కవితే!

నిరుద్యోగం – ఆకలితో రైల్లో కంపార్టుమెంట్లు తుడిచే స్వీపర్ కుర్రాడి మీద గరిమెళ్ల నాగేశ్వరరావు కవిత హృద్యంగా ఉంది. మనో మాలిన్యాన్ని తొలగించాలి ముందని చెత్త కుండీ మీద కవిత్వం చెప్పిన తుమ్మల దేవరావ్ కవిత కూడా ఉత్తమ కవితే! ఇంకా బాగున్న వాటిలో 'జైబోలో' అన్వర్ చెప్పిన కవితలో నేడు గూండాలు, రేసిస్టులు, రౌడీలు, కబ్జాదార్లు రాజకీయ నాయకులైతే జరిగే అనర్థాల్ని అక్షరీకరించిన తీరు అద్భుతం. చర్మకారుల మీద, క్షురకుల మీద కలువకుంట రామకృష్ణ మొదలైన వారు చెప్పిన కవితలు వాస్తవ జీవితాలకు అద్దం పడుతున్నాయి. సుధేరా – అనే కవి పాలేరు యొక్క జీవన చిత్రాన్ని అక్షరీకరించిన తీరు హృద్యంగా ఉంది. ఈనాటి కాన్వెంట్‌లో చదువుల్ని ఎద్దేవా చేస్తూ చెప్పిన కవితలో చదువుల జైళ్ళు అని పోల్చడంలో ఎంతో నిజం ఉంది.

ఉపసంహారం అని అనలేను గాని గ్రంథంలో అక్షర దోషాలు ఎక్కువగానే దొర్లాయి. పబ్లిషర్స్ కొద్దిగా ప్రూఫులు సరిగా చూసి వుంటే ఆ దోషం తలెత్తేది కాదు. ఏదిఏమైనా ముక్కాలు మువ్వీసం కవులు ఇందులో వ్రాసినవన్నీ నేను లోగడ చదివినవే. పేరు పేరునా నేను వాళ్ళని, కవితాంశాన్ని చెప్పటం ఈ సమీక్షలో కుదరలేదు. దాని వెల కనీసం 100 రూపాయలుగా నిర్ణయించి వుంటే ఎక్కువమంది పాఠకులు కొని చదివే అవకాశం ఉండేది. ఇటువంటి ప్రయత్నం చేసినందుకు సంకలన కర్తని అభినందిస్తున్నా.

**(జీవనోత్సవం (ఎక్స్‌రే అవార్డు కవితల సంకలనం), సంపాదకుడు : కొల్లూరి, వెల : రూ. 150/-, పేజీలు : 208, ప్రతులకు : ఎక్స్‌రే పేర, పి.బి. నెం. 340, డోర్ నెం. 28-15-2, కొల్లూరి టవర్స్, దాసువారి వీధి, అరండల్‌పేట, విజయవాడ-2)**

జనపదాలు సహజ భాషని కూడా మర్చిపోయి స్వార్థం అంటురోగమై వ్యాపించి పొలిమేరలు కలుషితమైన వాతావరణాన్ని నింపుకున్న పల్లెకి యివ్వాళ చిరునామా లేదు అంటాడు కవి. అంటే భాష లేదు, ప్రేమలు లేవు... అనుబంధాలు లేవు... సంస్కృతి కొల్లగొట్టబడింది.

'నిండు దారిద్ర్యంలోనూ
అనుబంధాల కలిమిని ఆస్వాదించిన ఊరు'

అనడంలో ఒకప్పుడు ఊళ్ళో వున్న దారిద్ర్యానికీ, ఇవ్వాళ ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో ఏర్పడిన పేదరికానికీ తేడాని ఎత్తి చూపినట్లయింది. ఒకప్పుడు పల్లెల్లో పేదరికం వున్నప్పటికీ అనుబంధాలని కలిమిగా పంచుకుని ఆస్వాదించేది ఊరు.... ఇప్పుడు ఈ రోజున ఉన్న దారిద్ర్యం పల్లెల్లో వున్న సహజ సంస్కృతినీ... మనుషుల మధ్య అనుబంధాలనీ పీల్చి పిప్పి చేసేసిన క్రమంలో అసలు ఊళ్ళోకిప్పుడు అడ్రసే లేకుండా పోయాయి...




వి. ప్రతిమ

# మాట్లాడటమే కాదు హృదయం రాయనూ గలదు

'హృదయలిపి' కవితా సంపుటి సమీక్ష రాయమని కవి మిత్రుడు ఈతకోట సుబ్బారావు కోరినపుడు సమయాభావం వల్ల కొంత ఇబ్బంది పడిన మాట నిజమే అయినప్పటికీ ఒకసారి హృదయాన్ని

విప్పి ఆ లిపి వెంట నడవడం మొదలయ్యాక ఇక ఆగడం సాధ్యపడలేదు...

'హృదయ లిపి' అన్న ఒక్క కవిత చాలు ఈ కవి హృదయాన్ని పట్టి యివ్వడానికి...

"పత్తి చేన్లలో పచ్చని ప్రాణాలు
తోడేసుకున్న వాళ్ళ కోసం
శీతాకాలపు అర్ధరాత్రి ఆకలి మంటలతో
చలి కాచుకున్న వాళ్ళ కోసం
కులాల పేరిట కిర్రు చెప్పుల కింద
నలిగిపోయిన వాళ్ళ కోసం
మతాల కురుక్షేత్రంలో రోడ్ల గుండెలపై
రంగవల్లులైన వాళ్ళ కోసం
గుండెకెందుకింత దిగులో?
రాత్రింబవళ్ళైన వింత గుబులో...?" అంటాడు.

ఈ 'హృదయలిపి' అన్న కవిత మొట్టమొదట పేజీలో వుంచడంలో ఈ కవిత సంపుటిని వాళ్ళందరి కోసం అంకితమిచ్చినట్లుగా... వాళ్ళ కోసమే తానీ కవితలన్నీ రాసినట్లుగా పాఠకుడికి అర్ధమవుతుంది...

'క్లోనింగు కోకిల రాగస్నానాలలో వాడు
వసంత కోకిల
స్వరగంగ ప్రవాహంలో నేను...
రెండు భిన్న ప్రపంచాలు...
ఒక నిరంతర సంగ్రామం...

ఈ కవి ప్రపంచీకరణకు వ్యతిరేకంగా భిన్న పార్శ్వాలలో నుండి కవిత్వాన్ని ఒలికిస్తాడు. వివిధ రంగాలలో ప్రపంచీకరణ ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుందో ఎండగడతాడు... ఆ చెప్పడంలో పదాల పోహళింపు పాఠకుడిని అలరిస్తూ ఒక ఒప్పుదల భావం మనసుని హత్తుకుంటుంది...

ఏది ఏమైనా సరే మన జీవితాల్లోకి ఒక ఉత్పాతంలా ముంచుకొచ్చి మనల్ని మనకు కాకుండా చేస్తున్న ప్రపంచీకరణకు వ్యతిరేకంగా బతుకు పదాతిదళం ఊపిరూపిరికీ నేలకొరుగు తున్నా సరే... నోటికాడి కూడు లాగేస్తోన్న శత్రువుపై మాత్రం యుద్ధం ఆగదంటాడు...

అగ్గి పిడికిళ్ళు జన్మభూమిని సందర్శిస్తాం వస్తారా అంటూ మనల్ని మరో లోకంలోకి తీసుకుపోతాడు... స్వార్థం లేని తపనల తపోవనాలు పచ్చగా దర్శన మిచ్చే చోటకి... మనిషి గుండెల్లో భయమై పాతుకు పోయిన తుపాకీ మడమల్ని ఆయుధాలనకూడదు... నిజాయితీ వెలుతురు పంచే దీపపు సమ్మెలని అంటాడు...

ఇంకా... "ఇక్కడే చెంపలపైన కన్నీళ్ళు"
సీతాకోక చిలుకలయి ఎగిరి పోయే సుందర దృశ్యాలు సాక్షాత్కరిస్తాయ" అని కూడా అంటాడు...

గునపాలై దిగిపోయిన గాయాలకి సంజీవనీ చికిత్స లభించేది కూడా యిక్కడేనంటూ మనల్ని అగ్గిపిడికిళ్ళ దుర్గమారణ్యాలలోకి సందర్శనానికి పిలుచుకెళ్తాడు...

అయితే యింట పాజిటివ్ థింకింగ్ ఉన్న కవితకి 'అడివి' అన్న పేరెందుకో అతికినట్లుగా లేదు. మామూలుగా మనం అడివి అన్న పదం కొంత నిందాత్మక భావంతో వాడతాం కాబట్టి మరేదయినా మంచి శీర్షిక పెట్టి వున్నట్లయితే బావుండేదేమో అన్పించింది.

మాతృభాష మీద, అక్షరం మీద ఈ కవికి ఎంత ప్రేమంటే పుస్తకం పేజీల్లో పద్మాసనం వేసి, మౌన తపస్విలా ధ్యానం చేస్తూ జ్ఞాన సంధ్యని ఆవిష్కరిస్తోన్న మహాక్షరానికి నమస్కరిస్తున్నాను అంటాడు శిరసొంచి.

గంగానదంత పవిత్రమైన మన తెలుగు భాషలో ఇంగ్లీషు మురికి కాల్వల్ని అపభ్రంశం చేయించాక యిప్పుడు మన తెలుగుకు వీధిపోటు తగిలింది అంటూ బాధపడతాడు.

ప్రపంచమంతా మార్కెట్ ప్రలోభంలో పడి చివరికి అవయవాల్ని రక్తాన్నీ... చివరికి పిండం మోయడానికి కూడా బేరం కుదుర్చుకుని మనిషి కుబేరుడవ్వాలన్న ఆశతో ఒక్కొక్క కిటికీని, ద్వార బంధాలన్నింటినీ రాల్చుకుని శిథిలమైపోతున్న పురాతన కోటలాగా ఒక్కో మానవీయ స్పర్శనూ కోల్పోతూ చరిత్ర దివాళా తీస్తోంది... ఈ చరిత్రను రేపటి సిలబస్‌లో మన వారసులు చదువుకుంటారు... కనీసం మన వారసులైనా బతికే తీరును మార్చుకుంటారు... మార్చుకోవాలి అన్న ఆశతో 'చరిత్ర' అన్న కవితను రాస్తాడు...

ఇవే కాక మరెన్నో ముఖ కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి...


చిరంజీవిగారన్నట్లుగా పాఠకులు స్వయంగా చదివి తీరాల్సిన కవితలు.. కవి ఎండ్లూరి సుధాకర్ రాసిన ముందుమాట ఈ కవిత్వ సంపుటికి చక్కగా అమిరింది.

ఈ కవి ఈతకోట సుబ్బారావు రాసిన 'చీలిన మనిషి' అన్న కవితకి యిటీవల ఆటా వారి బహుమతి వచ్చింది.

**(హృదయలిపి - కవితాసంపుటి, కవి : ఈతకోట సుబ్బారావు, పేజీలు 72, వెల : రూ. 40/-, ప్రతులకు : ఈతకోట సుబ్బారావు, హౌస్ నెం. 24/1175, 2వ వీధి, రవీంద్ర నగర్, నెల్లూరు-524004. మొబైల్ : 94405 29785**

డా॥ కె. గీత

# కళింగాంధ్ర మాండలికం-1




**ఉ**ద్యోగరీత్యా మొట్టమొదటిసారి మెదక్‌జిల్లాలో అడుగు పెట్టిన నాకు క్లాసులో పాఠం చెప్పిన తరువాత తిరిగి పిల్లలడిగే ప్రశ్నలు సరిగా అర్ధమయ్యేవి కావు. ఇక ఇంటిగల వాళ్ళు మాట్లాడుతుంటే మరేదో భాష అన్నట్టు, చాలా తక్కువ పదాలు మాత్రమే అర్ధమై అయోమయంగా వుండేది. మళ్ళీ మళ్ళీ అడిగేదాన్ని. నేను అలా అడుగుతుంటే నాకు చెవుడు అనుకునేవారట. ఇక ఇహ లాభం లేదని, ఓ నోటు పుస్తకం పెట్టి అర్ధం కాని ప్రతి పదానికీ అర్ధం కొంతమంది పిల్లల్ని అడిగి రాసి పెట్టుకునేదాన్ని.

ఈ పుస్తకం చూడగానే సరిగ్గా ఇలాంటి పుస్తకం వుండి వుంటే నాకా బాధ తప్పేది అన్పించింది. మాండలికాన్ని, అందులో కఠిన పదాల అర్ధం తెలుసుకోకపోతే, ఆయా ప్రాంతాల్లో వ్యవహారిక భాషని నేర్చుకోకపోతే ఒక్కోసారి చాలా కష్టపడాల్సి వస్తుంది. ఆ కొరతని తీరుస్తుందీ పుస్తకం.


భాషకు సంబంధించి సమగ్ర పరిశోధనలు తెలుగులో జరగడం లేదనేది వాస్తవం. ఇంకా ఎన్నో నిశితమైన పరిశోధనలు, ఆవిష్కరణలు జరగాల్సి వున్నాయి. ఈ పుస్తకం చూడగానే పరిశోధనా గ్రంథమనిపించింది. 'నిజమైన' పరిశోధన కూడా. కానీ డిగ్రీ కోసం కాక, ఆసక్తితో చేసే ఇలాంటి మార్పులే గొప్ప పరిశోధనలు. 'కళింగాంధ్ర' ప్రాంతంలో మాట్లాడే తెలుగులో ప్రామాణిక భాషకు విభిన్నమైన పదాలతో మొదటి సంకలనంగా రూపుదిద్దుకుందీ పుస్తకం. ఇందులో ప్రతి పదానికి అర్థంతో బాటూ ఉదాహరణ వాక్యాలు ఇతర రచనల నించి సేకరించి ఇవ్వడం వల్ల సరైన అర్థం సులభంగా బోధపడటమే కాకుండా రచయిత కఠిన శ్రమ కూడా అవగతమవుతుంది.

దైనందిన జీవితంతో, నిరంతరం మనకి మనమే మిగలని హడావుడి బతుకుతో సతమతమవుతున్న ఈ రోజులలో ఇంతే శ్రమించి ఒక గ్రంథ రాజాన్ని తయారు చేయడం మెచ్చుకోదగ్గ అంశం. కేవలం పదాల అర్థాలు అకారాదిగా చెప్పి ఊరుకోకుండా సంఖ్యావాచకాలు, వావి వరుసలు, అలంకారాలు, ఆభరణాలు మొదలగునవి, ద్విరుక్త పదాలు, రూపవైవిధ్యం, రూపాంతరాలు మొదలగునవి ఇవ్వడం వల్ల ఒక సమగ్రతని రూపొందించుకుందీ పుస్తకం.

ఇతర ప్రాంతాల వాళ్ళు కళింగాంధ్ర ప్రాంతానికి వెళ్ళాల్సి వచ్చినా, ఉద్యోగరీత్యానో, స్థిరపడాల్సి వస్తేదో ఈ పుస్తకం తీసుకువెళ్ళితే చాలు. ఏ కష్టం లేకుండా అక్కడి భాషని అర్థం చేసుకోవచ్చు. తెలుగు మాండలికాల మీద పరిశోధన చేసే వాళ్ళకూ బాగా ఉపకరిస్తుందీ పుస్తకం. ఇలా ఇతర మాండలికాల్లో కూడా పదకోశాలు రూపొందించాల్సిన అవసరాల్ని అందరూ గుర్తించాల్సి వుంది.

(పుస్తకం : కళింగాంధ్ర మాండలికం-1, రచయిత : జి.ఎస్. చలం, ముద్రణ : జనవరి, 2006, వెల : 50/- (వ్యక్తులకు) 100/- (సంస్థలకు), ప్రచురణ : శ్రీకాకుళ సాహితి)

**వేము**




## ఆంతరంగికాన్ని ఆవిష్కరించిన "వస్తువు అభివ్యక్తి"

**జ**రిగిన, జరుగుతున్న చరిత్రను ఒక క్రమ పద్ధతిలో అంచనా వేయడమంటే ఏమంత సాధ్యమయ్యే పని కాదు. అందునా సాహితీ రంగానికి చెందిన విషయాల గురించి మాట్లాడాలంటే సమగ్రంగా, కూలంకషంగా విషయ పరిజ్ఞానం, ఓపిక చాలా అవసరం. "తానొవ్వక నొప్పింపక తప్పించుకు తిరగడం సాధ్యం కాదు. అయిననూ సాహిత్య చరిత్రను అక్షరబద్ధం చేయాలనే తలంపు అవసరానుగతంగా వస్తుంది. (యూనివర్శిటీ పరిధిలో ఎం.ఫిల్, పి.హెచ్.డి., డిగ్రీల కోసం కావచ్చు. ఏదైనా పుస్తక ముద్రణ సంస్థ కోసం కావొచ్చు). సాహిత్య పరిశోధన దేనికోసం జరిగినా నిష్పక్షపాతంగా జరిగితే నూతన విషయాలు వెలుగులోకి వస్తాయి. కొన్ని సూత్రీకరణలతో సామ్యాలు, భేదాలు, ప్రత్యామ్నాయాలు ఎలా విభేదిస్తాయో తెలుసుకోవచ్చు. సమగ్రంగా ఒక మంచి పరిశోధన ఆయా కాలాల్లోని కవుల, రచయితల, కళాకారుల ఆత్మను సాక్షాత్కరిస్తుంది. ఇది భవిష్యత్ తరాలకు టానిక్‌లాంటిది. అట్లాంటిదే తెలుగు కవిత్వంపై ఒక పరిశోధనా వ్యాసం పుస్తక రూపంలో తెచ్చారు. కె.సి.వి.ఎస్.ఎల్. నరసింహారావు "సమకాలీన తెలుగు కవిత్వంలో వస్తువు - అభివృద్ధి" అనే టాపిక్ మీద సెంట్రల్ యూనివర్శిటీలో ఎం.ఫిల్. డిగ్రీ కోసం సమర్పించిన పరిశోధనా వ్యసం (డిజర్టేషన్) ఇది.

డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం గారన్నట్లు "పరిశోధనమనేది సత్యాన్వేషణ దృష్టితో, సమన్వయ దృక్పథంతో, నిర్మాణాత్మక వైఖరితో, విజ్ఞాన వికాసాన్ని సాధించాలి" అప్పుడే పరిశోధకుడు తను చెప్పాలనుకున్న విషయం, వాస్తవాన్ని వ్యక్తీకరించాలన్న దీక్ష సఫలీకృతమైనట్లు. ఇదే విషయాన్ని "వస్తువు - అభివ్యక్తి" అనే పరిశోధనా పత్రం సమర్పణలో నరసింహారావు పాటించారు.

విషయ ప్రాధాన్యతను బట్టి, కాలాన్ని బట్టి, వ్యక్తులను బట్టి ఆయా కాలాల్లోని సాహిత్యాన్ని విభజించుకొని కామెంట్ చేయడం. సమగ్రంగాను, తొట్రుపాటు లేకుండానూ ఉంటుంది. ఇదే ఈ పుస్తకంలో కన్పిస్తుంది. 1986-1990 మధ్య కాలాన్ని తీసుకుని ఆ కాలంలో వచ్చిన కవిత్వానిన సమకాలీన స్త్రీ చైతన్య కవిత, సమకాలీన విప్లవ కవిత, సమకాలీన అనిబద్ధ కవిత వంటి విభజన చేసుకొన్నారు. ఈ విభజన వల్ల పరిశోధన సౌలభ్యంగాను, సమగ్రతనూ సాధించిందనడంలో సందేహం లేదు.

స్త్రీ చైతన్య కవిత్వం స్త్రీల సమస్యల్ని గుర్తించి చర్చించడం తప్ప వాటికేదైనా పరిష్కారాన్ని చూపించగలదా? అనే సందేహం వ్యక్తమవుతుంది. ఈ సందర్భంలో కాత్యాయని అభిప్రాయాన్ని క్రోడీకరించడం శాస్త్రీయంగానూ, ఆలోచనాత్మకంగానూ ఉంది. అదేవిధంగా విప్లవ కవిత్వాన్ని పరిశీలిస్తున్నపుడు కె.కె. రంగనాథాచార్యులు, త్రిపురనేనిల సందర్భోచిత మాటల్ని క్రోడీకరించడం రచయిత తాను చెప్తున్న విషయాలకు రిఫరెన్స్ ఇస్తూనే బలాన్ని చేకూర్చుకున్నారు.

విప్లవ కవిత్వ వ్యక్తీకరణలో వరవరరావు ఆ తల్లి ముందు దోసిళ్ళతో... కవితలోని పాదాల్ని ఉదహరిస్తూ కవిత్వంలోని పట్టును, కవి అభివ్యక్తిని విశ్లేషించిన తీరు ఆకట్టుకునేట్లు ఉంది.

"తల్లి పాలు సజీవత్వానికి మట్టిలో చిందిన నెత్తురు మరణాన్ని ఉద్దేశించడం గమనించవచ్చు. కన్నబిడ్డ మరణం తల్లికి కలిగించే శోకాన్ని స్పష్టంగా తెలియజేసే ప్రయత్నం ఈ అభివ్యక్తిలో కన్పిస్తుంది." (పే. 64) ఇట్లాంటి విశ్లేషణలు ఈ పుస్తకంలో కోకొల్లలుగా విసిరారు రచయిత.

స్త్రీవాద సాహిత్యమంటే స్త్రీలు సృష్టించినదేనన్న వాదనను ఈ పుస్తకం సమర్థించినట్లుగా కన్పిస్తుంది. సమకాలీన స్త్రీ చైతన్య కవిత్వ అభివ్యక్తి విశ్లేషణకు రచయిత ఎన్నుకున్న కవితలు కొండేపూడి నిర్మల, జయప్రభ, విమల, ఓల్గా, సునీత వంటి కవయిత్రులవే దాదాపు తొంభైశాతం ఉండటం అసహనంగా అన్పిస్తుంది పాఠకునికి. ఈ భాగాన్ని పూర్తి చేసిన తర్వాత స్త్రీ సమస్యల మీద పురుషులు ఎవ్వరూ రాయలేదేమోనన్న అనుమానం కలగకమానదు. ఇదిరచయిత ఉద్దేశపూర్వకంగా కాకపోయినా ఆ కాలంలో ఈ సమస్యలపై పురుషులు రాసిన కవితలు బహుశా దొరకకపోవచ్చు. ముందుగానే రచయిత తన పరిశోధన కోసం ఆధారపడ్డ పలు అంశాల్ని వివరించారు (కవిత్వ సంకలనాలు, దిన, వార, సాహిత్య పత్రికలు తదితరాలు)

ఇక మూడవ అధ్యాయంలోని అనిబద్ధ కవిత శీర్షిక కింద ప్రేమ, ప్రకృతి, స్నేహం, మానసిక వేదన తదితర వస్తువులపై వచ్చిన కవిత్వంలో అభివ్యక్తిని విశ్లేషించారు. 1986–1900 మధ్యకాలంలో వచ్చిన కవిత్వంలో "ఒక సిద్ధాంతానికో, ఒక మార్గదర్శక విధానానికో కట్టుబడకుండా అన్ని రకాల అంశాల్ని విభిన్న రీతుల్లో ఆవిష్కరించడం అనిబద్ధ కవిత్వంలోని ముఖ్య విషయాలుగా పేర్కొంటూ ఈ తరహా కవిత్వాన్ని తన పరిశీలనా సౌలభ్యం కోసం అనిబద్ధ కవిత్వంగా (పేజి 107, 108) పేర్కొన్నారు. అనిబద్ధ కవిత్వం కింద ఉదహరించిన కవిత్వ పాదాలు పరిశోధకుని నిబద్ధతకు, విషయ పరిజ్ఞానానికి నిదర్శనంగా కన్పిస్తాయి. ఆయా కవితల్లోని అభివ్యక్తిని చాలా చక్కగా సాక్షాత్కరింపచేశారు. రహదారికి అడ్డంగా పడుకునే చీకటిని / దీప స్తంభాలు వెళ్లగొడతాయి / లారీలు హారన్లు కొట్టి ఊరవతలకి / తరుముతాయి / విజ్ఞానం యాంత్రికత ప్రకృతి నెలా అదృశ్యం చేస్తుందో చెప్పే సందర్భంలో సీతారాం "ఇదిగో ఇక్కడిదాకే" కవితను ఉదహరిస్తూ దానిలోని అభివ్యక్తిని అంచనా వేస్తూ చేసిన విశ్లేషణ తారాస్థాయికి చేరిందనడంలో సందేహం లేదు.


ఇంకా ఈ విభాగంలో పాపినేని శివశంకర్, విజయరాఘవ, జయప్రభ, శిరీష, ఎల్లోరా, తిర్మల్, కృష్ణస్వామి వంటి తదితర కవుల, కవయిత్రుల కవితల అభివ్యక్తిని విశ్లేషించారు. ఈ పరిశోధనా వ్యాసం విషయ గౌరవాన్ని, పరిశోధకుని దార్శనిక శక్తిని, పరిశీలనను, ప్రమాణికత కోసం తగిన ఉదాహరణలిచ్చిన విధానాన్ని, విశ్లేషణ తీరు, వర్గీకరణ విధానం శాస్త్రీయంగా ఉంది. కాకపోతే పుస్తకం మొత్తం చివరి పేజీ తిప్పేసి 1986–1900ల మధ్య కాలంలో అస్థిత్వ ఉద్యమాలు (ధోరణుల నుండి ఉద్యమ స్థాయికి ఎదిగాయి కూడా) గురించిన కవిత్వం తాలూకూ విశ్లేషణ కన్పించకపోవడంతో అసంతృప్తికి లోనవుతాడు. ఒకవేళ ఆయా ఉద్యమాలు ఈ పరిశీలనలోకి రావా? లేదా ఆయా ఉద్యమాల గురించిన సాహిత్యం ముఖ్యంగా కవిత్వం పరిశోధకుడు చెప్పుకున్నట్లు దిన, వార, మాస పత్రికల్లో కవిత్వ సంకలనాలు రాలేదా? ఒకవేళ వచ్చినా తనకిష్టం కాదా?

"ఇవే కాకుండా దళిత కవిత్వం ప్రత్యేక ధోరణిగా ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటుంది" (పేజీ -V) అని ముందు మాటలో చెప్పుకొని వదిలేయడంతో ఆంతర్యమేమిటో పరిశోధకునికే తెలియాలి. మొత్తానికి ఒక యూనివర్శిటీలో ఎం.ఫిల్ డిగ్రీ కోసం సమర్పించిన పరిశోధనా పత్రం పుస్తక రూపంలో పాఠకుల దగ్గరకు తీసుకురావడాన్ని అభినందించాల్సిందే. జి.వి.ఎస్. గారన్నట్లు "పరిశోధనారంగంలో ఇదే తుది తీర్పు అనుటకు వీలుకాదు" కదా!!

**("వస్తువు అభివ్యక్తి" పరిశోధనా వ్యాసం, కవి : కె.సి.వి.ఎస్.ఎల్. నరసింహారావు, పేజీలు : 185, వెల : రూ. 60/–, ప్రతులకు : మైత్రి బుక్స్, హైదరాబాద్–38, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్)**

---

**తెలకపల్లి రవి**




# తెలుగు విమర్శ, పరిశోధనల దర్పణం

గత అనేక సంవత్సరాలుగా తెలుగు సాహిత్య విమర్శ వివేచనా రంగంలో విశేషంగా కృషి చేస్తున్న రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అందించిన మొంచి పుస్తకం ' చర్చ'.

చర్చ పేరుకు తగ్గట్లే తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధన పరిణామాలను చర్చిస్తుంది. సాహిత్య రంగంలో సుప్రసిద్ధులూ, మార్గదర్శకులూ అయిన వారి విశిష్టతను విశ్లేషిస్తూనే వ్యక్తి ప్రధానంగా గాక విషయ ప్రధానంగా ఆయన పరిశీలన నడుస్తుంది. ఇందులో మొత్తం 36 వ్యాసాలున్నాయి. తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ అన్నవి రెండు ముఖ్యమైన వ్యాసాలు. అకడమిక్ కోణంలోనూ, అభ్యుదయ వాదంలోనూ కూడా లోతైన అవగాహన కలిగిన రాచపాళెం ఆ రెంటి మధ్యన సమతుల్యత పాటించగలరు. అందుకే దేని గురించి రాసినా కేవలం వ్యాఖ్యలకే పరిమితం కాకుండా వివరాలు, పూర్వాపరాలు ఇస్తారు. తనకన్నా ముందు తనతో పాటు తన తర్వాత విమర్శకుల పట్ల ఆయనకు పూర్తి గౌరవం వుంది.ఏవో ఒకటి రెండు మినహాయింపులన్నా ముఖ్యమైన సమకాలీన విమర్శకులెవరూ ఆయన దృష్టిపథం నుంచి తప్పిపోలేదు. వారు అంత ముఖ్యం కాదని కూడా ఆయన అనుకొని వుండొచ్చు.

రాచపాళెం విశ్లేషణకు కొన్ని కొలబద్దలు పెట్టుకున్నారు. . కాలం చెల్లిన భావాలను ఏ ముసుగులో ప్రతిపాదించినా ఆయన నిశితంగా ఖండిస్తారు. .విశ్వవిద్యాలయాలలో అత్యధికంగా సాగే నిరర్థక నిర్జీవ పరిశోధనా తతంగం పట్ల తన విముఖతను సూటిగానే ప్రకటిస్తారు.అయితే అందుకు మూలం వ్యక్తులుగా పరిశోధకులలో గాక వ్యవస్థగా మన విద్యా ప్రణాళికలోనే వుందని ఆయన అభిప్రాయం. ప్రజా ఉద్యమాలతో ప్రగతిశీలతతో ముడిపడిన సాహిత్యాన్ని చిన్నచూపు చూడటాన్ని, సిద్ధాంత రాహిత్యాన్ని ఆయన ఏమాత్రం సహించరు. తెలుగుడాక్టర్లూ పరిశోధన నాడి ఇప్పుడైనా చూస్తారా అంటూ విశ్వవిద్యాలయ పరిశోధనల లోపాలను ఎండగడతారు.భావవాద ప్రవాహంలో కొట్టుకుపోతున్న పదసాహిత్య విమర్శకులు అన్న వ్యాసంలో దీన్ని మరింత నిర్దిష్టంగా తెలిపారు. తెలుగు సాహిత్యంలోంచి నిష్క్రమించింది ఎవరు అన్న ఆయన చివరి వ్యాసం వేల్చేరు నారాయణ రావు అవాస్తవ వ్యాఖ్యలకు శక్తివంతమైన ప్రతిస్పందన. అలాగే ద్వానా శాస్త్రి సాహిత్య విమర్శ వున్నట్టా అంటూ సవాలు చేయడంపైనా స్పందించారు. ప్రొ.గంగాధర గాడ్గిల్ అకాడమీ అవార్డు తీసుకుంటూ చేసిన ప్రసంగంలో రచయితలు సిద్ధాంత నిబద్ధులై వుండటాన్ని ఖండించినపుడు రాచపాళెం గట్టిగా వ్యతిరేకిస్తారు. ఇవన్నీ ఆయన ఏ వైపున వున్నారో చెప్పే అంశాలే. తెలుగులో సాహిత్య విమర్శ ఎదగలేదా అన్న వ్యాసంలో అయన అనేక కీలకమైన అభిప్రాయాలు వెల్లడించారు' ఇప్పటిదాకా తెలుగులో వచ్చిన సాహిత్య విమర్శలో ఎక్కువభాగం పరిచయాలకే పరిమితమై పోయింది' సంప్రదాయ తెలుగు సాహిత్య విమర్శకులు ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని మార్క్సియ దృష్టితో చూడటాన్ని వ్యతిరేకిస్తారు. పాశ్చాత్య అలంకార శాస్త్రం తెలుగు వాళ్లకు అసలే వంటబట్టలేదు.'తెలుగు సాహిత్య విమర్శ ఎదగలేదు అనడానికి విశ్వవిద్యాలయాలు విశేషంగా కృషి చేస్తున్నాయి ' అని దెప్పిపొడుస్తారు.(పేజీ 51) ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో కుహనా ఆధునికులు చొరబడటం మరొక కారణం.వీళ్లు ఏదైనా వాదన బలంగా వున్నప్పుడు తమ విశ్వాసాలను దాచుకుని నమ్మకం లేని ఆ వాదనను సొంతం చేసుకుంటారు.కృత్రిమ ప్రతిపాదనలూ,

సూత్రీకరణలూ చేస్తారు. మార్క్సియ దృష్టితో వచ్చే విమర్శలో ఎక్కువభాగం వస్తు చర్చకే పరిమితం. శిల్పాన్ని గురించి మాట్లాడిన వాళ్లకు అకడమిక్ విమర్శకులుగా ముద్ర వేయడం వల్ల సాహిత్య విమర్శకు చాలా నష్టం జరిగింది. వల్లంపాటి ఈ లోపాన్ని తీర్చడానికి చేసిన ప్రయత్నాలు కేవలం వస్తు చర్చ చేయడం వల్ల సాహిత్య విమర్శ మొనాటనీకి దారితీసింది. అందువల్ల మార్క్సిస్టు దృష్టితో శిల్పవిమర్శ రావలసి వుంది. అది రాకపోవడం వల్ల కూడా విమర్శ ఎదగలేదన్న అభిప్రాయం కలుగుతోంది. ఇలాటి అభిప్రాయాలు చెప్పిన తర్వాత ఆయన ఇలా అంటారు: తెలుగు సాహిత్య విమర్శ చిన్నదేమీ కాదు. పెద్దదే. కాని దాని వెలుగు చిన్నదిగా వుంది'

తెలుగు సాహిత్యానికి విమర్శకు విశేషమైన సేవ చేసిన తాపీ ధర్మారావు, రాళ్లపల్లి, రూపనగుడి, మార్క్సిస్టు విమర్శకులు మద్దుకూరి, రారా, కెవిఆర్, త్రిపురనేని, వల్లంపాటి వంటివారి పట్ల రాచపాళెంకు ఎంతో గౌరవం. వారిలో ప్రతివారినీ ప్రస్తావించాడు. సోదాహరణంగా విశ్లేషించాడు. అదే సమయంలో వారి లోపాలనూ ఎత్తిచూపేందుకు వెనుకాడలేదు. అలాగే సూర్యసాగర్ ఎన్. వేణుగోపాల్, గుడిపాటి, వి.చెంచయ్య వంటి తదుపరి తరం విమర్శకులనూ పట్టుకున్నారు. అయితే ఆయనకు వ్యక్తి ఆరాధన లేదు. అందువల్లనే యుగాలే కాని యుగకర్తలుండరు అంటూ ఒక వ్యాసం రాశారు. అన్నిటినీ మించి తెలుగు పత్రికలలో ఒకో ఏడాదిలో వెలువడిన వివిధ సాహిత్య చర్చల తీరు తెన్నులను పరిశీలించి నివేదించారు. ఇవన్నీ చూస్తే రాచపాళెం తెలుగు సాహిత్య పరిణామాన్ని ఎంత నిబద్ధంగా గమనిస్తున్నారో అర్థమవుతుంది. అయితే ప్రస్థానంలో జరిగిన చర్చలు, సాహితీ స్రవంతి ప్రచురణలు ఆయన విమర్శలలో ప్రస్తావనకు రాకపోవడం దురదృష్టకరం. సాహిత్య సంఘాలు-ధోరణులు అన్న సంపుటంలోని అంశాలనైనా ఆయన ప్రస్తావించలేదు. అయితే సాహితీ స్రవంతికి ఆయన మంచి మిత్రులు కావడం వల్లనే ఈ కొరత మరింత ఎక్కువగా కనిపిస్తుంది.

స్థూలంగా రాచపాళెం విమర్శనా దృష్టి యాభైల నాటి అభ్యుదయ దృక్పథానికి దగ్గరగా వుంటుంది. తర్వాతి కాలంలో వచ్చిన వాద ప్రతివాదాలను శ్రద్ధాసక్తులతో గమనిస్తున్నా వాటితాలూకూ కార్యకారణ సంబంధాలనూ, సామాజిక సంక్లిష్టతలనూ అర్థం చేసుకోవడానికి ఆయనకు మరింత అధ్యయనం అవసరమవుతుంది. ఏది ధోరణి, ఏది ఉద్యమం అన్న చర్చను ప్రస్తావించి వర్గ వర్గేతర ప్రగతిశీల దృక్పథాల మధ్య ఘర్షణ కొనసాగుతూనే వున్నదని ఆయన రాశారు. సామాజిక అంశాలను ప్రతిపాదించడమే వర్గేతర దృక్పథం అనుకోకూడదు. ఆయన సిద్ధాంత రాహిత్యాన్ని, సంప్రదాయారాధననూ ఖండించినంత నిశితంగా అన్ని సందర్భాల్లోనూ రాసినట్టు కనిపించరు. అభినందించే అంశాలను వివరంగా రాసి విమర్శలను ప్రస్తావనతో సరిపెడతారు. ఉదాహరణకు త్రిపురనేని గురించి రాసేప్పుడు ఆయనలోని యాంత్రికతను ఎత్తిచూపరు. రారా క్రూరుడైన విమర్శకుడేతే రాచపాళెం కొంచెం సుకుమార విమర్శకుడని చెప్పాలి.

ఏమైనా చర్చ చాలా విలువైన సంపుటం. దీన్ని చదివితే తెలుగు సాహిత్య విమర్శ మాత్రమే కాక సాహిత్య గమనమే కళ్లముందు నిలుస్తుంది. అంతగా అందుబాటులో వుండని అనేక అంశాలనూ ఒకచోట కూర్చిన ఈ పుస్తకం మామూలు పాఠకులకే గాక సాహిత్య అధ్యయన శీలులకు కూడా అవశ్య పఠనీయాలవుతాయి.

(చర్చ, రచయిత : రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వెల : 65/-, పేజీలు : 202, ప్రతులకు : శ్రీమతి ఆర్. లక్ష్మి, 28-3-169, తారకనాథ కాలనీ, అనంతపురం-515 001. ఫోన్ : 08554 - 275366)

---

# ప్రకృతిని కాపాడుకుందాం

**ఎన్.కె. బాబు**



పచ్చని పైరులు
కనుచూపు మేరవరకు ఆకుపచ్చని కొండలు
లోయలు, సన్నని సెలయేళ్లు
కిలకిలా రావాలు, గిజిగాడు గూళ్ళు
మానవుని పరిణామ క్రమానికి ప్రతీకలైన వానరాలు
తోడేళ్ళు, చిరుతలు, లేళ్ళు
ప్రకృతి సహజీవనంలో ప్రశాంతమైన గిరిపుత్రులు
హాయిగొలిపే అద్భుతమైన ఓ సజీవ సుందర దృశ్యం
తూర్పు కనుమల కన్నుల పండుగ దృశ్యం
ఈ సుందర దృశ్యాలను తిలకించే హృదయాలు
ప్రకృతి సమతౌల్యానికి నిరంతరం శ్రమించే
వనాల రాశి ఈ విశాఖ ఏజెన్సీ
ఈ అందమైన నేల అందాన్నే ఇస్తుందనుకోకు
నిలువ నీడను ఇచ్చే చెట్లు
ఇక్కడి కొండలు, కోనలు సమయానికి వర్షాలను కురిపిస్తూ
త్రాగడానికి నీరు, తినే తిండిని పండించే పంట పొలాలకు
నీరుని అందిస్తూ ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడుతుంది
నేల తల్లి పొత్తిళ్ళలోని బాక్సైట్ బంగారం కోసం
బాంబులతో బ్రద్దలు కొట్టి బీభత్సం సృష్టించి
విధ్వంసానికి పూనుకున్నావో
అది నీ విధ్వంసానికి దారి తీస్తుంది
వేలకు వేల హెక్టార్లు బీళ్లుగా మారినపుడు
అక్కడంతా స్మశానమే
వర్షాన్నిచ్చే చెట్లుగానీ, వనచరాలు గానీ,
గిరిజనాలు గానీ, జాడలేకుండా పోతాయి
వనచరాలు, జనవాసాలపై పడ్డపుడు
ఆ భీతిల్లే దృశ్యం... ఊహాతీతం
ఛిద్రమైన భూమి తల్లి శాపనార్థం
మానవాళి మనుగడకు పెనుముప్పు తెస్తుంది
అందుకే ప్రకృతిని కాపాడుదాం
ప్రకృతిని కాపాడుదాం
మనలను మనం కాపాడుకుందాం

## నివేదిక

# ఉత్సాహం నింపిన ఉత్తరాంధ్ర సాహిత్యశాల



ప్రారంభ సభ వేదికపై (ఎడమనుంచి) కె. శివారెడ్డి, అద్దేపల్లి, రామలక్ష్మణమూర్తి, తెలకపల్లి రవి, కాళీపట్నం, ఎ. గోపాలరావు, నరసింహరాజు

**చీకటి దివాకర్**

**ఆ**ధునిక కథకు, కవితకు పుట్టిల్లు ఉత్తరాంధ్ర. పాటను ఆయుధంగా చేసుకొని 'మాకొద్దీ తెల్లదొరతనం' అని గర్జించిన ప్రాంతం ఉత్తరాంధ్ర. ప్రజాసంస్కృతుల నిలయం ఉత్తరాంధ్ర. ఆ ఉత్తరాంధ్ర నడిబొడ్డున ఉండి సాంస్కృతిక రాజధానిగా వన్నెకెక్కిన విజయనగరం. ఆ పేరు వినగానే చరిత్రపుటలు కళ్లముందు కదలాడతాయి. ఎందరో కవుల్ని, కథకుల్ని, కళాకారుల్ని అందించింది ఈ నగరం. విజయనగరం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో స్థానిక మెసానిక్ టెంపుల్లో డిసెంబరు 9, 10 తేదీల్లో సాహిత్యశాల జరిగింది.

స్థానిక సాహితీస్రవంతి గత పదేళ్లుగా విజయనగరం జిల్లాలో అనేక కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. సభలు, సమావేశాలు, పుస్తక సమీక్షలు, సెమినార్లు, ప్రముఖుల జయంతులు, వర్ధంతులు, జనకవనం వంటి కార్యక్రమాల్ని నిర్వహిస్తూ వచ్చింది. అందులో భాగంగా ఉత్తరాంధ్ర సాహిత్యశాల నిర్వహించింది. విశాల ప్రాతిపదికన సాహితీవేత్తల్ని ఒక వేదికమీదకు తీసుకురావడానికి అందుకు కావలసిన సాహిత్య వాతావరణం ఏర్పాటు చేయడానికి సాహిత్యశాల ఉద్దేశింపబడింది. అందులో భాగంగా పాఠశాల విద్యార్థుల స్థాయి బాలసాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు కవితల, కథల పోటీలను నిర్వహించింది. యువకుల్ని ప్రోత్సహించేందుకు వారికి సాహిత్యం పట్ల సానుకూల దృక్పథం కల్పించేందుకు కళాశాల స్థాయి కథల, కవితల పోటీలను కూడా నిర్వహించింది. ఉత్తరాంధ్ర కవుల ప్రస్తుత స్థితిగతుల్ని, సాహిత్యంలో ఈ ప్రాంతం స్థాయిని తెలపడంకోసం 'తిత్తవ' కవితా సంకలనాన్ని ప్రచురించింది.

### గురజాడకు నివాళి

డిసెంబరు 9న శనివారం ఉదయం వైతాళికుడు, యుగకర్త మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించడంతో కార్యక్రమం ప్రారంభమయింది. పురప్రముఖులు, ఉత్తరాంధ్ర కవులు, కథకులే కాక ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొన్నారు. 11 గం॥లకు ప్రారంభ సభ ప్రజాశక్తి పుస్తక ప్రదర్శన గ్రంథాలయోద్యమ నాయకులు జయంతి రామలక్ష్మణమూర్తి ప్రారంభించగా, ప్రముఖ సాహితీవేత్తల ఛాయచిత్ర ప్రదర్శనను ప్రముఖ రచయిత్రి డాక్టర్ చాగంటి తులసి ప్రారంభించారు. కార్యక్రమానికి వచ్చినవారికి విజయనగరం జిల్లా సాహితీస్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ స్వాగతం పలికారు.

కథానిలయం వ్యవస్థాపకులు, సీనియర్ కథా రచయిత కాళీపట్నం రామారావు ప్రారంభోపన్యాసం చేస్తు యువరచయితలు మానవ జీవితపు లోతుల్ని పరిశీలించి తమ తమ రచనల్లో ప్రతిబింబించేటట్లు చూడాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతపు ఈనాటి కొత్త రచయితలు పాత రచయితల గురించి గొప్పలు చెప్పుకోవడం కంటే అంతకుమించిన మంచి కథల్ని రాయలన్నారు. రాసే పద్ధతిలో కూడా మార్పు రావాలన్నారు. వస్తువును ఎన్నుకోవడం నుంచి అభివ్యక్తి వరకు అన్నింటా కొత్తదనం కనిపించాలని కోరారు. అలా అని కొత్త పేరిట ప్రజా జీవితాన్ని విడిచి వైయుక్తిక రచనలకు మరలిపోకూడదన్నారు. మహిళల్లో చైతన్యస్థాయి పెరగడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం మన ముందున్న పెద్ద సమస్య ప్రపంచీకరణని, అది మన వృత్తుల్ని నాశనం చేస్తుందని, మానవ సంబంధాల్ని ఛిద్రం చేస్తుందని తెలిపారు. దాని కారణంగా విద్య, వైద్యం సామాన్యుల నుండి దూరమవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పేరిట పాలకులు అప్పులు చేస్తున్నారని, అవి ఎవరికి మేలుచేస్తున్నాయో ఆలోచించాలని కోరారు. రచయితలు కొందరిలో స్థిర దృక్పథం కొరవడిన కారణంగా వారి రచనల్లో అస్పష్టత చోటు చేసుకుంటోందని తెలిపారు. ఎన్ని రచనలు చేశామన్నదాని కంటె ఎంత ప్రతిభావంతంగా చేశామన్నదే ప్రమాణమని తెలిపారు.

సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి అధ్యక్షోపన్యాసంలో సాహిత్యంలోని కొత్త గొంతులకు సాహితీస్రవంతి ఆహ్వానం పలుకుతుందని తెలిపారు. ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో వివిధ ధోరణులున్నాయని అన్ని రకాల పురోగమన సాహితీ శక్తుల్ని కలిపి ఒక వేదిక మీదకు తేవాలన్న అభిప్రాయంతో సాహితీ స్రవంతి పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటం కవులకు, రచయితలకు కేంద్ర బిందువయిందన్న అభిప్రాయన్ని వ్యక్తపరిచారు. రాజకీయాలలోనే కాకుండా, భాషా సంస్కృతులు కూడా ప్రజాస్వామ్యీకరించబడాలన్న గురజాడ ఆలోచనలు నిజంకావాలని అభిలషించారు. పుస్తకాలకు ఆదరణ నానాటికీ పెరుగుతుందని అన్నారు. పుస్తక ప్రచురణ సంఖ్య, పాఠకుల సంఖ్య, విమర్శకుల సంఖ్య పెరగడం హర్షణీయమన్నారు. మట్టిని, మనిషిని ప్రేమించే రాజకీయాలు కరువవుతున్నాయన్న బాధను వ్యక్తపరించారు.

గ్రంథాలయోద్యమ నాయకులు జయంతి రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో జరిగిన అనేకానేక ఉద్యమాలే సాహితీకారులకు ఉత్ప్రేరకాలని అన్నారు. సమాజంలో నానాటికీ సామన్యులపై దాడులు, అణచివేతలు పెరుగుతున్నాయని, సాహిత్యోద్యమం పటిష్టం కావడం ద్వారా ఇవి తగ్గుముఖం పడతాయని తెలిపారు. ప్రముఖ సంఘసేవకులు పి.వి.నరసింహరాజు (బుచ్చిబాబు) మాట్లాడుతూ ఈనాటి బాలలకు కవిత్వం పరిచయం కావల్సిన అవసరం ఉందని, ఆ పని సాహితీస్రవంతి కార్యక్రమాల ద్వారా తీరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విజయభావన ప్రధానకార్యదర్శి డాక్టర్

ఎ.గోపాలరావు మాట్లాడుతూ సంప్రదాయ సాహిత్యాన్ని కూడా విస్తారంగా అధ్యయనం చేసిన వారే గొప్ప సాహిత్య సృజన చేశారని గుర్తుచేశారు. తెలుగు భాష నాటకానికి పనికిరాదన్న అపవాదుని గురజాడ తొలగించారని, ఆయన మార్గం ఆచరణీయమని తెలిపారు. ప్రముఖకవి, విమర్శకుడు అద్దేపల్లి రామ్మోహనరావు మాట్లాడుతూ 'దేశి సరుకులు నింపవోయ్' అన్న గురజాడ ఆశయం నెరవేరలేదన్నారు. స్వదేశీ వస్తు వినిమయ ఉద్దేశంతోనే గురజాడ ఆ విధంగా అన్నారని తెలిపారు. 'మతములన్నియు మాసి పోవును, జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును' అన్న గురజాడ ఆశలు, ఆకాంక్షలు నెరవేరాల్సి ఉందన్నారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ ఔత్సాహిక కవులను ప్రోత్సహిస్తూ సాహితీ స్రవంతి నిర్వహిస్తున్న సాహిత్యశాల విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కథకుడు జాతశ్రీ, డాక్టర్ రామసూరి, డాక్టర్ చాగంటి తులసి, డాక్టర్ మేడేపల్లి రవికుమార్, సాహితీ స్రవంతి విజయనగరం జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్ ప్రభృతులు తమ సందేశాల్ని వినిపించారు.

**కవిత్వం**

మధ్యాహ్నం ప్రారంభమైన కవిత్వ సమావేశంలో వెంకటేశ్వర యునివర్సిటీ అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ మేడేపల్లి రవికుమార్ మాట్లాడుతు ఉత్తరాంధ్ర కవిత్వంగాక కథే ప్రధానమైందనట్లు ఆలోచించడం తగదన్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర నుంచి మంచి కవిత్వం వస్తుందని తెలిపారు. తను మాట్లాడిన ప్రతి చోట ఉత్తరాంధ్ర కవిత్వాన్ని ఉటంకిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచీకరణ ప్రభావం ముఖ్యంగా రైతాంగం మీద పడిందని కారణంగా రైతుల జీవితాలు ధ్వంసమై వలసలు పోతున్నారని ఈ విషయాల్ని కవిత్వీకరించడంలో ఉత్తరాంధ్ర కవులు బాగానే ప్రతిస్పందించారన్నారు. ప్రపంచీకరణ దుష్పరిణామాలు, అది మానవ జీవితంలో తెస్తున్న మార్పులు, పెరిగి పోతున్న వినిమయ సంస్కృతిపైనా ఇటీవలి కాలంలో వచ్చిన కవితల్ని, అందులో మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర కవితల్ని సోదహరణగా వినిపించారు. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలకంటే మన రాష్ట్రంలోనే ఎక్కువ కవిత్వ సృజన జరుగుతుందని తెలిపారు. ప్రపంచీకరణ కేన్సర్ పురుగులాంటిదని, దాన్ని గుర్తించేలోగానే మనల్ని దొలిచేస్తుందని పేర్కొన్నారు. ప్రపంచీకరణ మూలంగా ప్రతి అంశము వ్యాపారమైపోయిందన్నారు. వస్తు వ్యామోహ సంస్కృతి కారణంగా మనుష్యులకంటే వస్తువులకే విలువ పెరుగుతుందని వాపోయారు. సినిమాలో సాహిత్యం ప్రపంచీకరణ ఒరవడిలో కొట్టుకుపోతున్నా యన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మధ్య సంబంధాలు దెబ్బతిని, అంతా ఒకరి కొకరు శత్రువులుగా మారిపోతున్నారని చెప్పారు. దేశమంటే సరిహద్దు అని భావిస్తున్న అగ్రరాజ్యం ఇతర దేశాలను అక్కడి మనుష్యులతో, వారి మనసులతో సంబంధం లేకుండా కుంటి సాకులతో ఆక్రమించుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గురజాడ అప్పారావు రాసిన 'దేశమంటే మట్టి కాదోయ్ – దేశమంటే మనుష్యులోయ్' అన్న కవితా స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవల్సిన అవసరం ఉందన్నారు. ఈ కవిత విశ్వవ్యాప్తి చేస్తే దేశాలమధ్య సోదరభావాన్ని పెంపొందించగలరని అభిప్రాయపడ్డారు.



వైతాళికుడు గురజాడకు నివాళి

ఈ సభకు అధ్యక్షత వహించిన అద్దేపల్లి రామ్మోహన్ రావు మాట్లాడుతూ జన సామాన్యంలోనే కవిత్వం ఉందని దాన్ని ఒడిసి పట్టుకోవడంలోనే కవిప్రతిభ కనపర్చాలన్నారు. గత కొంతకాలంగా రాష్ట్రంలో జనకవనాలు, సాహిత్య శాలలు ఏర్పాటులో సాహితీ స్రవంతి కృషిని విశ్లేషించారు.

ఆ తరువాత ప్రముఖ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ వస్తువు, శిల్పాలపై ప్రసంగిచారు. కవిత రాసే క్రమంలో వస్తువు ఎలా స్వీకరించవచ్చో ఆయన తన స్వీయనుభవంనుంచి విశ్లేషించారు. వస్తువుకు తగిన రుపాన్ని అంటే శిల్పాన్ని ఎన్నుకోవాలని శిల్పాన్నిబట్టి వస్తువును స్వీకరించ కూడదన్నారు. కవిత్వం వల్ల జీవితం సౌందర్యవంతం అవుతుందన్నారు. కవిత్వమేతనను మనిషిగా మిగిలిచ్చిందని చెప్పారు. కవిత్వం కొత్త దృక్కోణం అల వరుస్తుందని తెలిపారు. స్పందించే గుణం కవికి అత్యంత అవశ్యకమని తెలిపారు. ఖాళీగా ఉన్నంత మాత్రాన కవిత్వం రాయాలనుకోవడం తగదన్నారు. నేటి రాజకీయాలు అందుకు అనువైనవని కవిత్వం సీరియస్‌గా పరిగణించాల్సిన విషయమని, జీవితాంతం కవిత్వంతో మమేక మైనప్పుడు మాత్రమే కవిత్వ రచనలో కవి విజయుడవుతా దన్నారు. ఈ ప్రాంతపు కవి, కథకుడు గాంటేడా గౌరినాయుడు మాట్లాడుతు నేటి తరం కవులు నిరంతర కవితాధ్యయనం చెయ్యాలని అప్పుడే మంచి కవిత్వం సృజించగలుగుతారని అన్నారు.

**'తిత్తవ', 'నాగలి' ఆవిష్కరణ**

ఈ కవిత్వ సెక్షన్‌లోనే ఉత్తరాంధ్ర కవుల కవితా సంకలనం తిత్తవను అద్దేపల్లి ఆవిష్కరించారు. ప్రముఖ కవి అల ఈ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సంకలనంలో మూడు దశాబ్దాలుగా కవితా రచనలో ఉన్న సీనియర్ కవులు ఇప్పుడిప్పుడే కవిత్వ రచనకు ఉపక్రమించిన కొత్త కవులు కవిత్వం ఉందని తెలిపారు. కవిత్వం భావావేశ ప్రక్రియ అని అందుకే మిగిలిన సాహితీ ప్రక్రియల కంటె ఇది భిన్నమైనదని తెలిపారు. ఈ సంకలనంలో ఎక్కువ కవితలు ప్రపంచీకరణకు వ్యతిరేకించనవేనని తెలిపారు. అయితే ఈ సంకలనంలో ఉత్తరాంధ్ర ఆసాంతం సాక్షాత్కరిస్తుందని అన్నారు. తోటపల్లి బేరేజ్ నిర్వాసతుల భాదల్ని, వ్యవసాయదారుల ఆత్మహత్యల్ని, ఇటీవల తుపానుకు కొండచరియలు విరిగిపడిన మరణాలదగ్గర్నుంచి, స్త్రీల, దళితుల అణచివేతలు, విద్యార్థుల వెతలు, శ్రీకాకుళ పోరాట తదనంతర విప్లవ సాహిత్యం, బాల కార్మిక వ్యవస్థ మొదలైన అంశాల మీద సుమారు 87 కవితలున్నాయని తెలిపారు.

గంటేడ గౌరినాయుడి 'నాగలి' కావ్యాన్ని కె. శివారెడ్డి ఆవిష్కరించారు కథకుడు నవలాకారుడు జి.ఎస్. చలం ఈ కావ్యాన్ని పరిచయం చేశారు ఉత్తరాంధ్ర రైతు సంస్కృతిని చాటి చెప్పే కావ్యంగా నాగలి మిగిలి పోతుందన్నారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని వర్ణించ డంలో గౌరునాయుడు కనపరిచిన శ్రద్ధకు అభినందనలు తెలిపారు.

**కథ, నవల**

అదేరోజు సాయింత్రం కథ, నవల సమావేశం జరిగింది. జి.ఎస్. చలం అధ్యక్షత వహించారు. తెలుగు కథ గురజాడ గురించి నేటివరకు జరిగిన అభివృద్ధి పరిణామాన్ని కోయి కోటేశ్వరరావు ఆర్ద్రంగా, స్ఫూర్తిదాయకంగా వివరించారు. కథన రీతుల్ని, వస్తువుని ఎన్నుకోవడంలోని, శిల్ప నిర్మాణంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి

జాతశ్రీ మాట్లాడారు. కథకులు ఎవరి గురించి వస్తువు తీసుకుంటున్నారో వాళ్ల గురించి చాలా సీరియస్‌గా అధ్యయనం చెయ్యాలని తెలిపారు అప్పుడు మాత్రమే వారి బాష, వాళ్ల సంస్కృతుల్ని కథలో ప్రతిబంబించ గలుగుతారని చెప్పారు. అట్టాడ అప్పల నాయుడు మాట్లాడుతూ రాజకీయాలు నవలారచనలో అంతర్భాగం అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్ని అర్ధంచేసుకొని వాటి నుంచి రచయితలు ఒక దృక్పధాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్రలో 70వ దశకం నుంచి నేటి వరకు జరుగుతున్న పరిణామ క్రమాన్ని వివరించారు.



'తిత్తవ', 'నాగలి' ఆవిష్కరణ సభలో
గౌరునాయుడు, శివారెడ్డి, అద్దేపల్లి, మేడిపల్లి రవికుమార్

## మీడియా - సాహిత్యం

భాషా ప్రాచుర్యానికి పత్రికలు దోహదపడాలని ఆకాశవాణి విశాఖపట్నం కార్యనిర్వాహణాధికారి నాగసూరి వేణుగోపాల్ 10వ తేదీ ఉదయం 'మీడియా–సాహిత్యం' అనే అంశంపై సమావేశంలో చెప్పారు.

స్వాతంత్ర్యోద్యమకాలంలోనూ గ్రంధాలయ ఉద్యమ కాలంలోనూ నిర్వహించాయని భాషను పత్రికలో గొప్ప భూమిక కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిమీద ఉందని తెలిపారు. పత్రికా భాషా ఏ ఒక్క ప్రాంతానికి పరిమితం కారాదన్నారు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఇంటర్నెట్ అందుబాటులో కొచ్చాక మరింత ఎక్కువ మంది సాహిత్యం చదివే అవకాశం ఉందని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్నికి అనుగుణంగా సాహిత్యం రూపం మార్చుకోవలన్నారు. నార్ల వారు తదితరులు తెలుగు భాషకు దార్శనికతచూపారన్నారు. టి.వి.చానల్స్ వచ్చాక వివిధ ప్రాంతాలలోని మండలికపదాలని, భాషా పద్దతుల్ని నేరుగా తెలుసుకోడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆకాశవాణిని సాహిత్య కారులు అంతగా ఉపయోగించుకోవడం లేదన్నారు.

సభాధ్యక్షుడు, ప్రజాశక్తి అసోసియేట్ ఎడిటర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రారంభంలో మత ప్రచారం కోసం పత్రికలు ఉపకరించాయని, అయితే ఆ తరువాత కాలంలో సంఘ సంస్కరణోద్యమంకోసం జాతీయో ద్యమం కోసం పత్రికలు సహాయపడ్డాయన్నారు. మీడియాకు సాహిత్యానికి విడదీయరాని బంధం ఉందన్నారు. మీడియలో వ్యాపార ధోరణి పెరగడంతో సాహిత్య ప్రాధాన్యత క్రమం కూడా మారిందన్నారు. స్వాతంత్ర్యానికి ముందు పత్రికలకోసం ఆస్తుల్ని పొగొట్టుకుంటే స్వాతంత్ర్యం వచ్చాక పత్రికలు ఆస్తులు పెంచుకోడం చూస్తున్నామన్నారు. సంపాదకీయాలు యజమానుల చేతిలోకి వెళ్లేక పరిస్థితులు ఇంకాదుర్భరంగా మరాయన్నారు. వాస్తవమైన హృదయస్పందనలకు స్థానం లేకుండా పోయిందన్నారు. ప్రకటనల్లోకూడా సాహిత్యం కనిపిస్తుందని తెలిపారు. సాహిత్యరంగం సొంతంగా మాద్యమాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

డా॥ రామసూరి మాట్లాడుతూ ప్రస్తుత గత సినిమా సాహిత్యాన్ని విశ్లేషించారు.గిడుగు వ్యవహారిక ఉద్యమ ఫలితం కన్యాశుల్క మని అన్నారు. తెలుగు భాష మల్లె తీగను ఎత్తి కన్యాశుల్కం అనే పందిరిపై గురజాడ పువ్వులు పుయించాడన్నారు. వ్యాపార ప్రధానంగా సాగే సినిమారంగంలో కూడా సాహిత్యానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చిన సందర్భాలు కన్పిస్తాయన్నారు. విన్పించే సాహిత్యాల కంటే కన్పించే దృశ్యం ఎక్కువ విషయాన్ని చెప్పగలుగుతుందన్నారు. అకారణం గానే దర్శకులు డైలాగులతో కంటే కెమేరాలతోనే ఎక్కువగా మాట్లాడిస్తారని వివరించారు. భాషలోని నుడికారం ఉపయోగించు కోవడం రావాలన్నారు. భాష రావడానికి అధ్యయనమే మార్గమని తెలిపారు.

## సాంస్కృతిక విశ్వవిద్యాలయం

ఈ సమావేశంలో రాష్ట్ర సాహితీ స్రవంతి కన్వీనర్ తెలకపల్లి రవి మాట్లాడుతు విజయనగరంలో సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచెయ్యలని కోరారు. ఈ విషయాన్ని చప్పట్లతో సభ తమ మద్దుతును ప్రకటించింది.

## జనకవనం

తరువాత అల, గంటేడ గౌరినాయుడు డా॥ రామసూరి, చీకటి దివాకర్ జనకవనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు డా॥ రామసూరి కన్నీటికి కవిత్వం అక్షర రూపాన్నిస్తుందని తెలిపారు. సాహిత్యం దాని ప్రయోజనం గురించి సాహిత్యశాల ఉయోగం గురించి గౌరినాయుడు వివరించాడు. అభివృద్ధికర ఆలోచనలున్న కవులు, రచయితలు, కళాకారులు కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందని, అందుకు సాహితీ స్రవంతి తన వంతు కృషిని చేస్తుందని అల తెలిపారు. గంటేడ గౌరినాయుడు, చింతా అప్పలనాయుడు, 'అల' సిరికి స్వామినాయుడు, డా॥ రామసూరి, మనాపురం రాజా చంద్రశేఖర్ తదితరులు సుమారు 60 మంది కవులు తమ కవితల్ని వినిపించారు.

ముగింపుగా సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి విజయనగరం సాహిత్యశాల ప్రత్యేకతలు తెలిపారు. ఈ కృషి కొనసాగుతుందన్నారు. సాహిత్యశాల చాల క్రమశిక్షణతో జరిగిందని కొనియడారు. ఉన్నతమైన భావాలు కలిగిన కవులు, రచయితలు హాజరుకావడం సాహిత్యశాల ప్రయోజనాన్ని పొందిందని భావిస్తున్నామని అన్నారు పూర్తి స్థాయిలో కవులు రచయతలే హాజరుకావడం సాహిత్యశాలకు నిండుదనాన్ని చ్చిందన్నారు. సాంస్కృతిక, సామాజిక మథనం రచయితల్లో కనిపించిందన్నారు, ఘర్షణ, ఆలోచన విరివిగా ఉన్న సాహితీకారులు హాజరుకావడం హర్షణీయమన్నారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి శ్రమించిన శేషగిరి, దివాకర్, మురళీధర్, అల, చలం, పద్మావతి, చంద్రిక, బంగారం, కుర్మారావు, లక్ష్మణరావు ప్రభృతుల్ని అభినందించారు. ఈ కార్యక్రమ స్పూర్తిని సాహిత్యపరంగా వినియోగించుకోవాలని నిర్వాహకుల్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.కె.బాబు, మన్మద, కుమార్ అందించిన సహాయానికి ధన్యవాదాలు తెల్పారు.

రెండు రోజుల పాటు జరిగిన ఈ సభలకు రాష్ట్రంలోని హైదరాబాదు, తిరుపతి, ఖమ్మం, కాకినాడ, మహబూబ్‌నగర్, రాయగడ ప్రాంతాల నుంచి సుమారు 20 మంది రచయితలు హాజరు కాగా విజయనగరం నుంచి 200 మందికి పైగా హాజరయ్యారు. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి 80 మంది హాజరయ్యారు.

విజయనగరం జిల్లా సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ ఆహ్వానంతో ప్రారంభమైన సాహిత్యశాల రెండవరోజు ఆయన వందన సమర్పణతో ముగిసింది.

# అరసం - విరసం మధ్య కాలంలో సాహిత్య సంచలనాలు



**“స్వాతంత్ర్యానికి పూర్వం భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం విజృంభించాయి. స్వాతంత్ర్యానంతరం కూడా అభ్యుదయ కవిత్వం ఏడెనిమిదేండ్లు కొనసాగి 1955లో వచన కవిత్వంగా, 1965లో దిగంబర కవిత్వంగానూ,1970లో విప్లవ కవిత్వం గాను పరిణమించింది.” “1970 నుండి సుమారుగా 1980లు విప్లవ రచయితల సంఘం ప్రాబల్యం వహించిన సంవత్సరాలు.**

**కూరపాటి మోహన్**

ప్రపంచంలో కలిగే మార్పులు నిరంతరమైనవి. ఏమార్పులైనా అకస్మాత్తుగానో, అప్రయత్నంగానో సంభవించవు. ఏదో ఒక మూలకారణం తప్పకవుంటుంది. ఇక భారత దేశంలో “క్రీ.శ.19-20 శతాబ్దాలలో భారత జాతి పొందిన పునరుజ్జీవనానికి, పాశ్చాత్య దేశాలలో వచ్చిన పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య విప్లవం వంటి మార్పుల తోడేగాక, కాల్పనిక వాదము, మానవతా వాదము వంటి భావసంచలనాలతో గూడా సన్నిహిత సంబంధం ఉన్నది. అయినప్పటికీ భారతజాతీయ పునరుజ్జీవనంలో ప్రధాన పాత్ర వహించిన రాజారామమోహన్‌రాయ్ (బ్రహ్మసమాజము), దయానందసరస్వతి (ఆర్య సమాజము), రామకృష్ణ పరమహంస, వివేకానందులు (అనుష్ఠాన వేదాంతము), తిలక్ (గీతా రహస్యము), గాంధీ (సత్యాహింసలు) ప్రభృతుల ఉద్యమాల స్వభావాన్ని పరిశీలిస్తే, తేట తెల్లం అయే సత్యం ఒకటి ఉన్నది. పాశ్చాత్య సంస్కృతి మన జీవన విధానం మీద చూసిన ప్రభావం సంక్షోభానికి దారితీస్తే, దాన్ని సవాలుగా తీసుకుని ప్రభవించిన పై ఉద్యమాలు ప్రతిక్రియగా కనిపిస్తాయే తప్ప, పాశ్చాత్య సంస్కృతిని పుణికి పుచ్చుకుని, స్వీయ సంస్కృతిని ఊచముట్టుగా కోల్పోయిన పరిస్థితి కనిపించదు.” ఈ లాంటి ప్రభావాలను స్థితులను వ్యక్తంచేయడానికి వ్యతిరేకించడానికి, ఉద్యమాలుగా స్థిరపడి కవిత్వం ప్రధానమాధ్యమంగా ఉంటుంది.

భారతీయ సమాజంలో జరిగే ప్రతి మార్పుకు తెలుగుసాహిత్యం ప్రతిస్పందిస్తూనే ఉన్నది. అది భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వ రూపంలో కాని కావచ్చు. లేదా మరో సంవాద రూపంలో నైనా కావచ్చు ఐతే నేను ప్రధానంగా తెలుగు సాహిత్యంలో అభ్యుదయ విప్లవకవిత్వాల మధ్యకాలంలో జరిగిన సంఘటనలను గురించినది ఈ పరిశోధనా పత్రం.

“స్వాతంత్ర్యానికి పూర్వం భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం విజృంభించాయి. స్వాతంత్ర్యానంతరం కూడా అభ్యుదయ కవిత్వం ఏడెనిమిదేండ్లు కొనసాగి 1955లో వచన కవిత్వంగా, 1965లో దిగంబర కవిత్వంగానూ,1970లో విప్లవ కవిత్వం గాను పరిణమించింది.” “1970 నుండి సుమారుగా 1980లు విప్లవ రచయితల సంఘం డామినేట్ చేసిన సంవత్సరాలు, విప్లవ కవిత్వం గురించి మొట్ట మొదటగా చెప్పుకోవలసిన విశేషం, ఇది ఇంతకు ముందు ఉద్యమాలవలె ఏవిధమైన పాశ్చాత్య ఉద్యమాల ప్రభావం లేదు సరాసరి జరుగుతున్న ఉద్యమంలో నుండి ఊపిరి తీసుకున్నది.”

ఐతే “1955లో ఆంధ్రలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజాస్వామ్య శక్తులు పునరేకీకరణ పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేక కూటమి ఐక్య సంఘటనగా ఏర్పడి. కమ్యూనిస్టు పార్టీని ఓడించింది.” దీనిలో “ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ఓటమితో అభ్యుదయ కవులు రచయితలు హతాశులయ్యారు. అభ్యుదయ రచయితల సంఘ కార్యకలాపాలు స్తంభించి పోయాయి. కవులు, రచయితలు సినిమాలలోకి, ఉద్యోగ వ్యాపారాలలోకి జారుకున్నారు.” అటు తరువాత కవిత్వంలో ఒక స్తబ్దత ఏర్పడింది. ఇక అప్పుడే 1955 నుండి 1970 వరకు గల కాలంలో ప్రధానంగా మూడు రకాల కవిత్వోద్యమాలు అంకురించాయి.

అవి : 1) వచన కవిత్వం
2) దిగంబర కవిత్వం
3) చేతనావర్తన కవిత్వం.

**వచన కవిత్వం :** “1930 తర్వాత తెలుగు కవిత్వపు బహిరాకృతిలో వచ్చిన మార్పు “వచన కవిత్వా”నికి వచన గేయం, వచన పద్యం, వచన కవిత, ఫ్రీవర్స్, వెర్స్‌లిబరే, స్వచ్ఛంద కవిత, ముక్త కవిత, మొదలైన పేర్లు వ్యాప్తిలోకి వచ్చాయిగాని వచన కవిత్వమనే పేరు స్థిరపడింది” ఈ విధంగా ప్రారంభమైన వచన కవిత్వానికి అభ్యుదయ కవిత్వ అంత్య దశలో జవసత్వాలివ్వడానికి “1955-1960 మధ్యకాలంలో కుందుర్తి వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంగా ప్రచారం చేశారు. ఇదో అత్యుత్సాహంలో చేసిన పని, కవిత్వ బాహిర స్వరూపాన్ని ఉద్యమంగా తలచకూడదు. From కంటే ఉద్యమానికి Contant ప్రధానం, కుందుర్తి స్థాపించిన ఫ్రీవర్స్ ఫ్రంట్ “వచన కవితా వికాసానికి మిక్కిలి తోడ్పడింది”. ఐతే వచన కవిత్వంలో వైవిధ్యం లేకపోతే నిలువలేదు అని గ్రహించిన కుందుర్తి ఆశ,శిక్ష ఏమిటి, ఆచార్ల గారమ్మాయి. లాంటి నాటికలు కూడా రచించారు. ఐతే శీలావీర్రాజులాంటి వారు వచన కవిత్వంలో కొన్ని కథా కావ్యాలు వ్రాశారు. కవిత్వం అనుభూతి ప్రధానమైనది. అది కథాబలంతో నిలవనక్కరలేదని తిలక్ మొదలైనవారు భావించారు. 1930లో ప్రారంభమైన వచన కవిత 1955-60లో ఒక ఉద్యమంగా మార్చేందుకు ప్రయత్నించదగిన వచన కవిత ఉద్యమంగా చెప్పడానికి అర్హమైందికాదని విమర్శకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**దిగంబర కవిత్వం:** ఎప్పుడైతే కుందుర్తి వచనకవిత్వాన్ని ఉద్యమంగా ప్రచారం చేయాలని ప్రయత్నించి విఫలమైనాడో అటు తరువాత 1965లో ప్రారంభమై 1968 వరకు

మూడేళ్ల పాటు సాహిత్యంలో మూడు సంపుటలతో గగ్గోలు పుట్టించిన తిరుగుబాటు దిగంబర కవులది" అభ్యుదయ రచయితల సంఘం నిర్వీర్య మైపోయాక ఏర్పడ్డ స్తబ్దతను బద్దలు చేసన్రావచ్చిన దిగంబర కవుల తిరుగుబాటు. అప్పటి సమాజంలోని కవుల రచనలు "ఏవీ జీవిత వాస్తవికతను పట్టుకోలేక పోయిన దుస్థితి ఏర్పడినప్పుడు వచ్చిన తిరుగుబాటు దిగంబర కవిత"

1956లో హైదరాబాద్‌లో "దిగంబరకవులం మేం మాది దిగంబర కవిత్వము, మాకవితలు "దిక్కు"లంటు" నగ్నముని(ఎమ్.హెచ్. కేశవరావ్), నిఖిలేశ్వర్ (యాదవరెడ్డి), చెరబండరాజు (బద్దం భాస్కర్‌రెడ్డి) మహాస్వప్న (కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు) జ్వాలా ముఖి (వీర రాఘవాచార్యులు) భైరవయ్య (మన్‌మోహన్ సహాయ్) అనే ఈ ఆర్గురు అభ్యుదయ కవిత్వానంతర స్తబ్దతను తొలగించిందని "షాక్ ట్రీట్ మెంట్" వంటి పద్ధతితో తమకు నచ్చని వాటిని తిడుతూ కవిత్వం రచించారు. దిగంబర కవులు తమ మొదటి సంపుటాన్ని హైదరాబాద్ నగరం అబిడ్స్ కూడలిలో 1965 మే 6వ తేది అర్ధరాత్రి నాంపల్లి పాండు అనే రిక్షా కార్మికుడి చేత ఆవిష్కరింపచేసినారు. రెండవ సంపుటిని 1966 డిసెంబర్ 18వ తేదీన విజయవాడ గవర్నర్ పేట సెంటర్‌లో హోటల్ క్లీనర్ జంగాల చిట్టి చేత, మూడవ సంపుటిని విశాఖ పట్నం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో 1968 సెప్టెంబర్ 14వ తేదీన ఎడమసూరి యశోద అనే బిచ్చగత్తె చేత ఆవిష్కరింపచేశారు. ఈ విధంగా అర్ధరాత్రుల్లో నడిబజార్లలో, అందరికి తెలిసిన, ఎవరికి పట్టని అభాగ్యులచేత ఆవిష్కరింపచేయడాలు సంచలనాలకి పబ్లిసిటీకి మాత్రమే పనికి వచ్చే పని అని తిలక్ మొదలైన అభ్యుదయ కవులే ఆక్షేపించారు. కానీ సాహిత్యంలో సాహిత్యవేత్తలలోను గూడు కట్టుకొన్న జడత్వాన్ని తొలగించటానికి యీ ఆవిష్కరణ సభలు కావ్య సంపుటాలు కొంతైనా తోడ్పడ్డాయి. అయితే డా॥ అనుమాండ్ల భూమయ్య దిగంబర కవులు " తమది దిగంబర కవిత్వం అని చెప్పుకున్నప్పటికీ ఇది ఉద్యమం కాదు దీనికి ఒక స్పష్టమైన నిర్దిష్టమైన లక్ష్యం లేదు అని చెప్పారు." కాని

అసలు దిగంబర కవిత్వ లక్ష్యం ఏమిటి? అన్నది మొదటి సంపుట ఉపోద్ఘాతానికి వీరు "దిగంబర కవుల శకంలోకి" అనే శీర్షిక పెట్టి తమ లక్ష్యాల్ని రాశారు. అందులో ముఖ్యమైన అంశాలివి :

"కీర్తి డబ్బు ఇనుప బూట్ల కింద పడి కొన ఊపిరితో గిలగిలా కొట్టుకుంటున్న మీ అసలు స్వరూపాన్ని ఎన్నడైనా ఒక్కనాడైనా చూసుకొన్నారా?"

మీరు జీవిస్తున్నది మీ జీవితంకాదు. మీముసుగునటనజీవితం, అధికారజీవితం, డబ్బుజీవితం గౌరవజీవితం వాటి కోసం పడిచచ్చి. వాటి కోసం ఏదైనాసరే చివరికి మిమ్మల్నిసైతం చంపుకునే దిక్కుమాలిన జీవితం. ఏం? ఈ ముసుగులేకపోతేనేం? స్వేచ్ఛగా అసలు రూపంతో బతకడానికి యత్నిస్తేనేం?

నువ్వులేవు నీ అధికారం లేదు, నీహోదాలేదు, నీ పంచ జరీ అంచు లేదు నువ్వు 24 గంటలు పదిలంగా మేకప్ చేసుకొన్న నీ ముసుగు లేదు.నీ పెళ్ళాం బిడ్డలు నీచుట్టూ గుమిగూడిన వాళ్లు నీ చివరి ఒంటరి బిక్కు బిక్కు క్షణాల్లో నిన్ను ఫూల్ చేస్తారు.

దేన్ని నమ్మకు, నీ లోపల ఈ ముసుగులోపల, ఈ వంచన అంచుల క్రింద ఉన్న నీ అసలు స్వరూపాన్ని నీ 'తనాన్ని' నమ్ముకో ఈ నాలుగు నిమిషాలు హాయిగా బ్రతుకు ఇది తెలుసుకొన్నప్పుడు ఇంత కాలం ఈ ముసుగు నిన్ను ఎంత వ్యర్థుడిగా చేసిందో తెలుస్తుంది. ఒక్కటి గుర్తుంచుకో ఇద్దరి మధ్య ఇన్ని ప్రపంచ ప్రకృతి కార్యకలాపాల మధ్య నిన్ను నువ్వు చీల్చుకున్న ఇన్నివేల ముసుగు ముఖాల మధ్య ఊపిరి సలపని పని బతుకు పోరాటం మధ్య నువ్వెప్పుడూ ఏకాకివి జనన మరణ యాతనల మధ్య పోరు సలిపే సైనికుడివి." అని చెప్పిన దానిలో ఈ కవుల లక్ష్యం స్పష్టంగా తెలుస్తుంది. "Hypocrisy లేని స్వచ్ఛమైన చిత్తశుద్ధి గల ఉన్నత మానవున్ని తయారు చేయడం ఈ లక్ష్యంతో పాటు exist entialist trend కూడా కనిపిస్తుంది. కొంత ఆధ్యాత్మిక స్పర్శ ఉంది."

ఈ కవులు షాక్ ట్రీట్ మెంట్ ద్వారా మార్పు తేవాలని ప్రయత్నించారు కాబట్టి " వీరి ప్రయత్నం వైయ్యక్తిక దృక్పథం కలది. గురజాడ నుండి అభ్యుదయ కవులకి అనుశాసనంగా వస్తున్న సామాజిక చైతన్యం కాదు. వారి రెండవ మూడవ సంపుటల్లో క్రమ క్రమంగా సామాజిక దృష్టి పెరిగింది."

అంతే కాక "ఈ దేశంలో యీ భూగోళంలో ఊపిరి పీల్చే ప్రతి మనిషి ఉనికి కోసం తపన పడి అతడి భవితని చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత" అని తమ కవితా స్వరూపాన్ని స్పష్టం చేసారు. ఈ భూగోళంపై దారిద్ర్యం, ఆకలి అలుముకుని వున్నంత వరకూ మార్క్సిస్టు దృక్పథాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికి లేదు" అంటూ " ఏ అచ్చాదనలకీ తలవొగ్గని ఏ భయాలకీ లొంగని నిరంతర సజీవ మానవుడికోసం ఎలుగెత్తి పిలుస్తున్నాం." అని తమలక్ష్యాలు ఆశయాలుగా చెప్పుకున్నారు. ఐతే వారు "కీర్తి డబ్బు ఇనపబూట్ల కింద అణగారిపోనున్న ప్రజలను ఆ స్థితి నుంచి రక్షించాలనేది వీరి లక్ష్యం"....... ... "స్వేచ్ఛా మానవుడి కోసం తపించిన వీరు, ప్రస్తుత సమాజం కుష్ఠు వ్యవస్థగా మారిందని, దాన్ని నాశనం చెయ్యాలని భావించారు. దిగంబర కవులు ఏదైతే చెప్పాలనుకున్నారో. వారికి నచ్చలేదో దానికి బూతును ప్రధానంగా ఎంచుకున్నారు. భావావేశంలో నాణ్యమైన కవిత్వాన్ని అందించారు."

"దిగంబర కవుల కవిత్వంలో సౌందర్యం కాని శ్రవణ సులభమైన పదయోజన గానీ లేదు. దిగంబర కవులు ప్రజల అంతరంగంలో వ్యాపించిన ఆరాటానికి వినుగుకు విశాదానికి స్పందించారు. సమాజంలోని రాజకీయాల్లోని కుళ్ళును దిగంబర కవులు చెరిగి పోశారు."

ఐతే కవితా రూపంలో కవితారంగ ప్రవేశం చేసి ఒక అలజడిని అరాచకాన్ని సృష్టించడమే వీరి ధ్యేయమైనట్లు వీరు ప్రకటించిన మొదటి ఖండిక (నిఖిలేశ్వర్) 'ఆత్మయోని' నిచూస్తే తెలుస్తుంది.

"నన్నయ్యను నరేంద్రుడి బొందలోనే
నిద్ర పోనియ్యి లేపకు
పీకనులిమి గోతిలోకి లాగుతాడు
ప్రబంధాంగనల తొడలు తాడి మొద్దులు
తాకితే కాళ్లు విరగ్గొట్టు
కుచములు ఎవరూ ఎక్కని పర్వతాగ్రములు
తలను ఢీకొని బ్రద్దలు కొట్టు
..../ పండితవర్యా రికార్డుల నోరుతిప్పకు
నవసృష్టిని కాలదన్నకు /
భావకవుల నపుంసక అహంభావాలకు సవాలు
అభ్యుదయ కవీ నల్లమందు తిని నిద్రపోయావ్
నయాగారా జలపాతంలో దూకలేకపోయిన
నన్నయ్యా ! గుడ్‌బై !

మీ కందరికి సలామ్ వాలేకుమ్
వచనం తేదు, కవిత్వం అంత కంటే లేదు
....." అంటూ

ప్రాచీన కవుల నుండి ఆధునిక కవుల వరకు అందరినీ దూషించడమే పనిగా పెట్టుకున్నటు కనిపిస్తుంది. ఐతే పరిశీలించి చూస్తే

నగ్నముని
ఉఁ లేముసుగు తొలగించు,
ఈ కంపు కొట్టే బట్టల్ని విప్పి
ఆత్మ ముందు నిలబడి
నిన్ను నువ్వు చూసుకో
మనిషిలా
మంచిగా
ఆకాశంలో – అవనిలో బతుకు అని అంటాడు.
నగ్నముని రసకవితల్లో "కాస్మిక్ జాతికోసం" కవిత (వివాదాస్పదమైంది)
కోడిపందాలకీ / గొర్రె పందాలకీ కుత్తుకలు తెగ్గేసుకునే ఓ ఆంధ్రదేశమా!
నీరోడ్లనీ / గొడ్లనీ / లారీల్నీ / మైకాగనుల్నీ / టెండర్లనీ / కాంట్రాక్టర్లనీ /
మాదాకవళం మేధావుల్నీ /
లంగామార్కు సినిమాలనీ / .........
ప్రణాళికల వ్రణాలపై మూగే ఈగల రాజకీయాల్నీ /... /
వేల సంవత్సరాల గొడ్రాలి సంస్కృతిని/
/ ..........కారంలో పొర్లించి రోకళ్ళతో

పట్టపగలు విషయించాలని ఉంది నుండి" అంటు ఎవరు జీర్ణించుకోని రీతిలో తమ భావాన్ని "షాక్ ట్రీట్ మెంట్" పేర వెళ్ళగక్కాడు. ''అశ్లీలం పలుకుతుంది దిగంబరాక్షరం అన్న నగ్నముని భూమిని వర్ణిస్తూ

"భూమి ముసలి వరిబీములా ఉన్నది
భూమి ఆంధ్రుల జీవితములా ఉన్నది
భూమి కవిసామ్రాట్టు తర్కంలా ఉన్నది
భూమి వచన కవితోద్యమంలా ఉన్నది
భూమి తెలుగు సినిమాలా ఉన్నది
భూమి ఎద్దు ప్రభుత్వంలా ఉన్నది
భూమి కడగని ఎండిన పీతి ముడ్డిలా ఉన్నది"

అని ఆవేశంతో చెప్పాడు, కాని ఆలోచనలో కాదు ఐతే నగ్నమునితానే "రిక్షా నుండి టీబీలోకి / ... పంచవర్ష ప్రణాళికల ప్రగతి ప్రకారం / అభివృద్ధి చెందుతున్నప్పుడు" శ్రమ జీవులకు అహింసా తత్త్వాన్ని బోధించుటలో అర్థంలేదని 'బుద్ధ క్షమాగీత'లో హెచ్చరించాడు.

ఒకనాటి త్యాగధనులు స్వాతంత్ర్యం వచ్చాక సుఖాల్లో మునిగిపోయి ప్రజలకు ద్రోహంచేస్తుంటే చూసి, గుండెలు బద్దలై విలపించిన గీతం 'తొడవిరిగిన తరం' అందుకే "నిజం రేజర్ లాంటిది / అది సిజర్ని సైతం క్షమించదు" అంటాడు నగ్నముని.

**నిఖిలేశ్వర్ :** తొలిసంకలనం తొలికవిత నిఖిలేశ్వర్‌వ్రాసినదే "ఎప్పుడు ఏడ్వలేనిదనీ" కవితలో

మరి ఎందుకలా నిన్ను నరుక్కొన్నావ్..../
అధికారాన్ని ఔపాసన పట్టినవాడ / ఎన్నడైనా/
గడపముందు ప్రశాంతంగా /
నిద్రించిన శవాన్ని చూశావా /
మనస్సు మమతల రాగాలలో /
ఒయాసిస్సు కన్నీళ్ళలో
నిండిందని తెలిసిందా?"

అంటూనే మరో కవితలో

"దేవుళ్ళకోసం – రాజుల సమాధులకోసం
బంగారు ఇటుకలతో గోడలు లేపే ఈ దేశంలో
మట్టి గోడల గోడు వినేవాడెవ్వడు" అంటూ

విగ్రహారాధనని, ధనికుల వ్యవహార శైలిని వ్యతిరేకిస్తు జనసామాన్యుల కోసం పడిన ఆరాటం కనిపిస్తుంది. "యువ మేధాసంపత్తిని కొల్ల గొట్టి ఈ తరాన్ని" నాశనం చేస్తున్నది. అధికారులు, రాజకీయ నాయకులేనని అంటాడు నిఖిలేశ్వర్

**చెరబండరాజు** నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడే కవిగా పేరున్నవాడు 'నన్నెక్కనివ్వండి బోను' కవితలో

"మనిషిమీద నమ్మకం పోగొడుతున్న మీరు
దేవుడిమీద ప్రమాణం చేయమంటారెందుకు?
దోషికి / నిర్దోషికి ఒకటే సూత్రం
వల్లించిందే వల్లించి వాదిస్తారు
ఫీజు కుడితి కుండలో /
న్యాయాన్ని ఎలుకలా ముంచేస్తారు...
మీరాత్రిచొక్కాలు పగళ్ళు నిలవవు
పగలు చొక్కాలు రాత్రి వుండవు...
ఆకలి కామం, కలలు, కన్నీళ్ళు
మనిషిలోని మర్మజ్ఞాన మంతా ఒకటే
దేశమేదైతేనే మట్టంతా ఒక్కటే
అమ్మ ఎవరైతేనేం? చనుబాల తీపంతా ఒక్కటే
బిక్కముఖాలతో చూస్తారేం?
పిచ్చి వాణ్ణిగా కేసుపుటప్ చేయండి

నన్నెక్కనివ్వండి బోను" అంటూ సామాజిక దురాగతాల్ని ప్రశ్నించే

ఈ కవిత వచన కవితలో అభివ్యక్తికి మరోదారి వేసి, సహృదయుల మనస్సుకు అత్తుకుపోయింది.

"ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది" కవితలో పల్లెను ముంచేసిన వరదను గురించి చెప్పుచూ.

"అప్పుడే పుట్టిన ఆవుదూడ /
లోతైన గోతిలో దిగబడింది /
ఎక్కడో కత్తి మెరుపు /
ఊరి ఎగువన తటాకం /
గుండె తెగి ప్రవహిస్తున్నట్టుంది/
ఒంటరి పాలేరు గుండె పూరింటిలో/
దూలం విరిగి గోడకూలి/
బంధాను బంధాల తాటాకులు /
గాలిలో ఎగురుతున్నాయ్/
కాపరి హృదయంలో ఏదో /
కన్నీటి ఊయల కదలాడింది"

అని వర్ణించాడు ''ఆధునిక కాలంలో చెప్పదగిన ఉత్తమ గీతాల్లో ఇదొకటి"[14] అని చెప్పవచ్చు.

''వందేమాతరమ్'' గీతములో ఆవేశంగా దేశంలోని దౌర్భాగ్యస్థితి వర్ణించబడింది. అందుకే ఈ గీతం దేశ భక్తులకు తీవ్రమైన ఆగ్రహాన్ని కలిగించింది.

"ఓ నాప్రియమైన మాతృదేశమా/ తల్లివి తండ్రివి దైవానివి నీ వేనమ్మా / దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది / అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది / సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది / ఊసినా దుమ్మెత్తి పోసినా చలనం లేని మైకం నీది / కోత కొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న / ఎలకల్నీ పంది కొక్కుల్నీ భరిస్తూ నుంచున్న 'భారతి "వమ్మ / నోటి కందని సస్యశ్యామల సీమవమ్మా / వందేమాతరం వందేమాతరం / ఒంటి మీది గుడ్డలతో జండాలు కుట్టించి / వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం నీది / అప్పుతెచ్చి లేపిన మిద్దెల్లో / కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది /ఎండిన స్తనాల మీదికి ఎగబడ్డ బిడ్డల్ని / ఓదార్చలేని లోకంనీది / ఆకలికి ఎండి మాడి / ఎరువు సొమ్ములతో వీధిన బడ్డ సింగారం నీది / అమ్మా / భారతీనీగమ్యం ఏమిటి తల్లీ / వందేమాతరం, వందేమాతరం'' అంటూ భారతమాత స్థితిని నిజాయితిగా వర్ణించాడు. నేటికి అదే స్థితిలో భారతమాత కునారిల్లు తున్నది.

**మహాస్వప్న :** వాడిగా ఒడుపుగా సంధించిన ఖండిక ఇది

"కలియుగం రేడియో గ్రామ్‌లో
గిరగిరతిరుగుతున్నా
క్రీ.శ. ఇరవయ్యో శతాబ్దం రికార్డు మీద పిన్నునై
మానవత రెండు కళ్ళూ మూసుకపోయినప్పుడు
విప్పుకుంటున్న మూడోకన్నునై
కాలం వాయులీనం మీద కమానునై
చరిత్ర నిద్రా సముద్రం మీద తుఫానునై
నేను వస్తున్నాను
దిగంబరకవిని
రాత్రి ఉదయిస్తున్న రవిని" అంటూ
చెప్పుకున్నాడు. అంతేకాదు
"రాజకీయాల్లో / ధర్మాశాస్త్రాల్లో /
వీర్యస్కలనం చేసుకున్నాను
భూగోళాన్ని శిశ్న శిఖరాగ్రం మీద నిలబెట్టాను"
అంటూ దిగంబరకుల్లోని ''షాక్ ట్రీట్ మెంట్"ను ప్రదర్శించాడు.

**జ్వాలాముఖి :** ఇతని కవితలు సుదీర్ఘంగా ఉంటాయి. అయినా అంశాల వారి క్లుప్తత, గాఢత ఉండనే ఉంటుంది.
"సూర్యస్నానం" కవితలో
"చచ్చిన రాజుల పుచ్చిన గాథల
మెచ్చే చచ్చు చరిత్ర కారులను
ముక్కు చెవులు కోసి అడగాలనుంది
మానవ పరిణామ శాస్త్రం నేర్పిందేమని ?
........
సమస్యలకు లోతులు తీసి
సామాన్యులను లోతుల్లోతోసి
నిర్లప్తతతోనే నిప్పును రాజేస్తూ
అనంత అమాయక మానవజాతిని అనాదిగా/
అధ్వాన్నముగా
పరిపాలించే పిడికెడు మేధావులకు
పిరామిడ్లు కట్టాలనుంది"

అంటూ వారిపై గల అక్కసు వెళ్ళగ్రక్కాడు అంతే కాదు ఆవేశాన్ని హద్దులో ఉంచుకుంటూనే...
"స్వార్థపరత్వపు వేశ్యారతిలో
ఆనంద పరబ్రహ్మ స్వరూపాన్ని చూస్తూ
అసలు కర్తవ్యాన్ని వదిలేస్తున్నాం
"అజ్ఞానపు తిమిరం నమిలేస్తున్నాం"

అంటూ సంచలనతను కొనసాగించాడు. అంతేకాకుండా "కిలకించితం" లో మత చాందసాలపై ధ్వజమెత్తాడు, మహాత్ముల త్యాగఫలం వ్యర్థమైందని విచారాన్ని వెలిబుచ్చుతూ వచ్చాడు.
"మతాలు – వ్యాపార మందిరాల్ని
అహంకారాల మసీదుల్ని
ఆడంబరాల చర్చల్ని
అందంగా తెరచి
సామాన్యులను లేవకుండా చరిచి
మౌఢ్యాల సమాశ్రయణాలు వేసి
సాంప్రదాయాల
బంజర్లలోకి సాగనంపుతున్నాయి
సమాజం కొలనులో అశుద్ధాన్ని
శాశ్వతంగా కలుపుతున్నాయి."

అంటూ తన ఆలోచనాపరంపరను కొనసాగించాడు.

**భైరవయ్య :** షష్ఠి పూర్తి, కరువు బిచ్చం లాంటి గంభీరతకలిగిన లోతైన భావాజాలంగల కవితలను వ్రాశాడు. ఐతే "దిగంబరి" అనే కవితలో దిగంబరకవిత్వం ఉద్దేశ్యం ఏమిటో, ఎవర్ని ఉద్దేశించి వ్రాయబడిందో వివరిస్తూ –
"మీ గుండెలు కుతకుత ఉడుకెత్తాలి
ఉడుకెత్తిన గుండెల్లో కొత్త రక్తం పుట్టాలి
మీ మస్తిష్కంలో నిర్మించుకున్న
అడ్డు గోడలు పగల కొట్టాలి
అంటు వ్యాధిలాంటి
అజగరంలాంటి
గొంగళి పురుగు భావాలు భస్మం చెయ్యాలి
మొహమాటంతో కట్టుకున్న బట్టల్ని
ఒంటరిగానైనా నగ్నంగా నిలబడి
మీలోకి చూసుకోవాలి
ఎరువు తెచ్చుకున్న మెదడుతో
ముట్టుకు చూడకండి
చూడకండి కుళ్ళి పోయిన కళ్ళతో

"అంటూ ఒక నిజాన్ని యదార్థాన్ని, సత్యాన్ని చూడాలంటే తెలుసుకోవాలంటే తమలోని తమ భావాల్ని పక్కకు పెట్టి చూడాలి, దానికి ధైర్యం కావాలంటాడు భైరవయ్య.

దిగంబర కవులు ఎంతటి ప్రతిభతో కవిత్వాన్ని వ్రాస్తారో తెలుస్తున్నది ఐతే వారు ''షాక్ ట్రీట్‌మెంట్'' పేర అశ్లీలాన్ని చొప్పించారు. అదే వారిపై తీవ్ర విమర్శకు కారణమైంది కూడా. అరుద్ర దిగంబర కవిత చదివి " మహా బలిపురంలో పెద్ద అలలు వచ్చి మొఖానికి తగిలితే కలిగిన షాక్ వంటి అనుభూతిని పొందాననన్నాడు.''కుందుర్తి, సోమసుందర్, తిలక్ మొదలైనవారు దిగంబర కవిత్వాన్ని నిరసించారు.

రాచమల్లు రామ చంద్రారెడ్డి "వీళ్లు ఆరు మంది అరిషడ్వర్గంలాగా ... యీ సంపుటిలో దిక్‌లు చాలానే వున్నాయి. కవిత్వం మాత్రం ఎక్కువలేదు" అని నిందించారు. "వీళ్ల రచనలు చదివితే అసహ్యం వేస్తుంది. ఆ తిట్లూ, ఆ బూతులూ, ఆ ఆటవిక, ఆవేశము, ఆ వొళ్ళెరుగని సంస్కారమూ, ఆ నోటి తీట, ఆ మాటల కంపు మనకు జుగుప్స కలిగిస్తాయి." ఐతే వీరు దిగంబర కవుల నీతి నిజాయితీల్ని ప్రతిభని వారి కవిత్వంలో ఆస్వాదించలేక పోయారు. అయితే "అందమైన వేషంతో అసలైన కవిత్వం కాకుండా ఉత్తమ కవిత్వంగా చెలామణి కావడాన్ని సాహిత్య చరిత్రలో చూస్తున్నాం. ఇలాంటి వేషాలవారి కవిత్వంమీద తిరుగుబాటుగా తెలుగులో వచ్చింది దిగంబర కవిత్వం." అని ఆర్వీయస్ సుందరం అన్నాడు. వోటూరు హనుమంతరావు ఒక వివరమైన విమర్శ రాశారు.

"దిగంబర కవులు ఉపయోగించిన అశ్లీల పదాలు, వర్ణనలు కామోద్రేకాన్ని కలిగించవు. జుగుప్స కలిగిస్తాయి. ఆ జుగుప్స వర్తమాన సమాజంలో ఉన్న హేయమైన పరిస్థితుల వల్ల జనించిందే'' అంటూ డా॥కడియాల రామమోహనరావ్ చెప్పే ధైర్యం చేశారు. ఇక ఒక శ్రీశ్రీ గారు మాత్రమే దిగంబర కవుల కవిత్వాన్ని ఆహ్వానించాడు. ఆంగ్లంలోకి అనువాదం కూడా చేశాడు.

**చేతనావర్తం :** దిగంబర కవిత్వం రెండవ సంపుటి (1966) వెలువడిన తరువాత ఒక సంవత్సరానికి (1967) చేతనావర్తం మొదటి సంచిక వెలువడింది. పేర్వారం జగన్నాథం, వే.నరసింహారెడ్డి, కోవెల సంపత్కుమారాచార్య, కోవెలసుప్రసన్నాచార్యలు చేతనావర్తం కవులు. వీరు తమ రెండవ సంచికను 1970లో ప్రచురించారు. 1977లో వే.నరసింహా రెడ్డి మరణంతో చేతనావర్తం సంకలనాలు ఆగిపోయాయి.

చేతనావర్తన కవుల గురించి కొవెలసుప్రసన్నాచార్యుల మాటలనే "ఈ సంకలనం యొక్క ప్రత్యేకత ఏమైనా ఉన్నదా? అంటే ఏదో ఒక సూత్రం ఈ కవులందరినీ ఏకీకృతం చేస్నున్నదని అంగీకరించాల్సి ఉంటుంది. ప్రాధాన్య భావవిశ్లేషణ చేసే వీళ్లందరూ ఒకే తత్వానికి చెందినవారు కారు. ఒకే అభివ్యక్తి మార్గానికి చెందినవారు కారు. కావాలని వచన కవితా ప్రక్రియయే పరమార్థమన్న ఊహకలవాళ్లు

కారు వీళ్లను ఐక్యం చేస్తున్నది ఆధునిక చేతన" అని చెప్పుకున్నారు. అంతేకాదు "మానవజీవితం ఐహికలోకం, భావలోకం, ఆధ్యాత్మికలోకం అని మూడు విధాలుగా విభజించవచ్చు సమగ్రమైన మానవ వికాసానికి అన్నిరంగాల సమన్వితమైన వికాసం అవసరం పాక్షిక దృష్టి అభివృద్ధి హేతుకం కాదు. ఈ సమన్వితికోసం ఈ కవులు భావిదర్శనం చేస్తున్నారు. ఈ దర్శనం వీళ్లను కవితారూపాన బందిస్తూవున్న ఏకీకృతి''. అంటూ సుప్రసన్నాచార్యులు చేతనావర్తం లక్ష్యాలను కలంపట్టడానికి కారణాన్ని వివరించారు.

సంపత్కుమారాచార్యులు చేతనావర్తం రెండవ సంచిక సంపాదకులుగా వ్యవహరిస్తూ (అనుశీలనలో) '' ఇది చేతనావర్తనం కవితా సంకలనాల క్రమంలో రెండవది నిరంతరాన్వేషణ, ప్రయోగశీలమూ, ప్రయోజన దృష్టి ఆసరాగా ఆధునిక తెలుగు కవితా మార్గాల్లో పురోగమిస్తున్న నలుగురు యువకవుల కవితలు ఈ సంకలనాలు. ఈ నలుగురిది ఒకే గొంతు కాదు. అభివ్యక్తి మార్గాలు కూడా భిన్నమయినవి. రీతులు వేరువేరయినయి. 'వచన పద్యం' కవితా వాహికగా సామాన్య రూపంలో స్వీకరించుట మన్నదొక్కటి తప్ప మిగిలిన కవితా సామాగ్రి విషయంలోనూ వైవిధ్యం చాలా ఉన్నది. అయితే, ఈ విధమయిన బహువిషయ వైవిధ్యం ఉన్నాగూడా వీరందరినీ ఏకంచేసే సూత్రం ఒకటి ఉన్నది. అది ఆధునిక భావ చైతన్యం ఈ కవిలో సంకలనాలో ఈ నలుగురు ఒక చోటికి రావడానికి ప్రాధాన్యం వహించిన దృష్టి ఇదే" అని వివరించాడు.

ఐతే చేతనావర్తనం మొదటి రెండవ సంచికల్లో ప్రత్యక్షంగా దిగంబర కవిత్వానికి వ్యతిరేకంగా వ్రాస్తున్నట్టు ఎక్కడా ప్రకటించకోలేదు.

ఐతే డా॥పేర్వారం జగన్నాథం చేతనావర్తం రజితోత్సవ సంచికలో "చేతనావర్తం దాని నేపథ్యం" అనే వ్యాసంలో "దిగంబరులు" అపూర్వమైన అరాచక పరిస్థితుల్ని సృష్టించి అనాగరికంగా చేస్తున్న లొల్లిని అరికట్టి మళ్ళీ తెలుగు కవిత్వాన్ని సువ్యవస్థీకరింపవలసిన బాధ్యత ఉత్తమ సాహిత్యకారులపై పడింది. దిగంబరుల వికార ప్రవృత్తులను విద్దూరపు చేష్టలను ఖండించి, కళల్నీ, కవిత్వపు విలువల్నీ ఉద్ధరింపవలసిన అవసరం ఏర్పడింది. అందుకే ఆనాటి చారిత్రక సందర్భం, సామాజికపరమైన ఒత్తిడి కారణంగా కటిక చీకట్లనుంచి కారుమేఘాల నుంచి చీల్చు కొని వచ్చే కాంతి పుంజంలో చేతనావర్తం ఆవిర్భవించిందని" పేర్కొన్నాడు కాని అలాగని చేతనావర్తనం మొదటి రెండవ సంకలనాలలో దేనిలోను స్పష్టంగా వ్యక్తం చేయబడిలేరు. కాని మొదటి సంకలనంలో "దిగంబరకవులను కవిత్వ చేష్టల్ని వ్యతిరేకిస్తూ" యదాయదాహి ధర్మస్యగ్లానిర్భవతి భారతి" అనే ఏకైక ఖండిక అధిక్షేపాత్మకంగా వ్రాయబడి మాత్రమే ఉన్నది."ఈ దిగంబర కవుల అల్లరికి హద్దువుడికి నిరసనగా 1967లో చేతనావర్తన కవులు సంఘటితంగా ముందుకు వచ్చారు." అని కోవెల సంపత్కుమారాచార్య అన్నారు. డా॥ముదిగంటి సుజాతారెడ్డి " దిగంబర కవులను అనుకరిస్తూ పైగంబరకవులు, తిరుగుబాటుకవులు, చేతనావర్తనకవులు బయలుదేరారు " అంటూ దిగంబర కవిత్వం తరువాత వచ్చిన సమూహ కవులను తృణీకరించినట్టు కనిపిస్తుంది.

పేర్వారం చేతనావర్తం గురించి చెబుతూ''... ఈ ప్రయత్నం ఒక ఉద్యమస్థాయిని అందుకునే తరుణంలోనే 1970లో విరసం ఆవిర్భవించింది. ఒక మహోజ్జ్వల కవిత ప్రస్థానంలో ఇది మరో విఘాతం." మరోచోట "చేతనావర్తం కవుల్లో ఒకడైన శ్రీవే.నరసింహారెడ్డి 27-01-1973 నాడు అకాల మరణం పాలైన తరువాత తమ సంపుటలు వెలువడలేదు" చెప్పుకున్నారు... అంతేకాక దిగంబర కవులగురించి అంటూనే "కవిత్వాన్ని అల్లరిపాలు చేసింది. దీనికి భ్రాంతి జన్యమైన ఒక వైదేశిక సామాజిక సిద్ధాంతం ఊతంగా ఉండడంవల్ల కొందరు రచయితల్ని ఆకర్షించుకోగలిగింది. దీని వల్ల గుడ్డిలో మెల్లలాగా ఒక మంచి పని జరిగింది. ఈ దెబ్బతో దిగంబరులు అంతర్థానమై నారన్నాడు.'' అసలు సత్యమేమిటంటే చేతనావర్తం మూలంగా దిగంబర కవిత్వం అంతర్థానం కాలేదు. 1968లో మూడవ సంపుటి ప్రకటించే నాటికి నగ్జల్బరి పోరాటం ఆంధ్రప్రాంతంలో శ్రీకాకుళం జిల్లాలో పాకింది. వ్యక్తిస్వేచ్ఛ గురించి దిగంబర కవుల్లో అంతర్మథనం ప్రారంభమైంది. దిగంబరకవుల్లో చీలికకు కారణమై, దిగంబర కవిత్వము అంతమవ దానికి కారణమైంది. నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, నగ్నముని 'వామపక్ష రాజకీయాల పట్ల ఆకర్షితులై' విప్లవ రచయితల సంఘం ఏర్పాటుకు తోడ్పడ్డారు. మహా స్వప్న, భైరవయ్యలు వ్యక్తి స్వేచ్ఛను వదులుకోవడం ఇష్టంలేక విప్లవ రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు.

"దిగంబరులు వ్రాసింది వచన కవిత్వమే అయిన దానిని 'దిక్' సంజ్ఞతో పిలవడం చేత అది వారి దృష్టిలో వచనం కాకుండా పోయింది." అని వి.వి.యల్. నరసింహారావు గారు అన్నారు. అయితే దిగంబరకవుల మూలంగా వచన కవిత్వం వృద్ధిలోకి వచ్చిందంటూ చేకూరి రామారావు "కవి కొండల గారి 'నక్కా సామి...' అనే వచన కవితా ఖండికను రచించారని, అదే తెలుగు సాహిత్యంలో మొదటి వచన ఖండిక అని ఆరుద్ర సూచించారు. వచన కవిత్వం పేరుతో పఠాభిగారు 1944 ప్రాంతంలో ప్రచారంలోకి తెచ్చారు. కుందుర్తి దానికి ఉద్యమ స్థాయి కల్పించారు. 1960 తరువాత దిగంబర కవుల వాడకంతో దీనికి స్థైర్యం కలిగింది" అని అన్నారు. అయితే "తెలుగు సాహిత్యంలోని ఒక సంధి యుగములో జడత్వాన్ని తొలగించి సాహితీ పరుల నరాలలో నిప్పు రగిలించి విప్లవ ఝంఝూ వీచటానికి దిగంబర కవిత్వం తోడ్పడింది."

''దిగంబర కవులు రాకపోతే అభ్యుదయ కవులు శక్తి కోల్పోయినపుడు ఏర్పడిన స్తబ్దత చెదిరి పోయేది కాదు వచన కవులు వైవిధ్యం కోసం ప్రయత్నం చేసినా, రాత్రి కవితా సంకలనాలతో కవులు కవితావేశాన్ని ప్రకటించినా పెద్ద మార్పు వచ్చేది కాదు. సమాజపరిస్థితులను చూసి రోత పుట్టి, జుగుప్స కలిగించే విధంగా తిడుతూ దిగంబర కవులు రాయకపోతే యువకవులు కర్తవ్యాన్ని గుర్తించేవారు కాదు." అభ్యుదయ కవిత్వయుగం తరువాత సాహిత్యంలో వచ్చిన జడత్వం ఛేదించబడిందంటే దిగంబర కవిత్వమే కారణంగా చెప్పవచ్చు. ఈ సంధి యుగం కాలంలో ఒక సంచలన సంఘర్షణ కారణంగానే తెలుగు వచన కవిత్వం ఉన్నత శిఖరాలకు చేరే మహాదృష్టం కలిగింది. ఇది ఎవరూ కాదనలేని చారిత్రక సత్యం.

ప్రసంగ పత్రం

# స్త్రీల రచనలలో మానవ హక్కులు, నైతిక విలువలు



**స్త్రీల రచనలు ఎక్కువగా హృదయగత స్పందనగా కుటుంబ పరిధి పరామర్శంగా ఉంటాయనీ, స్త్రీ సహజంగా మృదు స్వభావి. సహనమూర్తి. క్షమాగుణభరిత వంటి లక్షణాలు 'ప్రోఢి' అనీ, అవే సాహిత్యంలో తొంగిచూస్తాయనే అభిప్రాయం లోకాన స్థిరపడి, సాహిత్య లోకాన ఉంది. స్త్రీల రచనల్లో ఆ కోణం ఉంది. కేవలం ఆ లక్షణమే కాక లోకం చూడని కోణమూ ఉంది. లోకం ఇప్పుడు చూస్తున్న విప్లవాత్మక ఆలోచనా ధోరణి ఉంది.**

**డాక్టర్ కొలకలూరి మధుజ్యోతి**

**ఆ**ధునిక సాహిత్యం, అందునా స్వాతంత్ర్యానంతర గణతంత్ర దేశంలో సాహిత్యం అంతా నూతన విలువల ఆదర్శాల ప్రతిఫలనం. ఈ దేశపు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు. బాధ్యతల పునాదిపై సాహిత్యం వినిర్మితం. నేటి సాహిత్యం అంతా "Liberty Equality Fraternity'' అనే అంశాల సమాహారమే. స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాతృత్వాల నీడలో వికసించే, వికసింపచేసే మానవ ప్రాధా న్యమే ఈనాటి సాహిత్యం. నేడు కూడా వస్తున్న సంప్రదాయ సాహిత్యం మినహా మిగిలిన సాహిత్యం వ్యక్తిని గుర్తించింది. మనిషిని నిలిపింది. మనిషి మనుగడ కోరింది. పూర్వ సాహిత్యం దేవుడు, రాజు, రాజ్యం, సమాజం వంటి వాటికిచ్చిన ప్రాధాన్యం మనిషికి ఇవ్వలేదు. ఆయా అంశాల పరిరక్షణలో మనిషి గుర్తింపు పొందలేదు. మనిషికి ప్రాధాన్యం లేదు. మనిషిగా గుర్తింపబడినా అది సమిధ అయిన స్థితిలోనే తప్ప వైయక్తిక ప్రాధాన్యం లేదు.

ఆధునిక సమాజం ఫ్రెంచి, రష్యా విప్లవాలు ప్రపంచ వ్యాప్త మార్పులు, ప్రపంచ యుద్ధాలు, భిన్న పరిధులలో, భిన్న ప్రాంగణాలలో చాటిన సత్యం గుర్తించిన వాస్తవం. మనిషి మనుగడ ఈ సంఘర్షణ లలో లుప్తమైపోతున్న, నాశనమైపోతున్న మానవ ప్రాధాన్యం ప్రశ్నార్థకమై నిలిచింది. అలాంటి సందర్భం ప్రపంచమంతటా వర్తించడం వలన ఉద్భవించింది మానవ హక్కుల ప్రకటన.

ఇది ప్రపంచవ్యాప్తంగా దేశ, ప్రాంత, వర్ణ వివక్షలకు అతీతంగా ప్రతి మానవుడికి వర్తింపచేసే హక్కులు అయితే, ఈ దేశం తన పౌరులకు వర్తింపచేసేవి ప్రాథమిక హక్కులు. ప్రతి పౌరుడికి ఈ దేశం రాజ్యాంగం ఇచ్చిన హక్కులు – సమానత్వపు హక్కు, స్వాతంత్ర్యపు హక్కు, దోపిడీని నిరోధించే మత హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు, ఆస్తి హక్కు, రాజ్యాంగ పరిరక్షణ హక్కు.

**II.** హక్కులు బాహిరం, దాని అమలుకు పరిరక్షణకు వెనక రాజ్యం అమలు చేసే చట్టం ఉంది. హక్కుల అమలు తప్పనిసరి. నైతిక విలువలు ఆంతరికం. వాటికి నియమ నిబంధనలు స్థిరీకృతంగా ఉండవు. వాటి అతిక్రమణ ఫలితాలు కాలానుగుణాలు.

నీతిని మానవ సమూహం పాటిస్తుంది. ఒక నిర్ణీత సమాజంలో కొనసాగుతూ ఉంటుంది. దాని అమలుకు బలవంతపు ప్రయత్నం ఉండదు. పరిరక్షణకూ నిర్దిష్ట నియమాలు ఉండవు. నిశ్శబ్దంగా జనించి, నిశ్శబ్దంగా శాసిస్తుంది. మానవ సమాజాన్ని నైతికత సమాజంలో ఉంటూ సమాజంలో అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది.

III. తెలుగు సాహిత్యంలో హక్కులు, నైతిక విలువలు బాహ్యాంతర విభక్త అస్తిత్వాలు కావు. సాహిత్యంలో ఈ రెండింటి మిశ్రమ ప్రతిబింబాలు కనిపిస్తాయి. వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వ భావనలకు, భిన్నంగా నైతికత ప్రదర్శింపబడటం, చూడటం అరుదు. బాహ్యాంతరాంశాలైన హక్కులు, విలువలు కలగలసి ఉండటమో, ఒకటి మరోదాన్ని ప్రభావితం చేయటమో, ఒకదాని కారణంగా మరొకటి ఛిద్రమై పోవటమో జరుగుతుంది. ఈ రెండూ అవిభక్తం అనీ అనటం అందుకే.

స్త్రీల రచనలు ఎక్కువగా హృదయగత స్పందనగా కుటుంబ పరిధి పరామర్శంగా ఉంటాయనీ, స్త్రీ సహజంగా మృదు స్వభావి. సహనమూర్తి. క్షమాగుణభరిత వంటి లక్షణాలు 'ప్రోఢి' అనీ అవే సాహిత్యంలో తొంగి చూస్తాయనే అభిప్రాయం లోకాన స్థిరపడి, సాహిత్య లోకాన ఉంది. స్త్రీల రచనల్లో ఆ కోణం ఉంది. కేవలం ఆ లక్షణమే కాక లోకం చూడని కోణమూ ఉంది. లోకం ఇప్పుడు చూస్తున్న విప్లవాత్మక ఆలోచనా ధోరణి ఉంది.

వీరి రచనల్లో ఆవేదన ఉంది. ఆలోచన ఉంది. చైతన్యం ఉంది. ప్రశ్నించడం ఉంది. ధిక్కరించడం ఉంది. వీటన్నిటి వెనక హక్కుల విలువల నేపథ్యం ఉంది. మానవ హక్కులను నైతిక విలువలనే పరీక్షకు పెట్టడం ఉంది. మానవ హక్కుకు భంగం కలిగించే నైతికతలోని లోటుపాట్లను కోణానికి ఉన్న ఏకపార్శ్వతను ఎత్తిచూపటం ఉంది.

**(1)** 'మాతృదేవోభవ' పూర్వ సంస్కృతి. తల్లిని గౌరవించడం భారతీయ సంస్కృతి. కాలం మారింది. సమిష్టి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అయింది. తల్లిదండ్రులను బరువుగా పరిగణించే స్థితి వచ్చింది. మనిషిగా గుర్తించే పరిస్థితి లేదు. ఈ వాతావరణంలో పరాయి దేశ పోకడలను అనుకరిస్తూ తల్లిని గూర్చి చేస్తున్న హడావుడిని నిరసిస్తూ 'సావిత్రి'

"మాకీ దినోత్సవం వద్దు" రాసింది. మదర్స్‌డేకి నిరసన ఇది. స్త్రీని, తల్లిని నిర్దయగా చూస్తూ ఆ ఒక్కరోజు కీర్తించే సంస్కృతికి ఇది నిరసన.

"కనిపెంచినందుకీ వొక్కరోజే దుఃఖించి
యేడాదంతా యెడతెగని పోరు చేస్తాను
నువ్వు కరచాలనం చేసేదాకా
కరవాల చాలనం చేస్తూనే ఉంటాను"

**(2)** పురుష ప్రపంచం, పితృస్వామిక వ్యవస్థ ఏర్పరచిన నియమాలతో సాగే సమాజం ఇది. ఆ సమాజం నిర్దేశించే నైతికత కూడా అంతేను. పురుషుడేర్పరచిన, పురుషుడు తీర్చిదిద్దిన ఏకపక్షపు నియమాల పట్ల నిరసన, దాని ధిక్కరణ స్త్రీల రచనల్లో కనిపిస్తుంది. (ఫెమినిస్ట్ మానిఫెస్టో).

"మాకు దృష్టి ఉంది
అది స....ష్టి కాకపోవడం వల్ల
సాంసారిక రహస్యాల రక్షణ పేరిట
నేత్రాన్నీ, గాత్రాన్నీ నొక్కి వుంచడం వల్ల
ఇన్నాళ్ళూ మేం గొంతు విప్పలేదు.
పురుష ప్రపంచం విధించిన ధర్మాలు తప్పలేదు
ఇప్పుడు మమ్మల్ని ప్రశ్న వేధిస్తోంది
అహోరాత్రులూ అస్తిత్వపు సమస్య బాధిస్తోంది"

అంటూ ఘంటశాల నిర్మల నైతికతను నిర్దేశించే నియమాలను ప్రశ్నిస్తూ ఉంది. ఇలాంటిదే "వసంత కన్నబిరన్" వ్యక్తం చేస్తుంది.

"పొయ్యికీ, పెనానికీ మధ్య వేలాడే
నా అవిశ్వాసాన్ని వదలకుండా
పాటలతో, కథలతో, గాథలతో, చిత్రాలతో
నిన్ను విశ్వసించేలా
మెత్తగా మర్యాదగా వంచించావు"

(శరీరం)

పురుషుడికి కావలసిన విధంగా స్త్రీ ఎలా తీర్చిదిద్ద బడుతుందో, అది కథలు, పాటల ద్వారా ఎలా స్థిరపడుతుందో, మనిషిగా సంపూర్ణంగా వికసించవలసిన స్త్రీ పురుషుడికి అనుగుణంగా ఎలా వికసింపబడుతుందో చెప్తూ ప్రశ్నించింది.

**(3)** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని నేడు ప్రభుత్వం చెబుతుంది. రాజ్యాంగం చెబుతుంది. 14 ఏళ్ళ లోపు పిల్లలకు నిర్బంధ విద్య కూడా ఉండాలనే మాటా ఉంది. అయినా చిన్న పిల్లలతో పనులు చేయించటం, వారి పట్ల దురుసుగా, కరుకుగా

— — — — * * * — — — —



**దేశమో, రాష్ట్రమో మాత్రమే కాదు. మానవుల మనశ్శరీరాలనే కాదు ఆత్మలను కూడా ఆక్రమించుకున్నది. ఈ ప్రపంచీకరణ, దాని దుష్ఫలితాలు ఎన్నెన్నో. అది మనుషుల మధ్య ఎంత దూరం తయారు చేస్తుందో "ఇన్‌స్టెంట్ లైఫ్" కథలో కుప్పిలి పద్మ చక్కగా వివరించింది.**

— — — — * * * — — — —

ఉండటం, హృదయం లేని యాజమాన్య వైఖరి సమాజంలో నిత్యం ప్రతిఫలిస్తూనే ఉంటుంది. పసివారి పట్ల జాలి, ఆర్ద్రత సాహిత్యంలో కనిపిస్తూనే ఉంటుంది.

"బూరలా పొంగవలసిన ఆ బాలవదనం
ఆకటి చిచ్చులో కాలిన వంకాయలా
ముడతలు పడి ముడుచుకుపోయింది
పెరిగే మొక్కలా పెరగవలసిన ఆమె శరీరం
రాను రాను కురుచై నేలకు వంగిపోతుంది"

(ఇంకా తెల్లవారలేదు)

కుప్పిలి పద్మ రాసిన "స్వేచ్ఛ విహంగం" అనే కథలో పసివాడిని చూసు కోవడానికి వచ్చిన "నందు" అనే పనిపిల్లవాడు తన స్వేచ్ఛకు అణచివేతకు కారణమనే దృష్టితో పసివాడిని చంపివేసి వెళ్ళిపోవటం ఈ దుర్వ్యవస్థ వికార రూపానికి నిదర్శనం.

**(4)** వేశ్యావృత్తి పట్ల సమాజ వైఖరి అందరికీ సుపరిచితమే. ఇది నాణేనికి వ్యక్తమవుతున్న ఏకముఖం, ఎంతగా అసహ్యాన్ని వెళ్ళగక్కారో ఆ వృత్తి పట్ల, దాన్ని పోషిస్తున్న సమాజ సభ్యులు ఆ వికార అసహ్యాలు మరో ముఖాన్ని – ఆ నాణేనికి ఉన్నా చూడనివ్వలేదు. అది ఆ వృత్తిలో ఉన్న స్త్రీల కోణం. ఆ స్త్రీల మనోభావాలు, ఆ స్త్రీల వ్యథలు సమాజం పట్టించుకోని, పట్టించుకోవడానికి ఇష్టపడని ఎన్నో అంశాలను వ్యథగా, వ్యంగ్యంగా స్త్రీలు శక్తివంతంగా చిత్రించారు. అనైతికతకు పరాకాష్టగా భావించే వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీల పట్ల సమాజం వర్తించే తీరులోని నైతికతను ప్రక్కకు పెట్టారు. వారిని మనుషులుగా సైతం గుర్తించక హింసించే స్థితిని దయనీయంగా "మెహందీ స్త్రీల విజ్ఞప్తి"లో ఓల్గా చాటితే, ఆ స్త్రీల పిల్లల బాధలను "నాన్నల్ని కొనాలి రేటెంత?" అన్న కవితలో కొండేపూడి నిర్మల వ్యంగ్యాత్మకంగా ధిక్కరించింది.

"నాన్న ఉనికి ఎన్నో క్రిమి అయినా
నమ్మి నమ్మి నమ్మకాలన్నీ వట్టిపోయిన
మా వాడికి
నాన్నతనం ఎన్నో అబద్ధమైనా
బడికెళ్ళి కాసిని అక్షరాలు నేర్చుకునేందుకు
నాన్నల్ని చూపాలి కిలో రేటెంత?"

అందుకే ఘంటశాల నిర్మల "ఏ కాల్‌గర్ల్ మోనోలాగ్"లో

"నన్ను చూసి
అసహ్యంతో విరిగిన మీ కంటిచూపు
నొసట చిట్లింపు
అధమత్వానికి ఆవల
కేవల నీచత్వానికి క్షుద్ర ప్రతీక" అంది.

**(5)** ప్రపంచీకరణ మరో అంశం. చాప కింద నీరులా ప్రవేశించి ముంచేస్తున్న పాశ్చాత్య ధోరణి మనుషులను వారి కనీస ప్రాథమిక హక్కుల నుంచి దూరం చేస్తూ ఉంది. నైతిక విలువలను కాలరాస్తూ ఉంది. "గ్లోబల్ విలేజ్" అనే భావన ప్రపంచ దేశాలను దగ్గర చేస్తుంది అనేది ఎలా ఉన్నా ప్రపంచ దేశాలను పాశ్చాత్యీకరిస్తుంది అన్నది పర్యాయమై కూర్చుంది. పాశ్చాత్య వ్యామోహం, విదేశీ పయనం, విదేశీ వస్తు సంచయనం, విదేశీ సంస్థలు, అవకాశాలు పదోన్నతులు, రాయితీలు ఎన్నెన్నో... దీనిని ఆహ్వానిస్తూ ఉన్నది. దేశమో, రాష్ట్రమో మాత్రమే కాదు. మానవుల మనశ్శరీరాలనే కాదు ఆత్మలను కూడా ఆక్రమించుకున్నది. ఈ ప్రపంచీకరణ, దాని దుష్ఫలితాలు ఎన్నెన్నో. అది మనుషుల మధ్య ఎంత దూరం తయారు చేస్తుందో "ఇన్‌స్టెంట్ లైఫ్" కథలో కుప్పిలి పద్మ చక్కగా వివరించింది.

ఇందులో భాగంగా ఉత్పత్తుల మార్కెటింగ్‌లో జరిగే సౌందర్య సాధనాలుగా నిలిచే స్త్రీలు వారి శరీరాన్ని తదనుగుణంగా ఉంచుకోవడానికి పడే తపనను "సౌందర్యాత్మక హింస"లో విమల చక్కగా పేర్కొంది. వెర్రితలలు వేస్తున్న విదేశీ వ్యామోహాలు ఇక్కడి మనుషుల నైతిక పతనానికి ఎలా కారణం అవుతున్నాయో "విడియో కోచ్ విషాదం"లో ఘంటశాల నిర్మల ఇలా చాటుతూ ఉంది.

"రాజ్యం కల్పించే వినోదమే
రాజ్యం పెట్టే హింస
రాజ్య వినోదమే రాజ్య హింస
రాజ్యం ఇవ్వజూపే కుహనా విలాసం
రాజ్యానికే ఉల్లాసం
పరాయీకరణలో తెరపై క్షణిక నటుడై
చిందేసే అతనూ
పరకాయ ప్రవేశంతో
తాత్కాలిక తారగా తృప్తిపడే ఆమె
రాజ్యం దిద్దిన బొమ్మలు"

దీన్నే అనిశెట్టి రజిత "గ్లోబల్ లవ్"లో

"పల్లెలూ పచ్చదనాలూ మాయం
స్టార్ టీవీల సకిలింపుల్లో
పలకరింతలు యాంత్రికం
ప్రకృతి వనరుల స్థానే ప్లాస్టిక్ వాడకం" అని పేర్కొంది. దీనివలన ప్రయోజనం ఏమిటో "దుష్టత్రయం" కవితలో అనిశెట్టి రజిత ఇలా చాటుతూ ఉంది.

"ప్రపంచాన్ని ఎడం చేసే ఎల్లలు చెరిగిపోతుంటే
ఇక ఎవ్వరికీ దుఃఖకారణాలుండవు
సుఖించేందుకు సూక్ష్మమంత అవకాశం తప్ప
చేయదగిన పనులుండవు
హక్కులూ, సంఘాలూ పోరాటాలుండవు
సమ్మెకు దిగే రెక్కల రెపరెపలుండవు
ఏమార్చి హతమార్చే రాజ్యముంటుంది
ఆత్మహత్యల పాలనా రంగముంటుంది"

ప్రపంచీకరణ తెచ్చిన కార్పొరేట్ జీవితం, అది కల్పించే అవకాశాలు జీతాలూ, అమ్మాయిలను ఉపయోగించుకునే తీరు వారి జీవితం శారీరకంగా, మానసికంగా ఛిద్రమయ్యే దశను 'సాలభంజిక' కథలో కుప్పిలి పద్మ చిత్రించింది. స్త్రీని మనిషిగా స్వేచ్ఛగా, హాయిగా జీవించే కనీస హక్కును హరించిన స్థితిని, నైతికత మనసుకు, శరీరానికి పట్టకుండా దులిపేసుకు తిరిగే పురుషుడి తత్వాన్ని అద్దం పట్టిందీ కథ. ప్రపంచీకరణ నేపథ్యం విలువలను ఎలా కాలరాస్తూ ఉందో చెప్పే కథ. ప్రపంచీకరణ ప్రతిఫలనాలైన కార్పొరేట్ లైఫ్ మృగతృష్ణ యువత జీవితాన్ని బలిగొంటున్న వైనం చాటే కథ.

**(6)** నైతికత – నూతన విలువల ప్రవేశం స్త్రీవాద సాహిత్యంలో చూడగలం.



**స్త్రీల రచనల్లో, స్త్రీ పురుష సంబంధాలను నూతన కోణంలో చూడటం ఉంది. ఈ అన్నీ స్త్రీల స్వేచ్ఛా దృష్టితో సాగినవే. ఇవన్నీ స్థిరంగా సమాజంలో ఉన్న నైతిక విలువలను ప్రశ్నించేవే. నైతికతకు నూతన అర్థాన్ని ప్రతిపాదించేవే.**

వివాహం నూతన కోణం నేటి రచనల్లో కనిపిస్తుంది. స్త్రీ, పురుష సంబంధాలలో ఆలోచనా దృక్పథాలలో మార్పుంది. వివాహ వ్యవస్థలోని అమానవీయ సంబంధాల నిరసన ఉంది. వివాహానికి ప్రత్యామ్నాయ ఆలోచన ఉంది. స్త్రీల రచనల్లో, స్త్రీ పురుష సంబంధాలను నూతన కోణంలో చూడటం ఉంది. ఈ అన్నీ స్త్రీల స్వేచ్ఛా దృష్టితో సాగినవే. ఇవన్నీ స్థిరంగా సమాజంలో ఉన్న నైతిక విలువలను ప్రశ్నించేవే. నైతికతకు నూతన అర్థాన్ని ప్రతిపాదించేవే.

తల్లిదండ్రులు కుదిర్చే వివాహాలు మాత్రమే కాక కాలక్రమంలో ఓ పరిణామ భాగంగా ప్రేమ వివాహాలు సమాజంలో, సాహిత్యంలో వెలిశాయి. ఏ వివాహం లోనయినా పురుషాధిపత్యం ఉండటం – కొంత ఎక్కువ, తక్కువల భేదంతో – వల్ల వివాహ బంధంలో ముడిపడి జీవితం అంతా, సాహచర్య భాగంతో కాక యజమాని బానిస సంబంధంగా సాగటం పట్ల వ్యతిరేకత స్త్రీల రచనల్లో వ్యక్తమయింది. స్త్రీ తన స్వేచ్ఛను సంపూర్ణంగా వివాహం పేరుతో పురుషుడికి కుదవ పెట్టడం ఇష్టంలేని చైతన్యం స్త్రీలలో కలిగింది. పురుషుడితో సహ జీవనాన్ని కాంక్షించారు. పరస్పర గౌరవం లేని వ్యవస్థలో ఉండటం కంటే వివాహ వ్యవస్థకు బయట స్వేచ్ఛా గౌరవాల ఆనందాన్ని పొందటానికి ప్రాధాన్యం ఇచ్చారు. వివాహంతో సంబంధం లేకుండా కలిసి ఉండటాన్ని ప్రత్యామ్నాయంగా (ప్రయోగం – ఓల్గా) సూచించారు. ఎవరి స్వేచ్ఛను వారు అనుభవిస్తూ కలిసి జీవించటం సమాజంలో నెలకొని ఉన్న నైతికత దృష్టితో ఇది హర్షణీయం కాదు. వ్యక్తి స్వేచ్ఛ దృష్టితో నూతన విలువల ప్రవేశం సమాజంలో, సాహిత్యంలో కనిపిస్తూ ఉన్నాయి.

కేవలం వివాహ సంబంధమే కాదు, వివాహేతర సంబంధాలు కూడా ఈ సాహిత్యంలో కనిపిస్తాయి. వివాహ వ్యవస్థలో ఉంటూ ఇతర స్త్రీ లేదా పురుషుడితో సంబంధాన్ని కలిగి ఉండటం లేదా అవివాహితులు పెళ్ళయిన స్త్రీతోనో, పురుషుడితోనో సంబంధం కలిగి ఉండటం ఉంది. దీనిని అక్రమ సంబంధం అనటం సమాజ నైతిక విలువల దృష్ట్యా ఉంది. కానీ ఆ మాట కూడా వాడరాదంటారు స్త్రీవాదులు. వివాహంలో ఒదగని వారు ఒకరితో ఒకరు పొసగనప్పుడు వివాహంలో బాధ్యతే కాని ప్రేమ లేనప్పుడు మరో వ్యక్తితో ప్రేమలో పడటం, సంబంధం కలగటం అనైతికంగా భావించడం నేడు ప్రశ్నార్థకమే. "మారే ఆలోచనలు, మారే కాలం, స్థిరంగా ఉన్న నైతికతకు మరో నూతన విలువను జోడిస్తున్నాయా?" అనే అనుమానం కలగక తప్పదు. 'మానవి' (ఓల్గా) ఇందుకు నిదర్శనం. డాక్టర్ అయిన భర్త, పెళ్ళయిన కూతురు, పెళ్ళి కావలసిన కూతురు ఉన్న ఆ తండ్రి తోటి డాక్టర్‌తో ప్రేమలో పడటం, భార్యతో జీవించే ఇచ్ఛ కూడా లేకపోవడం, చివరికి ఆ భార్య కూతురి ద్వారా చైతన్యం పొందటం కథ. సమాజంలోను ఇలాంటి భావన కన్పిస్తుంది. కుప్పిలి పద్మ రాసిన కథ "అగాధ నీలిమ"లోనూ ఇటువంటి వివాహేతర సంబంధం స్త్రీ వైపు మంచి హృదయపూర్వక ఆవిష్కరణగా ఉంది.

భర్త మాట వినటం, భర్తకు ఎదురు చెప్పక పోవటం వంటి నిర్దిష్ట కుటుంబ చట్రం ఉన్న సమాజ చిత్రణ నుంచి సాహిత్యం వివాహేతర సంబంధాల చిత్రణ వరకు సాహిత్యం మారింది. కొన్ని నిషిద్ధాలను తొలగించుకుంది. తన సాహిత్య సృజనలో శృంగారం గురించి, శృంగారానుభవం గురించి స్త్రీ మాట్లాడటమే "అనైతికత" అనే దశను దాటి స్వేచ్ఛగా తమ అనుభవాలను వ్యక్తం చేశారు. (సాలభంజిక కథలు – కుప్పిలి పద్మ)

"మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకత" అన్నారు. స్త్రీ వివాహిత అయినపుడు పిల్లలు కలిగితే ఆమె జీవితం సంపూర్ణం. కలగకపోతే గొడ్రాలి గుర్తింపు. ఈ రెండింటిలో స్త్రీ ప్రమేయం శూన్యం. వివాహం అయిన దగ్గర నుంచి ఆమె జీవితం ఆమెది కాకుండా పోయే స్థితి సర్వసాధారణం. ఆ పరిస్థితి నుంచి గర్భం ధరించడం, ధరించకపోవటం నిర్ణయించుకునే హక్కు స్త్రీదేనని, స్త్రీకే ఉండాలి అనే ఆలోచన సాహిత్యంలోనూ తలెత్తింది. హేతుబద్ధం అయినపుడు వద్దనుకున్న గర్భాన్ని తొలగించుకునే స్వేచ్ఛ స్త్రీకే ఉండాలి.

"నీకు పంచేందుకు రక్తం లేకే కదా
నిన్ను పెంచేందుకు తీరిక లేకే కదా
... నేన్నిన్ను వద్దనుకున్నది.

(అబార్షన్ స్టేట్‌మెంట్ – పాటిబండ్ల రజని)

అన్న వేదనలో ఈ నిర్ణయం ఉంది. "గర్భాశయానికి వీడ్కోలు" (ఓల్గా) కవితా ఇలాంటిదే.


ఓల్గా రాసిన "రాజకీయ కథ" ప్రమాదవశాత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోయిన పురుషుడి పట్లా, పునరుత్పత్తి సామర్థ్యం కోల్పోయిన స్త్రీ పట్లా సమాజం చూపే వివక్షను చాటింది. ఓల్గా రచించిన "భిన్న సందర్భాలు" కథలో ఇదే ప్రధాన అంశం. వివాహంలో ఉన్న సుభద్రకి పిల్లలు వద్దంటే కుటుంబం అంతా పిల్లలు కావాలని బలవంతంపెట్టారు. అవివాహిత అయిన శాంతి వివాహంతో ప్రమేయం లేకుండా ఇష్టమైన వాడితో ఇష్టంగా బిడ్డను కనడానికి సిద్ధపడింది. ఈ రెండూ భిన్న సందర్భాలు. స్వేచ్ఛ లేమి, స్వేచ్ఛా ప్రవృత్తి. అక్కడ సుభద్ర అబార్షన్ చేయించుకుంది. ఇక్కడ శాంతి గర్భం ధరించింది. ఈ రెండూ సమాజ భావనలో తప్పులే. ఈ రెండూ నవీన విలువల రీత్యా తిరుగుబాటులే, స్వేచ్ఛా నిర్ణయాలే. నైతికత కాలగతి సమాజ తీరుతెన్నులను బట్టి పరిణామానికి గురవుతుంది.

**ఉపసంహారం**

సమాజం, సాహిత్యం రెండూ హక్కులను పరిరక్షిస్తాయి. మార్పును సూచిస్తాయి. ఈ రెండూ మనిషిని గుర్తిస్తాయి. "స్థూలంగా సాహిత్యంలో ప్రవేశించే సమాజం ఒకవైపు, ఆ సాహిత్యం నుంచి ప్రభవించే సమాజం మరోవైపు ఉంటాయి. ఈ రెండు సమాజాలు మానవ ప్రాధమ్యం కలిగి ఉంటాయి." ఈ ప్రాధమ్యం హక్కుల నైతికతల దశను, దిశను సూచిస్తుంది.

## ఒక అనామక బ్రతుకు చిత్రం

**పోతగాని సత్యనారాయణ**



మరపురాని త్యాగమేదో
నిరంతర జ్ఞాపకమై వెంటాడుతుంది
నిద్రాణమై మెదడు సంద్రంలో
మెలకువ కెరటాలై పల్లవిస్తుంది
కూరుకుపోయిన కనుగూళ్ళ చుట్టూ
వలయాలై పేరుకున్న అనుభవాల దొంతరలు
వృద్ధాప్య శిశిరంలో
ఒక్కొక్కటిగా కూలి పడుతున్న
సప్తవర్ణ స్వప్న శకలాలు
తెరుచుకున్న గాయాల గ్రంథం నిండా
భారమైన భావాలను భరించలేని
వాక్యాల అక్షర ఘోష!
ఇప్పుడామె
పేగుబంధం విడిచిన ఒంటరి కుబుసం!
పట్టణాల బస్‌స్టాండ్లలోకి
నిర్దయగా గెంటేసిన అనామక బ్రతుకు చిత్రం!!
జోకొట్టలేని ప్రశ్నలేవో
మిన్నాగులై బుసకొడుతుంటే
బుజ్జగింపుల నాదస్వరంలో
నిస్సహాయ దీనరాగాన్ని శృతిచేస్తుంది
కదలలేని కాలి గిరకలకు
ఆరు మైళ్ళు ఆయాసం అనివార్యమై ఆవహించి
కోతి కొమ్మచ్చులాడే ఆకతాయి బాల్యాన్ని
వేపకొమ్మల్ని విరిచేందుకు అర్థిస్తుంటే
ఆకలి కడుపుల్లో అన్నమై పూసిన అమ్మతనం
మెతుకు యాచనకి జోలె తెరిచిన దృశ్యమవుతుంది
వెలుగు రెక్కల రథాన్ని
మబ్బు పిట్టలు ఆహ్వానించే వేళ
దుర్గంధాన్ని ప్రక్షాళించిన మరుక్షణం
రెండుగా చీల్చబడే పండ్ల పుల్లల్ని
బతిమాలి అమ్ముకుంటూ
ఖాళీ పేగుల్లో గాండ్రించే
ఆకలి పులుల్ని ఊరడిస్తుంది
గుండు సూదుల్లా గుచ్చుకుంటున్న
గండు దోమల సంగీతమే
మూగబాధను నిద్రపుచ్చే జోలపాటవుతుంది
పేవ్‌మెంటుపై మంచు దుప్పట్లో
ముడుచుకున్న దేహం
ప్రశ్నార్థక చిహ్నమై మానవత్వాన్ని పరిహసిస్తుంది
అనుబంధాల అంపశయ్యపై
దొరకని జవాబు కోసం ఎదురు చూస్తాం...
ఆమె జీవనం ఇప్పటికీ ఒక పొగచూరిన పొడుపు కథైని!
మరుగుజ్జు మనస్తత్వాల జీవన మజిలీలలో
అడుగడుగునా మొలకెత్తే త్యాగాల తరువై
మనుషత్వాన్ని ప్రశ్నిస్తూనే వుంటుంది

# ప్రజా జీవనాన్ని కాంక్షించిన నవల 'మలుపు తిరిగిన రథ చక్రాలు'



ముదిగంటి సుజాతారెడ్డి

**మహీధర రామమోహనరావు రాసిన రథ చక్రాలు నవల తర్వాత ఇటీవలి కాలంలో ముదిగంటి సుజాతారెడ్డి రాసిన మలుపు తిరిగిన రథచక్రాలు నవల ప్రజాజీవనాన్ని కాంక్షించిన నవలగా పేర్కొనవచ్చు. నిజాం కాలం నాటి ప్రజల కష్టనిష్ఠూరాలను భూస్వాముల నిరంకుశ అమానుషత్వాన్ని ఎత్తి చూపే నవల. తెలంగాణ ప్రజల గ్రామీణ జీవితం, దొరల, దేశముఖుల దౌర్జన్యాలు చిత్రించబడ్డాయి ఈ నవలలో.**

**యర్రదొడ్డి సుభాషిణి**

**నవల - పరిచయం :**

విశ్వ సాహిత్యంలో అత్యంత పాఠకాదరణ పొంది సాహిత్య ప్రక్రియల్లో ప్రథమ తాంబూలమందుకొంటున్న ప్రక్రియ నవల. నవలలో రచయిత భావ ప్రకటనకు అనుకూలమైన నిడివి వుండటం చేత సమాజం ఇందులో ప్రతిబింబించ డానికి వున్న అవకాశం మరే ఇతర ప్రక్రియల్లోనూ లేదనడం అతిశయోక్తి కాదు. ఏ ఒక్క సంఘటనో, సన్నివేశమో, పాత్రో, కథలో ప్రధాన వస్తువైతే, నవలలో అనేక సంఘటనలకూ, పాత్రలకూ, వర్ణనలకూ స్థానముండటం దానికొక ప్రత్యేకతను తెచ్చింది. పఠనీయత కారణంగా తెలుగులో మధ్యతరగతి చదువు కొన్న వారి ఆదరణ వల్ల ఎంతో ఎదిగిన సాహిత్య ప్రక్రియ నవల. మానవ ప్రవృత్తికి ప్రతిబింబం నవల. మానవ ప్రవృత్తిపై తన ప్రభావం చూపుతూ అందలి రహస్యాలను ఛేదించడమే నవల మూల ఉద్దేశ్యం.

**తెలంగాణ నవలలు నేపథ్యం :**

తెలంగాణ ప్రజల జీవితాన్ని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల్ని చిత్రించే నవలలు అనేకం వచ్చాయి. బొల్లిముంత శివరామకృష్ణ – మృత్యుంజయంతో 1946లో తెలంగాణ ఉద్యమ నవల ప్రారంభమైంది. తర్వాత లక్ష్మీకాంత్ మోహన్ – సింహగర్జన, వట్టికోట ఆళ్వారుస్వామి – ప్రజల మనిషి, గంగు, మహీధర్ రామమోహనరావు – కొల్లాయి గట్టితేనేమి, ఓనమాలు, రథచక్రాలు, కత్తుల వంతెన, మృత్యువు నీడల్లో, దాశరథి రంగాచార్య – చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం, ఇల్లిందల సరస్వతీదేవి – నీ బాంచన్ కాల్మొక్తా, అంపశయ్య నవీన్ – కాలరేఖలు, చెదిరిన స్వప్నాలు, బాంధవ్యాలు మొదలైన తెలంగాణ ఉద్యమ నవలలన్నీ యాభై సంవత్సరాల గ్రామీణ నేపథ్యంలో ముఖ్యంగా తెలంగాణ ఉద్యమాన్ని చిత్రించడం జరిగింది.

నిజాం నిరంకుశ పాలనకూ, ఫ్యూడల్ వ్యవస్థకూ వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ ప్రజల చారిత్రాత్మక సాయుధ పోరాట గాథ మలుపు తిరిగిన రథ చక్రాలు. ఇటు గ్రామంలో ఆరంభమైన పోరాటం, పట్నం చేరిన తర్వాత పోరాటం పేరు వినిపిస్తుందే కాని కనిపించదు ఇదే ఉభయ సాయుధ పోరాటం.

సాయుధ పోరాట స్ఫూర్తితో నవలలు రాసిన వారు అల్లం రాజయ్య, సాహు మున్నగువారు. ఇప్పుడు ఉభయ సాయుధ పోరాటాల స్ఫూర్తితో డా॥ ముదిగంటి సుజాతారెడ్డి 'మలుపు తిరిగిన రథ చక్రాలు' నవల రచించారు.

**నేపథ్యం :**

నిజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు జరిపిన పోరాటం చరిత్రలో ఓ ఉజ్వల ఘట్టం. ఓ చారిత్రాత్మక సంఘటన. ఫ్యూడల్ సమాజ వాతావరణాన్ని దొరల యుగయుగాల దోపిడీతనాన్ని చిత్రించిన నవలలు చాలా వచ్చాయి. నిజాం నిరంకుశ దోపిడీ పాలనకు మారుపేరుగా నిలిచిన నిజాం సంస్థానానికి వ్యతిరేకంగా తెలంగాణా ఉద్యమం ప్రారంభమైందని చెప్పవచ్చు. తెలంగాణ ప్రజలు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిపిన పోరాటం చెప్పుకోదగ్గ అంశం. జాతీయోద్యమంలో భాగమైన తెలంగాణా ఉద్యమం భారతీయ చరిత్రలోనే ఓ ఉజ్వల ఘట్టం. తెలంగాణా ఉద్యమ నేపథ్యంతో చాలామంది రచయితలు తెలంగాణా ప్రజల యొక్క ఆర్తిని, బాధను, వాళ్ళ కన్నీటిని తుడిచే ప్రయత్నమే చేశారు. ఇప్పటికి కూడా తెలంగాణా ఉద్యమ నేపథ్యంతో నవలలు రావడం గమనార్హం.

మహీధర రామమోహనరావు రాసిన రథ చక్రాలు నవల తర్వాత ఇటీవలి కాలంలో ముదిగంటి సుజాతారెడ్డి రాసిన మలుపు తిరిగిన రథచక్రాలు నవల ప్రజాజీవనాన్ని కాంక్షించిన నవలగా పేర్కొనవచ్చు. నిజాం కాలం నాటి ప్రజల కష్టనిష్ఠూరాలను భూస్వాముల నిరంకుశ అమానుషత్వాన్ని ఎత్తి చూపే నవల. తెలంగాణ ప్రజల గ్రామీణ జీవితం, దొరల, దేశముఖుల దౌర్జన్యాలు చిత్రించబడ్డాయి ఈ నవలలో.

**కథా సారాంశం :**

ఈ నవలలో కథనాయిక సరళ పాత్ర ప్రజాస్వామిక విలువలకు ప్రతీక! దోపిడీ దౌర్జన్యపరుడైన విలాస పురుషుడైన

దేశముఖు రంగారావుకు సరళను కట్టబెట్టాలనడం, తర్వాత ఆమెకు అవినీతిపరుడైన దాసుతో పెళ్ళి కావడం ప్రజాస్వామ్య విలువలకు జరిగే హానే సూచింపబడింది. విప్లవ వీరుడు రమేశ్ సరళ మనుమరాలు బేబిని చేరదీయడం అతడు ప్రజాస్వామ్యం వైపు ప్రజల్లోకి రావడం ప్రతీక! అదే రథచక్రాలు మలుపు తిరగడం!

**తెలంగాణ ప్రజల స్థితిగతులు :**

నిరంకుశ నిజాం పాలనలో బడా భూస్వాములకు జాగీర్దార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా రైతాంగ పోరాటం తెలుగు ప్రజల చరిత్రలో రక్తాక్షర లిఖితం. దొరల గడుల్లో మానసిక శారీరక దోపిడీలకు గురవుతూ పసికందులను కని వారికి అసలు తండ్రెవరో కూడా తెలియజేయలేని స్థితిలో వుండే ఆడబాపల దైన్యం వర్ణనాతీతం.

సమాజంలో ఏ కాయకష్టం లేకుండా సుఖపడటం కొందరైతే, చెమటోడ్చి రోజంతా కష్టపడి పనిచేసేవాళ్ళు కడుపు నిండా తిండి ఒంటినిండా బట్టలేక బతుకుతున్న దీనులు మరికొందరు.

సోలెడు, మానెడు జొన్నలకు పిల్లల్ని బానిసలుగా అమ్ముకోవడం, జీతభత్యాలు లేకుండా మనుషులు వెట్టిచాకిరి చెయ్యడం! ఏడాదంతా వంచిన నడుము ఎత్తకుండా కుటుంబమంతా కష్టపడి పుట్లకొద్ది ధాన్యం పండించి పోస్తే తినడానికి వాళ్ళకు తిండికి లేకపోవడం! ఇదీ తెలంగాణా ప్రజల జీవన విధానం.

**పాత్రలు :**

ఈ నవలలో పాత్రలు సందర్భవశాన వచ్చి అంతమయ్యేవి కొన్ని. నవలలో అంతటా విస్తరించి ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నవి కొన్ని. ఇందులో ప్రధానంగా రమేశ్, సరళ, రామచంద్రరావు, అన్నారం దేశముఖు రంగారావు. దాసు, ప్రభాకర్‌లు కనిపిస్తారు. రమేశ్, సరళల పాత్ర సృష్టిలో ప్రాధాన్యం ప్రతిష్ఠించాలని రచయిత సంకల్పం.

— — — — * * * — — — —

**రమేశ్ వాస్తవంగా ప్రజల మనిషి. తొలి పోరాట వారసత్వంతోనే మలి పోరాటం సాగిన మాట వాస్తవం. కాని రెండవది మొదటి దాని కొనసాగింపు మాత్రం కాదు. ఏ విప్లవమూ నిరంతరంగా అంతకాలం కొనసాగడం కష్టం. ఏమైనా రమేశ్ ఆదర్శ విప్లవవాది, త్యాగమూర్తి.**

— — — — * * * — — — —

మిగతా పాత్రలకు అంత ప్రాధాన్యం లేదు. ఈ కారణాన ఈ వ్యాసం ప్రధాన పాత్రలకే పరిమితమవుతుంది. రమేశ్, సరళ పాత్రల నవలా జీవితం రేఖామాత్రంగా తెలిస్తే, ఆ పాత్ర గతంగా రచయిత ప్రతిష్ఠించిన ప్రజా జీవనం స్పష్టంగా అవగతమవుతుంది.

**రమేశ్ :**

ఈ నవలలో కథా నాయకుడు రమేశ్. చదువు కోవడానికి పట్నం వెళ్ళిన రమేశ్‌కి పాశ్చాత్యుల బట్టలు ఎందుకు వేసుకోవాలని ఏవగింపు గలగడం, తర్వాత ఆ బట్టలు వేసుకోమని సమ్మె చేయాలను కొంటున్న సమయంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం 'బి' హాస్టల్ విద్యార్థులు పాడే 'వందేమాతరం' గేయాన్ని పాడవద్దని అధికారులు ఆంక్షలు పెట్టారు. దానికి నిరసనగా ఊరేగింపుగా బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఆ సభలో పాల్గొనడమే అతని రాజకీయమే జీవితానికి ఆరంభం. తరువాత మెల్ల మెల్లగా విప్లవ భావాల వైపు ఆకర్షింపబడి, సాయుధ పోరాటంతోనే వ్యవస్థను మార్చటం సాధ్యమవుతుందని విశ్వసించిన వ్యక్తి రమేశ్. ఆ విప్లవ పంథాలో అతనికి ఎంతోమంది అనుచరులు స్నేహితులు ఏర్పడ్డారు. వాళ్ళంతా నాయకులై విప్లవ వీరుల దళాలను తయారుచేసి ప్రజాస్వాతంత్ర్య నిరోధక శక్తులతో పోరాటం సాగించాడు. నిజాం ప్రభుత్వం అతని మీద ఎన్నో కేసులు బనాయించి బంధించాలని చూడటంతో అతడు రహస్య జీవనం గడుపుతూ ఉద్యమ మార్గంలో సాహస వీరుడుగా ప్రయాణం చేసిన వ్యక్తి రమేశ్.

ఒకరోజు బతుకమ్మ పండుగరోజు కాల్పుల్లో దెబ్బతిన్న రమేశ్ సరళచే రక్షింపబడతాడు. నువ్వెవరు? మీ విప్లవకారులు చేసే పనేంటి? అని సరళ అడిగిన ప్రశ్నకు సమాధానంగా “మేం చేసేది సాయుధ పోరాటం. కేవలం ఇటువంటి దోపిడీలు ఆపడమే మా పనికాదు. ఇంతకంటే పెద్ద దోపిడీలు మన దేశంలో జరుగుతున్నాయి. అది ఆపాలని అట్టడుగు ప్రజలకు న్యాయం సమతలను పంచాలని మా ఆశయం. దొరల దేశముఖుల, జమిందార్ల క్రూర నియంతృత్వాన్ని దోపిడి, దౌర్జన్యాలను నశింపజేసి దున్నేవాడిదే భూమి అన్న న్యాయాన్ని, సమసమాజాన్ని స్థాపించాలని మా ఆశయం! దీనికి విరుద్ధంగా దొరలు, దేశముఖులు, జమిందార్లు తమ నియంతృత్వం ఎప్పటికీ కొనసాగాలంటే నిజామే ప్రభువుగా వుండాలని కాంక్షిస్తున్నారు. ప్రజల్లో భయోత్పాతాన్ని పుట్టిస్తున్నారు. నిజాం కోరల నుండి ఈ దేశానికీ ధనవంతుల అన్యాయాల నుంచి ప్రజలకూ విముక్తిని కల్గించడమే మా విప్లవకారుల ఆశయం.” (పుట : 35) అన్న వ్యక్తి రమేశ్.

నన్ను దాసు చెర నుండి రక్షించి తీసుకెళ్ళి పెళ్ళి చేసుకో అన్న సరళతో “నా పోరాటం ప్రజల కోసం, ఆ ప్రజలకు న్యాయం జరగందే నా పోరాటాన్ని విరమించుకోలేను. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు నా పోరాటం కొనసాగు తూనేవుంటుంది. “(పుట : 145) అన్న ఆదర్శ విప్లవవాది రమేశ్.

రమేశ్ వాస్తవంగా ప్రజల మనిషి. తొలి పోరాట వారసత్వంతోనే మలి పోరాటం సాగిన మాట వాస్తవం. కాని రెండవది మొదటి దాని కొనసాగింపు మాత్రం కాదు. ఏ విప్లవమూ నిరంతరంగా అంతకాలం కొనసాగడం కష్టం. ఏమైనా రమేశ్ ఆదర్శ విప్లవవాది, త్యాగమూర్తి.

“స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్న దేశంలో ఇంకా ఎందుకు మృత్యువు నిన్ను వెంటాడు తుండగా తిరుగుతావు? – నీ ఆశయాలను, ఆదర్శాలను

నెరవేర్చుకోవాలంటే ప్రజలకు న్యాయం కల్గించాలనుకుంటె - వేరే దారిలేదా? చెప్పు! రమేశ్ - చెప్పు! (పుట : 145) అని ఆవేశంగా అడిగింది సరళ మాత్రం కాదు. ఒక ఆలోచనా విధానం! దానికి సమాధానంగా రమేశ్.

"కొందరి చేతుల్లో మాత్రమే ఆస్తులు అధికారాలున్నంత వరకు నా ఉద్యమం ఆగదు. ప్రజానీకం మీద దౌర్జన్యాలు ఆగిపోయిన నాడే నా పోరాటం ఆగిపోతుంది. వర్గ భేదం సమాజంలో నశించిన్నాడే నా దీక్ష పూర్తవుతుంది! దౌర్జన్యం వున్నంతకాలం ప్రజలు నా ఉద్యమాన్ని పోరాటాన్ని సమర్థిస్తారు. నా వెంబడి నడుస్తారు! (పుట : 148) అన్న రమేశ్ మాటలు మరొక ఆలోచనా విధానం.

ఈ ఆలోచనా విధానాల తీర్పు చెప్పవలసింది కాలం - ప్రజలు. ఏది ఏమైనా ప్రజా జీవనాన్ని కాంక్షించిన రమేశ్ ఆదర్శమూర్తి.

**సరళ :**

ఇందూరు దొర రామచంద్రరావు కూతురు సరళ. అపురూప సౌందర్యవతి. అభిమానవతి. సాటి మనుషులంటే గౌరవాభిమానమున్న వ్యక్తి. తాను కూడా పోరాటంలో సాయపడతానన్న గొప్ప వ్యక్తి. తాను దొర కూతురు అయినా మామూలు వ్యక్తిని పెళ్ళి చేసుకోవడానికి ముందుకొచ్చిన అసాధారణ యువతి. ప్రజల కోసం కాల్పుల్లో గాయపడ్డ రమేశ్‌ని కాపాడిన ఒక అమూల్యమైన వ్యక్తి సరళ. నిజాం ప్రభువు రాజ్యంలో వున్న భూస్వాములు చేసే దౌర్జన్యాలను విన్న సరళ సమాజాన్ని, ప్రజా జీవనాన్ని మార్చి చరిత్ర గతినే తిప్పివేస్తున్న విప్లవ వీరులంటె ఒక విధమైన ఆరాధనా భావాన్ని ఏర్పరచు కొంది. సమాజంలో వున్న అసమానతకు ఆమె మనస్సు చలించి నేనూ - మీతో వచ్చి మీ ఉద్యమంలో చేరాలని వుందన్న సాహసమూర్తి సరళ.

తన తండ్రిని, అన్న ప్రాణాలను ప్రజలు తీసినప్పుడు "కొన్ని వందల ఏళ్ళుగా బానిసత్వంలో మగ్గిన ప్రజల హాహాకారం తన తండ్రిని తన అన్నను బలి తీసుకొన్నది ! (పుట : 98) అనుకొంటూ "ఇది ప్రజల తీర్పు! ప్రజల న్యాయం" - అన్న ఆలోచనతో మౌనంగా వుండిపోయిన సమయస్ఫూర్తి సరళ.

రమేశ్‌ని పెళ్ళి చేసుకొమ్మని కోరినా, చేసుకోక తిరస్కరించినప్పుడు పరిస్థితులకు రాజీపడి దాసును పెళ్ళి చేసుకొంది సరళ. సరళ కథ పోరాటానికి కాక అదృష్టానికి లంకె పడింది. ఆమె అనంత దురదృష్టవంతురాలు. పట్టిన బంగారం సొంతం మట్టి అయింది. దురదృష్టం నెట్టిన వైపు కల్లా ఉరికి విసిగి - ఆ నేపథ్యంలోనే కన్నుమూసింది. రమేశ్‌ని ప్రజాస్వామ్యం వైపు తీసుకురావాలన్న తన చిరకాల వాంఛని మనుమరాలు బేబిని రమేశ్‌కి అప్పగించి తీర్చుకొంది.

**రామచంద్రరావు :**

ఇందూరుకు దొర రామచంద్రరావు. ఇందూరు - ఇందూరు చుట్టూ వున్న నాలుగు పల్లెల్లోని భూమికి పట్టేదారు. అతడు జీతగాళ్ళను పెట్టి స్వంతంగా వ్యవసాయం చేసే భూమి ఏ వందెకరాలో వుంటుంది. మిగతా వందల కొద్ది ఎకరాల భూమిని ఇందూరు - ఇందూరు చుట్టూ వున్న పల్లెల్లోని ప్రజలు సాగు చేసి దొరకు ధాన్య రూపంలో కౌలును చెల్లిస్తారు. పంట పండకపోయినా దొరకు కౌలు చెల్లించాల్సిందే. బతుకమ్మ పండుగ రోజు రజాకార్లతో చేతులు కలిపి ప్రజల నగలు దోచుకోవడానికి వ్యూహం పన్నిన వ్యక్తి రామచంద్రరావు.

— — — — * * * — — — —

**దొరలు దేశ్‌ముఖులు, జమిందార్లు, రాజాలు పల్లెల్లో ప్రజలను కొల్లగొట్టి నిజాంకు నజరానాలర్పించుకొని అతన్ని ఖుషీ చేసేవారు. ఆ విధంగా నిజాం ఖజానా నింపుతూ దర్జాగా గడిపే జీవితాలు అంతమయ్యే కాలం వస్తుందని వాళ్ళు కలలో కూడా అనుకోలేదు. ఈ కోవకు చెందినవాడే రంగారావు దేశ్‌ముఖు.**

— — — — * * * — — — —

దొర ఏ కూలి నిర్ణయిస్తే ఆ కూలే వాళ్ళు తీసుకోవాలి. స్వంత భూములున్నా దొర ఏ కట్టడి చేస్తే వాళ్లందరూ అదే అనుసరించాల్సిందే. అతడు మాట్లాడితే ఉరుము ఉరిమినట్లు వుంటుంది. అతని కంఠస్వరం వింటేనే చాలు గడగడ వణికిపోతారు ప్రజలు. నాగుల ధాన్యం, కౌలుధాన్యం కొలవని ప్రజలను వేపచెట్టుకు కట్టి బుద్ధి వచ్చిందాకా కొట్టండి! అని ఆజ్ఞాపించే వ్యక్తి రామచంద్రరావు. ఇతడి ఆజ్ఞలకు ఎందరో అమాయకులు ప్రాణాలను కోల్పోవడం చూసిన ప్రజలు విప్లవ నాయకుల ప్రోత్సాహంతో అతని అరాచకాలను ధ్వంసం చేయాలని దొరను ఖతం చేసి, వాళ్ళ ఆస్తి కరపత్రాలను చేజిక్కించుకొని, గడిలో వున్న ధాన్యాన్ని అందరూ పంచుకొన్నారు.

**అన్నారం దేశ్‌ముఖ్ - రంగారావు :**

దేశాన్ని కొల్లగొట్టే ప్రపంచంలోని ముగ్గురు పెద్ద ధనవంతుల్లో ఒకడు నిజాం! నిజాం రాజ్యంలోని సంస్థానాధిపతులైన భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖులు, జమిందార్లు అందరూ నిజాం గద్దె మీద వుండాలని కాంక్షిస్తున్నారు. అతడు గద్దె మీదుంటేనే వాళ్ళ అధికారాలు సాగుతాయి. ప్రజాస్వామ్యం వస్తే సామాన్య జనానికి బలం చిక్కుతుందని దాని పేరు ప్రజలకు వినబడకుండా స్వాతంత్ర్యమంటే ఏమిటో తెలియని పుట్టు బానిసలుగా ప్రజలను మార్చారు.

దొరలు దేశ్‌ముఖులు, జమిందార్లు, రాజాలు పల్లెల్లో ప్రజలను కొల్లగొట్టి నిజాంకు నజరానాలర్పించుకొని అతన్ని ఖుషీ చేసేవారు. ఆ విధంగా నిజాం ఖజానా నింపుతూ దర్జాగా గడిపే జీవితాలు అంతమయ్యే కాలం వస్తుందని వాళ్ళు కలలో కూడా అనుకోలేదు. ఈ కోవకు చెందినవాడే రంగారావు దేశ్‌ముఖు. తండ్రి తాతల నుంచి ఆస్తితో పాటు దేశ్‌ముఖు పదవీ అతనికబ్బింది. అతడు అన్నారం దేశ్‌ముఖు అయినా అక్కడ వుండటం తక్కువ. హైదరాబాద్‌లోనే అతని నివాసం.

అతడి దౌర్జన్యాలన్నింటికి ప్రజల మీద పన్నులు వేయడం, కావలసినంత లాగడం, ఇవ్వకపోతే వాళ్ళను చంపడం – ఇవి అతని నిత్యకృత్యాలు.

ఏడాదంతా కష్టపడితే మాకు తిండికృూడా సరిగా మిగులుట లేదు. మా ఆడవాళ్ళ పుస్తెలు తప్ప బంగారం ఎక్కడదని మొరపెట్టుకొన్న ప్రజలతో "ఆ పుస్తెలే తెచ్చి కౌలు కట్టండిరా! రేపు బాగా పండితే నాకేమైనా ఎక్కువ వచ్చేది వుందా? ఏమన్నానా? లంజాముండా కొడుకులు!" అంటూ నీచంగా తిట్టిన వ్యక్తి దేశ్‌ముఖ్. ఆవేశంగా తిరగబడి మాట్లాడిన వాళ్ళను పిస్తోలుతో పేల్చడం ఇతడి దినచర్య.

మరోవైపు వయసు మీరిపోతున్నా, రెండవ భార్యగా సరళను పెళ్ళి చేసుకోవాలన్న అతని ప్రయత్నాలు చూసి విప్లవ నాయకులు అతడికి చావు ముహూర్తం పెట్టారు.

**దాసు :**

దాసు మాలతి కొడుకు. మాలతి ఇందూరు గడిలో ఆడబాప. ఇందూరు దొర రామచంద్రరావు చెల్లెలు లక్ష్మీదేవి భర్త ప్రతాప్‌కి, మాలతికి పుట్టిన వ్యక్తి దాసు. ఇందూరు నుంచి దాసు తల్లి మాలతి కిష్టయ్యతో లేచిపోయి పట్నం వచ్చింది. పట్నంలో కిష్టయ్య ధాన్యం వ్యాపారం చేసి లక్షలు సంపాదించి దాసుని వారసుడు చేశాడు. కష్టపడే గుణం లేదు దాసుకి. మంచి బట్టలేసుకుని ఊరి మీద, హోటళ్ళ మీద పడి తిరగడం, సినిమాలకు వెళ్ళడం అతడి నిత్యకృత్యాలు. మాలతి దాసుకి పెళ్ళి సంబంధాలు తెస్తే ఏదో వంకలు పెట్టడం 'నేను పెండ్లి చేసుకొంటే సరళనే పెళ్ళి చేసుకుంట, ఆ మరదలు పిల్లే నా భార్య' అని దాసు తల్లితో చెప్పాడు. ఇందూరులో తన తండ్రి, అన్న చనిపోయిన తర్వాత పట్నానికి వచ్చిన సరళను దాసు బందీగా చేసి పెళ్ళి చేసుకొంటాడు. తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ సంపాదించి ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యాడు. ప్రజలను మోసం చేసి, బాగా డబ్బు సంపాదించి చివరకు రాష్ట్రంలో శాంతి

— — — — * * * — — — —

**పెట్టుబడిదారీ రాజ్యంలో గాని, సోషలిస్టు రాజ్యంలో గాని, ప్రజాస్వామిక విలువలు లేకపోతే ఆర్థిక విధానం, వ్యవసాయోత్పత్తులు దెబ్బతిని చాలామంది బీదతనంలోకి నెట్టబడటం చూస్తున్నాం. ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇవ్వని ఏ సిద్ధాంతమైనా, ఏ రాజ్యమైనా ప్రజల ప్రతిఘటనను ఎదుర్కొంటుంది.**

— — — — * * * — — — —

భద్రతలు లోపించాయని దాసుని హోంశాఖ పదవి నుంచి రాజీనామా చేయాలని తీర్మానించారు. తుదకు ఎన్నికల్లో ఓడిపోయి మంచం మీద రోగిలా పడి, ప్రాణాలు వదిలాడు దాసు.

**ప్రభాకర్ :**

ప్రభాకర్ రమేశ్ చిన్ననాటి స్నేహితుడు. ప్రజల్లో చైతన్యం తెప్పించడానికి ఇందూరులో గ్రంథాలయాన్ని నడిపేవాడు. సరళ రమేశ్‌ను చూడాలనుకొన్నప్పుడు అతడికి సమాచారం చేరవేసి వాళ్ళను కలిపే వ్యక్తి ప్రభాకర్. ఇందూరు దొరను ఖతం చేసిన తర్వాత సరళ, కస్తూరి పట్నానికి వచ్చినప్పుడు వాళ్ళకు అన్ని సౌకర్యాలు కల్పించిన వ్యక్తి ప్రభాకర్. 'లా' పరీక్షలు పాసై లాయర్ వృత్తిని చేపట్టి ప్రజల కోసం విప్లవ వీరుల తరఫున కేసులు వాదించి గెలిచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యక్తి ప్రభాకర్.

**రచయిత దృక్పథం :**

ప్రజా జీవనాన్ని చాటడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొన్న రచయిత, ఆ అంశాన్ని సమర్థవంతంగా నిర్వహించింది. దీన్ని మలచడానికి పాత్రలను ఎంచి, రమేశ్, సరళలను సమంజసంగా గ్రహించారు. ఒకప్పుడు దోపిడీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణాలో సాయుధ పోరాటం అవసరమైంది. ఎందరో ఉద్యమ వీరులు సాహసంతో నిస్వార్థంగా, త్యాగబుద్ధితో పోరాటంలోకి దిగారు. ప్రజల సహకారంతో పోరాటం విజయవంతంగా సాగింది. ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. ఆ తర్వాత ప్రజాభ్యుదయం నత్త నడకతోనే సాగింది. దానికి పోరాట వీరుల్లో ఉన్న చిత్తశుద్ధి ఓటులతో గెలిచిన నాయకుల్లో లేకపోవడమేనని రచయిత దృక్పథం.

"భూస్వామ్య వ్యవస్థలో కొంత మార్పు వచ్చిన అనంతరం కథ ఇందూరు విడిచి పట్నం చేరింతర్వాత సాంఘికం అయిపోతుంది. పోరాటం పేరు వినిపిస్తుందేమోకాని కనిపించదు. అయితే ప్రభాకర్ ద్వారా పోరాటం విడిచి వచ్చిన వారు బాగుపడిన విధానం, దాసు వంటి చరిత్రహీనుల చేతికి అధికారం రావడం ఎంతో వాస్తవంగా చిత్రించారు. ఇది మనం చూస్తున్న దిగంబర సత్యం!" అంటారు 'మలుపు తిరిగిన రథ చక్రాలు' నవలకు రాసిన ముందుమాటలో దాశరథి రంగాచార్య.

పెట్టుబడిదారీ రాజ్యంలో గాని, సోషలిస్టు రాజ్యంలో గాని, ప్రజాస్వామిక విలువలు లేకపోతే ఆర్థిక విధానం, వ్యవసాయోత్పత్తులు దెబ్బతిని చాలామంది బీదతనంలోకి నెట్టబడటం చూస్తున్నాం. ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇవ్వని ఏ సిద్ధాంతమైనా, ఏ రాజ్యమైనా ప్రజల ప్రతిఘటనను ఎదుర్కొంటుంది.

వర్గ సమాజంలో పని, పనికి సంబంధించిన శ్రమలోంచి వెలువడిందే నిజమైన ప్రజా సాహిత్యం. లేదా ఉత్పత్తికి సృష్టికర్తలైన ప్రజల గురించి, వారి శ్రేయస్సు కోసం వెలువరించిన ఎలాంటి సాహిత్యాన్నయినా ప్రజా సాహిత్యం అంటారు.

నిజంగా నేను
ప్రజల కవి నేను
ఎంచేతంటేను
వాళ్ళను చదివేను
చదివిందే రాశేను

అన్న శ్రీశ్రీ మాటలు ఈ నవలకు అన్వయించుకోవచ్చు.

ప్రజా జీవనంలో భాగంగా వస్తువును గ్రహించి, ఆ ఇతివృత్తాన్ని తన రచనా శిల్ప నైపుణ్యంతో విశిష్టంగా రూపొందించారు 'మలుపు తిరిగిన రథ చక్రాలు' నవలలో ముదిగంటి సుజాతారెడ్డి.

## సంస్మరణ

# కదన శంఖం - కథన శిల్పం

# మగ్జీం గోర్కి నూరేళ్ల 'అమ్మ'



**'నేను ఆ తర్వాత అమ్మ పుస్తకం చూశాను. గోర్కి రచన నేను చూడటం అదే మొదటి సారి. దాన్ని చూశాక మాత్రం అప్పటి వరకూ నేను చదివినదంతా అత్యంత నీరసమూ, నిర్జీవమూ అని తెలుసుకున్నాను. నూలు పోగులు, ముతక గుడ్డల తర్వాత అందమైన కుట్టుపనిలా అది తోచింది. చెక్కమొహాలను చూసిన తర్వాత జీవం తొణకిసలాడే మనుషులను చూసి నట్టయింది... మానవులందరి ఆశా విశ్వాసాలు అందులో తొణకిసలాడాయి..." అని ఒక ప్రముఖ విమర్శకుడన్నాడు. ఈ మాటలు నిజానికి చాలా మంది భావాలను ప్రతిబింబిస్తాయి.దీనంతటికీ కారణం ఆ నవలలో వున్న జీవిత వాస్తవికతే.**

**తెలకపల్లి రవి**

ప్రపంచ సాహిత్యంలో దానితో పోల్చదగిన పుస్తకం మరొకటి లేదు. సరిహద్దు రేఖలనూ, తరాల అంతరాలనూ అధిగమించి దేశ దేశాల భిన్న కాలాల పాఠకులకు ప్రేరణగా నిల్చిన ఆ అద్భుత పుస్తకమే **అమ్మ.** సామాజిక మార్పుకు చోదక శక్తి అయిన శ్రామిక వర్గ చైతన్య ప్రజ్వలనను ప్రతిబింబించి, సామ్యవాద వాస్తవికతకు అంకురార్పణ చేసిన రచన. లక్షల ప్రతులు ప్రచురించి పంపిణీ చేయాలని లెనిన్ స్వయానా ప్రశంసించిన పుస్తకం.

అమ్మ 1906లో తొలిసారి వెలువడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కోట్ల కోట్ల ప్రతులు వెలువడుతూనే వున్నాయి. తెలుగునాట కూడా దాని ప్రభావం అమోఘమైంది.

అమ్మ అనే మాటలో కొంతమంది సెంటిమెంటు చూస్తుంటారు గాని వాస్తవంలో అమ్మ అనేదే ఏ సెంటిమెంటు లేని వాస్తవం. మానవాళి అస్తిత్వానికి ఆరంభ వాచకం అమ్మే. అన్ని బాధలూ గాథలకు ప్రథమ ప్రత్యక్ష సాక్షి అమ్మే. వాస్తవానికి అమ్మ పాత సమాజానికి ప్రతీక. దాని క్రమానుగత చైతన్య పతాక. అమ్మ పుస్తకంలోని ప్రతి పాత్రా, ప్రతి పరిణామమూ గోర్కీ వాస్తవ జీవితంలో పరిశీలించి తెలుసుకున్నదే.

.......

1905లో రష్యాలో తొలి విప్లవ వెల్లువ వచ్చింది. అయితే ప్రజలు అప్పటికింకా జారు చక్రవర్తిపై నమ్మకంతో వున్నారు. ఆయనే ఉద్ధరిస్తాడన్న విశ్వాసంతో సామూహికంగా వినతి పత్రం సమర్పించేందుకు వెళ్లారు. అయితే దానిపై తూటాల వర్షం కురిసింది. రక్తసిక్త ఆదివారం పేరుతో అది చరిత్రలో మిగిలిపోయింది. ఆ విఫల విప్లవం అక్టోబర్ విప్లవానికి డ్రస్ రిహార్సల్ వంటిదని లెనిన్ జేజేలర్పించాడు. దాని ప్రభావంతో రష్యాలో మూడు పుస్తకాలు వచ్చాయి. ఒక టాల్‌స్టాయ్ రాసిన ' ఐ కాంట్ రిమైన్ సైలెంట్. మరొకటి ఆండ్రేవ్ రాసిన ' ద సెవెన్ మెన్ హాంగ్‌డ్'. మూడవది గోర్కి అమ్మ. ఈ మూడింటిని నిశితంగా పరిశీలిస్తే అనేక పోలికలతో పాటు స్పష్టమైన తేడాలు కనిపిస్తాయి.

.......

రష్యన్ సాహిత్యాన్ని గురించి. అందులోనూ గోర్కి రచనా ప్రక్రియ గురించి కూడా తెలుసుకుంటే తప్ప అమ్మ విశిష్టత అర్థం కాదు. 19 వ శతాబ్ది నాటికే రష్యన్ సాహిత్యం చాలా శక్తివంతంగానూ, కళాత్మకంగానూ రూపొందింది. టాల్‌స్టాయ్, చెకోవ్, గోగోయ్, కుప్రిన్, దోస్తోవస్కీ వంటి కళాకోవిదులు ఐరోపాకే తలమానికమైన సాహిత్య సంపదను సమకూర్చిపెట్టారు. అంతకు ముందులా ప్రభువర్గానికి భజన చేసే రీతిలో కాక ప్రజల బాధలకూ, భావాలకూ పెద్ద పీట వేశారు. సమాజంలో పేరుకుపోయిన అవినీతిని, అక్రమాలనూ అన్నిటికన్నా మించి మానవ పతనాన్ని కళ్లకు కట్టేలా రచనలు చేశారు. దాన్నే సవిమర్శక వాస్తవికత అన్నారు. ఒక విధంగా రష్యాలో సామాజికంగా తీవ్రమైన భావాల వ్యక్తీకరణకు సాహిత్యం ఒక సాధనమై పోయింది. దానికి తోడు జారు ప్రభుత్వం సభా పత్రికా స్వాతంత్రాలపైన తీవ్రమైన ఆంక్షలు అమలు చేస్తుండడంతో కథా రూపంలో విషయాలు తెలియజేయవలసిన అవసరమూ ఏర్పడింది.

గోర్కి అసలు పేరు అలెగ్జీ మాగ్జిమోవిచ్ పెష్కోవ్. 1868 మార్చి 14న జన్మించాడు.....

వ్యక్తిగా చిన్నప్పుడే అనేక బాధలు పడ్డాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. దౌర్జన్య పూరితమైన తాతగారి పెంపకంలో పెరిగాడు. అయితే నానమ్మ చెప్పే కథలే అతనికి వూపిరి పోసేవి. వాటివల్ల బాల్యంలోనే కథన శిల్పమూ పరిచయమైంది. తర్వాత కాలంలో ఆ ఇంట్లో వుండలేక పారిపోయాడు. అనాథలూ, అశాంతులందరిలాగే పెరిగాడు. మూటలు మోశాడు. చెత్తకుప్పల పక్కన గడిపాడు. నేలమాళిగల్లో చీకటి గుయ్యారాల్లో బతికాడు. అలా ఆయన జీవితంలో అన్ని కోణాలూ చూడగలిగాడు. ఈ దరిద్రంలోనూ, దుర్భర జీవితంలోనూ ఆయనకు ఒకే ఒక ఉపశమనం – తన వానాకాలం చదువుతో పుస్తకాలు చదవడం. ఆ విధంగా ఆయన రష్యన్ సాహిత్యంతో పరిచయం పెంచుకున్నాడు. తను చూసిన జీవితాన్ని కూడా రాయాలనుకున్నాడు. కాని అంతకంతకూ జీవితంలో వైరుధ్యాలు ఆయనను అశాంతికి గురి చేశాయి. భరించలేక ఒక కొండపైకి వెళ్లి తుపాకితో కాల్చుకున్నాడు. ఆ గుండు కొంచెం పక్కనుంచి తప్పిపోయింది. అప్పుడు మిత్రులు

ఆదరించారు. అంతకు ముందు ఎవరైతే తనకు ద్వేషపూరితంగానూ, నీచంగానూ కనిపించారో వారే ఇప్పుడు ప్రేమాస్పదంగా గోచరించారు. జీవితంలో చీకటి వెలుగులనూ మానవ స్వభావంలో ఉచ్చనీచాలనూ ఆయన స్వయంగా అనుభవంలో తెలుసుకోగలిగాడు. ఆ దశలోనే ఆయనకు కొత్తగా పెంపొందుతున్న రష్యన్ కార్మికోద్యమంతో సంబంధమేర్పడింది. అక్కడ మానవ చైతన్యానికి కొత్త నిర్వచనాలు తెలుసుకున్నాడు. విప్లవకారుడుగా మారాడు.

ఇన్ని పనులు చేయడమూ, ఇంత విస్తారమైన జీవితానుభవమూ గోర్కికి చిన్నప్పుడే గొప్ప అవగాహన నిచ్చాయి. 1896లో ఆయన పావలోనా వోల్జినాను పెళ్లాడాడు. ఒక క్లర్కుగా పనిచేస్తూ ఖాళీ వేళల్లో కథలు రాయడం మొదలెట్టాడు. ఆ కథలను మాగ్జిం గోర్కీ అనే కలం పేరుతో రాసేవాడు. ప్రముఖ నవలా కారుడైన వ్లదీమర్ కొర్లెంచెంకో తన పత్రికలో ఆయనకు ఉద్యోగమిచ్చాడు. అప్పటినుంచి గోర్కీకి రచననే వృత్తిగా చేసుకునే అవకాశం లభించింది. అతని రచనలు కొద్ది కాలంలోనే అందరినీ ఆకర్షించాయి. వాటిలో సామాన్య మానవులు అధోజగత్సహోదరులు, ముఖ్యంగా సజీవమైన స్త్రీ పాత్రలు వుండటం అందరినీ ఆకట్టుకుంది. ఒక ప్రచురణ కర్త ముందు కొచ్చి వాటిని సంపుటాలుగా ప్రచురించడంతో గోర్కీ ప్రసిద్ధి పెరిగి పోయింది.

క్రమంగా ఆయనలో కార్మిక వర్గ చైతన్యం పెరిగింది. సంపూర్ణ సమానత్వం, క్రియాశీలత గల ప్రధాన పాత్రధారి కార్మికవర్గమేనని ఆయన గ్రహించాడు. ప్రపంచంలో ప్రప్రధమంగా ఆధునిక కార్మిక వర్గ చైతన్యాన్ని అందుకున్న రచయిత కావడమే గోర్కి ప్రత్యేకత అని ప్రసిద్ధ రష్యన్ విమర్శకుడు లునచార్స్కీ నివాళులర్పించారు. సరిగ్గా ఆ కారణంగానే జారిస్టు ప్రభుత్వం అతన్ని చూసి భయపడటం మొదలెట్టింది.

ఇరవయ్యవ శతాబ్ది గోర్కీ కొత్త చైతన్యానికి ప్రతీక కాబోతున్న సూచనలు మొదట్లోనే స్పష్టమైనాయి. 1901లో రాసిన 'తుపాను పిట్ట పాట'( సాంగ్ ఆఫ్‌ద స్టార్మీ పెట్రెల్)లో ఆయన త్వరలోనే తుఫాను రాబోతుందని హెచ్చరించాడు. 1901లోనే గోర్కి రచనలు అన్ని యూరోపియన్ భాషలలోకి అనువాదమయ్యాయి. ఆరు సంపుటాలు అయిదు సార్లు ముద్రణ పొందాయి. గోర్కీ వ్యక్తిగత జీవిత స్మృతులు కూడా రాశాడు. వాటిని బట్టి అతన్ని గురించి అనేక కథలు ప్రచారంలోకి వచ్చాయి. ప్రభుత్వం ఆయనపై రాజద్రోహ నేరం ఆపాదించి ఖైదు చేసింది. ప్రజలలో దానిపై ఎంత నిరసన వచ్చిందంటే చివరకు ఆయనను విడుదల చేయక తప్పలేదు. అయినా గోర్కిపై నిరంతరం నిఘా వేసి వుంచింది. సొర్మవో నౌకా నిర్మాణ కేంద్రం కార్మికులు అప్పటికే కుత కుత వుడికిపోతున్నారు. ప్రభుత్వం గోర్కి అక్కడకు వెళ్లకూడదని, అజర్మాస్‌లోనే వుండాలని శాసించింది. దానిపై లెనిన్' నిరంకుశ ప్రభుత్వం ఐరోపాలోనే ప్రసిద్ధుడైన రచయిత వాక్స్వాతంత్రాన్ని హరించి వేసి విచారణ లేకుండా వెళ్లగొట్టింది' అని నిరసించాడు. టాల్‌స్టాయ్ ఇంకా అనేకమంది ప్రముఖ రచయితలు కూడా గళమెత్తడంతో జారు దిగివచ్చి కొన్ని మాసాల పాటు క్రిమియా లో వుండేందుకు అనుమతిచ్చాడు.

— — — — * * * — — — —

**ఇరవయ్యవ శతాబ్ది గోర్కీ కొత్త చైతన్యానికి ప్రతీక కాబోతున్న సూచనలు మొదట్లోనే స్పష్టమైనాయి. 1901లో రాసిన 'తుపాను పిట్ట పాట'( సాంగ్ ఆఫ్‌ద స్టార్మీ పెట్రెల్)లో ఆయన త్వరలోనే తుఫాను రాబోతుందని హెచ్చరించాడు. 1901లోనే గోర్కి రచనలు అన్ని యూరోపియన్ భాషలలోకి అనువాదమయ్యాయి.**

— — — — * * * — — — —

1905 జనవరి9న రష్యన్ విప్లవంలో తొలి ఘట్టం. రెండు లక్షల మంది ప్రజలు చక్రవర్తిపై నమ్మకంలో మహజరు సమర్పించడానికి వెళ్లారు. ఆ నిరాయుధులపై సైనికుల కాల్పులతో ఆ అదివారం రక్తసిక్త ఆదివారంగా పేరొందింది. ప్రజలు కూడా ఎదురు తిరిగారు. ఆ సమయంలో గోర్కీ ఒక విజ్ఞప్తి రాశాడు. నిరంకుశత్వాన్ని కూలదోసేందుకు బహిరంగ తిరుగుబాటకు పిలుపునిచ్చాడు. చివరకు ఆయనను అరెస్టు చేసి మళ్లీ ప్రజల వత్తిడిపై వదలిపెట్టారు. అప్పుడే గోర్కి లెనిన్‌ను కలుసుకున్నాడు. వారిద్దరి భావాలూ ఒకేలా వున్నాయని తెలుసుకున్నాడు. తనపై వారంటు వున్న సంగతి తెలిసి జర్మనీ వెళ్లి అక్కడి నుంచి ఫ్రాన్స్‌కు చివరగా అమెరికాకు చేరుకున్నాడు.

ప్రపంచ కార్మికోద్యమానికి ప్రేరణ అయిన అమ్మను గోర్కీ సామ్రాజ్యవాద అమెరికాలో వుండగా రచించడం విశేషం. 1905 విప్లవం తర్వాత తన అరెస్టుకు వారంటు రావడంతో ఆయన విదేశాలకు తరలిపోయాడు. దేశ దేశాలు తిరుగుతూ రష్యా విప్లవానికి సహాయం కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ క్రమంలో అమెరికా చేరాడు. అక్కడే ఈశాన్య న్యూయార్క్‌లోని ఒక పెద్ద పర్వతశ్రేణిలోని క్యాబిన్‌లో కూచుని అమ్మ నవలలో చాలా భాగం పూర్తి చేశాడు. అది మొదట ఇంగ్లీషులో వెలువడింది. ఆలస్యంగా రష్యన్ భాషలోకి తర్వాత అనువాదమైంది.

అమ్మ తొలి ముద్రణ రష్యాలో పెద్ద సంచలనమే రేపింది. దాన్ని ప్రచురించిన పత్రికను ధ్వంసం చేశారు. రెండవ భాగాన్ని పూర్తిగా తొలగించేలా వత్తిడి పెట్టారు. సెన్సారింగు వల్ల చాలా అరకొరగానే అందించగలిగారు. అయినా రహస్యంగా దాన్ని చదువుతుండేవారు. విదేశాలలో మాత్రమే దాని పూర్తి పాఠం లభించేది. ప్రపంచంలోని ప్రధాన భాషలన్నిటిలోకీ అది అనువదించబడింది. అమ్మ నవల ప్రచురణపై ఆగ్రహించిన ప్రభుత్వం గోర్కీపై మరిన్ని ఆంక్షలు విధించింది. అతన్ని పట్టుకోవాలనే ఉత్తర్వులలో రచయిత అని పేర్కొనడం కూడా మానేశారు. ప్రసిద్ధమైన అతని కలం పేరు మగ్జీం గోర్కి అని గాక అసలు పేరు– అలెక్సీ మాక్సీమోవిచ్ పెష్కోవ్, చేతిపని వాడు అన్న పేరుతోనే అరెస్టు వారంటు ఇచ్చారు. అయితే గోర్కీ జారిస్టు పోలీసులను తప్పించుకుని కాప్రి దీవి చేరుకున్నాడు.

.......

'నేను ఆ తర్వాత అమ్మ పుస్తకం చూశాను. గోర్కీ రచన నేను చూడటం అదే మొదటి సారి. దాన్ని చూశాక మాత్రం అప్పటి వరకూ నేను చదివినదంతా అత్యంత నీరసమూ, నిర్జీవమూ అని తెలుసుకున్నాను. నూలు పోగులు, ముతక గుడ్డల తర్వాత అందమైన కుట్టుపనిలా అది తోచింది. చెక్కమొహాలను చూసిన తర్వాత జీవం తొణకిసలాడే మనుషులను చూసి నట్టయింది... మానవులందరి ఆశా విశ్వాసాలు అందులో తొణకిసలాడాయి..." అని ఒక ప్రముఖ విమర్శకుడన్నాడు.

ఈ మాటలు నిజానికి చాలా మంది భావాలను ప్రతిబింబిస్తాయి. దీనంతటికీ కారణం ఆ నవలలో వున్న జీవిత వాస్తవికతే.

అమ్మ నవల గోర్కి జన్మస్థలమైన పాత నగరం నిజ్నినోవోగ్రాడ్‌లో జరుగుతుంది. (దానికి ఆయన గౌరవార్థం 1932లో గోర్కి అని పేరు పెట్టారు) ఒకా నది వోల్గా నదిలో కలిసే చోటు. అక్కడ పెద్ద రేవు, రైల్వే మార్గం కూడా. పెద్ద వ్యాపార కేంద్రమైనా అక్కడ ఒకే ఒక ఫ్యాక్టరీ వుండేది. అదే క్రాసినో సొర్మోవో నౌకా నిర్మాణ కేంద్రం. గోర్కీ దాన్నే తన నవలలో నమూనాగా తీసుకున్నాడు. ఆ కాలానికి రష్యాలో వేలాది మంది కార్మికులు వున్న ఒక ముఖ్యమైన కేంద్రం అది. అక్కడ 1902లో మేడే ప్రదర్శనను పోలీసులు చెదరగొట్టడమే కాక దానిలో పాల్గొన్నవారిపై తర్వాత విచారణ జరిపారు. ఇవన్నీ తనలో ఒక పుస్తకం రాయాలనే ఆలోచన కలిగించాయని, అప్పట్లోనే తాను ఆ ఘటనల వివరాలు సేకరించి రాసి పెట్టుకున్నానని గోర్కీ తర్వాత చెప్పారు. కనక ఆయన రచనపూర్తిగా కల్పన కాదు. కళఅద్దిన వాస్తవం.

ఈ ప్రదర్శనకు నాయకుడైన పోత్ జలమోవ్‌తో గోర్కీకి చాలా సన్నిహిత పరిచయం. అతన్ని దృష్టిలో పెట్టుకునే పావెల్ వ్లాసోవ్ పాత్ర రూపొందించాడు. ఇక అతని తల్లిగారే అమ్మ నీలోవ్నా. కొడోమోత్సెవ్ అనే మరో కార్మికుడి తల్లి లక్షణాలను కూడా గోర్కి ఆ పాత్రకే జోడించాడు. ఈ ఇద్దరు తల్లులూ అనేక విధాల బిడ్డలకు సహకరించేవారు. జలమోవ్ తల్లి క్రైస్తవ సన్యాసినిగా మారువేషం వేసి పోలీసుల కళ్లు గప్పేది. ఇక కొడోమొత్సోవ్ తల్లి అయితే అతన్ని జైలు నుంచి తప్పించడానికి బాంబును దొంగచాటుగా తీసుకెళ్లింది. ఇందుకు గాను ఆమెకు జైలు శిక్ష విధించారు కూడా. తమ పిల్లలను విప్లవోద్యమంలోకి పంపిన మరికొంత మంది స్త్రీల లక్షణాలనూ కలిపాడు. (ఒక పాత్ర అలాటి అనేక పాత్రల సమాహారంగా వుండాలనే గోర్కి సిద్ధాంతం బాగా తెలిసిందే) ఈ ఫ్యాక్టరీ కార్మికుల మేడే ప్రదర్శనపై పోలీసుల దౌర్జన్యం గోర్కీపై చెరగని ముద్ర వేసింది. దాన్నే అతను అమ్మకు ప్రధాన ప్రేరణగా చేసుకున్నాడు. వాస్తవానికి ఇది 1905 విప్లవానికి ముందున్న రష్యన్ కార్మిక వర్గ జీవితమూ, పోరాటాల సాధారణ చిత్రణే.

— — — — * * * — — — —

**గోర్కి లెనిన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన 'మీ అమ్మ నవల పూర్తయిందా ' అని అడిగాడు. ' అయింది. అయితే కొంచెం హడావుడిగా పూర్తిచేయవలసి వచ్చింది' అని గోర్కి జవాబిచ్చాడు.' మంచిదే అయింది. ఇప్పుడు మనకు అలాటి రచన చాలా అవసరం. ఎందుకంటే సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోకి వచ్చిన వారిలో చాలా మంది కొత్తవారు. వారికి పాత విషయాలు తెలియవు. ఈ పుస్తకం చదివి తె లుసుకుంటారు. దీన్ని లక్షల ప్రతులు ముద్రించి అందించాలి' అన్నాడు లెనిన్.**

— — — — * * * — — — —

గోర్కి లెనిన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన 'మీ అమ్మ నవల పూర్తయిందా ' అని అడిగాడు. ' అయింది. అయితే కొంచెం హడావుడిగా పూర్తిచేయవలసి వచ్చింది' అని గోర్కి జవాబిచ్చాడు.' మంచిదే అయింది. ఇప్పుడు మనకు అలాటి రచన చాలా అవసరం. ఎందుకంటే సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోకి వచ్చిన వారిలో చాలా మంది కొత్తవారు. వారికి పాత విషయాలు తెలియవు. ఈ పుస్తకం చదివి తె లుసుకుంటారు. దీన్ని లక్షల ప్రతులు ముద్రించి అందించాలి' అన్నాడు లెనిన్. ఆయన అది ప్రచురణ కాకముందే ఒక స్నేహితుడి దగ్గర రాతప్రతి సంపాదించి చదివాడని గోర్కి గ్రహించాడు.

ఎందుకంటే అది ప్రపంచంలోనే తొలి శ్రామికవర్గ నవల.

.......

తను నివసించే నిజ్నినోవాగ్రాడ్‌లో జరిగిన మేడే ప్రదర్శననూ, దానిపై పోలీసు నిర్బంధాన్ని ప్రత్యక్షంగా చూసిన ప్రేరణతోనే గోర్కి అమ్మ రాశాడు. నవలలో ప్రధమ భాగం ఈ ప్రదర్శనలపై పోలీసుల దాడితో ముగుస్తుంది.

ఫ్యాక్టరీ యజమానులు కార్మికుల శ్రమను దోచుకోవడాన్ని వర్ణించే వాక్యాలతో అమ్మ ప్రారంభమవుతుంది. తర్వాత అక్కడి జనం జీవన దృశ్యాన్ని వర్ణిస్తుంది. ఇలా వుండీ వుండీ ఒక రోజు చనిపోయేవారు అని ఆ వర్ణనముగుస్తుంది.

వారిలో పావెల్ కుటుంబం. తాగుబోతు తండ్రి మిహాయిల్ వ్లాసోవ్. అతని దాష్టీకాన్ని భరిస్తూ బతికే తలి నీలోవ్నా. రోజంతా చాకిరీ చేసే ఆ కార్మికుడి ప్రవర్తనను ఖండిస్తూనే దానికి కారణాలను విశ్లేషించడంలో గోర్కి వర్గ చైతన్యం ప్రదర్శిస్తాడు. అతనూ చనిపోతాడు. చనిపోయాక అతని కుక్క మాత్రం రోజూ సమాధి దగ్గర కూచుంటుంది. కొన్నాళ్లకూ దాన్నీ ఎవరోచంపేస్తారు.

.......

తండ్రి దౌర్జన్యాన్ని ఒక రోజున ఎదుర్కొన్న పావెల్ తర్వాత తనూ తాగివస్తాడు! ఉన్నదానికన్నా నిషానునటిస్తాడు. అమ్మ మౌనంగా రోదిస్తుంది. తర్వాత మారిపోతాడు. రాత్రిళ్లు ఆలస్యంగా రావడం మొదలెడతాడు. వస్తూ వస్తూ ఏవో పుస్తకాలు తెస్తుంటాడు. చాలా మృదువుగా మాట్లాడతాడు. అతను ప్రేమలో పడ్డాడేమోనని మొదట్లో సరిపెట్టుకున్నా తర్వాత ఇదంతా అమ్మకు భయం కలిగిస్తుంది. అదే విషయం అడుగుతుంది. తాము చక్రవర్తికి వతిరేకంగా పనిచేస్తున్నామని చెబుతాడు. ఈ పుస్తకాలు చూస్తే జైల్లో పెడతారనీ అంటాడు. ఆ మాటలు వినగానే ఆమెకు వూపిరాడటం కష్టమై పోతుంది!

'ఆ పనెందుకు చేస్తావు పాషా' అని కొడుకును ముద్దుపేరుతో అడుగుతుంది అమ్మ.

'ఎందుకంటే నేను నిజానిజాలు తెలుసుకోవాలనుకుంటున్నాను గనక.' అంటాడు పావెల్. వారికి ఆపద రాకుండా చూడాలని అమ్మ ప్రభువును ప్రార్థించింది.

పావెల్ మేము సోషలిస్టులం అన్నప్పుడు అమ్మ నీలోవ్నా వాళ్లు చక్రవర్తిని చంపారు కదా అని అడుగుతుంది. మేము అలాటి పని చేయవలసిన అవసరం లేదు అంటాడు పావెల్. నా బిడ్డ తప్పు చేయడు అనుకుంటుంది అమ్మ.

.......

అమ్మ కొడుకును ఏదైనా ప్రశ్నించడం అదే మొదటి సారీ, చివరి సారీ. తర్వాత ఆమె సందేహాలు తెంచుకుని అతని మార్గంలో నడవడం మొదలెట్టింది. కొడుకు కోసం వచ్చే రకరకాల మనుషులూ, వారి మాటలూ చేతలూ చర్చలూ, వాదనలూ అన్నీ గమనిస్తూ వారికి అవసరమైనవి అమరుస్తూ వచ్చింది. వారంతా ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించేందుకోసం పోరాడుతున్నారని ఆమెకు అర్థమైంది. వారి తీరు తెన్నులు తను చూసిన

సమాజానికి భిన్నంగా వున్నాయి. ఆ వచ్చేవారు ప్రధానంగా కార్మికులు. అయితే అదే సమయంలో రైతులూ వస్తున్నారు. ఉన్నత వర్గీయులూ వున్నారు. ప్రశాంత చిత్తులూ, హడావుడి మనుషులూ, దూకుడు స్వభావులూ ఒకరేమిటి అన్ని రకాల వారూ. ఇప్పుడు ఆమె వారందరికీ అమ్మ అయిపోయింది. సాంత్వన ఇచ్చింది. తనేమో వారినుంచి ఉత్తేజం పొందింది.

అమ్మ అనగానే పావెల్ అతని కార్మిక మిత్రులూ గుర్తుకు వస్తారు. కాని అందులో అన్ని తరగతుల,తరాల ప్రతినిధులూ వున్నారు. కథానాయికే గత తరం ప్రతినిధి! అమ్మ నీలోవ్నా , రైతు రీబిన్, మేధావి వర్గానికి చెందిన నికోలాయ్ ఇవనావోచ్, పావెల్ అరెస్టు తర్వాత అతని స్థానాన్ని స్వీకరించి అనారోగ్యంతో కన్నుమూసే యెగోర్ వీరంతా పాతతరం వారే. ఇక యువ విప్లవ కారులలో మహిళలు గణనీయంగా వుంటారు. దూసుకు పోయే సోఫియా, పావెల్ స్నేహితురాళ్లు నటాషా, టాన్యా ఎవరూ పురుషులకు తీసిపోని విధంగా పనిచేస్తారు.

'పావెల్ విప్లవ మార్గమూ, నీలోవ్నా దయామయ న్యాయశీల హృదయమూ, మనస్సాక్షీ, జీవితాన్ని కరుణతో గడపాలనే ఆమె భావనలూ ఇవే ఈ పుస్తకంలో గోర్కీకి నైతిక ప్రమాణాలని' ఆయన సాహిత్యాన్ని మథించిన బొరిస్ బ్యాలిక్ అంటారు. ఈ కారణంగానే పాఠకులు నవలను అమ్మ కళ్లతోనే చూస్తారు. పావెల్ కామ్రేడ్లు కూడా ఆమెను అమ్మ అనడమే కాదు, పాఠకుడూ అమ్మ వెంట నడుస్తున్నానను కుంటాడు. ఒక విధంగా అమ్మ అంటే సమాజమే. 'మేమంతా ఒక తల్లి బిడ్డలం. ప్రపంచం లోని కార్మికులంతా సోదరులనే అకుంఠిత విశ్వాసమే మా తల్లి' అంటాడు నవలలో పావెల్ సన్నిహితుడైన ఆన్‌డ్రేయ్ సహోర్క. వీరికి తోడుగా రీబిన్ వంటి బలమైన రైతు పాత్రలూ వుంటాయి.'ప్రజలంతా ఒకటే ననే భావం వాళ్లకు కలిగించడం చాలా గొప్ప సంగతి. మనం చేస్తున్న పనినే లక్షలాది మంది ప్రజలు చేయదలుచుకున్నారని తెలిస్తే హృదయానికెంతో వూరట కలుగుతుంది' అంటాడు రీబిన్.

గోర్కీ సాధించిన విజయం ఇక్కడే వుంది. విప్లవ పోరాట క్రమంలో జన బాహుళ్యం ఎలా రాటు దేలతారో ఎలా పునీతులై పోతారో అమ్మ మనకు చెబుతుంది. అంతకు ముందు దోస్తోవస్కీ ప్రతివాడూ ప్రతివానికీ శత్రువే నన్న భావం విప్లవం కలిగిస్తుందని పొరబడ్డాడు. టాల్‌స్టాయ్ అనా కెరినినా మానవ వైరుధ్యాల తాకిడి తట్టుకోలేక రైలు కిందపడి ఘోరంగా ఆత్మహత్య చేసుకుంది. గోర్కీ ఈ రెంటికీ విరుగుడుగా అమ్మను, ఆమె పోరాట పథాన్ని సృష్టించాడు. ఇక్కడ మనుషులు కొత్త చైతన్యంతో ఐక్యతతో పునరుజ్జీవులవుతున్నారు. అనా కెరినినాకున్న ఆలోచనా స్థాయిలేని పాతకాలపు శ్రామిక మహిళ అమ్మ నీలోవ్నా విప్లవ శక్తులకు పురుడు పోస్తుంది!

మనిషి భవితవ్యం ప్రజా రాశుల భవితవ్యంతో విప్లవాత్మక పరివర్తనతో ముడిపడివుందనే పరమసత్యం చెప్పిన గోర్కీ ఆ క్రమంలోనే మానవుడు స్వార్థపూరితమైన ఆహాన్ని త్యజించి సమిష్టి స్ఫూర్తి సాహసాన్ని సంతరించుకోవడాన్ని చిత్రించాడు. వీటినే బూర్జువా విశ్లేషకులు వ్యక్తిత్వ రహితమైన పాత్రలుగా చిత్రిస్తుంటారు గాని వాస్తవంలో అమ్మ నవలలో ప్రతి పాత్రలో జీవం తొణకిస లాడుతుంది. అంతులేని వైవిధ్యం వుంటుంది.

"మనిషి జన్మత: దుష్టుడు కాదనీ, వర్గ వ్యవస్థ తాలూకా జుగుప్సాకరమైన సామాజిక ప్రభావం వల్లనే అతన భ్రష్టుపడుతున్నాడనీ రచయిత గుర్తించాలి. అలాటి వ్యవస్థ హింస లేకుండా వుండలేదు. అసూయ, పగ,సోమరి తనం ప్రకోపింప చేయకుండానూ వుండదు. నిర్బంధ పూరితమైన నిరర్థకమైన శ్రమ పట్ల వైముఖ్యాన్ని, సులభంగా సమకూరే లాభం పట్ల చవకబారు చెత్త సుఖాలపట్ల విషయ లౌల్యం పట్ల, తాగుడు తదితర దురలవాట్ల పట్ల ఆకర్షణ లేకుండానూ చేయలేదు. మనిషి జన్మత: నీచుడనీ, వాడి సహజ లక్షణాల్లో నీచత్వం భాగమనీ అది రాక్షస ప్రేరితమనీ అనుకునే స్థితి రాకూడదు..." ఇది గోర్కీ తరచనా తత్వం. మనిషి ఔన్నత్యం సమిష్టిలోనూ, సమరశీలతలోనూ వుందని ఆయన శక్తివంతంగా చిత్రించాడు.

అయితే విప్లవ పోరాటం కాల్పనికమైంది కాదు. వ్యక్తిగత సాహసమూ కాదు. దానిలో ఉద్వేగాలు లేని యాంత్రికతా కాదు. అమ్మలోని పాత్రల్లో ప్రేమలూ, వియోగాలూ, విషాదాలూ, వ్యాధులూ, బాధలూ వ్యక్తిగతమైన హెచ్చుతగ్గులూ అన్నీ చూస్తాము. పావెల్ స్వతహాగా ముక్తసరిగా మాట్లాడతాడు. అమ్మ నవలకు వచ్చిన ప్రఖ్యాతి వల్ల ఆ తరహా రచనల్లో నాయకుడు

## 'అమ్మ' లో పాత్రలూ, రచయితా....

**అమ్మ నవల వెలువడిన తర్వాత పరిణామాలేమంటే–**

**అమ్మ నవల ముగింపులో పావెల్ వెయ్యి మైళ్ల దూరంలోని సైబీరియా ప్రవాస శిక్షకు సిద్ధమవుతుంటాడు. అమ్మ పోలీసుల దౌర్జన్య కాండలో చిక్కుకుంటుంది.**

**ఈ పాత్రలకు ప్రేరణ అయిన వారి మాట? పావెల్‌కు ప్రాణమిచ్చిన ప్యోత్‌జలమోవ్ రష్యన్ విప్లవాన్ని సోషలిజం అభివృద్ధిని కళ్లారా చూసి 1955లో చనిపోయాడు. అతని తల్లి అమ్మకు మూల ప్రేరణ అన్నా కిరిలోవ్నా కూడా విప్లవం తర్వాత చాలా కాలానికి 1938లో మరణించింది. ఆ విధంగా అమ్మ నవలలో ఆమె మాటలు వాస్తవ జీవితంలో నిజమైనాయి.**

**ఇక గోర్కీ విషయానికి వస్తే అమ్మ నవల తర్వాత ఆయన ప్రతిష్ట తారాస్థాయికి చేరింది. విప్లవానికి వూపిరిపోసింది. ఆ తర్వాత కాలంలో ఆయన రచనల్లో పరిణితి, సమగ్రత అమోఘంగా వికసించాయి.రాను రాను ఆయన పత్రికా రచనలో ఎక్కువగా మునిగిపోయాడు. ప్రపంచ వ్యాపితంగా రచయితలకు గొప్ప మార్గదర్శి అయ్యాడు. అనారోగ్యం కారణంగా లెనిన్ బలవంతంపై 1921లో విదేశాలకు వెళ్లాడు. ఒకప్పటి ఆత్మహత్యాప్రయత్నం ఫలితమైన తూటా గాయం ఇప్పుడు విషమించింది. 1928 తర్వాత ఆయన వేసవికి మాత్రమే సోవియట్ రాగలిగేవాడు. 1933లో అనారోగ్యంగానైనా సోవియట్‌లోనే వుండిపోవాలని పట్టుపట్టాడు. ఫాసిజంపై పోరాటంలో కూడా పాలుపంచు కున్నాడు.మరో మూడేళ్ల తర్వాత ఫాసిజం ప్రమాదం ముంచుకొస్తున్నపుడు 'యుద్ధాలు వస్తున్నాయి సిద్ధంగా వుండాలి' అంటూ తుదిశ్వాస విడిచాడు. కాని అమ్మ నవల పుట్టుకకు కేంద్రమైన నిజ్నీ నొరోగోద్ ఫాసిజంపై యుద్ధ కాలంలో అపూర్వంగా ఉత్పత్తులు చేసి జేజేలందుకుంది.**

గంభీరంగా వుండాలనే భావన కూడా కొందరిలో వచ్చింది. కాని వాస్తవానికి అమ్మ స్వయానా కొడుకును మరింత అర్థమయ్యేలా మాట్లాడితే బాగుండనుకుంటుంది. " నీవు బాగా మాట్లాడతావు. కాని హృదయాన్ని స్పందింప చేయలేవు. అదంతే. వాళ్ల హృదయాలు కంపింపచేసేట్టు చెప్పాలి. గుండెల్లోపల నిప్పు రవ్వ రగిలించాలి. వాళ్లతో వాదించి ఒప్పించలేము. బిగుతు జోడుకాలికి ఎక్కదు' అంటాడు రీబిన్. అమ్మ కూడా ఇతరులతో పోల్చుకుని అతనెందుకు అలా మాట్లాడలేదు అని ఆలోచిస్తుంది. హడావుడి చేసే అమ్మాయిని చూసి ఈమె రీబిన్‌కు నచ్చదు అనుకుంటుంది. తీరా ఆమెను అతను ఆమోదించిన తర్వాత హమ్మయ్య అనుకుంటుంది. కొడుకును జైలు నుంచి తప్పించాలన్ననిర్ణయానికి సంతోషిస్తుంది.అది సరైన నిర్ణయం కాదని అతను అన్నందుకు మౌనంగా బాధపడుతుంది.

'మన పిల్లలే మన పాలిట న్యాయాధిపతులు' అని జైలులో తనను ఎకసెక్కం చేసిన అధికారికి ధైర్యంగా బదులు చెబుతుంది. తను పూజించే క్రీస్తు బోధనలకు వారి కార్యాచరణలోనే చూసుకుంటుంది. చివరకు ఆధ్యాత్మికత కన్నా ఈ పోరాటాలే గొప్పవన్న నిశ్చయానికి వస్తుంది. గూఢచారుల కళ్లుగప్పి విప్లవ సాహిత్య ప్రచారంలో సహాయక కార్యకలాపాలలో భాగం పంచుకుంటుంది.

చాలా చాలా ఘటనలు జరుగుతాయి. నిర్బంధాలు, సాయుధ భటుల దౌర్జన్యాలు, శిక్షలూ అన్నీ తట్టుకుంటుంది. చివరలో ఇలా చెబుతుంది:

'నా కొడుకు చెప్పిన మాటలను, నా రక్తంలో రక్తమూ మాంసంలో మాంసమూ అయిన నా కొడుకు మాటలను ఇతరులకు చెబుతుంటే నాకెంత సంతోషమో మీకు తెలిస్తేనా? నా ఆత్మను సమర్పిస్తున్నట్టే.

ఇదంతా చూస్తుంటే మానవుని కడుపున కొత్త దేవుడు అవతారమెత్తినట్టుగానే వుంది. ప్రతి ఒక్కటీ అందరికీ అంతా ప్రతి ఒక్కడికీ. నేనా దృశ్యాన్నే చూస్తున్నాను.నిజం చెప్పాలంటే మనమంతా కామ్రేడ్లం. ఆత్మీయులైన బంధువులం. అందరమూ సత్యమనే తల్లి బిడ్డలం. కామ్రేడ్స్ అనే మాటను నాలో నేను స్మరించే సరికి వారు నా హృదయంలోంచి పొంగి వస్తుండడం నేనే వినగలుగుతున్నాను'

నవల ముగింపు ఘట్టంలో పోలీసులు దౌర్జన్యం చేసినప్పుడు–

రక్తపుటేర్లు పారించినా సత్యాన్ని ముంచేయలేరు' అని గర్జిస్తుంది.

ఆ గర్జన ఇప్పటికీ ప్రపంచమంతా మార్మోగుతూనే వుంది. అమ్మ కావాలని అడిగే పాఠకులు అసంఖ్యాకం. ఇంటర్‌నెట్ చూస్తే అమ్మ నవలపై అపారమైన స్థాయిలో అభినందనా పూర్వకమైన అంశాలు కనిపిస్తాయి. దాన్ని యథాతథంగా అందించే సైట్లు లెక్కలేనన్ని . దాని పూర్ణ సంక్షిప్త ప్రచురణలు ఎన్నెన్నో. ఇప్పటికీ వాటిని చదివిన వారు ఉత్తేజితులవుతూనే వున్నారు. ఎందుకంటే అమ్మ అంటే జీవితం. జీవిత పోరాటం.

తన పుస్తకం ఫ్రెంచి ముద్రణకు ముందు మాట రాస్తూ గోర్కీ ఇలా అంటాడు:

.... ఇన్ని సంవత్సరాల నుంచి శ్రామికవర్గం అమ్మ నవల చదువుతూనే వుంది... గతించి పోతూవున్న పెట్టుబడిదారీ విధానపు ఏహ్యమైన ప్రకంపనాలు ఫ్రెంచి శ్రామికవర్గానికి ప్రపంచ శ్రామికవర్గానికీ ఇంకా ఇంకా స్పష్టంగా గోచరిస్తున్నప్పుడు ఈ పుస్తకపు నూతన ముద్రణ వెలువడుతోంది. "ఇలా అంటూ గోర్కీ ఆనాటి ప్రపంచ పరిస్థితులను ఫాసిజం ప్రమాదం వగైరాలను ప్రస్తావిస్తాడు. ప్రపంచీకరణ నేపథ్యంలోనూ అమ్మ శతజయంతికి అలాటి ప్రాధాన్యతే కలుగుతోంది!



## శ్రమైక జీవి

**మడిపల్లి భద్రయ్య**

తెలవారక ముందే ఊరూ వాడంత ఊడ్చి
కారుచౌకగా తన జీవన తీరం దాటే
ఆయమ్మను ఏమనాలి! ఆ కొమ్మను ఏమనాలి!
కలవారి కోడలా! కాదు కాదు కాదు.
మురిపాల ముగ్ధయా! ఊహూ అసలు కాదు
మురికివాడె అడ్రసుగా చిరంజీవియై సాగెడు
చింపిరి బొంతల బ్రతుకుతో – చీదరింపునెరుగకామె
సాగును ఎన్నో మైళ్ళు నిత్యం దినకృత్యంగా
అందరి వాకిళ్లామెవే – అందరి లోగిళ్లామెవే
సుందర తరముగ తీర్చెడి – కుందనపు బొమ్మ! ఆమె
మన మలినం పులుముకొనెడు మహా మహిళ! ఆమె
మన ఎంగిలి మంగలాన్ని – వంగి వంగి – డోకి డోకి
శుభ్రం చేసెడి "శుభదే" శుచిర్భూతె ఆ తల్లి!
నిస్వార్థం – నిబ్బరం – నిదానమే ప్రధానమై
ప్రతి నిన్నను ఇట్టె మరచు ప్రతిభామూర్తియె ఆమె
రేపటి తలపేలేని రేరాణియె ఆమె – పూబోణియె ఆమె
అర్ధరాత్రి కోడి కూతె – ఆమె చర్యకారంభం
జనం మేలుకొనకముందె జగం మేలు కోరునామె
ఒయ్యారాన్నొలకబోయు వగలాడి కాదు ఆమె
కయ్యానికి కాలుదువ్వు గయ్యాళా! ఆమె కాదు
వగపెరుగని "వసుధే" తను – క్షమియించు "క్షమే" తాను
ఊరంతా నాదనన్న ఉదారవాదం తనది
ఉదర పోషణిదే యనెడు ఉత్తమురాలామె చూడ
"పరిశుభ్రతే పరమాత్ముని – స్వరూపమని" నమ్మి ఆమె
పనిచేయుటె తన పనిగా – మనెడు "మట్టి మనిషె" ఆమె
ప్రతి పూట పొడుచునట్టి "పొద్దు పొడుపె" ఆమె
సద్దు చేయకుండ సాగు "శాంతి దూతె" ఆమె
ఎవరో ఆమెవరో కాదు మన చెల్లే – మన తల్లే
ఆ తల్లి రుణంలోన – లోకమెల్ల పణం
అంతటి సహనం శాంతిని మనమెప్పుడు కనం

## నివేదిక

# కష్టజీవుల కథల గురించి...



**ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యాపార సంస్కృతి విస్తరిస్తోంది. మానవ సంబంధాలూ విలువలూ దిగజారుతున్నాయి. వీటికి తోడు నగర జీవిత పోకడలూ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావమూ, తీవ్ర పోటీ పాఠకులతో పాటు రచయితలను కూడా ప్రజా సాహిత్యం నుండి దూరం చేస్తున్నాయనే అపోహలు నేడు వ్యాప్తిలో ఉన్నాయి. వాటిని పటా పంచలు చేస్తూ ఈ కథల పోటీ పట్ల రచయితలు బాగా స్పందించారు. ప్రజల నుండి, పోరాటాల నుండి దూరమై స్వలాభాల కోసం తాపత్రయ పడే వారే ఇటువంటి అపోహలతో నిరాశ నిస్పృహలు వ్యాప్తి చేస్తున్నారని రుజువు చేశారు.**

**సత్య భాస్కర్**

ప్రపంచీకరణ నేపథ్యంలో 'అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు – వారి సమస్యలు – పరిష్కారాలు' అనే ఇతివృత్తం మీద 'కార్మికలోకం' పత్రిక ఇటీవల కథల పోటీ నిర్వహించింది. నేడు అసంఘటిత రంగం విస్తరిస్తున్న తీరును, సమస్యలను, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణులను, ఈ రంగంలో సిఐటియు సాగిస్తున్న కృషిని వివరిస్తూ ఒక కరపత్రాన్ని కూడా రచయితల కోసం విడుదల చేసింది.

**ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యాపార సంస్కృతి విస్తరిస్తోంది. మానవ సంబంధాలూ విలువలూ దిగజారుతున్నాయి. వీటికి తోడు నగర జీవిత పోకడలూ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావమూ, తీవ్ర పోటీ పాఠకులతో పాటు రచయితలను కూడా ప్రజా సాహిత్యం నుండి దూరం చేస్తున్నాయనే అపోహలు నేడు వ్యాప్తిలో ఉన్నాయి. వాటిని పటా పంచలు చేస్తూ ఈ కథల పోటీ పట్ల రచయితలు బాగా స్పందించారు. ప్రజల నుండి, పోరాటాల నుండి దూరమై స్వలాభాల కోసం తాపత్రయ పడే వారే ఇటువంటి అపోహలతో నిరాశ నిస్పృహలు వ్యాప్తి చేస్తున్నారని రుజువు చేశారు.** అహర్నిశలూ సమాజానికి సేవలందిస్తూ కూడు లేక, గూడ లేక అణగారిపోతున్న కష్టజీవులు వీరి కథల్లో సజీవమూర్తులుగా దర్శనమిచ్చారు. కనీసం తోటి మనిషి బాగోగులను పట్టించుకునే తీరికా ఓపికా లేని మనలాంటి వాళ్లను నిశ్చేష్టులను చేస్తూ కంట తడి పెట్టించే కథలు రాశారు. ఇంటి పనివాళ్లు, రిక్షా కార్మికులు, కండక్టర్లు, డ్రైవర్లు, కూరలమ్ముకునేవాళ్లు, అడ్డా కూలివాళ్లు, రోడ్లు ఊడ్చే శ్రామిక మహిళలు, కాటరింగ్ కార్మికులు, సేల్స్ పర్సన్లు, మత్స్య కార్మికులు, క్వారీ కార్మికులు, చిన్న చిన్న కార్ఖానాల్లో యజమాని దయాదాక్షిణ్యాలపై అధారపడి దిన దిన గండంగా బతికే శ్రామికులు, హైటెక్ పరిశ్రమల్లో కులవివక్షకు బలై బడ్డీ కొట్టుపెట్టుకున్న విద్యావంతులు – ఇలా అణగారిపోతున్న ఎందరెందరి జీవన చిత్రాలనో మన కళ్లముందు నిలబెట్టారు.

యాళ్ల అచ్యుతరామయ్య రచించిన "బ్రతుక్కి అర్థం" కథకు మొదటి బహుమతి లభించింది. ఈ కథలో 'ఆల్విన్' ప్రైవేటీకరణ వల్ల రోడ్ల పాలైన ఓ కార్మికుడు బతుకు తెరువు కోసం విదేశాలకు వెళ్లేందుకు సిద్ధపడతాడు. ఈ పరిస్థితుల్లో కన్నకొడుకును విడిచి వుండలేని ముసలి తల్లి ఎంతగానో వేదన చెందుతుంది. ఆ సందర్భంలో వారి మానసిక సంఘర్షణ చిత్రితమైన తీరు పాఠకులను కంట తడి పెట్టిస్తుంది. ఈ కథలో ప్రధాన (కథానాయకుడి) పాత్ర ఎవరిది అనేది నిశితంగా పరిశీలిస్తే కానీ అవగతం కాదు. కథా ప్రారంభంలో కొడుకుని విదేశాలకు వెళ్లవద్దని తల్లి బతిమాలుతుంది. పొరుగున నివసించే మహిళ వారికి ధైర్యం చెబుతుంది. వామపక్ష కార్యకర్త అయిన తన కొడుకుని వారికి సాయం చేసేందుకు పంపిస్తుంది. అతని సలహా – సహాయంతో ఆ కార్మికుడు విదేశీ ప్రయాణం మానుకుంటాడు. వేరే కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా చేరి ఇక్కడే ఉండిపోతాడు. క్రమంగా ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ పోరాటాల్లో భాగస్వామి అవుతాడు. కొడుకుతో పాటు తల్లి కూడా ఆ ఉద్యమ స్వభావాన్ని అర్థం చేసుకుంటుంది. చివరకు ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడి రాకను నిరసిస్తూ సాగిన ప్రదర్శనల్లో తానూ పాల్గొంటుంది. ఆ సందర్భంలో ఆమెను ఓ విలేకరి ఇంటర్వ్యూ చేస్తాడు. తన లాంటి తల్లులకు కడుపు కోత మిగులుస్తున్న.. తమ బిడ్డల జీవితాల్లో నిప్పులు పోస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదంపై ఆ తల్లి ఆగ్రహాన్ని వెలిబుచ్చడంతో కథ ముగుస్తుంది. ఈ రకమైన ముగింపు గోర్కీ నవల 'అమ్మ'ను గుర్తుకు తెస్తుంది. స్వయంగా ప్రయివేటీకరణ బాధితుడైన రచయిత ఈ కథల పోటీలో మొదటి బహుమతి పొందడం విశేషం. 'కార్మికలోకం' కథల పోటీ నిర్వాహకులు ఆశించిన ప్రయోజనం ఈ విధంగా సంపూర్ణంగా నెరవేరిందని భావించవచ్చు.

ఎలికట్టె శంకరరావు రచించిన 'పొరకలు' కథకు రెండవ బహుమతి లభించింది. ఈ కథలోని పాత్రలు నిత్యం మన రోడ్లను ఊడుస్తూ చెత్తను ఎత్తి వేస్తూ కనపడే శ్రామికులే. తెలంగాణా మాండలికంలో సాగిన ఈ రచన ఎవరి గుండెనయినా కదిలించకమానదు. అర్ధరాత్రి అపరాత్రి అనక రోడ్లను ఊడుస్తూ, నెలల తరబడి జీతాలు రాక ఇబ్బంది పడుతూ, కాంట్రాక్టర్లు – అధికారుల ఛీత్కారాలకు గురవుతూ, కౌన్సిలర్ల బేరసారాలకు బలవుతూ, ఆకలితో అల్లాడుతూ బతుకుతున్న సజీవ పాత్రలు ఈ కథలో మనల్ని నిలదీస్తాయి. కథనంపై – మాండలికంపై రచయిత తనకు గల పట్టును ప్రదర్శించారు.

"రక్తంతో నడుపుతాను రిక్షాను! నా రక్తమే నా రిక్షాకు పెట్రోలు" అనే చెరబండరాజు గీతానికి సజీవ సాక్ష్యంలా

కనబడే రిక్షా కార్మికుని పాత్రధారిగా చేసి మునిసురేష్ పిళ్ళై రచించిన కథ 'కండ్లలో ఊట'. దీనికి మూడవ బహుమతి లభించింది. వేలాది రూపాయలు వెచ్చించి విలాస వస్తువులు కొనే పెద్ద మనుషులు వాటిని ఇంటికి చేర్చే సాటి మనిషి అయిన రిక్షా కార్మికుడి పట్ల ఎంత నిర్దయగా, మోసకారితనంగా వ్యవహరిస్తారనేది ఈ కథ కళ్లకు కట్టేలా చూపించింది. మోసానికి గురైన ఈ రిక్షావాడు కడుపు మండి తన నిరసనను తనకు చేతనయిన పద్ధతిలో వ్యక్తం చేస్తాడు. రిక్షా కార్మికుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలనే సందేశాన్ని అందిస్తుంది ఈ కథ.

ఈ కథల పోటీకి వందకు పైగా కథలు వచ్చాయి. ప్రముఖ కథా రచయితలు సింగమనేని నారాయణ, అక్కినేని కుటుంబరావు, 'ప్రస్థానం' ఎడిటర్ తెలకపల్లి రవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అక్టోబరు 19న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద జరిగిన 'శ్రామిక సమరభేరి' సభలో వేలాదిమంది అసంఘటిత రంగ కార్మికల సమక్షంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి. రాఘవులు విజేతలకు బహుమతులు అందచేశారు. మొదటి బహుమతి పొందిన అచ్యుతరామయ్య తన బహుమతి మొత్తాన్ని 'కార్మికలోకం' పత్రికకు విరాళంగా ప్రకటించారు.

మన స్థూల జాతీయ ఉత్పత్తిలో 60 శాతం పైగా వాటా అసంఘటిత రంగ కార్మికులదే. అయినప్పటికీ కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు, రక్షణ చట్టాలు కరవై అభద్రమైన జీవితాన్ని గడుపుతున్నారు 36 కోట్ల మంది అసంఘటిక రంగ కార్మికులు. వారిని తోటి మానవులుగా గుర్తించి, వారి పోరాటాలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేయడంలో కథా రచయతలందరూ కృతకృత్యులయ్యారు. ఈ కథలతో త్వరలో ఓ సంకలనం వెలువరించనున్నట్టు 'కార్మికలోకం' పత్రిక ప్రకటించింది. ప్రపంచీకరణ యుగంలో వెలువడుతున్న ఈ కథా సంకలనం తెలుగు సాహితీ జగత్తును పోరుబాట వైపు నడిపిస్తుందని ఆశిద్దాం.

---



## జాలరి బతుకు

**సువారపు రామచంద్రరావు**

పేగుల్ని దారాలు చేసి
గుండెల మగ్గాల్తో
ఆశల వలలు అల్లుకున్న వాళ్ళు!
ఎప్పటికప్పుడు భావి బంగారం అనుకొని
కలలు పండాలని
ఆకాశంకేసి చూసేవాళ్ళు!!

సంద్రం సరిహద్దని తెలిసి కూడా
సమీపాన బ్రతికేవాళ్ళు!
వారి గుడిసెలు ఎండిన ఆకుల శకలాలు
వారి గుడ్డలు చినిగిన పీలికలు
చీకటిలో నివసించే వారికి
సూర్య చంద్రులే వెలుగులు!
బ్రతుకులు భారమై
అప్పుల్లో బ్రతికే వారికి
మార్కెట్ మాయాజాలంలో
మరబోట్లు పొందలేక
తమ శ్రమతో నిర్మించిన
కొయ్య పడవులే వారి వృత్తికి
మూలాధారం!
ఎండనక వాననక
రెక్కలే తెప్పలేసుకుంటూ
అలల సుడులు నధిగమించి
దూర తీరాలకు చేరి
వలల్తో పట్టి తెచ్చిన
జీవరాసులే వారి వుపాధికి మూలం!!
ఈ జీవరాసులకే వారంటే ప్రేమ, కరుణ
పాలించే ప్రభుజన రాసులకిసుమంత
సానుభూతి లేదు!
ప్రాణాల్ని అరచేతుల్లో వుంచి
ప్రకృతిని నమ్మి బిక్కు బిక్కుమంటూ
వేట కోసం లోలోపలికి వెళ్లే
బడుగు వాళ్ళు వీరు!!
వెళ్ళిన వాళ్లు యిల్లు చేరే వరకు
కళ్ళు కాయలు చేసుకొని
ఆత్మీయులు ఆందోళనా హృదయాల్తో
ఎదురు చూస్తుంటే
దరికి చేరిన వాళ్ళకంటే
ఒడ్డునున్న దళారీదే వారిపై పెత్తనం!
దళారీ దయా దాక్షిణ్యంతో
శ్రమకు సమంకాని కాసులే
వాళ్ళ బ్రతుకు పూసులు
వారి శ్రమ దోపిడి ఫలితం!
అనంత సుఖభరిత దళారీ జీవితం!!
నిరంతర దోపిడి రాపిడికి గురైన
వారి జీవితం ఆక్రందనల మయం
ఆకలి అప్పుల నిలయం!!
బక్కచిక్కిన శరీరాల్తో
ఎండిన డొక్కలతో
పిడికిళ్ళు పైకెత్తి నినదిస్తే
అరెస్టులు, నిరసనల మధ్య
వారికందే ప్రభుత్వ సాయం గూడ
అంతంత మాత్రమే!!
ప్రకృతి కన్నెర్ర చేసి
ఆకాశం ఆగ్రహిస్తే
ఉరుములు మెరుపులతో
వర్షం పెనుభూతమై
వికటాట్టహాసం చేస్తే
పెనుగాలి ప్రభంజనమైతే
విధి వక్రంగా ప్రవర్తించి
సముద్రపు అలలు ఎగిరెగిరి
కరాళ నృత్యం చేస్తే
వారి జీవనాధారపు పడవలు
కొట్టుకుపోతాయ్!
అల్లుకున్న ఆశల వలలు
పటాపంచలైపోతాయ్!!
నమ్మిన సముద్రం కాస్తా
సరిహద్దు నతిక్రమించి
కొంపా గూడుల్ని తనలోకి లాక్కెళ్లితే
వారి జీవితాలు వేదన భరితాలు!
పొగిలిన ఏడ్పులకు సాక్షిగా
నిలిచిన అగాధాలు!!
ఉప్పెనొచ్చినా గంగవరం పోర్టొచ్చినా
అపారంగా నష్టపోయేది వాళ్ళే
గంగాపుత్రులుగా జన్మించిన వారిపై
ఆ గంగకే కరుణ లేనప్పుడు
సమస్యల జీవన వలయాల్లో చిక్కి
నిత్యం సతమతమవుతూ
శిథిలమయ్యే వారి జీవితాలకు
వెలుగెప్పుడు?
వారి వృత్తికి భుక్తికి
తగు హామీ రక్షణలెప్పుడు?
జాలరులుగా జన్మించడం పాపమా?
నిరంతరం శ్రమించడం, రోదించడం
వారికి శాపమా!!

## పురస్కారం

# ఆరు పదుల ఆత్మీయ కథకుడు మునిపల్లె రాజుకు సముచిత గౌరవం




ప్రస్థాన్

పురా పరిమళం, మానవీయ స్పర్శ, వ్యక్తావ్యక్త భావరవళి, ఆర్ద్ర భాషా వ్యవస్థ, అనుభవ పూర్వక ఆత్మీయ కథాశైలి ఇవన్నీ కలిస్తే మునిపల్లె రాజు. అద్భుత వాస్తవికత అన్న సాంకేతిక శిల్ప పరిభాష అన్వయం ఏమైనప్పటికీ అర్ధశతాబ్దికి పైగా అవిరామంగా అక్షర సంపదలు అందిస్తున్న జిజ్ఞాసువు ఆయన. మునిపల్లె రాజు అస్తిత్వనదం ఆవలి తీరాన కథా సంపుటికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం తెలుగు సాహిత్యాభిమానులందరికీ ఆనందదాయకమైన విషయం. ఆయన సాహిత్యంతో, ఆయనతో ప్రగాఢ పరిచయం వున్నవారికి మరింత సంతోషం.

మునిపల్లె రాజు వయసు ఎనభై రెండేళ్లు. ఆయన తన పదకొండవ ఏట కథా ప్రస్థానం ప్రారంభించారు. జగమెరిగిన ఆయన తొలి కథ 1952లో అచ్చయిన వారాలబ్బాయి. మునిపల్లె రాజు కథలు పేరుతో నాలుగు సంపుటాలు వెలువడ్డాయి. ఇందులో మ్యాజికల్ రియలిజం కథలు పేరిట వచ్చిన అస్తిత్వనదం ఆవలి తీరాన అన్నది నాల్గవ సంపుటం. జర్నలిజంలో సృజనరాగాలు పేరుతో పత్రికలలో వెలువడిన సాహిత్య వ్యాసాలను ఇటీవలే మరో సంపుటంగా తెచ్చారు. ఆయన రాసిన పూజారి నవలను అరవయ్యవ దశకంలో కళాతపస్వి బి.ఎన్.రెడ్డి పూజాఫలం సినిమాగా తీశారు. కథలతో పాటు ' వేరొక ఆకాశం, వేరెన్నో నక్షత్రాలు, అలసిపోయిన వాడి అరణ్యాకాలు' అన్న రెండు కవితా సంపుటాలను కూడా వెలువరించారు. అస్తిత్వనదం ఆవలి తీరాన అన్న సంపుటం ముగింపులో తన బాల్యాన్ని సాహిత్య పరిచయాన్ని వివరించే జ్ఞాపకాలను కూడా పునర్ముద్రించారు.

మునిపల్లె రాజు 1925 మార్చి 16న గుంటూరు జిల్లా బాపట్లలో పుట్టారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక కేంద్రమూ అనేక మంది అతిరథ మహారథులకు పుట్టినిల్లూ అయిన తెనాలిలో ఆయన తొలి బాల్య దశ గడిచింది. 1943 నుంచి నలభై ఏళ్లపాటు రక్షణ శాఖలో పనిచేశారు. విశాఖ పట్టణం నుంచి బొంబాయి వరకూ అనేక ప్రదేశాలు చూశారు. విస్తారమైన జీవితానుభవం, విశ్లేషణాత్మకమైన ఆలోచనా ధోరణి ఆయనలో కథన కౌశలానికి పదును పెట్టాయి. ఆయన అర్ధ శతాబ్ది పాటు అవిచ్ఛిన్నంగా రాస్తూనే వున్నారు.







ఆర్. కె. లక్ష్మణ్ వంటి వారి రచనలలో వుండే ప్రశాంతత, విశ్వనాథలోని నవ్యసంప్రదాయ ఛాయలు, కొడవటిగంటిలో కనిపించే వివేచనా శీలత, బుచ్చిబాబులోని తత్వ మీమాంస, మల్లాదిలోని గడుసైన ముగ్ధత్వం, శ్రీపాదలోని మానవీయ స్పర్శ, వగైరాలన్ని మునిపల్లె రాజు కథలలో ఒక్కచోట పోగుపోసుకుని కనిపిస్తాయి. అస్తిత్వం అనే మాట తరచూ వినిపించే ఆయన రచనల్లో గతం పట్ల అవ్యాజ మమకారం, వర్తమానంలో దాని అడుగుజాడల అన్వేషణ, ఈ రెండూ కలగలసిన మానవాంత:కరణమూ దర్శనమిస్తాయి. మామూలు మనుషులలోని మహనీయ పార్శ్వాలను పట్టి చూపడం, చైతన్యాన్ని కుదిపిలేపే ముగింపులు ఆయన ప్రత్యేకతలు. ప్రాచీనత పట్ల ఒక విధమైన ఆరాధన కనిపిస్తున్నా ఆయన వర్తమానంలోంచే బయిలుదేరి అక్కడికే వస్తారు. మ్యాజికల్ రియలిజంలో రెండో భాగానికి ప్రాధాన్యత నిచ్చేకథలే ఎక్కువగా రాశారు. ఆయన కథల్లో మ్యాజిక్‌లాగా కనిపించేది కూడా వాస్తవికత లోనే దర్శనమిస్తుంది. అయితే కథకుడైనా పాఠకుడైనా దాన్ని ఎలా స్వీకరించ వచ్చుననేది వారి వారి భావాలను బట్టే. ఆ విధమైన ద్వంద్వ అన్వయం వాటిలో సర్వసాధారణం. చాలా కథల్లో చివర వుండే కొసమెరుపు చదువరిని దిగ్భ్రమకు గురి చేస్తుంది.

వారాలపిల్లాడు కథ 1952లో భారతిలో వచ్చింది. బాగా బతికిన కుటుంబం చితికిపోతే ఆ ఇంటి కుర్రాడు నారాయణ వారాలు చేసుకుని బతకాల్సి వచ్చింది. వారాలు అంటే వారంలో ఒకో రోజు ఒక ఇంట్లో తిండి తింటూ బతికే ఆ పద్ధతి ఒకప్పుడు బాగా వ్యాప్తిలో వుండేది. అది కూడా అగ్రకులాల వారే . నారాయణ ఆ విధంగా ఒకో ఇంటి దగ్గర ఒకో అనుభవం పొందాడు. కాలక్రమంలో నేరస్తుడయ్యాడు. ఎవరూ వారాల పిల్లలను చదివించకూడదనే షరతు మీద నేరం అంగీకరించాడు. రేపు ఉరితీస్తారనగా పండిపోయిన అమ్మ

మామయ్యతో కలసి వచ్చి భగవద్గీత ఇచ్చింది. అదిచదివిన నారాయణ అమ్మా నా డబ్బూ వస్తువులూ నీకు ఇస్తారు. నేను చచ్చిపోయిన తర్వాత నీవొక వారాల పిల్లాణ్ని చదివిస్తే సంతోషిస్తా అన్నాడు. ఈ మలుపుకే పాఠకుడు కరిగిపోతాడు. ఆ రోజు వాళ్ల స్వగ్రామంలో పురాణ శ్రవణం చేసిన పంతులు గారు ఈ రోజుఉరితీసిన నేరస్తుడు మన వూరివాడేనట కలికాలం అంటూ నోరు నొక్కుకుంటాడు. పాఠకుడికి ఇందులోని బూటకత్వం వ్యాఖ్యానం లేకుండానే అర్థమై పోతుంది.

లక్ష్మీ ఉపాసకుడు అన్న కథ వాస్తవానికి ఈ కాలానికి చెందినదేమో అనిపిస్తుంది. వినిమయ సంస్కృతి ఇంతగా ప్రబలని రోజులలోనే ఆయన సుఖసంపదల కోసం పరుగులు తీసిన ఒక మనిషి ఆరాటాన్ని బలంగా చిత్రించాడు. కస్తూరి తాంబూలం కథ దాయాది కలహాల దావానలంలోనూ మానవతా పరిమళం మిగిలి వున్న వైనాన్ని చెబుతుంది. ఈ కథలో పక్క పక్కనే వున్నా పలకరింపలు లేని శాపనార్థాల మామ్మ గారు ప్రసవ సమయంలో కస్తూరి తాంబూలమిచ్చి కడశ్వాస విడుస్తుంది. బిచ్చగాళ్ల జెండాలో కరువు తట్టుకోలేక వలస పోయిన అభాగ్య జనసందోహం అక్కడ దళారీ పీడకులపై పాత గుడ్డపీలికలే జండాలుగా చేసుకుని తిరగబడతారు (ఈ మధ్య నెల్లూరులో సెజ్‌కు వ్యతిరేకంగా పోరాటంలో ఇలాటి పరిణామం వాస్తవంగా జరిగింది. లారీలు తుడవడానికి పెట్టుకున్న పాత గుడ్డల మూటలోంచి ఎర్రపీలికలు తీసి తిరగబడ్డారట) వీర కుంకుమ కథ– రాయలసీమ కరువు రోజుల్లో అభిమానం వదులుకోలేని రైతు కుటుంబం అనివార్యమై ఎద్దు పుల్లన్నను అమ్ముకున్నాక ఆఖరి ఘట్టం నాటకీయత వాస్తవికతల మేళవింపులా నడిచి గ్రామీణ భావాలను ఆవిష్కరిస్తుంది. నిశ్శబ్దం ఒక పదం కాదు– పదవీ విరమణ చేసిన మనిషి మౌన నిష్క్రమణను చెబుతుంది. ఆత్మహత్య అంచులకు చేరిన నిరాశోపహతులలైన యువతీ యువకులు ఆఖరి క్షణాల్లో ఒకరికొకరుగా చేరువై దేహాలు ఆత్మలు పెనవేసుకున్న వైనం చూస్తాం. నైమిశారణ్యంలో సత్రయాగం వంటి కథల్లో మార్మిక వాస్తవికత పురా వైభవ సంస్మరణ కొంచెం ఎక్కువగా వుంటాయి. సప్తతి మహోత్సవం కథనంలోనూ, నాటకీయతలోనూ చాలా బలమైన కథ. ఇందులో బీభత్సమూ ఆర్ద్రతా లౌకికతా సమాన స్థాయిలో వుండటం ఇందులో విశేషం.

ఇలా రాజుగారి కథల్లో చెప్పుకోదగ్గవీ, చెప్పుకోవలసినవీ చాలా వున్నాయి. విమర్శకులే గాక ప్రముఖ రచయితలు కూడా ఆయనను ఎంతగానో గౌరవిస్తారు. రచయితగానే గాక వ్యక్తిగానూ అందరికీ సన్నిహితుడు. రాజుకు అవార్డు రావడం పట్ల సాహితీలోకంలో హర్షం వ్యక్తమైంది. ఆయనకు ఫిబ్రవరిలో దీన్ని బహుకరిస్తారు.

# ఒకానొక ఖాళీ గురించి

**కోసూరి రవికుమార్**



గోడ మీద ఒక పెద్ద ఖాళీ
ఎన్ని రంగులు వేస్తున్నా
ఆ కాస్తంత చోటు ముందు
గోడంతా చీకటే

ఆ ఖాళీలోకి చూచినపుడల్లా
నిలువెల్లా చల్లని చూపులేవో తడుముతున్నట్లు
ఎలా వున్నారర్రా! అంటూ
మెత్తగా బుగ్గల్ని స్పృశిస్తున్నట్లు
అనుభూతుల మేఘం ముఖమ్మీద వాలినట్లు
గోడ మీద వెన్న పులిమినట్లు
తెలీని కాంతిపుంజమేదో
ఆ చోట్లో అలుక్కుపోయింది

నాలుగు గోడల మధ్యన
తిరుగుతున్నామన్న మాటేగానీ
కనబడని కవచాలేవో చుట్టూ వున్నట్లు
మాటలను, మాయం చేసే మాయడబ్బా ముందు
కుప్పగా కూలబడ్డామే గానీ,
మమ్మల్ని మాటకట్టే దారమేదో
పుటుక్కున తెగిపోయినట్లు
ఇల్లంతా చెల్లాచెదురుగా

ముందరింట్లో మచ్చు మీద ఆనబెట్టిన
చల్ల కవ్వాన్ని మూడు పిల్లి పిల్లలు
ఆప్యాయంగా నాకుతూ
ఆ గోడమీద ఖాళీ తట్టే చూస్తున్నై
స్లాబు చువ్వల మీద వాలిన ఊరపిచ్చుకలు
కిందటేడాది దాకా వరికంకులు కట్టిన చేతుల కోసం
ముక్కులతో మూల మూలలా ఆరా తీస్తున్నై

ఆమె అలికిడికి తత్తరపాటుతో
అతడు గోడ పగులులో దాచిన
ఉత్తరాది పుగాకు చుట్ట
నుసికట్టిన కళ్ళతో అదేపనిగా అటేపే చూస్తోంది
లేగదూడ తల్లి నాలుకను వద్దని
ఏ మెత్తటి స్పర్శకోసమో వెతుకులాడుతోంది.

రాగి సంకటి మీద గోంగూర పచ్చడి అద్దుకున్న
చేతులన్నీ చేష్టలుడిగి
పిజ్జా టేబుల్ చుట్టూ
జీర్ణాశయాలకు లేపనాలు పూతేసుకుంటూ
గోడమీద ఖాళీ వేపే చూస్తో

వాళ్ళు గోడమీద కూడా కరువైపోతే
ఇక అంతా ఊపిరిపీల్చే
ఊర్ధ్వజగత్ ప్రాణులమై పోతామేమో

"ఓల్డ్ మామ్ ఫోల్డర్" బద్దలు కొట్టి
అచ్చొత్తించిన అమ్మమ్మా, నాన్నమ్మల్ని
మళ్ళీ ఆ ఖాళీలోకి ఆహ్వానించి తీరాల్సిందే

ప్రపంచం గ్రామమై పోతున్నా
గ్రామాన్ని ప్రపంచం గోడ మీద
ఫొటోలుగా కూడా మిగుల్చుకోకపోతే
అనుభూతుల్నీ, అప్యాయతల్నీ
మనసు గోడల మీద నిలబెట్టుకోకపోతే
మన ఫొటోలకు ఫోల్డర్లు కూడా మిగలవ్

## నివాళి

# ప్రపంచ మహాకవి శ్రీశ్రీ



జాన్ మిర్డాల్

**తెలుగు కవులు, రచయితల గురించి బయట ప్రపంచానికి పెద్దగా తెలియదని తరచు ఆవేదన చెందుతూ వుంటారు. ఈ నేపథ్యంలో మహాకవి శ్రీశ్రీ గురించి ప్రసిద్ధ స్వీడిష్ రచయిత జాన్ మిర్డాల్ రాసిన నివాళి వ్యాసం ఆసక్తికరమైంది.**

స్వీడిష్ సాహిత్యంలో, సంస్కృతిలో ప్రసిద్ధి వహించిన జాన్ మిర్డాల్ తల్లిదండ్రులైన ఆల్వా గునార్ మిర్డాల్‌లు సంక్షేమ రాజ్య పితామహులుగా పేరు పొందారు. ఆయనకు అర్థశాస్త్రంలోను, ఆమెకు శాంతి కృషిలోను నోబుల్ బహుమానాలు లభించాయి. జాన్ మిర్డాల్ 30 పుస్తకాలకు పైగా రచించాడు. వీటిలో కథలు, నాటకాలు, కళా సాంస్కృతిక రాజకీయ గ్రంథాలు ఉన్నాయి. ఆయన చిత్రాలు టి.వి. డాక్యుమెంట్లుగా కూడా తీశారు.

జాన్ మిర్డాల్ రచించిన 'ఇండియా వెయిట్స్' అన్న పుస్తకంలో వ్యాసం ఇది.



జనవరి 2న శ్రీశ్రీ జయంతి సందర్భంగా కొద్దిగా సంక్షిప్తపరచి అందిస్తున్నాం.

### ప్రజా గీతాలాపన :

ప్రపంచంలోని మహాకవులలో ఒకరు 1983 జూన్ 15వ తేదీ మధ్యాహ్నం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 73 ఏళ్ళు. అయితే స్వీడన్ పత్రికలలో దీని గురించి చిన్న వార్త కూడా లేదు. బహుశా ఫ్రెంచి, ఇంగ్లీషు పత్రికలలో ఏమైనా చిన్న వ్యాఖ్య వచ్చిందేమో నేను చూడలేదు.

ఐరోపాలో ఈ మౌనం ఆశ్చర్యకర మేమీ కాదు. మద్రాసులో చనిపోయిన కవి భారతీయుడు. ఆసియన్. అంతకంటే కూడా ఆయన కమ్యూనిస్టు. అది కూడా యూరో కమ్యూనిస్టు కాదు. నిజమైన కమ్యూనిస్టు. సూటిగా ఉండే ఎర్రటి కమ్యూనిస్టు. ఆయన మద్రాసులో మరణించాడు. ఆయన భాష తెలుగు. చాలా అందమైన, కవితాత్మకమైన భాష. సంపన్నమైన సాహిత్య వారసత్వం గల భాష. అయితే అది ఆసియన్ భాష. దాన్ని దీర్ఘకాలిక మహత్తర సాంస్కృతిక వారసత్వం. ఫ్రెంచి, బ్రిటిష్, అమెరికా లకు చెందినది కాదు. పారిస్‌లో ఎవరో కవితా నిర్మాణం గురించి కెలికిన దానిపై ఉగ్రూతలూగిపోయే ఐరోపా సంస్కృతికి నాలుగు కోట్ల మంది దక్షిణాది భారతీయులు మాట్లాడే, తమ ఆవేశాలు, అనుభూతులు వ్యక్తీకరించే భాష లెక్కలోదే కాదు.

1983, జూన్ 16న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో నివాళి రాసిన డి. ఆంజనేయులు ఇలా ముగించాడు : "బంగ్లాదేశ్‌కు నజ్రూల్ ఇస్లాం, లాటిన్ అమెరికాకు ఫ్లాబో నెరూడా, సోవియట్ రష్యాకు మయకోవస్కీ ఎటువంటివారో, ఆంధ్రప్రదేశ్‌కు ఆయన అటువంటి వాడు. ఆయన విప్లవ కవిగా, వైతాళికుడుగానే ఉంటాడు."

1827, జనవరి 27న ఎకర్మాన్ గురించి రాస్తూ పోతే ఎవరైనా సరే తను రాసిందే గొప్ప విలువైన కవిత్వమని భ్రమలో పడిపోకూడదని అనుకుంటే ప్రపంచాన్ని తేరిపార చూడాలని చెప్పిన మాట సరైందే. అయితే దురదృష్టవశాత్తు ఆయన ఒక విషయంలో పొరబడ్డారు. ప్రపంచ సాహిత్య యుగం అందుబాటులోకి వచ్చిందని చెప్పడం పొరబాటే. ఆ చర్చ తరువాత 157 ఏళ్ళు గడిచినప్పటికీ ప్రపంచ సాహిత్య యుగం అన్నది ఇప్పటికీ దూరంగానే ఉన్నది. సాహిత్య రంగంలో కృషి చేసే యురోపియన్లు 1983 వేసవిలో మద్రాసులో మరణించిన ఈ మహాకవిని గుర్తించనే లేదు.

ఆ ప్రజలు ఆయనను ప్రేమించారు. శ్రీశ్రీ అన్న పేరుతో పిలిచారు. ఆయన కవిత్వ భాషా పటిమ కారణంగా వర్గ శత్రువులు కూడా అయిష్టంగానైనా ప్రేమించవలసి వచ్చింది. ఆయన ద్రోహి అని, మత విధ్వంసకుడని, కుల విచ్ఛిన్నకుడని వారు భావించారు. ఆయన పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. 1910, జనవరి 2న విశాఖపట్టణంలో మధ్యతరగతి ఛాందస కుటుంబంలో ఆయన జన్మించారు. అక్కడే పాఠశాల విద్య అభ్యసించారు. తరువాత మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో జంతు శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. అప్పటికే ఆయన కవిగా ప్రఖ్యాతిగాంచారు. కొంత కాల్పనికత, కొద్దిపాటి అభివృద్ధి నిరోధకత్వం ఉందనుకునేవారు. 1928లో తన 28వ ఏట ప్రభవ అన్న కావ్యంతో ఆయన రంగప్రవేశం చేశారు. అది ఒక చిన్న సంపుటం. చాలా విశ్వాసంతో కూర్చింది. సాంప్రదాయక శైలిలో ఉన్న పాత తరహా కవిత్వం.

ఆంధ్ర సాహిత్యంలో అది గొప్ప కాలం. తరువాతి కాలంలో భారతీయ సాహిత్య చరిత్ర రాసినపుడు 1915 – 1935 ఆంధ్రను ఏథెన్స్‌లోని పెరిక్లాన్ యుగంతోను, ఇంగ్లండ్‌లో ఎలిజబెత్ యుగంతోను పోలుస్తారు. ఆంధ్ర పునర్వికాస కవులు వీరేశలింగం పంతులు వంటి వారు కరుడుగట్టిన లిఖిత భాషను తుత్తునియలు చేశారు. మాట్లాడే భాషలోనే సాహిత్యం సృష్టించారు. ఐరోపాకు ఏ మాత్రం తెలియని గొప్ప కవుల సముదాయం అత్యంత విస్తారమైన గేయ సాహిత్యాన్ని, కావ్య సంపదను, భక్తి గీతాలను, గేయ కథలను సృష్టించింది. ఈ సమయంలోనే తెలుగులో నవలలు , నాటిక రచన కూడా సాగింది.

1933లో సుస్తాస్థికలుతో శ్రీశ్రీ కొత్త దోవ తొక్కాడు. ఆయన ఛాందసాన్ని, అభివృద్ధి నిరోధకత్వాన్ని తిరస్కరించాడు. ఆధునిక కల్పనను చేపట్టాడు. అదే సమయంలో ప్రజా సాహిత్య మార్గం తీసుకున్నాడు. ఇప్పుడాయన నూతన సాంకేతిక విజ్ఞానాన్ని, పారిశ్రామికీకరణ యంత్ర నాగరికత ఆరాధన, సామ్యవాదాన్ని, విప్లవాన్ని ఆహ్వానించడం చూస్తాం. శ్రమతోను ప్రపంచం, దాని సంపద సృష్టించ బడ్డాయంటారు. తమను తాము విముక్తి చేసుకుని రేపటి ప్రపంచాన్ని సృష్టించేది శ్రామిక ప్రజలే. ప్రజల భాష పైన సంస్కృత భూయిష్టమైన తెలుగు పైనా ఒకే విధమైన పట్టుతో శక్తివంతమైన భాషతో శబ్దంపైన అధికారంతో ఆయన 30వ దశకం నాటి యువతను ఉర్రూతలూగించాడు. పాత రాజ్యాన్ని కూలగొట్టవలసిందిగా పిలుపునిచ్చాడు.

అదే సమయంలో ఆయన విదేశీ కవిత్వాన్ని కూడా అధ్యయనం చేశాడు. ప్రజలలో, వారి భాషలో బలంగా వేళ్ళూనుకున్న శ్రీశ్రీ బయటి ప్రపంచాన్ని స్వేచ్ఛగా పరిశీలించాడు. నజ్రూల్ ఇస్లాం, హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయలతో పాటు షెల్లీ, స్విన్‌బన్, రూపార్‌డ్రూక్, షిగ్‌ఫ్రాయిడ్, ససూల్, బాదలేర్, పాస్టర్ నాక్, మయకోవస్కీ వంటి వారి ప్రభావం కూడా ఆయనపై ఉంది. ఆయన చాలా రకాల పనులు చేశాడు. ఎందులోను స్థిరంగా ఉండేలేదు. చాలా ఎక్కువగా తాగేవాడు. చాలా కష్టాలతో బతికాడు. ఆంధ్రప్రభ వంటి పత్రికలలో పనిచేశాడు. పత్రికలకు, రేడియోకు రచనలందించాడు. వైమానిక దళంలో కొంతకాలం పౌర విభాగంలో ఉన్నాడు. నలభైలలో మద్రాసులోని దక్షిణ సినిమారంగంలో సంభాషణలు రాశాడు. ముప్పయిలలో ఆయన రాజకీయ చైతన్యం పెరిగింది. ప్రపంచ ఫాసిజం ప్రమాదం పెరుగుతుండటం, తొలి సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికలు, స్పానిష్ అంతర్యుద్ధం, చైనా ప్రజలపై జపాన్ దురాక్రమణ ఆయన్ని మార్చివేశాయి. కాల్పనిక విప్లవ శైలి, కార్మికవర్గ నియంతృత్వ ఆవశ్యకతగా రూపుదాల్చింది. ప్రపంచ కవితా దృష్టి శ్రామిక వర్గ అంతర్జాతీయతగా మారింది. దక్షిణాదిలోని వ్యవసాయ కార్మికుడిని చెక్ దేశపు గని కార్మికుడితోను, ఐరిష్ నావికుడితోను, దక్షిణ అమెరికాలోని పత్తి చేలో పనిచేసే నల్ల జాతీయునితోను కలిపింది.

ఇక లూయీ ఆర్గాన్ ఆయన శైలిని ప్రభావితం చేసి దిశా నిర్దేశం గావించాడు. ఆధునికత నుంచి అధివాస్తవ ప్రయోగాల వైపు మళ్ళాడు. ప్రజల భాషా సంస్కృతులలో తన మూలాలను వెతుక్కునేందుకు శ్రీశ్రీ ఉద్దేశపూర్వకంగానే ప్రజల వైపు మళ్ళాడు. కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన అభ్యుదయ రచయితల సంఘంలో శ్రీశ్రీ ఒక నాయకుడయ్యాడు.

శ్రీశ్రీ కేవలం మేధావి మాత్రమే కాదు. ప్రత్యక్షంగా రాజకీయ కార్యాచరణలో పాల్గొన్నాడు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగం పంచుకున్నాడు. ప్రపంచశాంతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. హెల్సింకి, పారిస్, మాస్కోలను సందర్శించాడు.

ఆంధ్రదేశపు విప్లవ కవులలో అగ్రగణ్యుడుగా ఆయన సహజంగానే అత్యంత భీకరమైన దాడులకు గురయ్యాడు. ఆంధ్రలో 1955 ఎన్నికల ప్రచారంలో పత్రికలలోను, సమావేశాలలోను ఆయనపై ఎంతో తీవ్రంగా దాడి జరిగింది. కాంగ్రెస్ మద్దతుదారులైనవారు సాంస్కృతిక స్వాతంత్ర్యం అంటూనే ఆయనపై విరుచుకుపడ్డారు. దాంతో నరాలు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ వ్యక్తి స్వేచ్ఛ కోసం ఎలుగెత్తే ఈ యోధుడిని మార్చలేకపోయారు. శ్రీశ్రీ ఆ మానసిక అస్వస్థత నుంచి బయటపడి రచనా వ్యాసంగం కొనసాగించాడు. అప్పటి కమ్యూనిస్టు ఉద్యమంతో అసంతృప్తి చెందిన 1967లో వచ్చిన నగ్జల్‌బరీ ఉద్యమం వైపు మొగ్గాడు.

శ్రీశ్రీకి 60 ఏళ్ళు నిండినపుడు చాలా ఘనంగా, అధికారికంగా జేజేలు అర్పించాడు. విద్యార్థులు ముందుకు వచ్చి అక్కడకు చేరిన కవులను మీరెటు వైపు అని ప్రశ్నించాడు.

జర్మనీలో అభ్యుదయవాదులైన యువ విద్యార్థులు తమ ప్రియమైన కవి గోథె ఉదాశీనతలోకి జారుకోవడాన్ని చూశారు. శ్రీశ్రీ చాలా గొప్పవాడు. తన కాలానికి గోథె వంటి వాడు. ప్రజలతో మమేకమయ్యాడు. ఆయన ఉదాశీనతకు లోనవలేదు. 1970 షష్టిపూర్తి సంవత్సరం. ప్రభుత్వం నుంచి అనేక పురస్కారాలు, నగదు బహుమానం ప్రతిపాదనలను తిరస్కరించాడు. ఆ డబ్బును, గౌరవాలను తిరస్కరించి అందుకు బదులుగా విప్లవ రచయితల సంఘం స్థాపకుడయ్యాడు. అది నగ్జల్‌బరీ మార్గాన్ని బలపరిచింది. తరువాత కాలంలో అయినా విరసంతో కలిసి అధికార వర్గాలను ధిక్కరించారు. ఒకప్పుడు జాతీయ కవిగా తమతో కలుపుకోవాలనుకున్న వ్యక్తిని కొంతకాలం పాటు జైలులో కూడా పెట్టారు. అయినా ఆయన రాస్తూనే వున్నారు. ఆంధ్రలో కవితా ఉద్యమం కోసం వేలాదిమంది కవులు, లక్షలాది శ్రోతల కోసం 1970 తరువాత శ్రీశ్రీ రాసిన కవితలను 'మరో ప్రస్థానం' పేరుతో ప్రచురించారు. అది ఒక గొప్ప సృజనాత్మక కొనసాగింపు.

ఇప్పుడాయన అస్తమించాడు. ఆయన గురించి విననని ఐరోపా కార్మికులు, విద్యార్థులు కూడా దురదృష్టవంతులే. అయితే భారత ప్రజల విముక్తి కోసం మొదలైన విప్లవ కవితా ఉద్యమానికి ఆయన ఇచ్చిన ఉత్తేజం అంతకంతకూ బలోపేతం అవుతూనే ఉంటుంది.

**(మహాకవి శ్రీశ్రీ డాట్ కామ్ సౌజన్యంతో)**

పరిశీలన

# ఇమేజిస్టు కవి నారాయణబాబు



**నారాయణబాబు మిగిలిన ఆధునిక కవితా మార్గాల కంటే ఈ మార్గం పట్ల అమితంగా ఆకర్షితుడయ్యాడు. అప్పటికి తెలుగులో ఉన్న కవిత్వ మార్గాన్ని పూర్తిగా ఎదిరించాడు. ఈ ప్రయత్నంలో ఆధునిక కవులు ఎవరూ చేయని సాహసాన్ని చేసి ఇటు సామాన్య పాఠకులకు అటు పండిత వర్గంతో పాటు కాల్పనిక వాదులకు శ్రీశ్రీ బాటలో నడచిన అభ్యుదయ వాదులకు కూడా దూరమయ్యాడు. కొందరు సన్నిహితులు ఆయన జీవితాన్ని, కవిత్వాన్ని కలగలిపి చూసి అరాచకవాదిగా, ఉన్మాదిగా పరిగణిస్తే ఇతరులు ఒక అర్థం, తాత్పర్యం, దండాన్వయం వంటివి ఏమీ లేకుండా ఆ కవి అందించిన నిగూఢ స్ఫూర్తిని అందుకోలేక పెదవి విరిచి ముఖం ప్రక్కకు తిప్పుకున్నారు.**

**డా॥ యు.ఎ. నరసింహమూర్తి**

నారాయణబాబు పుట్టిన తరువాత ఆధునిక కవిత్వంలో ఇమేజిస్టు కవిత్వోద్యమం ఒకటి మొదలయింది. కవిగా అతడు రాటుతేలడానికి ఇతర ఆధునిక కవితా సంప్రదాయాలతో పాటు ఇమేజిస్టు మార్గాన్ని కూడా సునిశితంగా అధ్యయనం చేయడం ఒక కారణమైంది. కవిత్వంలో సంప్రదాయ మార్గాన్నీ, భావకవితా మార్గాన్నీ శ్రీశ్రీ స్వంతం చేసుకొన్న మాత్రాచ్ఛందో మార్గాన్నీ పూర్తిగా నిరాకరించి తనదైన ఒక నూతన పథాన్ని చేపట్టిన నారాయణబాబు తెలుగులో తొట్ట తొలి ఇమేజిస్టు కవి. ఈ పద్ధతిని తెలుగువారు భావ చిత్ర వాదమని అన్నారు. మొదటి ప్రపంచ యుద్ధానికి కొంచెం ముందుగా Ezra Pound, Amy Well, T.E. Hulme, Richard Aldington వంటి కవులు ఇమేజిస్టు కవిత్వోద్యమాన్ని ప్రారంభించారు. పద్యానికి దృఢమైన స్పష్టమైన భావచిత్రం అవసరమని, అది వాడుక భాషలో ఉండాలని, వస్తు స్వీకరణలో పరిపూర్ణమైన స్వేచ్ఛ కలిగి ఉండాలని వీరు భావించారు. పదాలు కవి మనసులో పుట్టించే భావచిత్రాల ద్వారా వస్తు జగత్తును ప్రతిబింబింపచేయడం కవికి ఈ పద్ధతిలో సాధ్యం కావచ్చును. ఈ భావచిత్రాలు అనుభూతిని కలిగించేవిగా ఉంటాయి. భావచిత్రాలలోని భాషా మాధుర్యం సహృదయునికి సౌఖ్య హేతువు అవుతుంది. కవులు తరచుగా భావచిత్ర వైఫల్యాన్ని అంగీకరించవలసిన సందర్భం వచ్చినప్పుడు దానిని ఒక ప్రతీకగానో, ఉద్విగ్న భావంగానో మారుస్తూ ఉంటారు. అయినా మనకు అక్కడ భావచిత్రమే కనిపిస్తుంది.

నారాయణబాబు మిగిలిన ఆధునిక కవితా మార్గాల కంటే ఈ మార్గం పట్ల అమితంగా ఆకర్షితుడయ్యాడు. అప్పటికి తెలుగులో ఉన్న కవిత్వ మార్గాన్ని పూర్తిగా ఎదిరించాడు. ఈ ప్రయత్నంలో ఆధునిక కవులు ఎవరూ చేయని సాహసాన్ని చేసి ఇటు సామాన్య పాఠకులకు అటు పండిత వర్గంతో పాటు కాల్పనిక వాదులకు శ్రీశ్రీ బాటలో నడచిన అభ్యుదయ వాదులకు కూడా దూరమయ్యాడు. కొందరు సన్నిహితులు ఆయన జీవితాన్ని, కవిత్వాన్ని కలగలిపి చూసి అరాచకవాదిగా, ఉన్మాదిగా పరిగణిస్తే ఇతరులు ఒక అర్థం, తాత్పర్యం, దండాన్వయం వంటివి ఏమీ లేకుండా ఆ కవి అందించిన నిగూఢ స్ఫూర్తిని అందుకోలేక పెదవి విరిచి ముఖం ప్రక్కకు తిప్పుకున్నారు. నారాయణబాబు కవిత్వ పరిభాషను మార్చాడు. రూపు రేఖలను మార్చాడు. ఆధునికులు కొందరు అతడి కవిత్వంలోని ఈ విలువలను గుర్తించినా వేరు వేరు కారణాల వల్ల అతణ్ణి తృతీయ పంథా వాడని ముద్రవేశారు. ఫలితంగా నారాయణబాబు కవిత్వానికి అటు కవులలో అనుయాయులు లేరు, ఇటు సామాన్య పాఠకులలో ప్రచారమూ రాలేదు. ఆయన అభిమానుల సంఖ్య తక్కువ. అతడు చేపట్టిన ఇమేజిస్టు కవితా మార్గం తెలుగువారికి కొత్త కావడం వల్ల ఇటువంటి స్థితి ఏర్పడింది.

భావచిత్రం, భావచిత్రవాదం అన్న పరిభాషలకు ఎన్నో అర్థాలు, అర్థచ్ఛాయలు ఉన్నాయి. భాష వస్తువులను, చర్చలను, అనుభూతులను, భావాలను, ఊహలను, మానసిక స్థితిగతులను, ఇంద్రియ – ఇంద్రియాతీత గ్రహణాలను సూచించే ప్రత్యామ్నాయంగా కవిత్వంలో ఉపయుక్తం కావడాన్ని భావచిత్రవాదమని అంటారు. శబ్దం, అర్థం, అనుభూతి, భావచిత్రం కవిత్వ మూల పదార్థాలు. వీటిలో శబ్దం తన మౌలికార్థాన్ని విడిచి కవిత్వపరమైన విశేషార్థాన్ని అందించడం ద్వారా మనలో అనుభూతుల్ని రేకెత్తిస్తుంది. ఈ శబ్దం మీద ప్రభుత్వాన్ని సాధించి దానిని శ్రవణ సులభంగా ప్రయోగించి శ్రీశ్రీ అనర్గళం, అనితర సాధ్యము అయిన కవితా మార్గాన్ని సృష్టించి అసంఖ్యాకులను ఆకర్షించగలిగాడు. శబ్దానికుండే అర్థం తెలియకపోయినా ఒక నాద సౌభాగ్యంతో తాను ఉద్దేశించిన స్ఫూర్తిని పాఠకుల కందించి కృతార్థుడయ్యాడు. కవిత్వాన్ని నానా గానా నూన స్వానావళితం చేసి తన జాతి జనులు పాడుకొనే మంత్రంగా చేశాడు. ఇమేజిస్టుల కవితా మార్గం ఇది కాదు. వారు కవిత్వాన్ని సమ్మోహకశక్తిగా కాక వికాస ముద్ర గావించారు. కవిత్వం మాయాదర్పణం కాదని, మంత్రకవాటం కాదని, మనో వ్యాపారానికి రూపమిచ్చే రంగుల కల అని, అంతర లోకాలను ఆవిష్కరించే రహస్తంత్రి అని భావించారు. శబ్దం స్వైర విహారం చేయకుండా భావగతమైన అవస్థను పునఃసృజన చేయడానికి అనుగుణంగా ఒదిగి ఉండాలని అనుకొన్నారు. శబ్దాన్ని తమ అదుపాజ్ఞలలో ఉంచారు. కవిత్వం చదివేందుకే కాని పాడటానికి కాదు. పాటగా మారేటప్పుడు అది కవిత్వ లక్షణాన్ని గాక వేరే లక్షణాన్ని సంతరించుకుంటుంది.

సంగీత గుణం కవిత్వానికి సహజమైనదైనా అది బలవంతపు బ్రాహ్మణార్థం కారాదని వీరి భావన. కవిత్వంలోని ప్రతి మాటలోను అనుభూతి నిండి ఉండాలి. ఛందస్సుల అశ్వ హృదయాన్ని వశం చేసుకొన్నవారు ఈ అనుభూతిని ఉదాత్త కవితావేశంతో రంగరిస్తారు. ఇమేజిస్టులు ఆవేశం కంటే ఆలోచనకు పట్టం కడతారు. శబ్దంతో సాధించే సంగీతం కంటే భావంతో సమకూర్చే సంగీతాన్ని ఇమేజిస్టులు వరించారు.

కవి ఉపయోగించే పదంలో ఆత్మీయమైన అనుభవంతో పాటు బాహిరమైన, సార్వజనీనమైన వస్తువొకటి వ్యక్తమవుతుంది. పదానికుండే ఈ సామాజిక విషయమే కవి అందించే భావమవుతుంది. అప్రయత్న సిద్ధమూ, లయాత్మకమూ అయిన ఉద్వేగం భావంగా పర్యవసించాలి. అది కళాత్మకంగా ఉండాలి. అనుభవసారంగా ఉండే భావం తన విలువలను నిలుపుకొంటుంది. ఈ భావమే కవిత్వంలో భావచిత్రంగా అవతరిస్తుంది. భావనామాత్రంగా ఉన్నప్పటి కంటే ఇంద్రియగ్రాహ్యమైన వస్తువుతో కూడినప్పుడు భావం అనుభూతిగా మారడానికి బలిష్టమైన ఆలంబనగా ఉంటుంది. భావచిత్రవాదులు ఛందోబద్ధ కవితారూపాన్ని వదలిపెట్టారు. ఇమేజిస్టు కవిత లయశూన్యంగా ఉంటుంది. ఉన్నా అది స్వల్పం. అది వచన ప్రాయంగా ఉంటుంది. భావచిత్రవాదులు వచనానికి, కవిత్వానికి వారధి కట్టారు. అందుకే జీవితమంతా సంగీతంలో మునిగితేలిన నారాయణబాబు కవిగా సంగీతంతో తనకున్న బొడ్డు పేగును కోసేసుకున్నాడు ఆ రకంగా తెలుగులో వచన కవిత్వోద్యమానికి మార్గదర్శి అయాడు. కవిత్వానికి, వచనానికి మధ్య విరోధమేమీ లేదు. వచనానికి కూడా ఒక లయ, మాధుర్యం అభివ్యక్తి సామర్థ్యం ఉండటమే ఇందుకు కారణం.

భావచిత్రమనగానే అది కేవలం మానసిక చిత్రమై ఉండాలనే నిబంధన ఏమీ లేదు. భావచిత్రం అనేక రకాలుగా ఉండవచ్చు. సాధారణ భావచిత్రం (Literal Image)లో అలంకారిక పద ప్రయోగముండదు.

చచ్చిన తల్లి శవం
మెళ్ళో గజ్జెల
పట్టెడతో

— — — — * * * — — — —

**లోకానికి భౌతికమైన రూపం ఒకటుంది. కానీ ఇతరేతర కారణాల వల్ల లోకం పట్ల వెగటు పుట్టిన కవి ఆ భౌతిక రూపాన్ని నిరాకరించి ఇంకొక రూపాన్ని బొమ్మ కట్టిద్దామనుకొన్నాడు. ఆ రూపం కూడా దృశ్యం కాదు. అయినా అది ఒక చిత్రమై పాఠకుడి కందాలి. అందుకు కాలిన దేహం నుండి వెలువడే కమురు కంపును కవి ఆశ్రయించాడు.**

— — — — * * * — — — —

ఉల్లాసంగా
ఆడుకునే
పసిపిల్లదురా
గాలి!

ఇది భావచిత్రమే. ఆకారంలేని గాలికి ఒక చిత్రకల్పన చేయడానికి కవి చేసిన ప్రయత్నం ఇక్కడ కనిపిస్తుంది. కానీ పదాలలో గానీ, కల్పనలో గానీ ఇందులో అలంకారితకు చోటు లేదు. ఇందులో స్వచ్ఛమైన విషయం కంటే వాచ్యమైన విషయమే ఎక్కువగా వుంది. అందుచేత దీనిని అభిదా చిత్రం (literal Image)గా భావించాలి. ఇటువంటి సందర్భాలలో భావచిత్రం స్ఫుటమైన రూపాన్ని పొందవచ్చును. పొందలేకపోవచ్చును.

కొన్ని భావచిత్రాలు గ్రహణ యోగ్యమైన చిత్రాలుగా (Perceptual Image) ఉంటాయి.

కాలం కాలిన
గుడ్డ పీలికై
ధూళి రేగినది

ఇది ఒక అందమైన, గ్రహణ యోగ్యమైన భావచిత్రం. కాలానికి రూపమే లేదు. సహృదయుడికి గుడ్డ పీలిక కాలడం, అది నుసిగా మారి పొగరేగడం అనుభవంలో ఉన్న విషయం. దానిని ఆధారంగా చేసుకొని కవి మండే ఎండలలో ఎగిరే వేడి ధూళిని కాలంతో కలగలిపి ఈ భావచిత్రాన్ని పాఠకులకు అందించాడు. ఇందులో దృశ్యం అందరికీ నూటికి నూరుపాళ్ల కళ్ళకు కట్టకపోయినా ఆ చిత్రాన్ని స్వీకరించగల సామర్థ్యం మాత్రం వారికి ఉంటుంది. ఇటువంటి భావచిత్రాలతోనే ఈ వాదం బలపడటం మొదలయింది. ఈ రెండూ సాధారణమైన భావచిత్రాలు.

అలంకారిక పద ప్రయోగంలో అనేక రకాలైన భావచిత్రాలు దర్శనమిస్తాయి. ఒక భావచిత్రం కంటికి కట్టేదిగా ఉండవచ్చును. ఇంకొకటి మనసుకు పొడకట్టేది కావచ్చును. అలా కాకుండా ఘ్రాణేంద్రియ గ్రాహ్యమైన భావచిత్రం (Olfactory) కూడా ఉంటుంది.

కాలిన ప్రేయసి
దేహం
చమురు కంపు
ఈ లోకం

లోకానికి భౌతికమైన రూపం ఒకటుంది. కానీ ఇతరేతర కారణాల వల్ల లోకం పట్ల వెగటు పుట్టిన కవి ఆ భౌతిక రూపాన్ని నిరాకరించి ఇంకొక రూపాన్ని బొమ్మ కట్టిద్దామనుకొన్నాడు. ఆ రూపం కూడా దృశ్యం కాదు. అయినా అది ఒక చిత్రమై పాఠకుడి కందాలి. అందుకు కాలిన దేహం నుండి వెలువడే కమురు కంపును కవి ఆశ్రయించాడు. మానవతా దృష్టితో తానెంతో ప్రేమించిన ఈ లోకం వెగటు గొల్పడం కవిని బాధించింది. దాన్నంతటినీ బొమ్మ కట్టించడానికి ప్రేమించిన ప్రేయసి మృతశరీరం నుండి వెలువడే కమురు కంపు కావలసి వచ్చింది. ఘ్రాణేంద్రియ మూలకంగా ఈ భావచిత్రం సహృదయుల అనుభవంలోకి వస్తోంది. అంతకు మించి ఇక్కడ దృశ్య చిత్రమంటూ ఏదీ లేదు.

ఇంకొక రకమైన భావచిత్రం స్పర్శ జ్ఞాన మూలకంగా (Tactile) స్ఫురిస్తుంది.

హాయిగా అర్ధరాత్రి
ఆడ మగ
తడిమిన తెలియని
తాండ్ర పాపారాయుడు
తమస్సు

తాండ్ర పాపారాయుడు అర్ధరాత్రి హనన కృత్యాన్ని నిర్వహించే సందర్భంలో అతని శరీర చలనాలలోని మెలకువ స్పర్శజ్ఞాన సంబంధమైన చైతన్యం ఆధారంగా కవి ఇక్కడొక స్పర్శ చిత్రాన్ని సహృదయుడి మనస్సులో స్థాపించాడు. ఇటువంటి చిత్రాల సారం అనుభూతి మూలకంగా గ్రహించదగినదే కానీ అర్థం తాత్పర్యం – దండాన్వయం వంటి సాంప్రదాయక

మార్గంలో అన్వేషించ దగినది కాదని రోణంకి అప్పలస్వామి అన్నారు.

చిత్రం శ్రవణేంద్రియ వ్యాపారం వల్ల మనసుకెక్కితే దానిని శ్రవ్యచిత్తమనీ (Auditory Image) అన్నారు.

శ్రవణపేయంగా
రజత రావ
సంగీతం
రోదసి నిండెను!

ఇదొక అద్భుతమైన శ్రావ్య చిత్రం. వెన్నెలను శ్రవ్యం చేసిన ఈ మార్గం పూర్తిగా ఆధునికమైనది. కవి ఈ సందర్భంలోనే చంద్రునిలోని మచ్చ శ్రుతి కటువుగా ఉందనడం గమనార్హం. ఇక్కడ నల్లని మచ్చ, తెల్లని సంగీతం రెండూ దృశ్యాలే. అయినా కవి వాటిని శ్రవ్యాలుగా మార్చి ఆధునికులలో కొత్త పంథా తొక్కాడు. కవి 'దరిద్ర సంగీతం' అనే ఈ గేయాన్ని సంగీత పరిభాషలో ఆరంభించి చివరి వరకు ఆ పరిభాషను కొనసాగించడం ఈ శ్రవ్య చిత్ర కల్పనకు కారణమైంది.

బ్రహ్మాండ భాండమ్మున
శేషుని కోరల
గరళం పిండి
గాలి పెదవుల
కమ్మని
తమ్మల మట్టుల
పూసేస్తాను
పోయిన ఆ యేటి నవ్వే
పుక్కిట నెమరేసుకుంటు
గండశిల నీడలోన
కనుమోడ్చెను
గార్దభ స్వామి!!

పై చరణాలలో శేషుని కోరల నుండి తీసిన గరళపు రుచిని మన కందించడానికి కవి రుచిని ఆశ్రయించిన భావచిత్ర భేదాన్ని కల్పించాడు. అలాగే యేటి నవ్వు కూడా గార్దభ స్వామి జీవితంలో ఉండే మధుర స్మృతులను వెల్లడించే చిత్రంగా సహృదయునికి స్ఫురింపచేయడానికి కవి నెమరువేతను ఆశ్రయించాడు. ఇది రుచి ద్వారా అందే అనుభవం మాత్రమే గ్రహించగల చిత్రం.

— — — — * * * — — — —

**తెలుగు కవిత్వంలో ఆధునికత పురుడు పోసుకున్న తొలి రోజుల్లోనే నారాయణబాబు భావచిత్రవాదంలో గల ఇన్ని వినూత్న ప్రయోగాలు చేశాడు. కానీ అతడు ప్రయోగవాది కాదు. కేవలం ప్రయోగం కోసం ఏ అత్యాధునిక కవితా మార్గాన్ని చేపట్టలేదు.**

— — — — * * * — — — —

అమూర్తమై కేవల మేధోగ్రాహ్యమైన భావచిత్రాన్ని నైరూప్య చిత్రమనీ అన్నారు.

హృదయంలో
ఒకటి రెండు
వెలుతురు గాయాలు
నైరూప్య చిత్రాలే.

ఫిడేలు నాయుడిగారి వేళ్ళను గూర్చి చెప్తూ

నిశ్శబ్దపు
నీలి నీలి
యంచులనే
మ్రోగించును
మీ వ్రేళ్ళు!

అన్న చిత్రం ఇంకా అమూర్తమైనది.

పదాలకు ఒక లయ ఉంటుంది. ఒక చలన ముంటుంది. ఒక శక్తి ఉంటుంది. ఈ శక్తుల కలయికలో కవిత్వంలో అంతర్గర్భితంగా చోటు చేసుకొనే చిత్రం శరీరావయవాల కదలికను, కండరాల చలనాన్ని కలిగిస్తే దానిని Kinaesthetic Image అన్నారు. అర్థంతో సంబంధం లేకుండా కేవలం మాటల కూర్పు వల్ల పుట్టే ధ్వనులే అర్థస్ఫూర్తినిగానీ, దృశ్య సాక్షాత్కారాన్ని గానీ కలిగించే Onomatapoeia కు ఇది దృశ్యపరంగాను, భౌతికపరంగాను కూడా ప్రత్యామ్నాయమైనది. ఇక్కడ భావమే పాఠకుల శరీరావయవాల కదలికకు కారణమై ఒక చిత్రాన్ని సృష్టిస్తుంది. నారాయణబాబు రాసిన 'కపాల మోక్షం' అనే ప్రసిద్ధ కవిత ఇటువంటి భావచిత్రాలతో నిండి ఉంది.

స్వాహా వల్లభు
సువర్ణ గర్భం
సుళుపరించినది
కళవళించినది
గంగ వక్షమే
పాల పోటుతో
కళవళపడ్డాది

పై చరణాలను చదివిన కారణంగా కలిగిన అనుభూతి పాఠకుని శరీరాన్ని ఒక సుళుపరింతకు, ఒక కళవళపాటుకు గురిచేయక మానదు. ఈ భౌతిక చలనాలను సాధించడమే ఈ కోవకు చెందిన భావచిత్రానికి పరమార్థం. ఈ భేదాలన్నీ దేనికదిగా విడివిడిగా ఉంటా యని చెప్పలేము. కొన్ని సందర్భాలలో ఇవి రెండు, మూడు కలసి ఉండవచ్చును.

తెలుగు కవిత్వంలో ఆధునికత పురుడు పోసుకున్న తొలి రోజుల్లోనే నారాయణబాబు భావచిత్రవాదంలో గల ఇన్ని వినూత్న ప్రయోగాలు చేశాడు. కానీ అతడు ప్రయోగవాది కాడు. కేవలం ప్రయోగం కోసం ఏ అత్యాధునిక కవితా మార్గాన్ని చేపట్టలేదు. సంప్రదాయ కవితా మార్గంతో విసిగి వేసారి సామాజిక పురోగతికి అవరోధంగాను, ప్రయోజన శూన్యంగాను, కేవలం సౌందర్యవాదం గాను సమకాలీనంగా తామర తంపరగా అల్లుకుపోతున్న భావ కవితోద్యమాన్ని దృఢంగా నిరోధించాలని నిజాయితీగా తాను నమ్మిన ఈ నూతన కవితా మార్గాన్ని వరించాడు. నారాయణబాబు చేపట్టిన కొత్త కవితా ప్రక్రియ వ్యాప్తి చెందకపోవడానికి, అతడికి ప్రజాదరణ లభించకపోవడానికి ఒక ప్రధాన కారణం ఉంది. ఎక్కువమంది పాఠకులు బుద్ధిగమ్యమైన కవిత్వాన్ని గ్రహించి ఆదరించినట్లుగా ఇంద్రియ గ్రాహ్యమైన నూతన కవితానుభవాన్ని చేరుకోలేరు. నారాయణబాబు కవిత్వంలో ఎక్కువ పాలు జ్ఞానేంద్రియానుభవ ప్రధానమైనది. సాధారణ బుద్ధికి, సాధారణ తర్కానికి అందనిది. ఆ కవి గేయాలు 'రుధిర జ్యోతి' అనే సంకలనంగా చాలా ఆలస్యంగా వెలుగు చూశాయి. అంతవరకు కవిత్వాభిమానులు వాటిని ఒక చోట చూడలేకపోయారు. దురదృష్టవశాత్తు రుధిర జ్యోతి కవితా సంకలనం వెలువడే నాటికి ఆధునికాంధ్ర కవితా ప్రియులలో తీవ్రమైన చీలికలు, వర్గాలు ఏర్పడ్డాయి. కవిత్వాన్ని ఒక కుట్రగా చూసే కక్షల వాతావరణం ఏర్పడింది. ఇమేజిస్టు కవిత వెనుకబడటం తెలుగులోనే

కాదు పాశ్చాత్య కవిత్వంలో కూడా జరిగింది. పాశ్చాత్య విమర్శకులు ఇమేజిస్టు కవితలో కొన్ని ప్రధాన లోపాలను చూశారు.

(1) ఉద్వేగం కల భావం కంటే భావ చిత్రమే ప్రధానమని భావించడంలో భావచిత్ర వాదులు తప్పు త్రోవ పట్టారు.

(2) కవిత్వాన్ని అంతర్జగత్ సంబంధమైన అభివ్యక్తిగా కాక వస్తు జగత్సంబంధ మైన దృశ్యంగా మార్చడానికి వారు చేసిన ప్రయత్నమంతా పురాతన వాదాన్ని తిరగతోడటమే అవుతుంది.

(3) కవిత్వాన్ని ఆత్మీయ ఉద్వేగాల నుండి మళ్ళించి బహిర్జగత్తులోకి తరలించుకొనే ప్రయత్నం వారు చేశారు.

(4) వర్ణచిత్రాలను, శిల్పాలను దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తే కవి వస్తు జగత్తును రంగులలోకి, ఆకృతులలోకి మార్చడానికి తన భావచిత్రాల ద్వారా చేసిన ప్రయత్న మంతా ఒక నీడలా భాసిస్తుంది. జ్ఞాపకాలెప్పుడూ వాస్తవాలిచ్చిన తృప్తినియ్యవు.

(5) వర్ణచిత్రం వర్ణచిత్రమే, భావచిత్రం భావచిత్రమే. ఒక కళ ఇంకొక కళకు సాటి వచ్చేది కాదు. ఒక కవి చిత్రకారుని పరిధిలోకి ప్రవేశించి నప్పుడు ఆ కవిత్వాన్ని చిత్రకళా ప్రమాణాలతోనే పరిశీలించవలసి ఉంటుంది. ఆ పరిశీలనలో భావచిత్రం లొచ్చుగా కనిపిస్తుంది. కవిత్వం పరిధిలోనే కవి తన సృష్టిని కొనసాగించినప్పుడు కవితా లోకపు సర్వసత్తాక స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన నియమాలతో దానిని పరిశీలిస్తాం. ఆ పరిధి దాటకుండా ఉన్నప్పుడే కవి ప్రయత్నంలో సమగ్రత సిద్ధిస్తుంది.

(6) ముందు భావచిత్రం ప్రవేశించి తరువాత కవి అన్వయమంతా వెలువడు తుంది. దానితో కవిత్వం భావచిత్రంగాను, అన్వయంగాను రెండు భాగాలుగా చీలిపోతుంది. వాటి మధ్య నుండే సంబంధం బహు సున్నితమైపోతుంది.

ఇమేజిస్టు కవితా పద్ధతిలో గల లోపాలుగా పాశ్చాత్య విమర్శకులు ఎంచిన ఈ లక్షణాలు నారాయణబాబు కవిత్వంలో కూడా కనిపించవచ్చును. అటువంటి లోపం కనిపిస్తే అది ఆ కవితా పద్ధతికే చెందుతుంది. కానీ నారాయణబాబు అశక్తతకు చిహ్నంగా నిలబడదు.

కావు! కావు!
ఆకాశం కాకిపిల్ల
నోరు తెరచె
మేత కొరకు
పాపిష్టి ఇనోదయమ్మె
పాముకాటు ఎండ పొడిచె
భువికి తగిలె
శివజ్వరం!

ఇక్కడ భావం కంటే భావచిత్రమే ముందు స్ఫురిస్తుంది. ఆ కారణంగా పాఠకుడి అనుభూతి తీవ్రత కొంత మందగించే అవకాశం ఉంది. అయినా భావచిత్రం స్పష్టపడిన వెంటనే భావాన్ని పునరాకలనం చేసుకోగల స్థాయి గల పాఠకుడికి ఉదాత్తమైన భావావేశ స్ఫురణ కలుగుతుంది. కవిత్వానికి సంబంధించిన అంతర్జగత్ సంవేదనలను తరచుగా వస్తు జగత్తులోని పదార్థాలతో ముడిపెట్టి ఊహను బొమ్మ కట్టించే ప్రయత్నం నిరంతరంగా కొనసాగినప్పుడు పాశ్చాత్య విమర్శకులు పేర్కొన్న అనుభూతి వైకల్యానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ లోకాన్ని కవి కొంత వరకు తన సమర్థతతో కప్పివుచ్చవచ్చును. భావచిత్రవాదం కళాతత్వాన్ని ఆశ్రయించినది. నారాయణబాబు వంటి సామాజిక ప్రయోజనాన్ని ఆశించే అభ్యుదయ చైతన్యం నిండిన కవి తన వస్తువును, కళా సామగ్రిని కలగలిపి కళానుభవాన్ని సాధించడం కత్తి మీద సాములాంటి పని. ఆ సాము గరిడీలలో నారాయణబాబు చాలా వరకు కృతకృత్యుడయ్యాడనే చెప్పవచ్చును. శ్రీశ్రీ నారాయణబాబును తోకచుక్క అనడం తప్పు కాదు. కానీ అది శ్రీశ్రీ చెప్పిన తోకచుక్క కాదు. గురజాడ చెప్పిన తోకచుక్క, సంఘ సంస్కరణ ప్రయాణ పతాక. కవిత్వాన్ని సాంఘిక ప్రయోజన సాధకంగా ఉపయోగించ చడంలో నారాయణబాబు ఏ ఆధునిక కవికీ, ఏ అభ్యుదయ కవికీ తీసిపోడు.

# గోరింకపూలు



డా॥ కె. గీత

ఓ చెట్టు గోరింకపూలని ఆకాశంలోకి వెదజల్లింది
ఎర్రనారింజ సూర్యుణ్ణి అమాంతం మింగిన నింగి సముద్రం
ఎక్కడ చూసినా ఒకే మోహమేసుకుని తలదించుక్కూర్చుంది
చెట్టు చెట్టునా రాలి ఎగిసే కిలకిలలు
చీకటి మానాన్కి ముందు
వెల్తురు చివరి రోదన
పగటి ముక్కు కొనల ఆఖరి కరచాలనాలు
పాపం ఎవరో అష్టమి లాంతరు పుచ్చుకుని
కొమ్మ కొమ్మనా వెతుకుతున్నారు
ప్రేమించే హృదయాన్ని చెరిసగం పంచుకుందామని
వెలుగు అలసటల్ని తీర్చే సంధ్య కువకువల్ని విందామని
నాలుగు కళ్ళు ఒక్క గోరింక హృదయమై
పరకాయ ప్రవేశించాయి
చిక్కని రెక్కలు ముడుచుకున్న గోరింకపూలు
స్పర్శకు శబ్దించే గుండె చప్పుళ్ళు
ప్రేమిస్తూనో –
రోదిస్తూనో –

# సాహితీ సంరంభంగా అద్దేపల్లి సప్తతి

క్రిష్ణమ్మ ఒడిలో పుట్టి గోదావరిలో సేదదీరిన అద్దేపల్లి కవిత్వ ప్రతిబింబమై తెలుగు సాహిత్యంలోనే తనదైన విశిష్ట అభివ్యక్తికి పతాకగా నిలుస్తారని సూపర్‌బజార్ మాజీ ఛైర్మన్ అద్దేపల్లి ఫౌండేషన్ అధ్యక్షులు వై.డి. రామారావు అన్నారు. నవంబర్ 10వ తేదీన కాకినాడ సూర్య కళా మందిరంలో జరిగింది. అద్దేపల్లి సప్తతి పూర్తి మహోత్సవ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎం.వి. భరతలక్ష్మి జ్యోతి ప్రజ్వలనంతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రారంభ సదస్సులో నోముల సత్యనారాయణ అభినందన చెప్తూ వ్యక్తిత్వం, మానవత్వాల చిరునామా అద్దేపల్లి అన్నాడు. కడలి సూర్యనారాయణ డా॥ అద్దేపల్లి సాహిత్య నిబద్ధతను ప్రశంసించారు. డా॥ అద్దేపల్లిపై పరిశోధన చేస్తున్న ఎస్.ఆర్. సంస్థ అద్దేపల్లిని సాహితీ సేనానిగా అభివర్ణిస్తూ, సమగ్రతకు మారుపేరు ఆయన కవిత్వం – విమర్శ అన్నారు. తిరుపతి నుండి విచ్చేసిన డా॥ వేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రయోజనకరమైన అభిమానులతో విస్తరించే ప్రజాకవి డా॥ అద్దేపల్లి అన్నారు.

హైదరాబాద్ నుండి విచ్చేసిన డా॥ ధేనుకొండ శ్రీరామమూర్తి అద్దేపల్లి కవిత్వ తత్వాన్ని వివరించారు. మాకినీడి సూర్యభాస్కర్ రచించిన "అద్దేపల్లి కవిత్వతత్వం" సంపుటిని డా॥ భరతలక్ష్మి ఆవిష్కరించగా, దాట్ల దేవదానంరాజు సమీక్షించారు. అనంతరం రాధేయ (అనంతపురం) రచించిన "మగ్గం బతుకులు" కవితా సంపుటిని వై.డి. రామారావు ఆవిష్కరించగా, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి విద్వాన్ పృధ్వీ సమీక్షించారు. శ్రీమతి అద్దేపల్లి జ్యోతి రచించిన పున్నమి హైకూ సంపుటిని డా॥ అద్దేపల్లి ఆవిష్కరించగా డా॥ శిరీష సమీక్షిస్తూ అనుభూతి ప్రతిబింబాలుగా వెన్నులలో తడిపే హైకూ విశిష్టతను వివరించారు. తొలుత కవి, ప్రయోక్త, ఫౌండేషన్ కార్యదర్శి వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు స్వాగతంతో ప్రారంభమైన ఈ సమావేశంలో వేదుల శ్రీరామశర్మ రచించిన తెలుగు కవుల కాలపట్టిక "తెలుగు వెలుగులు"ను డా॥ అద్దేపల్లి ఆవిష్కరించారు.

డా॥ బోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమైన ద్వితీయ సమావేశం ఎస్. అశోక్‌కుమార్ 'తల్లి ఎవరు నువ్వు' దీర్ఘ కవితను చినుకు సంపాదకుడు ఎన్. రాజగోపాల్ ఆవిష్కరించగా, జి. సుబ్బారావు (కొత్తపేట) సమీక్షించారు. కె.బి. కృష్ణ రచించిన 'జంతర్ మంతర్' నవలను డా॥ బోయిన ఆవిష్కరించగా, సోమయాజులు సమీక్షించారు. ఆర్. రంగస్వామి గౌడ్ (కర్నూలు) రచించిన 'స్పందన మందారాలు' లేఖా వీచికల్ని డా॥ అద్దేపల్లి ఆవిష్కరించగా, నెల్లూరు నుండి విచ్చేసిన పెరుగు



నవంబర్ 12న కాకినాడ సూర్య కళా మందిరంలో అద్దేపల్లి సప్తతి పూర్తి సభలో పాల్గొన్న డా॥ పి. చిరంజీవినీ కుమారి, డా॥ ఆలూరి విజయలక్ష్మి, విఎస్.ఆర్.ఎస్. సోమయాజులు, ఎస్.ఆర్. పృధ్వీ, జి. సుబ్బారావు, శిరీష, వై.డి. రామారావు, వి. చందు, వక్కలంక రామకృష్ణ ప్రభృతులు

రామకృష్ణ వచన కవితల సి.డి. 'పరావర్తనం'ను పరిచయం చేశారు. విశాఖపట్నం నుండి విచ్చేసిన రామతీర్థ సంపాదకత్వంలో వెలువడిన ఆంగ్ల సాహిత్య పత్రిక 'మొజాయిక్'ను డా॥ అద్దేపల్లి ఆవిష్కరించగా, రామతీర్థ స్పందిస్తూ తెలుగు సాహిత్యం ఇంగ్లీషులోకి అనువదించబడటం ఎంతో అవసరమన్నారు.

కొత్తగూడెం నుండి విచ్చేసిన సుబ్బారావు, సంపాదకులు సలీం దురానీ తదితరులు పాల్గొన్నారు. భోజనానంతరం డా॥ శిరీష స్వాగత సంచాలనంతో రామతీర్థ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన యాభై మంది కవులు రసవత్తరంగా కవితల్ని విన్పించారు. నిర్వాహకులుగా భగ్వాన్, యాసలపు సూర్యారావు వ్యవహరించిన కవి సమ్మేళనం అనంతరం ఫౌండేషన్, తుమ్మిడి, ద్విభాష్యంల సౌజన్యంతో ప్రజాకవి డా॥ అద్దేపల్లి రామ్మోహనరావు సత్కార సంరంభం పుర ప్రముఖులు, అశేష కవుల సమక్షాన జరిగింది. సప్తతి సంచిక 'నిరంతరం' ఆవిష్కరణ, కవి ఎస్.ఆర్. పృధ్వి 'గుండెవూటలు' నానీల సంపుటి ఆవిష్కరణ జరిగాయి. డా॥ ఎల్.కె. సుధాకర్, సోమయాజులు వందన సమర్పణ చేశారు. విశేషంగా ఆంధ్ర దేశం నుంచి వందలాది మంది అభిమానులు అద్దేపల్లిని అభినందించి, సభను విజయవంతం చేశారు.

ఇదే సభలో డా॥ అద్దేపల్లి రామమోహనరావుకు డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు లిటరరీ అవార్డును వక్కలంక రామకృష్ణ అందజేశారు. కళాశాల విద్యార్థులకు నిర్వహించిన కవితల పోటీలో నగదు బహుమతులు ఫౌండేషన్ అందించింది. సప్తతి విశేష సంచిక నిరంతరం ఆవిష్కరించబడింది. ఈ సందర్భంగా జరిగిన సన్మానానంతరం అద్దేపల్లి మాట్లాడుతూ కవులొక్కరే సమాజ సమకాలీన పరిస్థితులపై సమగ్రంగా స్పందించగలుగుతారని, తనపై చూపిన అభిమాన సత్కారానికి కృతజ్ఞతలు తెల్పి, బాల్యంపై గజల్ విన్పించారు.

**- ఎస్.ఆర్. పృథ్వి**

# వేడుకగా శిఖామణి సాహితీ రజతోత్సవం

**ఆ**ధునిక తెలుగు కవిత్వంలో శిఖామణి విశిష్ట కవి. రణగొణ ధ్వనుల మధ్య అస్పష్ట కవిత్వ గజిబిజి గందరగోళాల నడుమ ఉక్కిరి బిక్కిరవుతున్న తెలుగు పాఠకుడికి తన మువ్వల చేతికర్రతో చేయూతనందించి మార్దవభరితమైన కవితా మార్గాన్ని దర్శింపచేసిన వ్యక్తి శిఖామణి. ఆయన కవిత్వం మూడు తరాల పాఠకులకు, కవి పండితులకు, విమర్శకులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, వక్తగా, సాహితీవేత్తగా శిఖామణి కృషిని స్మరించుకుంటూ ఆయన స్వస్థలం యానాంలో నవంబర్ 26న శిఖామణి సాహితీ రజతోత్సవం కవితాభిమానుల పండగగా జరిగింది. స్ఫూర్తి సాహితీ సమాఖ్య (యానాం), కవి సంధ్య (హైదరాబాద్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి మంత్రి శ్రీ మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మువ్వల చేతికర్ర కవితా సంపుటిని ఆవిష్కరించి తొలి ప్రతిని శీలా వీర్రాజుకి అందజేశారు. 'సమాంతర' వ్యాస సంపుటిని శీలా వీర్రాజు ఆవిష్కరించగా మల్లాడి కృష్ణారావు అంకితం స్వీకరించారు. డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు సభకు అధ్యక్షత వహించారు. కె. శివారెడ్డి శిఖామణి కవిత్వంపై కీలకోపన్యాసం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సుప్రసిద్ధ కవులు, విమర్శకులు, సాహితీ మిత్రులు, కళాకారులు, వాగ్గేయకారులు ఈ సభలో పాల్గొన్నారు. దాట్ల దేవదానం రాజు రచించిన 'సరదాగా కాసేపు' గ్రంథం, రామతీర్థ అనువదించిన 'మొజాయిక్' కవితా గ్రంథం ఈ సందర్భంగా ఆవిష్కరించబడ్డాయి. మేడిపల్లి రవికుమార్, శివారెడ్డి, డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, కె.రామమోహనరాయ్, కోయి కోటేశ్వరరావు, స్వరూపరాణి, యాకూబ్ తదితరులు అభినందన ప్రసంగం చేశారు.



**నవంబరు 26న యానాంలో జరిగిన శిఖామణి సాహితీ రజతోత్సవంలో 'సమాంతర' వ్యాస సంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో శీలా వీర్రాజు, కె.శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు, అద్దేపల్లి, శిఖామణి, గిడ్ల చంద్రరావు, విల్సన్ సుధాకర్**

**స్పందన :** తన కవిత్వంలో లాలిత్యం, మృదుత్వం, ఆర్ద్రత వంటి గుణాలు తను పుట్టిన నేల నుండి, గాలి నుండి, నీటి నుండి తనకు సంక్రమించాయని, జీవితంలో ఒక తల్లిని కోల్పోతే ఎందరో తల్లులు తనను ఆదరించారని ఈ కవిత్వం ఆ తల్లుల పాల ధార గొప్పదనమేనని ముగింపులో శిఖామణి చెప్పారు.

ఆ సాయంత్రం శివారెడ్డి ముఖ్య అతిథిగా, దాట్ల దేవదానం రాజు అధ్యక్షులుగా, జి. సుబ్బారావు, మధునాపంతులు, సిహెచ్. రాం సమన్వయ కర్తలుగా కవి సమ్మేళనం జరిగింది. గోరటి వెంకన్న గీతాలు సభను ఆసాంతం ఉర్రూతలూగించాయి.

**- కోయి కోటేశ్వరరావు**

# 'సంవీక్ష' పుస్తకావిష్కరణ



**'సంవీక్ష' గ్రంథావిష్కరణ సభలో డా॥ బోయినపల్లి వేంకట రామారావు, చిత్రంలో నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్, రచయిత దాస్యం సేనాధిపతి, మాడిశెట్టి గోపాల్, డా॥ గంద్ర లక్ష్మణరావు, బి.సి. గౌడ్, ఎస్. నాగేంద్రశర్మ తదితరులు ఉన్నారు**

ప్రముఖ కవి, రచయిత, సమీక్షకులు దాస్యం సేనాధిపతి రచించిన గ్రంథ సమీక్షా వ్యాసాలు 'సంవీక్ష' పుస్తకాన్ని డిసెంబర్ 17వ తేదీన నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సంవీక్ష'లోని సమీక్షా వ్యాసాల్లో సేనాధిపతి సహృదయత ప్రతిబింబిస్తున్నది అన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు డా॥ తిరునగరి మాట్లాడుతూ సమాజ హితం కోరే సాహిత్యం రావాలని కోరారు. 31 సమీక్షా వ్యాసాలతో 'సంవీక్ష' పేరున గ్రంథాన్ని వెలువరించిన రచయిత సేనాధిపతి అభినందనీయులని అన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని సాహితీ సంస్థలు సేనాధిపతిని ఘనంగా సన్మానించాయి. సాహితీ గౌతమి అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు అన్నవరం దేవేందర్, డా॥ జి. లక్ష్మణరావు, ఎస్. వేణుశ్రీ, లదాస్యల లక్ష్మయ్య, డా॥ టి.ఆర్.కె. చారి, బి.సి. గౌడ్, ప్రముఖ కథా రచయిత ఐతా చంద్రయ్య, డా॥ బోయినపల్లి వెంకట రామారావు, ఎస్. నాగేంద్రశర్మ, బి.వి. ఎన్, అనంతాచార్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ కల్లూరి శ్యామల నూతన గ్రంథాల ఆవిష్కరణ


**ఢి**ల్లీకి చెందిన ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు డా॥ కల్లూరి శ్యామల రచించిన "స్వగతాలు" కవితా సంపుటి, "ట్వంటీయత్ సెంచరీ తెలుగు పొయెట్రీ" ఆంగ్లానువాద గ్రంథాల ఆవిష్కరణ సభ ఇటీవల హైదరాబాద్‌లోని కళా సుబ్బారావు కళా వేదికపై జరిగింది.

'స్వగతాలు' కవితా సంపుటిని ఆవిష్కరించిన ప్రముఖ కవి, విమర్శకులు డా॥ అద్దేపల్లి రామమోహనరావు ప్రసంగిస్తూ కవయిత్రి తన అనుభూతులనూ, ఆవేదనను హృదయానికి హత్తుకునే రీతిలో కవిత్వంలో వ్యక్తీకరించారని అన్నారు. "ట్వంటీయత్ సెంచరీ తెలుగు పొయెట్రీ" గ్రంథాన్ని ఆవిష్కరించిన ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త ఆచార్య చేకూరి రామారావు తన ప్రసంగంలో డా॥ శ్యామల అనువాదాలు మూలానికి దగ్గరగా వున్నాయని అభినందించారు.

సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ కన్వీనర్ డా॥ పోరంకి దక్షిణామూర్తి మాట్లాడుతూ తెలుగులో సరియైన అనువాదకులు లేకపోవడం వల్లనే మనం వెనుకబడి వున్నామని విచారం వ్యక్తం చేశారు. డా॥ వి. నిత్యానందరావు, డా॥ సి. భవానీదేవి గ్రంథ పరిచయం చేశారు. ఆర్.ఎస్. గణేశ్వరరావు, తాళ్ళపల్లి మురళీధర్, రచయిత్రి డా॥ శ్యామల తదితరులు ప్రసంగించారు.



**డాక్టర్ కల్లూరి శ్యామల రచించిన "స్వగతాలు" "ట్వంటీయత్ సెంచరీ తెలుగు పొయిట్రీ" గ్రంథాల ఆవిష్కరణ సభలో పాల్గొన్న వక్తలు. చిత్రంలో డాక్టర్ వెలిదండ నిత్యానందరావు, డా॥ అద్దేపల్లి, ఆర్.ఎస్. గణేశ్వరరావు, డాక్టర్ పోరంకి, ఆచార్య చేరా, గ్రంథకర్త డా॥ శ్యామల, డా॥ సి. భవానీదేవి**




**దుర్గం రవీందర్, గద్దర్, డా॥ సి. నారాయణరెడ్డి, బి.ఎస్. రాములు, రాఘవేందర్‌రావు, అందెశ్రీ**

# వీక్షించినవారికే విమర్శించే హక్కు

**'వి**రామ చిహ్నాలు లేకుండా ప్రవహించే మహా సముద్రమే మనిషి బ్రతుకు' అని జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి అన్నారు. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో జరుగుతున్న బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో బి.ఎస్. రాములు రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభకు ఆయన హాజరయ్యారు. రాములు రచించిన "జీవితం అంటే ఏమిటి?" అనే పుస్తకాన్ని సి. నారాయణరెడ్డి, "వ్యక్తిత్వ వికాసం – సామాజిక నాయకత్వం" అనే పుస్తకాన్ని ప్రజా గాయకుడు గద్దర్ ఆవిష్కరించారు. సినారె మాట్లాడుతూ ఏదైనా అంశంపై లోతుగా వీక్షించి విశ్లేషణ చేసిన వారికే విమర్శించే హక్కు ఉంటుందన్నారు. జీవితాన్ని అన్ని కోణాల నుంచి చూసిన రాములు రచనలు సమాజానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. గద్దర్ మాట్లాడుతూ పాత తరం వ్యక్తులు జరిపిన జీవన పోరాట ఘట్టాలే ఇప్పుడు పుస్తకాలుగా ప్రచురితమవుతున్నా యన్నారు. కార్యక్రమంలో దుర్గం రవీందర్, కాసుల ప్రతాపరెడ్డి పుస్తకాల పరిచయం చేశారు. కార్యక్రమంలో కన్నడ కవి ఎం.ఎల్. రాఘవేంద్ర రావు, ప్రముఖ గాయకుడు అందెశ్రీ తదితరులు పాల్గొన్నారు.



**ఇటీవల ఆంధ్రప్రదేశ్ అధికారా భాషా సంఘం, ఢిల్లీ తెలుగు సాహితీ వారు ఢిల్లీలో ఏర్పాటు చేసిన తెలుగు వికాసం మహోత్సవం సందర్భంగా అధికార భాషా సంఘం అధ్యక్షులు డా॥ ఎ.బి.కె. ప్రసాద్ ద్వారా మెమెంటోను అందుకుంటున్న కందుకూరి వెంకట మహాలక్ష్మి పక్కన కమిషనర్ సి. విశ్వనాథ్, వేణుధరరెడ్డి**

# 21వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ఆకట్టుకొన్న 'అక్షరాంజలి'



డిసెంబర్ 1 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో గల పీపుల్స్ ప్లాజా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 21వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో నగర సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో "అక్షరాంజలి" స్టాల్ ఏర్పాటుచేసింది. ప్రస్థానం పత్రికలు ప్రముఖ కవుల రచయితల ఫొటోలు, సూక్తులు, తొలి గ్రంథాలు, ముద్రణలు మరియు ప్రపంచ ప్రఖ్యాత కవులు, రచయితలు, బ్రెహ్ట్, రస్సెల్స్, గోర్కి, టాల్‌స్టాయ్, నెరుడా, భారతదేశంలోని కవులయిన ఠాగూర్, ప్రేమ్‌చంద్, సుబ్రమణ్య భారతి, రాహుల్ సాంకృత్యాయన్, తెలుగు కవులయిన ధర్మవరం కృష్ణమాచార్యులు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, మల్లాది, దేవులపల్లి, తాపీ ధర్మారావు, ముగ్ధం మొహిద్దీన్, ఆరుద్ర, శ్రీశ్రీ, కాళోజి, సుబ్బారావు, పాణిగ్రాహి, శారద, చెరబండ రాజు, గరికపాటి రాజారావు, తెన్నేటి సూరి, త్రిపురనేని, కందుకూరి, గురజాడ ఇలా దాదాపు 300 మంది అభ్యుదయ, ప్రగతిశీలులైన వారివి, ప్రాచీన కవుల యొక్క ఫొటోలు సందర్శకుల్ని ఎంతో ఆకర్షించాయి.

ఈ శిబిరాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి ప్రారంభించగా, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఎన్.బి.టి. ఛైర్మన్, ప్రఖ్యాత చరిత్రకారులు బిపిన్ చంద్ర తొలిగా సందర్శించారు. ముగ్దం మొహిద్దీన్, దాశరథి లాంటి వాళ్ళ ఫొటోలు అడిగి మరీ చూసి సంతోషించారు. పద్యకవులు, అభ్యుదయ కవులు, విద్యావేత్తలు, అధికార, అనధికారులు చారిత్రక పరిశోధకులు ఈ అక్షరాంజలి శిబిరాన్ని సందర్శించారు. చాలామంది ఈ ప్రయత్నాన్ని అభినందించడమే కాక పుస్తకంగా వెలువరించాలి. 1, 2 సంపుటాలుగా అనే సూచనలు చేశారు. ప్రస్థానం పత్రికలు ఉత్సాహంగా చూసి కొన్నారు.

అలాగే హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ వారు నిత్యం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు, కవి సమ్మేళనం, మీడియా ధోరణులపై గోష్టిలాంటి ప్రతి కార్యక్రమంలోను సభా నిర్వహణ బాధ్యతల్ని నగర సాహితీ స్రవంతి బాధ్యులు చేపట్టి, అటు నిర్వాహకుల, కవుల, రచయితల, సందర్శకుల మన్ననలు పొందారు.

ప్రొఫెసర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ శివ కె. కుమార్ నిర్వచించిన ముఖాముఖి కార్యక్రమంలో మరియు మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగాయి. టి.వి.9 రవిప్రకాష్‌తో జరిపిన ఇష్టాగోష్ఠి సదర్భంలో సాహితీ స్రవంతి కార్యకర్తలు ప్రపంచీకరణపై, సాహిత్య ధోరణులపై ప్రశ్నలు వేయడమే గాక ప్రముఖుల దృష్టిలోకి ప్రపంచీకరణ వ్యతిరేక భావజాలం తప్పనిసరి అనే ఆలోచనను రేకెత్తించారు.

సభా కార్యక్రమాలు – సాహితీ స్రవంతి అక్షరాంజలి శిబిరాన్ని ప్రతి రోజు క్రమశిక్షణతో నగర సాహితీ స్రవంతి బాధ్యులైన సత్యభాస్కర్, తంగిరాల చక్రవర్తి, వరప్రసాద్, తంగెళ్లపల్లి కనకాచారి, వెంకన్న, విప్లవ్‌దత్ శుక్లా, పసునూరి రవీందర్, మౌనశ్రీ మల్లిక్ (రచయిత), కన్స్యూమర్ టైమ్ ఎడిటర్ శ్రీ విజయ్ బాబూరావు, కవి బొపార (బొల్లు పాండురంగం), లక్ష్మయ్య మొదలైనవారు నిర్వహించారు. ప్రతి నిత్యం వేలాది సందర్శకులతో పాటు అక్షరాంజలి శిబిరాన్ని సందర్శించిన ముఖ్యులు, ప్రముఖులలో డా॥ సి.నారాయణరెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్, రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల డైరెక్టర్ రాళ్ళబండి కవితా ప్రసాద్, జ్వాలాముఖి, శివారెడ్డి, శిఖామణి, ద్వారం నారాయణశాస్త్రి, మాజీ శాసనసభ్యులు నరసిరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి. రాఘవులు, వేదగిరి రాంబాబు, చిత్రకారులు చంద్ర, అంపశయ్య నవీన్, అబ్బూరి ఛాయదేవి, సినీ కవులు చంద్రబోసు, పరుచూరి గోపాలకృష్ణ, విమర్శకులు జితేంద్రబాబు, చేకూరి రామారావు, బి.ఎస్. రాములు, ప్రొ॥ సుబ్బారావు, కవి మాధవరావు, కోరుపోలు, చంద్రశేఖర్ ఆజాద్, మోత్కూరు నరహరి (ఆంధ్ర సారస్వత పరిషత్ మాజీ ప్రిన్సిపాల్‌లాంటి ప్రముఖులు సందర్శించి, విలువైన తమ తమ... అభిప్రాయాలు విజిటర్స్ బుక్‌లో రాశారు. తెన్నేటి సూరి కుటుంబీకులు తెన్నేటి సూరి ఛాయాచిత్రాలు కావాలి అని తమ చిరునామాను అందజేశారు. ఎంతో ఆనందించారు. నిర్వాహకులను అభినందించారు. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా నగర కవులతో రాయబడిన "కలాలు – గళాలు" పుస్తకం నగర కన్వీనర్ సత్యభాస్కర్ గద్దర్‌కు బహూకరించారు. 21వ బుక్‌ఫెయిర్‌లో అక్షరాంజలి (శిబిరం) ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకుల్ని, మేధావుల్ని విశేషంగా ఆకర్షించింది.

**- తంగిరాల చక్రవర్తి**

# మట్టి ముత్యాలు ఆవిష్కరణ

డా॥ నలిమెల భాస్కర్ రచించిన 'మట్టి ముత్యాలు' (నానీలు) పుస్తకావిష్కరణ సభ మానేరు రచయితల సంఘం – సిరిసిల్ల ఆధ్వర్యంలో అక్టోబర్ 8న జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డీన్, ఆచార్య ఎన్. గోపి గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ "ప్రస్తుతం తెలంగాణాలోని రెండవ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమానికి కరీంనగర్ కేంద్రం అని, నలిమెల భాస్కర్ రచించిన నానీలు అక్కడ మట్టిలో నానాయనీ అన్నారు. ప్రముఖ కవయిత్రి ఎన్. అరుణ మాట్లాడుతూ ఈ నానీల్లో ఏ ఒక్కటీ తీసివేయలేమని అన్నారు. ఈ సభకు ప్రముఖ రచయిత జూకంటి జగన్నాథం అధ్యక్షత వహించగా డా॥ ఎస్. రఘు పుస్తక పరిచయం చేశారు. డా॥ పత్తిపాక మోహన్, డా॥ మచ్చ హరిదాసు, బండి చంద్రశేఖర్, మద్దికుంట లక్ష్మణ్ తదితరులు కవిని అభినందిస్తూ మాట్లాడారు.

# డైరీ

## కరీంనగరం నానీలకు తలమానికం

### ప్రొఫెసర్ ఎన్ గోపి



అన్నవరం దేవేందర్ 'బుద్దపర్కలు' నానీల సంకలనం ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్. గోపి. వేదికపై వరుసగా సాంబారి లక్ష్మీరాజ్యం, జందం అశోక్, పత్తిపాక మోహన్, గూడూరి సీతారాం, మద్దికుంట లక్ష్మణ్, ఆచార్య గోపి, అన్నవరం దేవేందర్, కాసుల ప్రతాపరెడ్డి, జీవగడ్డ విజయకుమార్

**ఆం**ధ్రదేశంలో కరీంనగర్ జిల్లా నానీల సంకలనానికి తలమానికం అయిందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ ఎన్. గోపి అన్నారు. ఆయన ఇటీవల సిరిసిల్లలో అన్నవరం దేవేందర్ 'బుద్దపర్కలు' నానీల సంకలనంను ఆవిష్కరించారు. మానేరు రచయితల సంఘం నిర్వహించిన ఈ సభకు ప్రముఖ కవి జూకంటి జగన్నాథం అధ్యక్షత వహించారు. కరీంనగర్ జిల్లా నుంచి ఇప్పటి 17 నానీల సంకలనాలు వచ్చాయని అన్నారు. అన్నవరం దేవేందర్ కవిగా ఇప్పటికే ప్రసిద్ధుడని ఆయన రాసిన నానీలు ధిక్కార స్వరంతో ఉన్నాయని అన్నారు. తెలంగాణ భాష తెలంగాణ జీవితం ఈ నానీలో వ్యక్తం అవుతుందన్నారు. 'బుద్దపర్కలు' అనే పేరు పెట్టడంలోనే దేవేందర్ భాషా ప్రత్యేకత కన్పిస్తుందన్నారు. సమావేశంలో 'బుద్దపర్కలు'ను సమీక్షిస్తూ డాక్టర్ పత్తిపాక మోహన్ అన్నవరం నానీలు వట్టివి కావు గట్టివని అన్నారు. "దొరగాడిని చూస్తేనే / ఉచ్చపడేది / ఇప్పుడు అండ్లనే / పోస్తన్నం" అన్న నానీ మొత్తం ఉద్యమ చరిత్ర చెబుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన జూకంటి జగన్నాథం మాట్లాడుతూ తెలంగాణ నుండి వస్తున్న సాహిత్యం అంతా జీవితం నుంచి వస్తున్నదని, మిగతాది విరామం నుండి మిగులు నుంచి ఉత్పన్నమవుతున్నదని అన్నారు. సమావేశంలో తెలంగాణ తొలి తరం కథకులు గూడూరి సీతారాం, విమర్శకులు కాసుల ప్రతాపరెడ్డి, కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, బహు భాషా కోవిదులు డాక్టర్ నలిమెల భాస్కర్, ఎన్. అరుణ, నాంపెల్లి సుజాత, చిత్రకారులు అన్నవరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంకలనం అంకితం ఇవ్వబడ్డ జీవగడ్డ దినపత్రిక సంపాదకులు బి. విజయకుమార్‌కు మాట్లాడుతూ అన్నవర దేవేందర్ ఇరవై ఏండ్ల నుంచి జర్నలిస్టుగా, సాహిత్యకారునిగా తనదైన ముద్రతో ఉన్నారని అన్నారు. సిరిసిల్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి సాహిత్యకారులు హాజరయ్యారు.

## 'అంపశయ్య' నవీన్ గ్రంథాల ఆవిష్కరణ




**డిసెంబర్ 24న సహృదయ సాహితి, సృజనలోకం ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన డా॥ అంపశయ్య నవీన్ 'సాహిత్య కబుర్లు', 'జీవన శైలి' గ్రంథాల ఆవిష్కరణ సభలో పాల్గొన్న వక్తలు. చిత్రంలో వరుసగా నల్లా యాదగిరి, డా॥ గిరిజా మనోహర్‌బాబు, తాళ్ళపల్లి మురళీధర్‌గౌడు, గ్రంథకర డా॥ నేరెళ్ళ వేణుమాధవ్, డా॥ పోరంకి దక్షిణామూర్తి, డా॥ అద్దేపల్లి, డా॥ రామచంద్రమౌళి**

ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ రచించిన సాహిత్య కబుర్లు, జీవనశైలి – గ్రంథాల ఆవిష్కరణ సభ డిసెంబర్ 24 వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాలులో జరిగింది. సహృదయ సాహితి, సృజనలోకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ ధ్వన్యనుకరణ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ అధ్యక్షత వహించారు. గడచిన నాలుగున్నర దశాబ్దాలుగా నవీన్ చేస్తున్న సాహిత్య సేవను ఆయన తన ప్రసంగంలో ప్రశంసించారు. 'సాహిత్య కబుర్లు' గ్రంథాన్ని ఆవిష్కరించిన పోరంకి దక్షిణామూర్తి మాట్లాడుతూ నవీన్ గొప్ప అధ్యయన శీలి అని, ఎంతోమంది గొప్ప రచయితలను గురించి ఆసక్తికరంగా రాశారని అన్నారు. 'జీవన శైలి'ని ఆవిష్కరించిన అద్దేపల్లి రామమోహనరావు నవీన్ గొప్ప స్నేహశీలి అన్నారు. రచయితలు రామచంద్రమౌళి, నల్లా యాదగిరి, గిరిజా మనోహర్‌బాబు గ్రంథాలను పరిచయం చేశారు. ఇదే సందర్భంలో అద్దేపల్లిని ఆయన సప్తతి సందర్భంగా సంస్థలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. వి.ఆర్. విద్యార్థి, ఎల్.ఎన్.ఆర్. ప్రసాద్, టి. మురళీధర్‌గౌడ్, కె.పి. అశోక్‌కుమార్, వాసిరెడ్డి కృష్ణారావు, కాశీభట్ల విశ్వనాథం, విజయమోహన్‌రావు, వాసిరెడ్డి భాస్కరరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు సభలో పాల్గొన్నారు.

# మందరపు హైమవతికి సినారె అవార్డు ప్రదానం



గత పదహారు సంవత్సరాలుగా కరీంనగర్‌లో సాహితీ గౌతమి నేతృత్వంలో డా॥ సి. నారాయణరెడ్డి అవార్డును రాష్ట్ర స్థాయిలో ఈ పోటీ నిర్వహించి ఎంపికైన వచన కవితా సంపుటికి ఇస్తున్నారు. అవార్డు పేర పదివేల రూపాయల నగదు బహుమతి, మెమొంటో, శాలువా కవికి బహూకరించెదరు. నగదు బహుమతికి శాశ్వత పురస్కార ప్రదాతగా డా॥ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. పురస్కార కమిటీ కన్వీనర్‌గా వీరి అధ్వర్యంలో కార్యక్రమం సాగుతుంది. అటువంటి అవార్డును ఈ సంవత్సరం మందరపు హైమవతిగారి నిషిద్ధాక్షరి కవితా సంపుటి గెలుచుకుంది. ఈ అవార్డు చరిత్రలో ఎన్నికైన మొదటి కవయిత్రి వీరు. స్త్రీవాద నేపథ్యపు భూమికలో సాగిన ఈ వచన కవితా సంపుటిని అవార్డుకు ఎన్నిక చేసిన న్యాయ నిర్ణేతలు అభినందనీయులు. అవార్డు కార్యక్రమ సభను 19 నవంబర్, 2006 రోజున కరీంనగర్ ఫిలింభవన్‌లో జరిగింది. సభాధ్యక్షులుగా డా॥ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి వ్యవహరించగా, ముఖ్య అతిథిగా డా॥ సి. నారాయణరెడ్డి అవార్డును కవయిత్రికి అందజేశారు. ఈ సందర్భంలో నారాయణరెడ్డి కవులు, రచయితలకు అనేక సూచనలు చేశారు. కవితా సంపుటిని వారాల ఆనంద్ సమీక్షించారు. సాహితీ గౌతమి అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ గౌతమి ప్రస్థానాన్ని అందరికీ తెలియజేశారు. కవయిత్రి మాట్లాడుతూ, నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోవడం ఆనందాన్నిచ్చిందని అన్నారు. బోయినపల్లి వెంకట రామారావు కవయిత్రిని అభినందించారు. దాదాపు మూడువందల మంది పాల్గొన్న ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొన్నారు. నలిమెల భాస్కర్, దాస్యం సేనాధిపతి, అన్నవరం దేవేందర్, గంద్ర లక్ష్మణరావు, సంకేపల్లి నాగేంద్రశర్మ, పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతాచార్య వందన సమర్పణలో కార్యక్రమం ముగిసింది.

# 'గోరుకొయ్యలు' పుస్తకావిష్కరణ

'రక్త సంబంధం కన్నా సాహితీ బంధుత్వం గొప్పదని, సాహిత్యం మనుషుల మధ్య బంధాలను దృఢం చేస్తోందని' కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ఉస్మానియా విశ్వ విద్యాలయం డీన్ ఆచార్య ఎన్. గోపి అన్నారు. కరీంనగర్ జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య 'సాహితీ గౌతమి' ఆధ్వర్యంలో స్థానిక ఫిలిం భవన్‌లో అక్టోబర్ 7న జరిగిన డాక్టర్ మచ్చ హరిదాసు నానీల సంపుటి 'గోరు కొయ్యలు' పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై, పుస్తకావిష్కరణ చేసిన తర్వాత ఆయన ప్రసంగించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగనభట్ల నరసయ్య మాట్లాడుతూ ఇటీవల నానీలు తమ రూపశిల్ప సౌలభ్యాలతో యావదాంధ్ర దేశాన్ని ఆర్ద్రం చేశాయన్నారు. అనంతరం విశిష్ట అతిథి, ప్రముఖ కవయిత్రి శ్రీమతి ఎన్. అరుణ ప్రసంగిస్తూ 'నానీల సంకలనాలు ఎంతో అర్ధవంతంగా, సులభగ్రాహ్యంగా ఉంటున్నాయన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యువకవి తత్వాది ప్రమోద్‌కుమార్ పుస్తక సమీక్ష చేశారు. ఈ సమావేశంలో కవి మిత్రులు డా॥ జి. లక్ష్మణరావు, డా॥ నలిమెల భాస్కర్, డా॥ మలయశ్రీ, అన్నవరం దేవేందర్, సబ్బని లక్ష్మీనారాయణ, వారాల ఆనంద్, డా॥ బి. మధుసూదన్‌రెడ్డి, అనంతాచార్య, బి.వి.ఎన్. స్వామి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.



**డా॥ మచ్చ హరిదాసు 'గోరు కొయ్యలు' నానీల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్. గోపి. చిత్రంలో రచయితతో పాటు డా॥ సంగనభట్ల నరసయ్య, మాడిశెట్టి గోపాల్, సబ్బని లక్ష్మీనారాయణ, అన్నవరం దేవేందర్, మచ్చ భారతి, ఎన్. అరుణ, డా॥ జి. లక్ష్మణరావు, తత్వాది ప్రమోద్‌కుమార్ ఉన్నారు**



**ముంబయిలో 'కల్చరల్ సెంటర్ ఆఫ్ రష్యా'లో సంగెవేని రవీంద్ర రచించిన "వర్లి" వలస నానీలు మరియు నడిమెంట్ల యెల్లప్ప "ముంబయి ముత్యాలు" పుస్తకావిష్కరణ చేసిన ఆచార్య డా॥ ఎన్. గోపి, అంబల్ల జనార్దన్ సంకు సుధాకర్, సంగెవేని రవీంద్ర, నడిమెట్ల యెల్లప్ప మరియు శ్రీమతి ఎన్. అరుణ**

## డైరీ

# నాయని సుబ్బారావు జయంతి సభ

"విశిష్ట వ్యక్తిత్వమున్న గొప్ప కవి నాయని సుబ్బారావు. అరుదైన కవితా శైలి, ప్రతిభ, ద్రవించే హృదయం, సంబంధాల పట్ల మమకారం ఇవన్నీ ఆయన కవిత్వాన్ని అందరికీ చేరువ చేశాయి. "విమర్శకు గురికాని మహాకవి నాయని" అంటూ సభాధ్యక్షుడు ఆచార్య రవ్వా శ్రీహరి నగర కేంద్ర గ్రంథాలయంలో నవంబర్ అయిదో తేదీన ఆయని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాయని 107వ జయంతి కార్యక్రమంలో అన్నారు. ప్రధాన వక్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మం తన ప్రసంగంలో "నాయని ప్రౌఢ కవి. నాచన సోముడు వంటి కవులు ప్రయోగించినట్లు అరుదైన పద సంబంధాలను నాయని వాడారు. విశ్వనాథ సత్యనారాయణ, నాయని సుబ్బారావుల మైత్రి అనితరసాధ్యం. ఏ పదాన్ని ఏ సందర్భంలో వాడాలో ఆయనకు తెలిసినంతగా మరొకరికి తెలియదనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు" అంటూ సోదాహరణ ప్రసంగం చేశారు. బేతవోలు రామబ్రహ్మని నాయని పురస్కారంగా రూ. 2,116లు, శాలువా జ్ఞాపికలతో రవ్వా శ్రీహరి, నాయని కృష్ణకుమారి సత్కరించారు. నాయని కృష్ణకుమారి కావ్యం "సౌభద్ర భద్రరూపం", ఆచార్య చేకూరి రామారావు వ్యాస సంకలనం "సౌభద్ర భద్ర కవితా వైవిధ్యం"లను శ్రీహరి ఆవిష్కరించారు. కృష్ణకుమారి కావ్యంపై ప్రసంగిస్తూ ఆచార్య సుమతీ నరేంద్ర భావ గాఢత, స్పందన, సమాజం పట్ల ప్రేమ ఆమె కవిత్వాన్ని ఆస్వాదనీయం చేశాయన్నారు. చేకూరి రామారావు కావ్యంపై ప్రసంగిస్తూ ఆచార్య అనుమాండ్ల భూమయ్య నాయని సుబ్బారావు జీవితానికి ప్రత్యక్ష సాక్షి అయిన చేరా ఎన్నో సంఘటనల్ని అక్షరీకరించారన్నారు. ఆచార్య నాయని కృష్ణకుమారి జ్ఞాపిక లందజేశారు. చీకోలు సుందరయ్య స్వాగతం పలుకగా, రఘుశ్రీ వందన సమర్పణ చేశారు.



హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో నాయని ట్రస్టు నిర్వహించిన నాయని సుబ్బారావు జయంతి సభలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మంను నాయని పురస్కార జ్ఞాపికతో సత్కరిస్తున్న నాయని కృష్ణకుమారి. చిత్రంలో ఆచార్యులు రవ్వా శ్రీహరి, సుమతి నరేంద్ర, చేకూరి రామారావు, రఘుశ్రీ తదితరులున్నారు.



వార్తా మాధ్యమాల విశ్వసనీయత – అంశంగా సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, హైదరాబాద్ యిటీవల హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఒక సదస్సు జరిగింది. ఇందులో పత్రికా సంపాదకులు, ఛానళ్ళ ప్రముఖులు, మీడియా సంస్థల నిర్వాహకులు, రచయితలు, మేధావులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో నాగసూరి వేణుగోపాల్ రచనలు 'పాత్రికేయపాళి', 'ఛానళ్ళ విస్తృతి – సీరియళ్ళ వికృతి' ఆవిష్కరించబడ్డాయి. మొదటి పుస్తకాన్ని ఆవుల మంజులత ఆవిష్కరించి తొలి ప్రతిని టంకసాల అశోక్ అందజేశారు.

రెండవ పుస్తకాన్ని మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ బి. సుభాషణ్ రెడ్డి ఆవిష్కరించి తొలి ప్రతిని దేవులపల్లి అమర్‌కి అందించాడు. డాక్టర్ కె. రామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు.




కవి, రచయిత, స్వాతంత్ర సమరయోధుడు హీరాలాల్ మోరియా సంస్మరణ సభ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగింది. ఖమ్మంలో స్థానిక కేంద్ర గ్రంథాలయంలో రావెళ్ళ వెంకట రామారావు అధ్యక్షతన సంస్మరణ సభలో డా॥ వై. రాధాకృష్ణమూర్తి, చేకూరి కాశయ్య, షుకూర్, డా॥ దిలావర్ మొదలైనవారు మోరియా స్మృతులను గుర్తు చేసుకున్నారు. చిత్రంలో మాట్లాడుతున్నవారు ఆనందాచారి.



సాహితీ స్రవంతి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, తానా వారి ఆధ్వర్యంలో ఖమ్మంలో తెలుగు భాషా పరిరక్షణ కోసం ఊరేగింపు జరిపి, పరిపాలనలో తెలుగు భాషను అమలుపరచాలని, ప్రాచీన భాషగా తెలుగును గుర్తించాలని కలెక్టర్‌కు విజ్ఞాపన అందజేశారు. సాధనాల, డా॥ బి.వి. అప్పారావు, రవిమారుతి, ఆనందాచారి, రౌతు రవి, టి. నర్సింహరావు, పోతగాని, లెనిన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

# అమెరికా అమానుషానికి కవులు, కళాకారుల నిరసన




సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్య సభలో ప్రముఖ కవి జ్వాలాముఖి ప్రసంగిస్తూ ఇరాక్ దేశపు ఆత్మగౌరవ పతాక సద్దాం అని అభివర్ణించారు. ఇరాక్‌లో సామ్రాజ్యవాద దురహంకారంతో అమెరికా చేస్తున్న దురాగతాలను ఎండకట్టారు. నేడు ఇరాక్‌లో జరుగుతున్న పరిణామాలను, వాటి నేపథ్యాలను తన సుదీర్ఘ ప్రసంగంలో వివరించారు. కువైట్ మీద సద్దాం యుద్ధం చేయడానికి కారణముంది అని అన్నారు. కువైట్ ఇరాక్ సరిహద్దులలో ఉన్న చమురు బావుల నుండి ఒప్పందానికి విరుద్ధంగా కువైట్ ఎక్కువ చమురును తీసివేయడంతో ఇరాక్ సరిహద్దులలోని చమురు బావులు ఎండిపోయాయని, ఈ విషయాన్ని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోని పరిస్థితులలో మాత్రమే కువైట్‌తో సద్దాం యుద్ధం చేయవలసి వచ్చిందని ఆయన అన్నారు. యాసర్ అరాఫత్ పాలస్తీనాకు పర్యాయ పదమైతే, సద్దాం హుస్సేన్ ఇరాక్‌కు పర్యాయ పదమని, భవిష్యత్ కాలంలో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ మరింత మంది యోధులు పుట్టుకొస్తారని ఆయన అన్నారు. సద్దాం చనిపోతూ కూడా పాలస్తీనా స్వావలంబనను ఆకాంక్షించాడని, అది సద్దాం నిబద్ధతను తెలియజేస్తుందని అన్నారు. అరబ్ దేశాలలోని అంతర్గత వైరుధ్యాల వల్ల భిన్న జాతులు, సమూహాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయని, వాటిలో పడి ఆయా జాతులు తమ హక్కులను కూడా మరచిపోయే పరిస్థితుల్లోకి వెళ్ళిపోతున్నాయని, ఆ పరిస్థితిని సామ్రాజ్యవాద దురహంకారి అమెరికా సొమ్ము చేసుకుంటుందని అన్నారు.

ప్రముఖ కార్మిక నాయకులు పర్సా సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ వియత్నాం యుద్ధం జరిగినప్పుడు అమెరికాలోని ప్రజలు తమ దేశంపైనే నిరసన తెలిపారని, ప్రస్తుతం 40 ఏళ్ళ తరువాత తిరిగి అమెరికాలో నేడు ఆ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దానికి కారణము సద్దాం హుస్సేన్ అని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి నగర కన్వీనర్ సత్యభాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నేడున్న పరిస్థితుల దృష్ట్యా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ సాహిత్యకారులు, మేధావులు తమ నిరసనను తెలియజేయాల్సిన అవసరముందని అన్నారు. ఈ క్రమంలో సాహితీ స్రవంతి నిరంతరం తన వంతు పాత్రగా నిరసన గళాన్ని వినిపిస్తున్నదని అన్నారు.

కార్యక్రమ అనంతరం పలువురు కవులు సామ్రాజ్యవాదాన్ని, సద్దాం ఉరిని నిరసిస్తూ ఉత్తేజభరితంగా తమ కవితలను చదివి వినిపించారు. ప్రముఖ ఇరాకీ కవి రాసిన కవితను పాటగా మలిచిన అరుణోదయ రామారావు ఉద్వేగభరితంగా పాడి శ్రోతలను అలరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు జగన్, నరేష్ తదితరులు తమ పాటలతో కార్యక్రమానికి ఉత్తేజాన్నిచ్చారు.

ప్రముఖ కవి శిఖామణి, కవయిత్రి మహజబిన్, రహమతుల్లా, వల్లభాపురం జనార్ధన్, గజవెల్లి, తంగిరాల చక్రవర్తి, పసునూరి రవీందర్, తంగెళ్ళపల్లి కనకాచారి, పరిమళ్, ఖాజామొయినుద్దీన్, అకోకాచారి, గురజాడ అప్పారావు, రాజా, యాదగిరిరావు, గిన్ని ఆనందరావు, పౌరప్రసాద్, వరలక్ష్మి, రౌతు కృష్ణమూర్తి తదితరులు తమ కవితలను చదివారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

## మరికొన్ని నిరసనలు

సద్దాం ఉరితీత వార్త తెలియగానే హైదరాబాద్‌లోని కవులు, రచయితలు బషీర్‌బాగ్‌లో చేరి నిరసన తెలిపారు.

జనవరి 3న తెలంగాణా సమాచార కేంద్రంలో కె. శివారెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసన సభలో ఎ.బి.కె. ప్రసాద్, హరగోపాల్, వరవరరావు, సైబాబా మాట్లాడారు. పలువురు కవితలు చదివారు. రాష్ట్రంలో ఇతర చోట్ల కూడా నిరసన కార్యక్రమాలు జరిగాయి.

## కవితలు

# ద్వేషం



**హెచ్చార్కె ప్రసాద్**

అభద్రత కారణమయింది
ప్రపంచ శాంతి సాకుగా మారింది
అసలు విషయం చమురు లాభాలే
పైపైన రసాయనిక ఆయుధాలది
లోలోన దాడికి సమాయత్తమైంది
దేశాన్ని ఆయుధాగారమంది
ప్రపంచమంతా భూతద్దంలో చూపించింది
అక్కడ చీమల శబ్దమే తప్ప
ప్రపంచానికి ప్రమాదపుటంచులేం కనపడలేదు

అతడు వాడికి శత్రువే
ప్రపంచానికి శత్రువును చెయ్యాలనుకుంది
ప్రపంచం అంతా అతడ్ని ద్వేషించాలనుకుంది
ప్రపంచానికి అతడు అజాతశత్రువయ్యాడు

అతడి మీద ప్రేమ మాత్రమే కాదు
అంతకు మించి ఉరి తీసిన వాడి మీద అంతులేని ద్వేషం
అతడ్ని ఉరితియ్యడం ప్రపంచమంతా చూపించింది

ఎంత ధైర్యం ఒక నాగరిక ప్రపంచంలో
బహిరంగ నరబలి!
ఎదురులేని తనంలో కళ్ళు బైర్లు గమ్మి చేస్తున్న కిరాతకం!!

అతని అనివార్య మరణం
అనేక రూపాలుగా ప్రవహిస్తుంది
అనాగరిక అమెరికా దిగంబరత్వం
ఇప్పుడు ప్రపంచమంతా ఒక వికార దృశ్యమయింది
ఎదిరించి గర్జించిన అతని గొంతు
కోట్లాది గొంతులకు ప్రేరణనిచ్చింది

భూతలం మీద దురహంకార
సామ్రాజ్యవాదాన్ని
ప్రశ్నిస్తూ ఉరికొయ్యకు వ్రేలాడుతున్న అతని
శిరస్సు
వాడికి మరణశాసనాన్ని లిఖించక మానదు
ప్రపంచమంతా వీక్షిస్తుండగా మరణాన్ని
అందుకున్నవాడతను

నిన్నటిదాకా సాధించిందేమో కానీ
నేడు మాత్రం సామ్రాజ్యవాదం కొమ్ము
విరుస్తున్నాడు
అతనితో చేతులు కలుపుతూ
నినాదాలు చేస్తూ కోట్లాది చేతులు
ఇక మిగిలింది
వాడ్ని మిగల్చకపోవడమే!

---

# ఖబడ్దార్



**యాళ్ల అచ్యుతరామయ్య**

పరాయి దేశాలను దురాక్రమణ చేసి
కిరాయి రౌడీలకు పట్టం కట్టే
కిరాతక అమెరికాను చూసి
స్వేచ్ఛా విగ్రహం తలవంచింది సిగ్గుతో
ఆమె చేతిలోని కాగడా భగ్గుమంది
ఆగ్రహంతో!

ఆధిపత్య భావజాలంతో విర్రవీగే
అమెరికా అధ్యక్ష రాక్షసుణ్ణి
ఒంటరిగా ఢీకొని అమరుడైన
సద్దాంకు జోహార్!

ఉరితాడు సద్దాం మెడకే బిగిసినా
మరణించిన వాడు మాత్రం బుష్
జనం గుండెల్లో సద్దాం పునర్జన్మించి
వీరుడికి మరణం లేదని నిరూపించేడు!

ఉరి తీయబడినా ధిక్కారంతో
తెరిచి ఉన్న సద్దాం కళ్ళు
బరి తెగించిన బుష్ నియంతృత్వంపై
గురి పెట్టిన తుపాకీ గుళ్ళు!

అందరి మెడలకూ అమెరికా
ఉరితాళ్ళను బిగించక ముందే
ఖబడ్దార్ అమెరికా అని ప్రతి ఒక్కరూ
సద్దాంలా గద్దించాలి!

కవిత

# ధర్‌తా నహీ ఫాంసీకో



**కె. ఆనందాచారి**

"అరే...జారే బుష్
లేవోరే జాన్ హమారా
మై ధర్‌తా నహీ ఇస్ ఫాంసీకో
మై ఫిఖర్ న కరతా ఇస్ జిందగీకేలియే !

మై హూ న హు జంగ్ ఛల్ తేహీ రహతా
తుజ్‌సే రఖరానే వాలోంమే రహూంగా మై
తేరీ హార్‌కో వఖ్త్‌హీ లిఖేగా ! తేరీ అంత్ జరూరీ హై
యహ్ హఖీకత్ హై !

మేరే దేశ్‌కే లోగోంకేలియే
తేరే పాపోంకో ఖబర్ కర్‌నే కేలియే
ఖుషీసే మై అపనీ జాన్‌కో
ఫాంసీకే దర్జియోంపర్ లెహరాయాహు
అబ్‌తూ ఉస్ కో కుచ్ నహీ కర్‌సకేగా"

నినదిస్తూన్న గొంతుక శబ్దాలు
విస్తరిస్తూ మ్రోగుతున్నాయి !
సద్దాం మరణంతో
యుద్ధం ఆగిపోలేదు
ముసుగులేని తలను
ఉరితాడుకందించి
నిజంగా ధర్మయుద్ధ భేరీ మోగించాడు !

వీరుల హతమార్చి ఖననం చేస్తే
జనుల గుండెల్లో చైతన్య మొలకలై లేస్తారు !
హంతకులు బ్రతికేందుకు నిత్యం చస్తుంటారు
బుష్‌లా వణుకుతుంటారు !

వందానలుబది
ఎనిమిది మంది మృతికి కారకుడంటూ ....
అమెరికా ఆధిపత్య అన్యాయ స్థానం
పాతేసిన కనీస సూత్రాలపై నుండి
తీర్పును ఖరారు చేశారు కదా !

మరి ఆరు లక్షల ఇరాకీల హననానికి,
వియత్నాం నుండి అఫ్ఘనిస్తాన్ వరకూ
లక్షలాది ప్రజల, పసిపాపల బలిగొన్న
ఖూనీఖోర్ అమెరికా బుష్‌ను ఎన్నిసార్లు ఉరితీయాలి !

దోపిడీ రెక్కలతో ఎగురుతోన్న
సామ్రాజ్యవాద డేగ బుష్ కన్ను
ఇరాకీ చమురు నేలపై పడగానే

అబద్ధాలు రసాయన ఆయుధాలై
ఆరోపణల విషాన్ని కక్కాయి
కిరాతక నియంత యుద్ధపు కత్తిని దూసి
రక్తపుటేరుల్లో రాక్షస నృత్యం చేశాడు

ఆరోపణ రుజువు కాలేదు
ఆక్రమణ పూర్తయింది
మారణ హోమగుండంలో
మానవతను మసి చేసిందు

ప్రపంచ శాంతికై వకల్తా పుచ్చుకున్న డేగ వాడు
జనం గమనిస్తున్నారు
ప్రతిఘటన నినదిస్తూనేవుంది

కొన్ని దేశాలు
గోడమీది పిల్లుల్లా గొణుగుతూ
కొందరు 'విభజన'తో ఊగుతూ ...

విధ్వంసం రెక్క విప్పుతూనే వుంది
నేరస్తుడెవరో అందరికీ తెలుసు
నాకెందుకనుకునే వాడికి
నాలుగు రోజులు ఆలస్యమవుతుంది అంతే !

అందుకే ఓ అమరుడా
ఓ నా వీర సద్దామా !
మనోస్థైర్య నిబద్ధుడా !
దృఢ సంకల్ప ప్రేరణ పతాకా
సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రతీకా
ఓ నా సద్దాం ఈ యుద్ధాన్ని కొనసాగిస్తాం !

## కవిత

# "జాతి మేక"



**జ్వాలాముఖి**

ఒంటరి ఒయాసిస్సు నీటివాలులో
తడారిన గొంతును తడుపుకోవడానికి
ఎడారులన్నీ ఏకంగా గాలించి వచ్చిన
మేకపిల్ల మనుగడ మీద మహాభియోగం
"నీటిని నిలువునా ఎంగిలి చేసిందని"
ఎత్తు నాక్రమించి వున్న నెపాల తోడేలు నీలాపనింద
దప్పిక తీర్చుకునే ప్రాణాంతక ప్రమాదంలో దాడి
మూగ సత్యాల మీద క్రూర దురాక్రమణల వేడుక

ఖర్జూర ఖడ్గాల ప్రత్యక్ష సాక్ష్యాల మౌనం
డస్సిన ఎడారి ఓడల పరాధీన శ్వాసల ధ్యానం
భూమ్యాకాశాలు ఆవహించిన అనాథల "అజా"!
అంతిమ ప్రార్థనకు విశ్వాసాల మోహరింపు

బక్రీద్ కన్నా ముందే బలైన ఎడారి జాతి మేక
పాలస్తీనా దీవెన అరాఫత్ ఆర్ద్ర స్వాగతం
పెల్లుబికిన ఒయాసిస్సు ఆర్తి స్తన్యం
చరిత్ర గతి విస్తుపోయిన రాజకీయ వికృతం

పెట్రోలు బావుల్లో నీడ చూసి భయపడే కాగితప్పులి
నీడతో యుద్ధం చేసి అలసిన ప్రాంతీయ రాజకీయ చలి
ఆకలి దేశాలతో చెరలాట లాడే అమెరికా ఘోరకలి
మేల్కొనే మట్టి పౌరుషం చూడలేని ఏక ధ్రువాహంకారం

ఈసారి క్రిస్మస్ తాత బహుమతుల సంచిలో
గాయపడిన మానవ హక్కుల న్యాయాన్యాయాలు
ఏనాటికీ జాతులు సంఘటితపడకుండా చిచ్చులు
ప్రపంచీకరణ పాతాళ దృష్టిలో పశ్చిమాసియా హెచ్చరిక

అమెరికా బ్రిటన్ల చావు తెలివి చరమాంకం
సాధు మేకల కొమ్ములు అమెరికా ఆట కట్టిస్తాయి
ఎడారి ఓడల తిరుగుబాటు చరిత్ర గతిని మారుస్తుంది
ఇసుక తుఫాను సామ్రాజ్యవాదాన్ని పాతేస్తుంది

సాయుధ మతాల నేల విడిచిన సాములో
చిక్కుపడి చెదిరిన జాతుల పునరాలోచన
దింపుడు కళ్లాల దైన్యంలో పోపు "ఆత్మశాంతి"
ఐరాస నిరాశల కార్యదర్శి దాట వేసిన కర్తవ్యం

అంకుల్ శ్యాం ప్రపంచాధిపత్య బేరసారాల్లో
"ప్రజాస్వామ్యం మైలురాళ్లు జాతుల ఉరితీతలు"
అయినా మనుగడ పోరాటంలో వీరమరణం బతుకు శీర్షిక
పాలస్తీనా విముక్తి యుద్ధంలో సద్దాం చెరగని అధ్యాయం

పోరాడే జాతులు పోరాటాల్లోనే కళ్లు తెరుస్తాయి
వీరుల త్యాగాలు వీరత్వాలతోనే వళ్లు విరుస్తాయి
మనుగడలు నినదిస్తాయి మనుషులు ఊపిరి పీలుస్తారు
కలలు వెలుగుతాయి వెలుగులు విప్పారుతాయి

చెలరేగే సుడిగాలి కదలాడే పోరాట పతాకం
సంఘటిత జాతుల విముక్తి నినాదం పాలస్తీనా గీతం
మతచిచ్చులు జాతి వైరాలు సృష్టించే దొంగ ప్రజాస్వామ్యం
నగ్నంగా బయటపడి ప్రజాగ్రహంలో
భయంకరంగా కూలుతుంది.

## "దళిత కవితా యుగం" సంకలనానికి ఆహ్వానం

దళిత కవులు వందలాది మంది రాస్తున్నారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి. మైనార్టీలు, ఈ వర్గాల్లోని స్త్రీలు ముమ్మరంగా రాస్తున్నారు. వివిధ పత్రికల్లో దళిత కవిత్వమే బహుళంగా వస్తుంది. ఈ సందర్భంగా మొత్తం ఆంధ్రదేశంలో వున్న అన్ని విశ్వవిద్యాలయాలు దళిత కవిత్వాన్ని గుర్తించాయి. ఆయా తరగతుల్లో ఒక పాఠ్యాంశంగా కూడా చేశాయి. విస్తృతంగా దళిత కవిత్వం మీద పరిశోధన జరుగుతుంది. అయితే దళిత కవిత్వాన్ని చాలామంది కవులు గ్రంథాలుగా తెచ్చుకోలేక పోతున్నారు. పైగా వాటిపైన సరైన విశ్లేషణలు కూడా రావడం లేదు. ముఖ్యంగా బ్రాహ్మణవాద భావజాలానికి ప్రత్యామ్నాయంగా ఈ కవిత్వం వస్తుంది. దీనిలోని భాష, అలంకారాలు, ప్రతీకలు, అభివ్యక్తి ఇతరులకు కొత్త. అందువల్ల దళిత కవితా యుగ వాస్తవాన్ని ఎక్కువమంది అంగీకరించలేకపోతున్నారు. ఈ దశలో ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా ఒక పెద్ద పొత్తాన్ని తీసుకురావాల్సిన చారిత్రక అవసరం మన ముందుకు వచ్చింది. ఈ సందర్భంలో వెయ్యి మంది కవులతో కవితా సంకలనాన్ని తెచ్చి బ్రాహ్మణవాదానికి ప్రత్యామ్నాయ కవిత్వ సముచ్ఛయాన్ని రూపొందించాలని ప్రయత్నం. ఇందులో మీరూ భాగస్వాములై మీ కవిత్వాన్ని మరియు మీకు అందుబాటులో ఉన్న దళిత బహుజన మైనార్టీ, స్త్రీల కవిత్వాన్ని మాకు అందించగలరని కోరుతున్నాం. బహుజనేతర కవులు ఈ ఆహ్వానాన్ని తమ మిత్ర కవులయిన బహుజన మైనార్టీ కవులకిచ్చి ప్రోత్సహించగలరని ఆశిస్తున్నాను. స్త్రీలు మనుస్మృతి చేత పీడించబడినవారు కనుక అన్ని వర్ణాల వారు దళితుల క్రిందే జమవుతారు. అందువలన అన్ని వర్ణాల స్త్రీలు తమ కవిత్వాన్ని పంపవలసినదిగా కోరుతున్నామ.

**ఈ సంకలనానికి**
**ప్రధాన సంపాదకులు : కత్తి పద్మారావు**

**సంపాదకులు : ఎ. విద్యాసాగర్, ఐ.ఎ.ఎస్.,**
**డి. నాగమ్మఫూలే, బైసా దేవదాసు**

**మీ కవితల కోసం, బయోడేటా కోసం చూస్తూ, మీ కవి మిత్రుల అడ్రస్సులు కూడా పంపగలరని ఆశిస్తున్నాము.**


పంపవలసిన అడ్రస్

**దళిత కవితా యుగం**
**ప్రధాన సంపాదకులు**
**కత్తి పద్మారావు**
**అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్ ఫౌండర్ & డైరెక్టర్**
**లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ**
**పొన్నూరు - 522 124, గుంటూరుజిల్లా**


## ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు-2006 విజ్ఞప్తి

గత 18 సంవత్సరాలుగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ ఆధునిక కవిత్వానికి ప్రతిష్టాత్మక పురస్కారంగా భావించబడుతున్న "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు-2006" కోసం రాష్ట్రంలోని కవుల నుండి కవితా సంపుటాలకు ఆహ్వానిస్తున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు, ప్రముఖ కవి రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

H అవార్డు పరిశీలన కోసం 2005-06 సంవత్సరాలలో ప్రచురింపబడిన కవితా సంపుటాలను మాత్రమే పంపాలి.

H న్యాయ నిర్ణేతలచే ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి రెండువేల రూపాయలు నగదు మరియు షీల్డుతో కవికి సత్కారం వుంటుంది.

H 31-1-2007 తేదీలోగా 4 ప్రతులు ఈ క్రింది చిరునామాకు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నాము. గడువు తర్వాత అందిన పుస్తకాలు పరిశీలించబడవు.


**రాధేయ, అవార్డు వ్యవస్థాపకులు**

**రాధేయ కవితా నిలయం**
**ప్లాట్ నెం. 312, రాజహంస ప్యాలెస్ అపార్ట్‌మెంట్స్**
**ఆర్.టి.సి. బస్‌స్టాండ్ దగ్గర,**
**అనంతపురం-515 001**
**ఫోన్ : 08554-222652, సెల్ : 9985171411**


## అసురులు



**రాచపాళెం**

తుమ్మెదలు ఆస్వాదించాల్సిన పువ్వుల్ని
చెట్టే ముల్లై చీరేస్తుందా?
గద్ద తరిమితే
పిల్లల్ని రెక్కల్లో పొదువుకునే
కోడిని చూశాం
ఏనాడైనా
కోడే గద్దై
తన పిల్లల్ని తానే పొడిచేసిందా?
పక్షి గూట్లోకి
పాము దూరితే చంపేస్తాం
పక్షే పామై దూరితే
ఏం చేద్దాం పురుషోత్తములారా?
కట్టుకున్న దానికీ
కన్నదానికీ
సరిహద్దు చెరిపేసే అద్వైతులూ
మనిషికీ
మృగానికీ
తేడాను తుడిచేసే
మరో సురులైనా
మహిషాసురులే

**(కన్నకూతుళ్ళనే కాటేస్తున్న**
**కొందరు తండ్రుల క్రౌర్యాన్ని నిరసిస్తూ)**


Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



ఫొటో ప్రదర్శన ప్రారంభిస్తున్న
జయంతి రామ లక్ష్మణమూర్తి, చీకటి దివాకర్



గురజాడకు నివాళి



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న డాక్టర్ చాగంటి తులసి



సాహిత్యశాలలో ప్రారంభోపన్యాసం చేస్తున్న కాళీపట్నం రామారావు, సభలో పాల్గొన్న ప్రతినిధులు



'తిత్తవ' ఆవిష్కరణలో గౌరినాయుడు, జశివారెడ్డి, రవి, అద్దేపల్లి, మేడిపల్లి రవికుమార్





కథ, నవల సమావేశంలో ప్రసంగిస్తున్న కోయ కోటేశ్వరరావు, జాతశ్రీ, కె.ఎస్. చలం, అట్టాడ అప్పలనాయుడు



సాహిత్యం - మీడియా సదస్సులో మాట్లాడుతున్న నాగసూరి వేణుగోపాల్, వేదికపై డా॥ రామసూరి, వెంకట్రావ్



చర్చలలో ప్రతినిధులు



ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శన




భోజనాలు

# నూరేళ్ల 'అమ్మ'కు అరుణాంజలి

ఇదంతా చూస్తుంటే మానవుని కడుపున
కొత్త దేవుడు అవతారమెత్తినట్లు వుంది.

అందరమూ సత్యమునే తల్లి,బిడ్డలం. క్రామేడ్స్ అనే మాటను
నాలో నేను స్మరించే సరికి వారు నా హృదయంలోంచి
పొంగి వస్తుండడం నేనే వినగలుగుతున్నాను



శ్రామిక వర్గ
పోరాట పటిమను
నూతన సమాజ
నిర్మాణ దీక్షనూ
సహజ శైలిని
శక్తివంతంగా
ప్రతిబింబించడమే
మన కర్తవ్యం

